జనవరి, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక:12 పేజీలు: 64 వెల: రూ. 20/-



మకర సంక్రాంతి
శుభాకాంక్షలు


నానాటికీ పెరిగిపోతున్న భూతాపం నుంచి
ఈ సీతాకోక చిలుకలను కాపాడుకోవాలి

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 12

జనవరి, 2010

ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)
**బ్రిగేడియర్ డి.వి. రావు**
**మహమ్మద్ తకీయుద్దీన్**
**ఎమ్.ఎ. కుమార రాజా**
**హెచ్. కూర్మారావు**
**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**
**ఎన్. విజయ కుమార్**
**బి. నరేంద్రనాథ్ రావు**
**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**
**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**
**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**
**డాక్టర్ పి. రఘునాథరెడ్డి**
**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : Phanikumar@ap.gov.in

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2
సూర్య పర్వంలో మకర సంక్రాంతి ........ 3
సంక్రాంతి జానపదులు ........ 5
మన గ్రామం - మన మార్కెట్లు ........ 9
స్వాతంత్ర్యోద్యమానికి తొలి పిలుపు వందేమాతరం ........ 14
కృష్ణా, ప్రకాశం జిల్లాల సర్పంచ్‌ల మహారాష్ట్ర పర్యటన ........ 17
పల్లెబాట పట్టనున్న న్యాయస్థానాలు ........ 20
2009-10 గ్రామ సభల సంవత్సరం ........ 22
హోమియో వైద్యం ఎందుకు మంచిది ? ........ 23
మహనీయుల చతురోక్తులు ........ 24
రుతువుల వర్ణనల్లో తెలుగు అందాలు ........ 25
రైతాంగ విజ్ఞాన పెన్నిధులు గ్రామీణ విజ్ఞాన సమాచార కేంద్రాలు ........ 29
ప్రణాళికతో పశుగ్రాసాల సాగు ........ 31
క్యాలండర్ల వెనుక ఎన్ని కథలో ? ........ 35
బకాసుర ........ 41
శ్రీ రమణ పేరడీలు ........ 53
గిరిజన జాతరలు ........ 57
గ్రామీణ యువతకు స్ఫూర్తి, విలువిద్యలో రాణి - ప్రణీత ........ 61
మనం ప్రేమించే క్రీస్తు ........ 63

## సంపాదకీయం..

# కారు చీకటిలో కాంతిరేఖ

వాతావరణం విపరీతమైన మార్పులకి గురికాకుండా అరికట్టటంలో భూతాపాన్ని తగ్గించటంలో మానవాళి వేయవలసిన అడుగులు చాలానే ఉన్నాయి, నడవాల్సిన దూరం ఎంతో ఉంది, చేరుకోవలసిన గమ్యం కనుచూపు మేరలో కనపడలేదనే సత్యాలను డెన్మార్క్ రాజధాని కోపెన్ హాగన్‌లో డిసెంబర్‌లో రెండు వారాల పాటు జరిగిన వాతావరణ మార్పు శిఖరాగ్ర సమావేశం మన కళ్ల ముందు నిర్మొహమాటంగా ఆవిష్కరించింది. 193 దేశాలకు చెందిన దేశాధినేతలు, మంత్రులు, రాయబారులు, అధికారుల బృందాలు ఇందులో పాల్గొనటం జరిగింది. అయితే ఏకాభిప్రాయ సాధనకు దూరంలోనే సదస్సు ముగిసింది. అమెరికాతో పాటు, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇండియా, చైనా ('బేసిక్' దేశాలు) చొరవ తీసుకుని ఒక ఒప్పందాన్ని కుదిర్చాయి. ఉద్గారాల తగ్గింపుపై ఎటువంటి చట్టబద్ధమైన కట్టుబాట్లు విధించని రాజకీయ ఒప్పందం ఇది.

పారిశ్రామికీకరణ నాటి కన్నా ముందున్న ఉష్ణోగ్రతలతో పోలిస్తే.. నేడున్న భూతాపం పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్‌కి పరిమితం చేయాలని, ప్రపంచ, జాతీయ స్థాయిలో ఉద్గారాల గరిష్ట సంవత్సరాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రకటించాలని, పారిశ్రామిక ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను 2010 ఫిబ్రవరి నాటికల్లా ప్రకటించాలని, వర్ధమాన దేశాలు కూడా ఇదే బాటలో పయనిస్తూ నిర్దేశిత పరిమాణాల్లో ఉద్గారాలను తగ్గించుకునేందుకు తీసుకోబోయే చర్యలను వివరించాలని ఈ ఒప్పందంలో పేర్కొన్నారు.

ఉద్గారాల తగ్గింపు కోసం చేపట్టే చర్యలకు అంతర్జాతీయ సాయం అందని పక్షంలో వాటిని దేశీయ సంస్థలే పర్యవేక్షించాలని, అయితే ఆయాదేశాల సార్వభౌమాధికారానికి విఘాతం కలగని రీతిలో అంతర్జాతీయ సంప్రదింపులు, విశ్లేషణలు చేపట్టవచ్చని అందులో వివరించారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, దీర్ఘకాలిక చర్యలు చేపట్టడానికి 10,000 కోట్ల డాలర్లను వర్ధమాన దేశాలకు ఇస్తారు. అత్యంత పేద దేశాలకు, వాతావరణ మార్పుల వల్ల తీవ్రస్థాయిలో ముప్పును ఎదుర్కొనే దేశాలకు ఈ సహాయం చేస్తారు. ఈ ఒప్పందంపై వివిధ దేశాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయటంతో ఆమోదానికి బదులు, దానిని పరిశీలనలోకి తీసుకోవాలని సదస్సు తీర్మానించింది. అయితే, ఉద్గారాలపై చట్టబద్ధమైన కట్టుబాటును నిర్దేశించే ఒప్పందం దిశగా ఇది ముందడుగంటూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి బాన్ కి మూన్ అభివర్ణిస్తూ హర్షం వ్యక్తం చేయటం విశేషం.

ఏది ఏమైనప్పటికీ, ప్రపంచ వాతావరణ పరిస్థితిని మెరుగుపరచటానికి, భూతాపాన్ని తగ్గించటానికి ప్రపంచదేశాలు కలిసికట్టుగా చిత్త శుద్ధితో వ్యవహరించలేక పోయాయన్నది నిష్ఠుర సత్యం. నానాటికీ దిగజారుతున్న భూ పరిస్థితి గురించి తెలిసికూడా అవి అవసరమైనంతగా ముందుకు కదలలేక పోయాయి. 1997కు పూర్వం నాటికన్నా ఈ పన్నెండేళ్లలో ప్రపంచ ఉష్ణోగ్రత 0.4 డిగ్రీలు పెరిగింది. భూతాపం అనూహ్య స్థాయికి చేరింది. సముద్ర మట్టాలు ఒకటిన్నర అంగుళాలు పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వానలు కురిసి, వరదలు ముంచెత్తాయి. వాన చుక్క కురవక అనేక హరితారణ్యాలు ఎండు కట్టెలుగా మారుతుంటే, ఎడారి ప్రాంతాల్లో భారీ వరదలు పెను బీభత్సాలు సృష్టిస్తున్నాయి. అమెరికా, ఐరోపా, ఆసియాలోని అనేక దేశాల్ని ప్రకృతి విపత్తులు అతలాకుతలం చేస్తూ, పరిస్థితి తీవ్రతకు నిలువుటద్దం పడుతున్నాయి. మరోవైపు, ఆఫ్రికా ఖండంలో ఆకలిదప్పులు తీరక, డొక్కలు ఎండిపోతున్నాయి. కార్చిచ్చులు చుట్టిముట్టి అమెరికా, ఆస్ట్రేలియాల్లో కోట్ల రూపాయల ఆస్తి పాస్తుల్ని బుగ్గి చేశాయి. వాతావరణ మార్పు, భూతాపం కారణంగా ధ్రువప్రాంత ఎలుగు బంటితో పాటు పలురకాల సీతాకోక చిలుకలు, రంగురంగుల కప్పలు కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడింది. ప్రపంచం మొత్తం మీద ప్రతి 20 నిమిషాలకు ఒక జీవజాతి అంతరిస్తున్నట్లు అంచనా. ఈ లెక్కన ఈ శతాబ్దం ఆఖరుకు భూమ్మీది జీవజాతుల్లో సగం నశిస్తాయి. పర్యావరణం ఛిద్రమై, జీవావరణానికి చేటు తెస్తోంది. చివరికి జీవ వైవిధ్యం, ప్రకృతి సమతుల్యత దెబ్బతిని మనిషి మనుగడకే ముప్పు ముంచుకొస్తోంది.

ఇంతటి విపత్కర పరిస్థితిని ఎదుర్కోవటానికి కోపెన్ హాగన్ సదస్సు అవసరమైనంతగా సాధించలేకపోయింది. వాతావరణం మార్పులపై, భూతాపంపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెరగటానికి దోహదపడి కారు చీకటిలో ఓ చిరుకాంతి రేఖగా మాత్రమే మిగిలిపోయింది. రానున్న కాలంలో అయినా ఈ చిరు కాంతి రేఖ కోటి రేఖలుగా ప్రజ్వరిల్లి కారు చీకటిని పూర్తిగా తొలగిస్తుందని ఆశిద్దాం.







# సూర్య పర్వంలో మకర సంక్రాంతి

వెలుగు మరొక్క పేరణల విద్యలకున్ బరమార్థ భూతమై
వెలుగులు తన్నుమించి మరి విశ్వమునందున వేరుచోటలే,
వలఘుడు శిష్యవత్సలుడు నంబుధిశోషణ దాహమూర్తి నె
ల్లుల నిధికిన్ గురూత్తమునకున్ జగదక్షునకున్ నమస్కృతుల్

సముద్ర లంఘనానికి ఉద్యమిస్తూ ఆంజనేయుడు మొదట చేసిన సూర్య నమస్కారమిది . (రామయణ కల్పవృక్షం సుందర పూర్వరాత్రి.1)

సమస్త విద్యలకు పరమార్థం జ్ఞానం-తెలివిడి. దీనికి మరోపేరు వెలుగు. ఆ వెలుగులకు నిధి సూర్యుడు. ఆ సూర్యుడు ఆంజనేయునికి గురువు. గురువంటే అంధకారాన్ని నివారించేవాడు. ఈ 'అంధకారం' అజ్ఞానానికి మరొక పేరు. తన గురువని ఆంజనేయుడు సూర్యనమస్కారం చేసి ఉంటాడా? కావచ్చు. కాని సూర్యుడు విఘ్ననివర్తకుడని పెద్దలంటారు. 'రామాయణం'లో 'ఆదిత్య హృదయం' (యుద్ధకాండం. 107సర్గ) ఉంది. దాని పారాయణం చేయటం గూర్చి '-నిరస్తా శేష విఘ్న తయా బ్రహ్మ విద్యాసిద్ధౌ సర్వత్ర జయసిద్ధేచ-' (అనేక విఘ్నా (ఆటంకా)లని కారణ పూర్వకంగా 'బ్రహ్మవిద్య' సిద్ధి కొరకు సర్వత్ర జయ సిద్ధి కొరకు) ఈస్తోత్ర జపం చేయాలని 'తిలక' వ్యాఖ్యానం వివరించింది. చీకటి/అజ్ఞానం కన్నా పురోగతికి ఆటంకం ఇంకేముంటుంది? దాన్ని ఆయన తొలగిస్తున్నాడు. అంతేకాదు. సూర్యుడంటే సర్వజీవులకూ కర్మప్రేరకుడు, క్రియాశీలాన్ని గలిగేవాడు అని అర్థం. ఆయన మరొకపేరు 'పూష్యా'- పోషించువాడు అని అర్థం. జీవులను పోషిస్తూ, కర్మప్రేరకుడయిన ఆయన మనం చేసే క్రియలన్నింటికీ సాక్షి గూడా. కర్మసాక్షి అని ఆయనకు మరొకపేరు.

సూర్యునికి పర్యాయ నామాలు చాలా ఉన్నాయి. అమరకోశంలోనూ, 'ఆదిత్య హృదయం' సోత్రంలోనూ వాటిని చూడవచ్చు. అయితే ఏ నామంలో ఈ చరాచర జీవలోకాన్ని ఏవిధంగా పోషిస్తున్నాడో, ఏవిధంగా క్రియాశీలాన్ని పెంచుతున్నాడో, జ్ఞానం కలిగిస్తున్నాడో, కర్మసాక్షిగా, జగన్నేత్రంగా వెంట ఉంటున్నాడో తెలిపే పేర్లే అని. 'తమోఘ్నాయ, హిమఘ్నాయ, శతృఘ్నాయామి వాత్మనే' అని ఆదిత్య హృదయం. ఆయన 'అమితాచ్యుడు' - అపరిచ్ఛన్నమయిన రూపంగలవాడు. దేశ, కాల, వస్తువులను బట్టి విభజించరానివాడు అయినా ఆయన జీవుల కోసం, జగత్తు కోసం 'ద్వాదశాత్ముడు'. పన్నెండు ఆత్మలు - రూపాలు గలవాడు - ద్వాదశావతారుడు - విష్ణువు దశావతారుడు. సూర్యుడిని 'సూర్య నారాయణుడంటారు. 'నారాయణ' పదం మరే పదంతోనో కలిసి ప్రయోగంలో లేకపోవటం గమనించదగింది. సూర్యుడికి నారాయణునికీ అభేద ప్రతిపత్తి. నారాయణుడు సూర్యమండల మధ్యవర్తియై లోకరక్షణ చేస్తున్నాడు. అయితే శ్రీమన్నారాయణుని అవతారాలకు కాల నియమేమిలేదు - ధర్మనియతి తప్ప. 'యదా యదాహి ధర్మస్యగ్లానిర్భకల భారత! అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజేత్యుహమ్' అని భగత్వచనం. కాగా ఆ అవతారాల కన్నా సూర్యనారాయణుని ద్యాదశావతారాలు నిశ్చితమయినవి.

మన పూర్వ ఖగోళవేత్తలు ఆకాశంలోని నక్షత్రాల తీరుతెన్నులను పరిశీలించారు. అనంతాకాశంలో ఆనంద నక్షత్రాలు. అవి కొన్నికొన్ని చోట్ల విడివిడిగానూ, కొన్నికొన్ని చోట్ల గుంపులు-కుప్పలుగానూ ఉంటాయి. ఇట్లాంటి గుంపులను పన్నెండింటిని వారు గుర్తించారు. 'గుంపు' అనే దానికి 'రాశి' అని సంస్కృతం. (కుప్ప అనీ అనవచ్చు) ఆ గుంపులు స్ఫురింపచేసే రూపాలను బట్టి మేషం, వృషభం మొదలయిన విధంగా పేర్లు పెట్టినారు. ఈ కుప్పలు-రాసులు సూర్యునికి దగ్గరగా లేదా సూర్యుడే వీటికి దగ్గరగా- వీటిలో కలసి నియతకాలంలో ప్రవర్తించటం గమనించబడింది. ఈ ప్రవర్తననే సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించటం. దీన్నే 'సంక్రమణం' అంటారు. 'సంక్రాంతి' అంటారు. అంటే



పురోగమించటం అని తాత్పర్యం. ఒక దశ నుండి మరొక దానికి సంక్రమించటానికి పట్టేకాలం ఒకనెల.

నిజానికి 'నెల' (చంద్రుడు) చాంద్రమానాన్ని బట్టి వచ్చిన మాట. 'మాసం' అనేదీ అట్లాంటిదే. కాని సూర్యుడి సంక్రమణాన్ని గూడా 'మాసం', 'నెల' అని సామాన్య ధోరణిలో వ్యవహరిస్తుంటారు. చాంద్రమాసంలో చైత్ర, వైశాఖాది నామాలు చంద్రునికి ఆయా నక్షత్రాల దగ్గరితనాన్ని బట్టి కాగా, సౌరమానంలో రాశులను బట్టి మేషమాసం-ఇత్యాదిగా వ్యవహారం. ఈ విధంగా సూర్యుడు పన్నెండు రాసులలో పన్నెండు అవతారాలెత్తుతాడు. ఆ అవతారాలు వరుసగా - ఇంద్ర, ధాత, పర్జన్య, త్వష్ట, పూష, అర్యను, భగ, నకస్వత్, విష్ణు, అంశుమత్, అరుణ, మిత్ర అని చెప్పబడుచున్నవి. ఈ పన్నెండు గురేద్వాదశాదిత్యులు.

వీటిలో తొమ్మిదవదిగా చెప్పబడిన అవతారం విష్ణువు. మేషాది రాసులలో ధనూరాశి తొమ్మిదవది. కాగా ధనుర్మాసం విష్ణువు అవతారమన్నమాట. చంద్రమానం ప్రకారం మార్గశిర మాసంలో దాదాపు సగం నుంచి ధనుర్మాసం మొదలవుతుంది. 'మాసానాం మార్గశీర్షోహం' అన్న భగవద్గీత వాక్యాన్ని ఈ స్థితిలో సమన్వయించుకోవచ్చు.

మార్గశిర మాసం నుండి ఆరునెలల కాలాన్ని ఉత్తరాయణమని, మిగిలిన ఆరునెలల కాలం దక్షిణాయన కాలమని అంటారు. సంవత్సరం రెండు అయనాలు. అయనం అంటే గమనమని అర్థం. సూర్యుని గమనం ఉత్తరం వైపు వంగి సాగితే ఉత్తరాయణం, దక్షిణం వైపు వంగి సాగితే దక్షిణాయనం. ఉత్తరాయణం దేవతలకు ప్రీతికరమయినదనీ, అందువల్ల అది పుణ్యకాలమనీ అంటారు. అందుకే భీష్ముడు దక్షిణాయనంలో నేలకొరిగినా, స్వచ్ఛంద మరణం గలవాడు కాబట్టి, ఉత్తరాయణం వచ్చేదాకా ఆగి మరణించాడనీ, ఆయన మరణించింది విష్ణు ప్రీతికరమయిన ఏకాదశి నాడు కాబట్టి, అదే భీష్మైకాదశిగా మనం పాటిస్తున్నామనీ అంటారు. కాగా 'అయనాలు' సూర్యగమనాన్ని బట్టి గుర్తించబడినాయి.

ధనూరాశి నుండి మకరరాశికి సూర్యుడు సంక్రమించేటప్పటికి వివిధ ధాన్యాలతో పాడిపంటలు సమృద్ధంగా చేతికందుతాయి. అందుకని మకరసంక్రాంతి - దీన్నే మకర సంక్రాంతి అయిన 'సంక్రాంతి పండుగ' అనే పేరుతో మనం 'పండుగ' చేసుకుంటాం. మకరం పదవరాశి. ఆ రాశిలో సూర్యునికి 'అంశుమదవతారం'. అంశుమంతుడంటే తన కిరణాలతో అంతర్బహిస్సులలో వ్యాప్తిగలవాడని తాత్పర్యం. 'అంతర్బహిశ్చయుత్సర్వం వ్యావ్యనారాయణః స్థితః'. సూర్యనారాయణుడు ఆ విధంగా వ్యాపించి ఉంటాడు. బహిర్ వ్యాప్తి వల్ల పాడిపంటలు, అంతర్ వ్యాప్తివల్ల ధార్మిక సాత్త్వికతలు సమృద్ధంగా ఉంటాయి.

సంక్రాంతి మూడునాళ్ల పండుగ. సంక్రాంతికి ముందు దినం భోగి, తరువాత దినం కనుము. భోగినాడు భోగి మంటలలో వ్యర్థ పదార్థాలను వేసి మంట బెట్టటం, సంక్రాంతి నాడు సూర్యప్రీతికరంగా పులగం వండుకొని బంధుమిత్రులతో ఉల్లాసంగా ఉండటం, కనుము నాడు పాడిపంటలను, మనకు ప్రసాదించిన పశువులను - పశువుల పాకలను శుభ్రం చేసి అక్కడ పొంగళ్లు వండి వాటి విషయంగా కృతజ్ఞత ప్రదర్శించుకోవటం.

ఈ పండుగ మరొక ప్రత్యేకత ఇంటి ముందు అందంగా ముగ్గులు పెట్టటం. ముగ్గులు వేసేప్పుడు ముందు ఒక పద్ధతితో ముగ్గుతో చుక్కలు పెట్టి, వాటిని రకరకాలుగా గీతలతో కలుపుతారు. ఈ తీరు గమనిస్తే ఆకాశంలో చుక్కల (నక్షత్రాల)ను కలపటంగా అనిపిస్తుంది. నేలనూ, నింగినీ ఏకం చేసే తీరు కన్పిస్తుంది. సంక్రాంతినాడు రథం ముగ్గు విశేషం. దీన్ని సూర్యరథమంటారు. ఈ రథం ఒక నక్షత్రరాశి నుండి మరొక నక్షత్రరాశికి సంక్రమించటానికి సూచన.

ఉత్తరాయణం పుణ్యకాలం కావటాన, దేవతా ప్రీతికరం కావటాన ఈ కాలంలో సమృద్ధిగా లభించే నువ్వులు, బెల్లం, గుమ్మడి వంటి వాటిని దానాలు చేస్తారు. ఈ కాలంలో చేసిన దానాలు అధిక పుణ్యఫలం కలిగిస్తాయని పెద్దలంటారు.

'తట్టలో గూర్చుండబెట్టిన వధువునా
గుమ్మడి పూవులో కులికెనొక మంచు బిందువు'

అంటారు విశ్వనాథ. ప్రకృతి అంతా మంగళప్రదంగా, సౌందర్యమంతంగా దర్శనమిస్తుంది. సంక్రాంతి వైభవాన్ని వర్ణించటంలో ఎంతోమంది ఆధునిక కవులు ఎంతో వైవిధ్యం ప్రదర్శించారు. కాగా - సంక్రాంతి అంతా ప్రత్యక్ష దైవమయిన సూర్య నారాయణుని విలాసం. కాగా -

'నక్షత్ర గ్రహతారాణాం అధిపో విశ్వభావనః
తేజోసామః తేజస్వీ, ద్వాదశాత్మకి నమోస్తుతే'

- కోవెల సంపత్కుమారాచార్య

**తెలుగునాట సంప్రదాయ పర్వాలకు నానాటికీ ప్రాధాన్యత తగ్గిపోవడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విషయం. ఒక జాతి ప్రతిష్ట ఆ జాతి పరిరక్షించుకునే చిరకాల సంస్కృతి పైన ఆధారపడి వుంటుంది. తెలుగువారు అత్యంత వైభవంగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ వస్తున్న సంక్రాంతి పండగను అంత శోభాయమానంగా నవీనులు జరుపుకోవడం లేదనే చెప్పాలి. పూర్వులు మన సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో వారు పండుగలను జరుపుకున్న తీరు తెలుపుతున్నది.**



సంక్రాంతి వచ్చిందంటే తెలుగువారి సందడి అంతా ఇంతా కాదు. సంకురాత్రి నాడు బయలుదేరే భిక్షకుల ఆర్భాటాలు చూసి తీరవలసిందే. 'సంక్రాంతి భిక్షకు'లు అనగానే మొదట కళ్ళల్లో మెదిలేవారు 'గంగిరెద్దులవారు'.

*'డూడూ డూడూ బసవన్నా*
*అయ్యవారికి దండం పెట్టు*
*అమ్మవారికి దండం పెట్టు'*

అని యజమాని పాడుతూ తనను ఆజ్ఞాపిస్తుంటే చెప్పినట్టుగా తల ఊపుతూ

# సంక్రాంతి జానపదులు

ముంగాళ్ళు వంచి దండం పెట్టే గంగిరెద్దును చూసేందుకు పల్లెల్లో ఆబాలగోపాలమూ గుంపులు గుంపులుగా చేరేవారు. సంచార జాతికి చెందిన గంగిరెద్దులవారి ప్రధాన వృత్తి ఇదే. గంగిరెద్దు వారికి జీవనోపాధి. దానిని వెంటబెట్టుకుని ఊరురా తిరుగుతూ వుంటారు. పూర్వం సింహాచలంలో మొక్కుబడుల నిమిత్తం వదిలిన కోడెలను వీళ్ళు తెచ్చుకుని విద్య నేర్పేవారు. రంగురంగుల అద్దాలు పొదిగిన బట్టలను ఎద్దు వీపుపై వేస్తారు. గంగడోలు చుట్టూ గంటల గుత్తులు వేలాడదీస్తారు. ముఖంపై పంగనామాలు పెడతారు. ముక్కుకు బంగారుకాడ, ముఖం ముందుభాగాన త్రికోణకారపు తోలు పట్టీ కట్టి గజ్జెలు వేలాడదీస్తారు. ముఖంపై పంగనామాలు ఎద్దుకు ఎంతో అందాన్ని చేకూరుస్తాయి.

తోలు పట్టీలతో గవ్వలు పొదిగి తమ కులదైవం 'మైసమ్మ'ను అతికి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు.



గంగిరెద్దుల విన్యాస ప్రదర్శనలో ముగ్గురు ప్రధాన పాత్ర వహిస్తారు. ఒకరు జేగపేట, మరొకరు సన్నాయి, ఇంకొకరు వీరణం వాయిస్తారు. వారి తాళాలకనుగుణంగా గంగిరెద్దు ముక్కాలిపీటపై నిలబడడం, యజమాని రొమ్ముపైకి ఎక్కి ఊపిరి బిగపట్టి నిలబడడం వంటి సాహస విన్యాసాలు చూపిస్తుంది. గంగిరెద్దుల కళను చూసి పూర్వం జానపదులు ఎద్దులకు వెండిగిట్టలు, పైడికొమ్ములు చేయించేవారు. పట్టు శాలువాలు, పట్టుచీరలు, ధోవతులు బహుకరించేవారని మన కావ్యాలలో ప్రస్తావించబడింది. అంతటి అపురూప జానపద కళ ఈనాడు ఆదరణ కోల్పోయి అంతరించే దశలో వుంది. ఎక్కడో ఓ చోట గంగిరెద్దులు కన్పిస్తున్నా గతంలోని ఆదరణ కరవైంది.

సంక్రాంతినాడు కోడితో మేలుకొని స్నానమాడి ముఖంపై త్రిచూర్ణ రేఖలు ధరించి, మెడలో తులసి పూసలు వేసుకొని, కాళ్ళకు గజ్జెలతో చేతుల్లోని చిరుతలు మోగిస్తూ తలపై అక్షయపాత్ర పెట్టుకుని 'హరిలో రంగహరి' అని పాడుతూ బిచ్చమెత్తుకునే 'సాతాని జియ్యరు' ఈనాడు కన్పించదు. మన సాహిత్యంలో ప్రముఖంగా ప్రస్తావించబడిన సాతాని జియ్యరులు దాదాపు మృగ్యమయ్యారు. రుద్రాక్ష పూసలతో కలిపికుట్టిన గోపురాకారపు టోపీని ధరించి కనురెప్పలపై నుంచి ఫాలభాగం దాకా వ్యాపించేట్టు విభూతిరేఖలు దిద్దుకొని కాశికా రుద్రాక్షమాలలు వేసుకొని వాటి మధ్య వెండి లింగంకాయ వేలాడుతుండగా 'హరహరపాహి' 'హరహరమహాదేవ' అంటూ శంఖం ఊది వినోదం కల్గించే జంగమ దేవరలు నేడు కన్పించరు.

సంక్రాంతినాడు ఉషోదయాన చీకట్లలోనే విన్పించేది 'డుబుడుక్కల' వాని 'ఢక్కా' వాదం. ఈ వాద్యాన్ని 'డమరుకం' అని కూడా అంటారు. 'బుడ్‌బుక్, బుడుబుక్' అన్న శబ్దాలు గ్రామానికంతటికీ విన్పిస్తుండగా–

*'అంబ పలుకు*
*జగదాంబ పలుకు*
*కంచిలో కామాక్షి పలుకు*
*మధురలో మీనాక్షి పలుకు*
*కాశిలో అన్నపూర్ణ పలుకు'*

అంటూ గొంతెత్తి పలుకుతూ నొసట విభూతి, గుబురు మీసాలు, నిండుగా వేసుకున్న కోటూ, దానిపై ఎర్రని రంగుల వస్త్రం, తలకు చుట్టుకున్న రుమాలుతో ఇంటింటికీ తిరిగి జోస్యం చెబుతూ భిక్షాటనం చేసే డుబుడుక్కలవారు నేడు కరవయ్యారు. 'అంబా', 'భళిభళి' అని పలుకుతూ విచిత్రమైన, ఆకర్షణీయమైన వేషం ధరించి సంక్రాంతినాడు గ్రామాల్లో తిరిగే సంబాలవాళ్ళు ఈనాడసలే కన్పించడం లేదు.

'ఇక్ష్వాకుల తిలక ఇకనైనా బ్రోవవె రామచంద్రా', 'మము బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ' వంటి రామదాసు కీర్తనలను కంఠమెత్తి పాడుతూ










పాట కనుగుణంగా తంబూరా తీగ మీటుతూ భిక్షాటనం చేసే 'దాసరులు' కనుమరుగయ్యారు.

*'అవ్వవ్వాయవ్వ*
*మాయవ్వ కడుపు సల్లగుండాలె*
*రత్నాలసంటి కొడుకులు పుట్టారు*
*ముత్యాలవంటి బిడ్డలు పుట్టారు'*

అంటూ సంక్రాంతినాడు చేతిగంట మోగిస్తూ చంకలో జోలెతో బిచ్చమెత్తుకునే 'బాలసంతులు' నేడు కనుమరువుతున్నారు. ఇంకా 'పిచ్చుగుంటలు', 'పెద్దమ్మలవారు', 'సిందోళ్ళు' మొదలైన భిక్షుకులు సంక్రాంతి పండుగనాడు గ్రామాలలో బిచ్చమెత్తుకునే వాళ్ళలో ముఖ్యులు. వీరంతా క్రమేపి కనుమరుగవుతున్నారు.

ఏమైనా సంక్రాంతి జానపద వినోదాల ప్రదర్శనలో ప్రముఖ భూమిక నిర్వహించే భిక్షకుల పట్ల ఆదరణ సన్నగిల్లడంతో తమ వృత్తుల వల్ల పొట్ట గడవడం కష్టమై వారు వాటిని వదులుకుని ఇతర పనులను చేపడుతున్నారు.. జానపద కళలను నమ్ముకొన్న ఈ కళాకారులైన భిక్షుకులను ఆంధ్రులు ఆదరించే మంచి సంక్రాంతుల కోసం మనం నిరీక్షిద్దాం!

# గొబ్బియళ్ళో...గొబ్బియళ్ళో

ఆంధ్ర సంస్కృతికి అద్దం పట్టే పండుగ సంక్రాంతి. మరే పండుగకు లేని ప్రత్యేకతలెన్నో సంక్రాంతికున్నాయి. సూర్యభగవానుడు మకర



రాశిలో ప్రవేశించే ఉత్తరాయణ పుణ్యవేళ కాబట్టి దీనిని మకర సంక్రాంతి అని కూడా వ్యవహరిస్తారు. మార్గశిరంతో ప్రారంభమయ్యే ధనుర్మాసం సంక్రమణంతో ముగుస్తుంది. కాబట్టి ఆధ్యాత్మికంగా ఈవేళ విశిష్టమైనదని చెబుతారు. సంక్రాంతి నాటికి రైతుల శ్రమ ఫలించి నవధాన్యాలు ఇళ్ళకు చేరుకుంటాయి.

సస్యలక్ష్మి ధాన్యలక్ష్మిగా అడుగు పెట్టిన శుభవేళ సంక్రాంతి. పల్లెపట్టులలో బంతి తోటలు పచ్చగా శోభాయమానంగా కనిపిస్తాయి. బంతులను, చేమంతులను సిగలలో ముడుచుకొన్న జవరాండ్రతో, జడలకు అల్లుకున్న కన్యలతో సంక్రాంతి పర్వసౌందర్యాలు కవులను, వారి కలాలను కదిలిస్తాయి. సంక్రాంతి అనగానే మనకు ముమ్మొదట గుర్తుకు వచ్చేవి గొబ్బిళ్ళు.

మన సారస్వతంలో గొబ్బిళ్ళ ప్రస్తావన చాలాచోట్ల ఉంది. సంక్రమణ శుభోదయాన వాకిళ్ళలో కళ్లాపి చల్లి అలికి ఆంధ్ర స్త్రీలు రకరకాల ముగ్గుల



వేస్తారు. సంక్రాంతి రథం వేయడం తప్పనిసరి సంప్రదాయం. ముగ్గుల మధ్య ముచ్చటైన రంగులు దిద్దుతారు. మధ్యభాగంలో పసుపు, కుంకుమ, గుమ్మడిపూలతో అలంకరించిన గొబ్బిళ్ళను వుంచుతారు. బాలికలు గొబ్బిళ్ళు పెట్టిన తరువాత పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు.

ఉత్తర భారతంలోని 'గర్భో' నృత్యానికి తెలుగుసేత 'గొబ్బి' అని పరిశోధకుల అభిప్రాయపడ్డారు. కాని సుప్రసిద్ధ పరిశోధకులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు గొబ్బి 'గోపీ' భావమని ఊహించారు. 'గోపమ్మ' అంటే భావం గొబ్బెమ్మ. తమిళంలోని 'గొల్లయళో', 'గోపిగళ్' పదభావం. ధనుర్మాసం సందర్భంగా నిద్రలేచి గొబ్బెమ్మలను ఆవు పేడతో బొమ్మలుగా చేసి ముంగిళ్ళలో ముగ్గులు పెట్టి పూజలతో అలంకరించి పూజిస్తారు. దీనిని బట్టి గొబ్బి 'గోపీ' పదం నుంచి వచ్చిందని రూఢి అయింది.

*'సుబ్బి గొబ్బెమ్మా సుఖము లియ్యావే*
*తామరపువ్వంటి తమ్ముణ్ణియ్యావే*
*చేమంతి పువ్వంటి చెల్లెల్నియ్యావే'*

మొదలైన 'గొబ్బి' పాటలు ప్రశస్తమైనవి. తమిళంలో వైష్ణవులు ధనుర్మాసంలో గానంచేసే 'తిరుప్పావై'లో కూడా ఇవే భావాలు గల గీతలున్నాయి. 'హంస వింశతి' కావ్యంలో కూడా 'గొప్ప ప్రియమునకు గొబ్బిళ్ళు' అనే ప్రయోగం వుండడం గమనార్హం. తెలంగాణాలో గొబ్బెమ్మలను పెట్టి నవధాన్యాలుంచడం నేటికీ కొనసాగుతున్న ఆచారం. ఖమ్మం, కృష్ణా తదితర ప్రాంతాలలో గొబ్బిళ్ళు పెట్టి స్త్రీలు, బాలికలు లయబద్ధంగా గొబ్బి పాటలను మధురంగా ఆలపిస్తూ నృత్యాలు చేయడం కనిపిస్తుంది.

"తారమ్మయ్య తందాన గొబ్బి", "గొబ్బీయళ్ళో గొబ్బి గొబ్బున", "గొబ్బియళ్ళో చందమామ", "సుబ్బీ గొబ్బెనమ్మ" వంటి పాటలు బాగా ప్రచారంలో ఉన్నాయి. రాయలసీయ, కోస్తా జిల్లాల్లో గొబ్బిని 'గౌరి'గా పూజిస్తారు. భోగి పండుగ నాడు గొబ్బి గౌరీవ్రతాన్ని చేస్తారు. అలా నాలుగు రోజులు పూజించి నాలుగవ చివరిరోజు బావిలోకాని, కాలువలో కాని, చెరువులోకాని నిమజ్జనం చేస్తారు.

'గొబ్బిపూజ' గురించి ఒక కథ కూడా ప్రచారంలో వున్నది. పూర్వం కాటమరాజు అనే యాదవరాజు తనకు ప్రియమైన సోదరియైన 'గొబ్బి'ని ఏటేటా తీసుకొని వచ్చి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు ఇతర కానుకలతో సత్కరించి పశువుల పర్వం నాడు 'కనుము' చేయించి అత్తవారింటికి పంపేవాడట. ఆ ఆచారం నేటికీ కొనసాగుతూ వస్తున్నది. ఈ కథ వల్ల గొబ్బి గోమాతకు, ఆలకాపరులైన బాలికలకు ప్రతిరూపమని తెలుస్తున్నది. గోమాతను పూజించే ఆచారం గల వ్యవసాయిక ప్రాంతమైన ఆంధ్ర సీమలో 'గొబ్బెమ్మ' ను పూజించడం శ్రీకరంగా భావిస్తారు. వైష్ణవులు పసుపు. కుంకుమలతో అలంకరించిన మూడు గొబ్బెమ్మలను "గోమాత, గోపాలుడు, గోవర్ధనగిరి" గా భావించి పూజిస్తారు.

సంక్రాంతి నాడు ముంగిళ్ళలో పెట్టిన గొబ్బిళ్ళు కన్యలకు మధురోహలు, బాలికలకు ఎనలేని సంబరాలు, గృహిణులకు శోభాయమానాలు, ఎల్లరకు నయనాభిరామాలు. జగతికి సర్వసౌభాగ్యశ్రీలు " సంక్రాంతి గొబ్బిళ్ళు".

# హరిలో రంగహరి....!

*'కదిలి వచ్చెను భాగ్యాల కడలి వోలె*
*మకర సంక్రాంతి లక్ష్మి హేమంత వీధి'*

సంక్రాంతి రోజు తెలుగునాటనే కన్పించే సంప్రదాయాలు; సంబరాలు, వేడుకలు ఎన్నెన్నో. ద్వారాలకు బంతి, చేమంతి పూలదండలు, వాకిళ్ళలో రంగవల్లులు. రంగవల్లుల మధ్యన గొబ్బిళ్ళు, వాటి పక్కన ఉంచిన నవధాన్యాలు, డుబుడుక్కుల ఢక్కా నినాదాలు, గంగిరెద్దుల విన్యాసాలు, పిచ్చుకగుంట్లు, బాలసంతులు మొదలైన భిక్షుక గాయకుల పాటలు గ్రామసీమలకు కొత్త శోభను సంతరిస్తాయి. సంక్రాంతినాడు ప్రధానంగా కన్పించే వ్యక్తి "హరిదాసు". తలపై అక్షయపాత్ర, నుదురుపై తీర్చిదిద్దిన తిరునామాలు, చేతిలో చిరుతలు, అందంగా నేలకు జీరాడే పంచెకట్టు, కాళ్ళకు గజ్జెలు అదో విలక్షణ వేషధారణ.



ఉదయాన్నే ఇంటింటికీ తిరుగుతూ "హరిలో రంగహరి" అని పాడుతూ సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పాడే హరిదాసు రాక మంగళప్రదమని తెల ంగు మహిళలు భావిస్తారు. అక్షయపాత్రలో బియ్యం పోస్తారు. బియ్యం అందుకునేందుకు హరిదాసు తల కిందికి దించి వాటిని గ్రహించడం ఓ చక్కని దృశ్యం. ఆ బియ్యం అక్షయపాత్రలో పడగానే "కృష్ణార్పణం" అంటూ మరో ఇంటికి వెడతాడు.



ఆంధ్రదేశంలో వైష్ణవ మతానుయాయులైన సాతానులు, జియ్యరులు, దాసరులు ఈ హరిదాసులుగా కృష్ణ కీర్తనలు పాడుతూ సంక్రాంతినాడు బి క్షాటన చేస్తుంటారు. నేడు 'హరిదాసు'లు భిక్షకుల స్థాయిలో చూడబడుతున్నా ,ఒకనాడు వారికి సమాజంలో సముచిత గౌరవం ఉండేది. తెలుగు కవులు సంక్రాంతి పైన ఎన్నో కవితలల్లారు. వానిలో హరిదాసు వర్ణన విశిష్టమైనది. పల్లా దుర్గయ్య 'గంగిరెద్దు' కావ్యంలో....

*'నాసికపై నుండి నడినెత్తికన్ ఎగదట్ట*
*పెట్టిన తిరుమణి పట్టెలమర*
*పిడివంటి మెడచుట్టు నుడిగొన్న పిడికెడు*
*తులసి పూసలు రొమ్ముతుదల గ్రుమ్మ*
*చీల మండల మీద వ్రేలి చిందులు త్రొక్క*
*కంచుగజ్జెలు ఘల్లు ఘల్లుమనగ*
*రెండు చేతులలోన గండు చిర్తల జంట*
*చెవుల చెంగట గొంతు చించుకొనగ*
*కోడి గ్రుడ్డును తలపించు బోడితలను*
*రాగ అక్షయపాత్రిక ఊగకుండ*
*హరిలోరంగ హరిలోరంగా యటంచు*
*చిందులిడుచుండె సాతాని జియ్యంరొకడు'*

అని 'హరిదాసు'ను కళ్లకు కట్టినట్లు చిత్రించారు.

*"నిముషాన కొకసారి నిండు నక్షయపాత్ర*
*గాసిచే సాతాని గజ్జె విప్పె"*

నని తెలుగులెంక తుమ్మల సీతారామమూర్తి 'పరిగపంట'లో వర్ణించారు. ఇలా ఎందరో కవుల సంక్రాంతి కృతుల్లో హరిదాసులైన 'సాతాని జియ్యరు'ల మనోజ్ఞ వర్ణనలున్నాయి. సంక్రాంతి పర్వవేళ హరినామ సంకీర్తనం చేస్తూ ఇంటింటికీ వచ్చే హరిదాసులు కనుమరుగవుతున్నారు.

*-ఎ.ఎమ్. ఫీచర్స్*



# మన గ్రామం మన మార్కెట్లు

**గ్రామీణ జీవితం సంక్లిష్టమవుతున్న కారణంగా నగరాలకు, పట్టణాలకు వలసలు పెరిగి, ప్రణాళికా రహితమైన, వికృతమైన నగరీకరణకు దారితీస్తున్నది. భారతదేశంలోని నగరాల్లో 40% మంది మురికి వాడల్లో నివసిస్తున్నారని ఐక్యరాజ్య సమితి రూపొందించిన అభివృద్ధి ప్రణాళికా నివేదిక తెలియజేస్తున్నది.**

గ్రామీణ వ్యవస్థను పరిపుష్టం చేయడం ద్వారా నగరాలకు వలసలను నివారించవచ్చు. గ్రామాలను స్వయం సమృద్ధం చేయగలిగితే, పట్టణాలకు వలస వెళ్ళిన వారు కూడా తిరిగి రావచ్చును. ఇది కలగానో, అతిశయోక్తిగానో, ఊహాజనితంగానో అనిపించవచ్చు. కానీ మన భూమి, నీరు, పశుసంపద, అడవులు, వేలాది కిలోమీటర్ల తీరప్రాంతం, ఔషధ మొక్కలతో సహా మన జీవవైవిధ్యం వంటి వనరులను కాపాడుకొని, సద్వినియోగం చేసుకోగలిగినట్లయితే ఆ స్వప్నం సాకారమవుతుంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయటంలో గ్రామీణ మార్కెట్ విధానం అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లో మన గ్రామాల్లో మార్కెట్లను గుర్తించిన అంశాలు సవివరంగా పొందుపర్చబడ్డాయి.

**పబ్లిక్ మార్కెట్లు:**

గ్రామపంచాయితీ పబ్లిక్ మార్కెట్ కోసం కొంత స్థలాన్ని కేటాయించవచ్చును అని, కమీషనర్ అనుమతితో అలాంటి మార్కెట్‌ను లేదా అందులో భాగాన్ని మూసివేయవచ్చును అని ఈ చట్టంలోని 104వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి పబ్లిక్ మార్కెట్లలో నిబంధనలకు లోబడి గ్రామపంచాయితీ ఈ క్రింద పేర్కొన్న వాటిలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రకాల ఫీజులను, నిర్దేశించిన గరిష్ట పరిమితులేమైనా ఉంటే వాటికి లోబడి వసూలు చేయవచ్చును.

(ఎ) ఉపయోగించినందుకు ఫీజు లేదా అట్టి మార్కెట్‌లో సరుకును అమ్మకానికి పెట్టుకున్నందుకు.

(బి) అట్టి మార్కెట్లోని దుకాణాలను, చావిళ్ళను లేదా స్టాండులను ఉపయోగించుకున్నందుకు ఫీజు

(సి) మోటారు వాహనాల చట్టం 1988 లో నిర్వచించిన వాహనాలతో సహా వాహనాల మీద లేదా అట్టి మార్కెట్‌లో అమ్మకానికి సరుకును తీసుకువచ్చే లేదా తీసుకువెళ్ళే జంతు సమూహాలు లేదా వ్యక్తులు

(డి) అట్టి మార్కెట్‌లో అమ్మకానికి తేబడిన లేదా అమ్మబడిన జంతువులపై ఫీజు

(ఇ) అట్టి మార్కెట్‌లో తమ వృత్తిని చేసుకుంటున్న బ్రోకర్లు, కమీషన్ ఏజెంట్లు, తూకము, కొలతలు వేసే వాళ్ళ లైసెన్స్ ఫీజు.

అయితే ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తి మరియు లైవ్‌స్టాక్) మార్కెట్ల చట్టం 1966లోని 30వ సెక్షనుల్లో మార్కెట్ల ఏర్పాటు, నిర్వహణ లేదా నియంత్రణ లేదా ఫీజు విధించటం గురించి పేర్కొంటూ, ఏ ఇతర చట్టం కూడా ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తి మరియు లైవ్‌స్టాక్) చట్టం 1966 ప్రకారం ఏర్పడ్డ మార్కెట్లకు వర్తించదని లేదా అట్టి మార్కెట్లకు సంబంధించి మార్కెట్ కమిటీ అధికారులను ప్రభావితం చేయరాదని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తి మరియు లైవ్‌స్టాక్) చట్టం 1966 ప్రకారం ఏర్పాటైన మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న గ్రామపంచాయితీలో, గ్రామపంచాయితీచే ఏర్పరచబడిన పబ్లిక్ మార్కెట్‌పై అధికారం గ్రామపంచాయితీకి ఉంటుందా లేక మార్కెట్



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 11 12/26/2009, 11:27 AM



కమిటీకి ఉంటుందా అన్న అంశంపై 1997లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పునిస్తూ పంచాయితీరాజ్ చట్టంలోని 104వ సెక్షను ద్వారా గ్రామపంచాయితీకి ఉన్న అధికారాలను, మార్కెట్ కమిటీ తీసుకొనజాలదని తేల్చిచెప్పింది.

గుంటూరు జిల్లా అచ్చంపేటలోని వేల్పూరు గ్రామపంచాయితీలోని పశువుల అంగడికి వేలం పాటను 31.03.1997, తరువాత గ్రామపంచాయితీ నిర్వహించరాదంటూ క్రోసూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి నుండి డివిజినల్ పంచాయితీ అధికారి, గుంటూరు వారికి జారీ చేయబడ్డ 27.03.1997 తేదీ ఉత్తర్వులను వేల్పూరు గ్రామపంచాయితీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సవాలు చేసింది. అట్టి కేసులో అప్పటి హైకోర్టు గౌరవ న్యాయమూర్తి జస్టిస్ బి.కె.సోమశేఖర తీర్పునిస్తూ, గ్రామపంచాయితీలకు చట్ట ప్రాతిపదిక మాత్రమే కాక రాజ్యాంగ ప్రాతిపదిక కూడా ఉన్నదని, రాజ్యాంగంలోని 243జి అధికరణ ప్రకారం పంచాయితీలు అవసరమైతే స్థానిక స్వయం ప్రభుత్వాలుగా (local self Governments) వ్యవహరించే విధంగా అధికారాలను కల్పిస్తూ, ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం తదితర రాజ్యాంగంలోని 11వ షెడ్యూలులో పేర్కొన్న అంశాలకు సంబంధించి అవసరమైన ప్రణాళికలను తయారు చేయటానికి వాటిని అమలు జరపటానికి కావలసిన అధికారాలను, బాధ్యతలను పంచాయితీలకు కల్పిస్తూ చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రశాసన సభ కలిగి ఉన్నదని, రాజ్యాంగలోని 243 హెచ్ అధికరణ ప్రకారం పంచాయితీలకు నిర్దేశించిన విధంగా పన్నులు, సుంకాలు (duties), రుసుము (tolls), మరియు ఫీజులు విధించడానికి, వసూలు చేయుటానికి ఖర్చుపెటుకోవటానికి తద్వారా స్వయం ప్రభుత్వంగాను (Self Government), మరింత ఆర్థిక స్వాదలంబన కలిగించే దానికి చట్టాలను రూపొందించడానికి ప్రభుత్వాలకు అధికారమివ్వబడిందని;

రాజ్యాంగంలోని 243డి ప్రకారం పంచాయితీలకు ఇవ్వబడిన అలాంటి అధికారాల్లో పంచాయితీలకు మార్కెట్లు, సంతలు కలిగి ఉండే అధికారాలు ఉన్నాయని;

స్వయం ప్రభుత్వం (Self Government) లో భాగంగా మార్కెట్లు, సంతలు నిర్వహించు కోవటానికి గ్రామపంచాయితీలకు రాజ్యాంగ అధికారం కల్పించబడినట్లుగా సూచించబడిందని వివరించారు.

**ప్రైవేటు మార్కెట్లు**

గ్రామపంచాయితీ అనుమతి లేకుండా ఏ వ్యక్తి క్రొత్త ప్రైవేటు మార్కెట్ తెరచుట కానీ లేదా ప్రైవేటు మార్కెట్‌ను తెరచి ఉంచటం కానీ చేయరాదని ఈ చట్టంలోని 105వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి అనుమతి కొరకు దరఖాస్తును స్థల యజమాని మార్కెట్ ప్రారంభించుటకు ముందు లేదా అనుమతిని పునరుద్ధరించుకోవలసిన సంవత్సరం ప్రారంభం కావటానికి ముందు 30రోజులకు తగ్గకుండా 90రోజులకు మించని కాలపరిమితిలో సమర్పించాలి.

చట్టపరంగా ఏర్పాటై ఉన్న ప్రైవేటు మార్కెట్లకు, క్రొత్త ప్రైవేటు మార్కెట్లకు దరఖాస్తు చేయబడ్డ అనుమతులను గ్రామపంచాయితీ అజమాయిషీ, తనిఖీ షరతులు (conditions of supervision & inspection), పారిశుధ్యం, డ్రైనేజి, నీటి సరఫరా, దారులు, బాటల వెడల్పు, ఉపయోగించబడే తూనికలు, కొలతలు, అట్టి మార్కెట్‌కు గ్రామపంచాయితీచే విధించబడే అద్దె, ఫీజు వంటి నిబంధనలకు లోబడి మంజూరు చేయాలి; లేదా గ్రామపంచాయితీ లిఖితపూర్వకంగా పేర్కొన్న కారణాల చేత అనుమతిని నిరాకరించవచ్చును. గ్రామపంచాయితీ అనుమతిలో షరతులు ఉల్లంఘించ బడినట్లయితే, అట్టి అనుమతి నిలుపుదల చేయడం లేదా రద్దు చేయడం చేయవచ్చును. గ్రామపంచాయితీ అనుమతిలోని షరతులను నిర్దిష్ట తేదీ నుండి అమలులోనికి వచ్చే విధంగా సవరించవచ్చును.

ఈ సెక్షను ప్రకారం అనుమతిని మంజూరు చేసిన, తిరస్కరించిన, నిలిపివేసిన, రద్దు పరచిన లేదా సవరించిన విషయం గురించి గ్రామ ప్రధాన భాషలో అనుమతి కోరిన స్థలం వద్ద లేదా దగ్గర్లో కనిపించే విధంగా నోటీసును అతికించాలి.

ఈ సెక్షను క్రింద జారి చేయబడ్డ ప్రతి అనుమతీ ఆ సంవత్సరం చివరకు కాలం చెల్లుతుంది. పైన పేర్కొన్న విధంగా గ్రామపంచాయితీ జారీ చేసిన ఉత్తర్వుల వలన నష్టపోయిన వ్యక్తి అట్టి ఉత్తర్వుల మీద అప్పీలును కమీషనరుకు దాకలు చేసుకొనవచ్చును. కమీషనరు సహేతుకమని భావిస్తే అప్పీలు విచారణ కాలంలో అట్టి ఉత్తర్వులు నిలిపివేయవచ్చును.

అయితే రోడ్లమీద తోపుడు బండిపైన, నెత్తిమీద బుట్టల్లోనూ కూరగాయలు, పండ్ల వంటి వాటిని వీధుల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా అమ్ముకోవటం ప్రైవేటు మార్కెట్టుగా పేర్కొనలేమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2007లో తీర్పునిచ్చింది.

నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి మేజరు గ్రామపంచాయితీ వాసులైన షేక్ దస్తగిరి, ఇంకొకరు, తోపుడు బండ్లపైనా, నెత్తిమీద బుట్టల్లోనూ కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో మార్కెట్ ప్రదేశాన్ని గ్రామపంచాయితీ నిర్ణయించి, అక్కడ కొన్ని గదులను నిర్మించి వాటికి వేలం పాటను నిర్వహించిన దరిమిలా, గ్రామపంచాయితీ కార్యనిర్వహణాధికారి, ఉదయగిరి పోలీసులతో కలసి తమ వ్యాపారాన్ని ఆటంకపరచడాన్ని సవాలు చేస్తూ షేక్ దస్తగిరి, ఇంకొకరు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. గౌరవ న్యాయమూర్తి జస్టిస్ వి.వి.ఎస్.రావు తీర్పునిస్తూ, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లోని 105వ సెక్షన్‌ను మొత్తంగా పరిశీలించినప్పుడు గ్రామపంచాయితీ అనుమతి పొందిన, నీరు, డ్రైనేజి, పారిశుధ్యం, సరుకుల కొలతలకు, తూనికకు ఏర్పాటు వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసుకొన్న దానిని ప్రైవేటు మార్కెటుగా భావించవలసి ఉంటుందని, కనుక తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకోవడాన్ని ప్రైవేటు మార్కెట్‌గా పేర్కొనటం నిర్హేతుకం (un-



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 12 12/26/2009, 11:27 AM

reasonable) అవుతుందని పేర్కొన్నారు. ఈ చట్టంలోని 111వ సెక్షను ద్వారా గ్రామపంచాయితీలోని పబ్లిక్ రోడ్డు లేదా స్థలంలో జంతువులను లేదా వస్తువులను అమ్మడాన్ని లేదా అమ్మకానికి పెట్టడాన్ని బహిరంగ ప్రకటన ద్వారా నిషేధించడానికి లేదా లైసెన్సు ఇవ్వటానికి లేదా నియంత్రించడానకి కార్యనిర్వాహణాధికారికి అధికారం ఇవ్వడం కూడా ఈ ఆలోచనలను బలపరుస్తున్నదన్నారు. ఈ చట్టంలోని 105వ సెక్షను క్రింద ఏర్పాటైన ప్రైవేటు మార్కెట్టుకు, గ్రామపంచాయితీ రోడ్లమీద జరిగే అమ్మకాలకు మధ్య ఈ చట్టంలో స్పష్టమైన తేడా ఉన్నదని పేర్కొన్నారు. రోడ్లమీద జంతువులను లేదా వస్తువులను అమ్మడాన్ని నియంత్రించడానికి అధికారం ఉన్నప్పటికీ అది గ్రామపంచాయితీ సక్రమమైన ముందస్తు ఆమోదంతో జరగాలని, రోడ్ల మీద జంతువులను లేదా వస్తువులను అమ్మడాన్ని లేదా అమ్మకానికి పెట్టడానికి అనుమతించడానికి లేదా నియంత్రించడానికి కార్యనిర్వహణాధికారికి అధికారాన్ని ఇస్తూ గ్రామపంచాయితీ తీర్మానం లేని పక్షంలో ప్రతివాదులు పిటిషనర్ల వ్యాపారాన్ని ఆటంకపరచలేరని పేర్కొన్నారు. అంతేగాకుండా వీధిలో అమ్ముకోవటం అనేది ప్రాథమిక హక్కుగా గుర్తించబడిందని, వీధుల్లోనూ లేదా పేవ్‌మెంట్ల మీద ఇతరులకు ఏవిధమైన ఇబ్బంది కలిగించకుండా వ్యాపారం చేసుకొనే హక్కు పంచాయితీల్లో కూడా వర్తిస్తుందని, కనుక ప్రతి వాదులు పిటిషనర్ల వ్యాపారాన్ని ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా పూర్తిగా ఆటంక పరచలేరని పేర్కొన్నారు.

### మార్కెట్ ఫీజు

పబ్లిక్ మార్కెట్లలో ఈ చట్టంలోని 104వ సెక్షను ప్రకారం పొందిన అనుమతికి గ్రామపంచాయితీ విధించే ఫీజు అట్టి మార్కెట్ యాజమాని గత సంవత్సరం ఆ మార్కెట్టు నుండి పొందిన ఆదాయం (gross income) లో 15శాతానికి మించకుండా ఉండాలని ఈ చట్టంలోని 106వ సెక్షనులో పేర్కొన్నారు.

### మార్కెట్ బై లా ఉల్లంఘన

ఈ చట్టంలోని 107వ సెక్షను ప్రకారం కార్యనిర్వాహణాధికారి, ఏ వ్యక్తి గానీ అతని పనివాడు గాని పబ్లిక్ మార్కెట్లలో అమలులో ఉన్న బైలాల ఉల్లంఘనకు శిక్షింపబడినట్లయితే అట్టి వ్యక్తిని మార్కెట్ నుండి బహిష్కరించవచ్చును. అట్టి వ్యక్తిని గాని, అతని పనివాడు లేదా ఏజెంట్ తదుపరి ఆ మార్కెట్‌లో వ్యాపారం చేయకుండా నిరోధించవచ్చును, అట్టి లీజును రద్దుపరచవచ్చును.

### ప్రైవేటు మార్కెట్లలో ఏర్పాటు

ప్రైవేటు మార్కెట్లపై గ్రామపంచాయితీకి ఉండే అధికారాలను ఈ చట్టంలోని 108వ సెక్షనులో పేర్కొన్నారు. ప్రైవేటు మార్కెటు యజమానిని లేదా స్వాధీనంలో ఉన్న వ్యక్తిని ఈ క్రింది పనులు చేపట్టమని గ్రామపంచాయితీ నోటీసు జారీ చేయవచ్చును.

(ఏ) అట్టి మార్కెట్‌కు అప్రోచ్‌లను, ప్రవేశాలను, దారులను, గేట్లను, డ్రైన్‌లను, భూగర్భ మరుగు ట్యాంకులను నిర్మించమని, గ్రామపంచాయితీ అవుసరమని భావించిన సంఖ్యలో, అవుసరమైన రీతిలో, అవుసరమైన చోట మరుగుదొడ్లను ఏర్పాడు చేయమని;

(బి) కప్పు వేయటం, పరిశుభ్రంగా ఉంచడానికి, ఇంకకుండా ఉండటానికి, గ్రామపంచాయితీ అవుసరమని భావించిన రీతిలో నేలమీద గచ్చువేయడం;

(సి) గాలి రాకపోకలకు కావలసిన ఏర్పాట్లు చేయటం, అవసరమైనంత నీటి సరఫరా ఏర్పాటు చేయటం;

(డి) అంగళ్ళకు మధ్యలో అవసరమైనంత వెడల్పుగల దారులను ఏర్పరచటం, అంగళ్ళకు, దారులకు, దుకాణాలకు, తలుపులకు లేదా మార్కెట్‌లోని ఇతర భాగాలకు గ్రామపంచాయితీ అవసరమని భావించిన మార్పులు చేయమని కోరటం;

(ఇ) పరిశుభ్రంగానూ, సక్రమంగానూ ఉంచాలని; చెత్త, చెదారాన్ని అక్కడి నుండి తొలగించి, గ్రామపంచాయితీ నిర్దేశించిన స్థలంలో ఆదేశించిన పద్ధతిలో డిస్పోజ్ చేయాలని;

(ఎఫ్) గ్రామపంచాయితీ అవసరమని భావించిన ఇతర పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని;

ఈ విధంగా గ్రామపంచాయితీ నుండి నోటీసు జారీ కాబడిన వ్యక్తి, అట్టి నోటీసులో పేర్కొన్న పనులను, నోటీసులో నిర్దేశించిన గడువులోపల, నిర్దేశించిన పద్ధతిలో పూర్తి చేయకపోయినట్లయితే, అతని లైసెన్స్‌ను గ్రామపంచాయితీ నిలిపివేయవచ్చును లేదా అట్టి పని పూర్తి చేసే వరకూ లైసెన్స్ జారీ చేయటానికి నిరాకరించవచ్చును.

లైసెన్స్‌ను నిలిపివేయబడిన కాలంలో అట్టి ప్రైవేటు మార్కెట్‌ను లైసెన్స్ పునరుద్ధరించబడే వరకూ తెరవరాదు.

ప్రైవేటు మార్కెట్ లేదా అందులోని షాపు,స్టాల్, షెడ్ లేదా ఇతర ప్రదేశం యజమాని, స్వాధీనంలో ఉన్న వ్యక్తి, ఏజెంట్ లేదా మేనేజరు అట్టి ప్రదేశాన్ని ఇతరులకు ఇబ్బంది (nuisance) లేకుండా ఉంచాలి. అట్టి ఇబ్బంది కరమైన వాటిని తక్షణమే గ్రామపంచాయితీ నిర్దేశించిన ప్రదేశానికి తరలించాలి.

ఏదైనా ప్రదేశం మార్కెట్ అవునా? కాదా? అనే విషయంలో వివాదం తలెత్తినట్లైతే అట్టి వివాదాన్ని గ్రామ పంచాయితీ ప్రభుత్వానికి నివేదించాలని, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని ఈ చట్టంలోని 109వ సెక్షనులో పేర్కొన్నారు.

ఏ వ్యక్తి కూడా లైసెన్సు లేని ప్రైవేటు మార్కెట్‌లోనూ లేదా లైసెన్సు ఉన్న పబ్లిక్ మార్కెట్లలో కార్యనిర్వాహణాధికారి అనుమతి, లైసెన్సు ఉన్న ప్రైవేటు మార్కెట్‌లో లైసెన్సు దారుని అనుమతి లేకుండా జంతువులను లేదా వస్తువులను అమ్మడంగాని, లేదా అమ్మకానికి పెట్టడం కానీ చేయరాదని ఈ చట్టంలోని 110 సెక్షనలో పేర్కొన్నారు.

పబ్లిక్ రోడ్డు మీద లేదా స్థలంలో లేదా అందులోని ఏదేని భాగంలో జంతువులను లేదా వస్తువులను అమ్మడంగానీ లేదా అమ్మకానికి పెట్టడం గాని కార్యనిర్వహణాధికారి గ్రామపంచాయితీ ఆమోదంతో నిషేధిస్తూ గానీ లేదా నియంత్రిస్తూ నోటీసు జారీ చేయవచ్చునని ఈ చట్టంలోని 111వ సెక్షనులో పేర్కొన్నారు.

గ్రామంలోని పబ్లిక్, ప్రైవేటు మార్కెట్లను, మండలపరిషత్ మార్కెట్లు, గ్రామ పంచాయితీ మార్కెట్లుగా వర్గీకరించడానికి, అట్టి మార్కెట్లపై అధికారాన్ని అప్పగించడానికి, తత్సంబంధిత ఆదాయాన్ని జిల్లాపరిషత్, మండల పరిషత్, గ్రామపంచాయితీల మధ్య పంచడానికి లేదా తత్సంబంధిత చెల్లింపులు గ్రామపంచాయితీ లేదా జిల్లా పరిషత్ లేదా మండల పరిషత్తుకు చెల్లించడానికి ప్రభుత్వానికి అధికారం కలదని ఈ చట్టంలోని 112వ సెక్షనులో పేర్కొన్నారు.



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 13 12/26/2009, 11:27 AM




మండల పరిషత్ మార్కెట్టుగా పేర్కొనబడ్డ మార్కెట్లపై గ్రామపంచాయితీ, దాని కార్యనిర్వాహణాధికారి ఈ పైన పేర్కొనబడిన సెక్షను 104 నుండి 111 వరకూ గల అధికారాలను వినియోగించరాదు.

ఈ చట్టంలోని 113వ సెక్షను ప్రకారం ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) ఎస్టేట్స్ (రద్దు, రైత్వారిగా మార్పిడి) చట్టం 1948లోని సెక్షను 41 యొక్క ఉప సెక్షన్ (1) ప్రకారం ఏవేని ఎస్టేట్స్‌కు చెల్లించవలసిన తుది నష్టపరిహారాన్ని డిపాజిట్ చేసిన నాటి నుండి ఆ చట్టం ప్రకారం ప్రభుత్వానికి దఖలు పర్చబడిన అట్టి ఎస్టేట్‌లో మార్కెట్‌గా ఉపయోగించబడిన ఏ స్థలమైనా, ఏ గ్రామపంచాయితీ పరిధిలోకి వస్తుందో ఆ గ్రామపంచాయితీకే బదిలీ అయి దఖలు పర్చబడుతుంది మరియు తదుపరి గ్రామపంచాయితీ అట్టి స్థలాన్ని పబ్లిక్ మార్కెట్‌గా ఉపయోగించటానికి కేటాయించాలి.

గ్రామ పంచాయితీ పరిధిలోని పబ్లిక్ రోడ్లు, సంతలు, పండుగలు, సత్రాలు (choultries), ఆనుపత్రులు, గ్రంధాలయాలను జిల్లాపరిషత్, మండల పరిషత్ లేదా గ్రామపంచాయితీకి అనుసంధానం చేసే విధంగా వర్గీకరణను నిర్దేశించిన పద్ధతిలో చేయాలని 114వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

ఈ చట్టంలోని 115వ సెక్షను ప్రకారం గ్రామపంచాయితీ పబ్లిక్ లాండింగ్ స్థలాలను, హోల్డింగ్ స్థలాలను, బండ్లు నిలుపుకునే స్థలాలను (జంతువులను, మోటారు వాహనాలతో సహా అన్ని రకాల వాహనాలను నిలుపుకొనే స్థలాలను) ఏర్పాటు చేసి, వాటిని ఉపయోగించినందుకు ఫీజు వసూలు చేయవచ్చును.

అయితే అట్టి చెల్లింపుల నుండి మినహాయింపు పొందటానికి గాను, గ్రామపంచాయితీ నిర్ణయించిన సొమ్మును ఏక మొత్తంగా చెల్లించిన వ్యక్తికి గ్రామపంచాయితీ మినహాయింపు నివ్వవచ్చును.

నిర్దిష్ట ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన స్థలానికి లేదా స్టాండుకు నిర్ణీత దూరంలోని ఇతర పబ్లిక్ స్థలాన్ని లేదా పబ్లిక్ రోడ్డు ప్రక్కలను అదే ప్రయోజనానికి వినియోగించడాన్ని గ్రామపంచాయితీ కమీషనర్ యొక్క అధికారానికి లోబడి నిషేధించవచ్చును.

గ్రామపంచాయితీ అనుమతి లేకుండా క్రొత్తగా ప్రైవేటు బండ్లు నిలుపుకొనే స్థలాన్ని ప్రారంభించడం కానీ లేదా కొనసాగించడం కానీ చేయరాదని ఈ చట్టంలోని 116వ సెక్షనులో పేర్కొన్నారు. అట్టి అనుమతి పొందిన వ్యక్తి ప్రతి సంవత్సరం దానిని పునరుద్ధరించుకోవాలి.

చట్ట పరంగా ఏర్పాటై ఉన్న ప్రైవేటు కార్ట్ స్టాండ్‌లకు, క్రొత్తగా ఏర్పాటు అయ్యే ప్రైవేటు కార్ట్ స్టాండులకు గ్రామపంచాయితీ షరతులతో కూడిన లైసెన్సును మంజూరు చేయవచ్చును లేదా అట్టి అనుమతి పొందిన వ్యక్తి ప్రతి సంవత్సరం దానిని పునరుద్ధరించుకోవాలి.

చట్టపరంగా ఏర్పాటై ఉన్న ప్రైవేటు కార్ట్ స్టాండ్‌లకు, క్రొత్తగా ఏర్పాటు అయ్యే ప్రైవేటు కార్ట్ స్టాండులకు గ్రామపంచాయితీ షరతులతో కూడిన లైసెన్సును మంజూరు చేయవచ్చును లేదా అట్టి లైసెన్సును మంజూరు చేయుటకు నిరాకరించవచ్చును.

లైసెన్సులోని షరతులను నిర్దిష్ట తేదీ నుండి అమలులోకి వచ్చే విధంగా గ్రామపంచాయితీ సవరించవచ్చును.

షరతులను ఉల్లఘించినట్లయితే గ్రామపంచాయితీ అట్టి లైసెన్సును రద్దు చేయవచ్చును.

ప్రతి లైసెన్సు జారీకి లేదా పునరుద్ధరణకు రెండువందల రూపాయిలకు మించకుండా ఫీజును గ్రామపంచాయితీ వసూలు చేయవచ్చును.

### కబేళాలు

గ్రామపంచాయితీ కబేళాలుగా ఉపయోగించటానికి కావలసిన స్థలాలను నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసి వాటిని ఉపయోగించిన వారి వద్ద నుండి అద్దెను, రుసుమును వసూలు చేయవచ్చునని 117 సెక్షనులో పేర్కొన్నారు.

కబేళాలలో మినహా ఇతర చోట్ల జంతు వధను లేదా జంతువుల తోలు ఒలుచుటకు నిషేధిస్తూ లేదా నియంత్రిస్తూ;

నిబంధనల మేరకు ప్రజలకు అమ్మటానికి జంతు వధ చేయటానికి వ్యక్తులను అనుమతించుటకు; కబేళాలను, అక్కడి మాంసాన్ని తనిఖీ చేయుటకు మరియు తనిఖీ కొరకు నియమించబడ్డ అధికారుల జీతం చెల్లించటానకి ప్రభుత్వం నిబంధనలను రూపొందించవచ్చునని 118 సెక్షనులో పేర్కొన్నారు.

గ్రామపంచాయితీ పరిధిలోని స్థలాలను నిబంధనల్లో పేర్కొన్న ఒకటి లేదా అంత కంటే ఎక్కువ ప్రయోజనాలకు, కార్యనిర్వాహణాధికారి అనుమతి లేకుండా లేదా లైసెన్సు నిబంధనల విరుద్ధంగా వినియోగించ రాదని గ్రామపంచాయితీ నిర్దేశించిన పద్ధతిలో నోటిపై చేయవచ్చునని 119వ సెక్షనులో పేర్కొన్నారు.

అయితే అట్టి నోటిఫికేషన్, ప్రకటించిన తేదీ నుండి 60రోజుల గడువు ముగిసే వరకూ అమలు లోనికి రాదు.

### షెడ్యూలు ప్రాంతంలో మార్కెట్లు

భారత రాజ్యాంగంలో పంచాయితీల గురించి పేర్కొన్న IXవ భాగంలోని అంశాలు షెడ్యూలు ప్రాంతాలకు వర్తించవని 243ఎమ్ అధికరణలో పేర్కొన్నారు. ఈ అధికరణలోని 4వ క్లాజు, సబ్ క్లాజు (బి) ప్రకారం పార్లమెంట్ చట్టం ద్వారా ఈ భాగంలోని అంశాలను. అవసరమైన మార్పులతో షెడ్యూలు ప్రాంతాలకు



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 14 12/26/2009, 11:27 AM

వర్తింపచేయవచ్చునని పేర్కొన్నారు. పంచాయితీలకు సంబంధించిన అంశాలను షెడ్యూలు ప్రాంతాలకు వర్తింపచేస్తూ 1996లో చట్టం చేయబడింది. ఇదే ''పెసా'' చట్టంగా పేరుపొందింది (వివరాలకు స్థానిక పాలన నవంబరు సంచికలోని ''పెసా'' చట్టం ద్వారా షెడ్యూలు ప్రాంతాలలో గ్రామ సభలకు అధికారాల బదలాయింపు వ్యాసంలో చూడండి).

''పెసా'' చట్టంలోని 4వ సెక్షనులో రాజ్యాంగంలోని IXవ భాగానికి మినహాయింపులను, మార్పులను (modifiactions) గురించి పేర్కొనబడింది. ఈ సెక్షనులోని ఉపసెక్షను (ఎమ్)లో షెడ్యూలు ప్రాంతంలోని పంచాయితీలకు స్వయం ప్రభుత్వాలుగా(self government) వ్యవహరించటానికి కావలసిన అధికారాలను దఖలు పరిచేటప్పుడు, రాష్ట్రశాసన సభ నిర్దిష్టమైన అంశాలపై గ్రామసభలకు, వివిధ స్థాయిల్లో పంచాయితీలకు అధికారాలను ఇవ్వాలని పేర్కొన్నారు. అట్టి అంశాల్లో క్లాజ్ (iv) లో గ్రామ మార్కెట్లు ఏ పేరుతో పిలవబడుతున్నా వాటిని నిర్వహించే అధికారాన్ని కూడా పొందుపర్చారు.



## ఫ్యాక్టరీలకు అనుమతి, వాటిపై నియంత్రణ

ఆవిరి శక్తిని, నీటి శక్తిని లేదా ఇతర యాంత్రిక శక్తిని లేదా విద్యుత్ శక్తిని వినియోగిస్తూ ఫ్యాక్టరీని, వర్కుషాపును లేదా పని ప్రదేశాన్ని నిర్మించుకోవటానికి, లేదా

ఇందు నిమిత్తం రూపొందించిన నిబంధనల ప్రకారం మినహాయించబడిన ఆవిరి, నీరు లేదా పైన పేర్కొన్న ఇతర శక్తులతో నడపబడే పరిశ్రమ లేదా ఉత్పాదక కేంద్రాన్ని ఏదేని ప్రదేశంలో ఏర్పాటు చేసుకొనుటకు గ్రామపంచాయితీ నుండి నిర్దేంచిన పద్ధతిలో నిర్మాణ ప్రారంభానికి ముందే ధరఖాస్తు చేసి అనుమతి పొందాలి అని 120వ సెక్షనులో పేర్కొన్నారు.

అయితే ప్రభుత్వం అన్ని గ్రామపంచాయితీలో లేదా ఒక్క గ్రామపంచాయితీ లేదా అందులో ఒక భాగానికి సంబంధించి అయితే అట్టి గ్రామపంచాయితీ ఆమోదంతో, అన్ని భవనాలనూ లేదా ఏదేని ఒక తరహా భవనాలను ఈ చట్టం క్రింద చేయబడ్డ నిబంధనలు లేదా బై లాల నుండి మినహాయింపు ఇవ్వవచ్చును.

ఆవిరితోనూ, నీటిశక్తి తోనూ లేదా ఇతర యాంత్రిక శక్తితోను నడిచే ఫ్యాక్టరీ, వర్కుషాపు లేదా పని ప్రదేశం వల్ల, అట్టి వాటిలో ఉపయోగించే ఇంధనం వల్ల లేదా ధ్వని కారణంగా, లేదా అవి కలిగించే ప్రకంపనల వల్ల ఇతరులకు ఇబ్బంది (nuisance) కలుగుతున్నట్లయితే. అట్టి న్యూసెన్స్‌ను నిర్దిష్ట గడుపులోపు నివారించమని ఆదేశిస్తూ గ్రామపంచాయితీ నోటీసు జారీ చేయవచ్చునని ఈ చట్టంలోని 122వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి ఆదేశాలను ఉద్దేశ్యపూర్వకంగా అమలు జరపకపోయినా లేదా నివారించటం అసాధ్యంగా ఉన్నా, గ్రామపంచాయితీ అందులో ఉపయోగిస్తున్న ఇంధనాన్ని వాడటాన్ని నిషేధిస్తూ లేదా

ఫ్యాక్టరీ, వర్కుషాపు లేదా పని ప్రదేశంలో సాయంత్రం 9.30 నుండి ఉదయం 5.30 వరకూ పని చేయడాన్ని నిషేధించి ధ్వని లేదా ప్రకంపనలను నియంత్రించవచ్చును.

ఈ చట్టం ప్రకారం ఇవ్వబడే అన్ని లైసెన్సులు, నోటీసులు, అనుమతులు అన్నీ కూడా సంబంధిత నిబంధ నల ప్రకారం ఉండాలని ఈ చట్టంలోని 123వ సెక్షనులో పేర్కొన్నారు.

పైన పేర్కొన్న సెక్షను 119, 120 లేదా 122 ప్రకారం తీసుకున్న చర్యల విషయంలో లేదా తీసుకోకుండా ఉన్న విషయంలో, సాధారణంగా గాని (generally) లేదా నిర్దిష్టంగా గాని (particular case) అవసరమని భావించిన ఉత్తర్వులు ప్రభుత్వం జారీ చేయడం. ఆదేశాలనివ్వటం చేయవచ్చును అని 124వ సెక్షనులో పేర్కొన్నారు.

## వినోద కార్యక్రమాలకు అనుమతులు

ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) పబ్లిక్ రిసార్ట్ స్థలాల చట్టం 1888 లేదా రాష్ట్రంలో అమలులో ఉన్న అలాంటి ఏదేని ఇతర చట్టంను ప్రభుత్వం ఏదేని గ్రామానికి లేదా అందులోని ఒక భాగానికి వర్తింపజేసినప్పుడు:

(ఎ) సినిమాల ప్రదర్శన మినహా ఇతర ప్రయోజనాల కోసం స్థలాన్ని, భవనాన్ని వినియోగించుటకు అట్టి చట్టం ప్రకారం పొందవలసిన లైసెన్సు కొరకు చేయవలసిన ధరఖాస్తును తీసుకొనుటకు, అట్టి లైసెన్సు మంజూరు చేయటానికి లేదా తిరస్కరించటానికి కార్యనిర్వాహణాధికారి చేయవచ్చును.

(బి) అట్టి లైసెన్సును మంజూరు చేస్తూ, తిరస్కరిస్తూ, రద్దు చేస్తూ లేదా నిలిపి వేస్తూ కార్యనిర్వాహణాధికారి ఇచ్చిన ఉత్తర్వులపై గ్రామపంచాయితీకి అప్పీలు దాఖలు చేసుకొనవచ్చును.

ఈ అంశాలను అవగాహన చేసుకొని అమలులోకి తీసుకురావటం ద్వారా పచ్చదనం - పరిశుభ్రత గల గ్రామాల పునః నిర్మాణానికి దారి వేయగలం. అందుకు దూరదృష్టి, దృఢ సంకల్పం, సమైక్యత, సద్భావనతో కూడిన కృషి నేడు అవసరం.

–వి. రఘు
న్యాయవాది


SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 15 12/26/2009, 11:27 AM



# స్వాతంత్ర్యోద్యమానికి తొలిపిలుపు వందేమాతరం



**'వందేమాతరం' అంటే 'తల్లీ నమస్కరిస్తున్నా'నని అర్థం. జాతీయోద్యమ కాలంలో ఎందరో దేశభక్తులను సృష్టించిన గీతం వందేమాతరం.**

1947 జనవరి 24వ తేదీన భారత రాజ్యాంగ సభలో జాతీయగీతం గురించిన జరిగిన చర్చలో 'జనగణమన' గీతాన్ని జాతీయగీతంగాను, బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన 'వందేమాతరం' గీతానికి దానితో సమానమైన ప్రతిపత్తి ఇవ్వాలని తీర్మానించారు. స్వాతంత్ర్య సమరయోధులను చిరకాలం నుంచి ఉత్తేజపరచిన వందేమాతరం గీతం 1882లో బంకించంద్రుడు ప్రచురించిన 'ఆనందమఠ్' అనే నవలలో వస్తుంది. ఈ గీతాన్ని 1896లో ఒక రాజకీయ సమావేశంలో మొదటిసారి పాడటం జరిగింది. వందేమాతరం గీతానికి రవీంద్ర కవీంద్రుడే స్వరకల్పన చేశారు. మరింత వివరంగా చెప్పాలంటే ప్రభుత్వానికి సంబంధించిన అధికార కార్యక్రమాలన్నిటిలోను 'జనగణమన' గీతమే ఉపయోగిస్తారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో ఉత్సాహాన్ని కలిగించిన వందేమాతరం గీతం కూడా జనగణమనతో సమానంగా గౌరవింపబడుతుంది. ఈ రెండు జాతీయ గీతాల మధ్య వివాదాలు అవసరం లేదని సుప్రసిద్ధ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు గారు ఈ విధంగా చెప్పారు. 'తల్లిదండ్రుల పట్ల భక్తి ప్రేమలకు సంబంధించినట్టి విషయంలో తారతమ్యాలకు కారణాలు వెదకడం నిజానికి వృధా శ్రమ. ఇవి కారణాలకు అతీతమైన మనః ప్రవృత్తికి సంబంధించిన విషయాలు. తల్లిదండ్రుల మధ్య ఎవరికి ఆధిక్యమివ్వడమో చెప్పరాని విషయమైనట్లే వందేమాతరం, జనగణమన గీతాలతో దేనికి అగ్రతాంబూలం ఇవ్వడమో కూడా నిర్ణయించరాని విషయం. ఈ పరిస్థితులలో రవీంద్రుని గీతాన్ని జాతీయగీతంగా చేస్తూ, బంకించంద్రుని గీతానికి సమాన ప్రతిపత్తి,



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 8 12/26/2009, 11:27 AM

## జాతీయ పతాకకు వందనం

సారనాథ్‌లో బుద్ధుడు తన మొదటి ధర్మోపన్యాసం చేసిన చోట అశోకచక్రవర్తి నిర్మించిన స్తంభానికి అగ్రంలో ఉన్న చిత్తరువు ఆధారంగా జాతీయముద్ర రూపొందించబడింది. ఒక పీఠం మీద వీపుకు వీపు ఆన్చి నిలుచున్న మూడు సింహాలు (నాలుగవ సింహం అవతల వైపున వుండటం వల్ల ముద్రలో కనిపించదు), ఆ పీఠం మీద ధర్మచక్రం, దాని అడుగున సత్యమేవ జయతే అని సంస్కృతంలో వ్రాసిన పదాలు జాతీయముద్రలో కనిపిస్తాయి.

జాతీయ పతాకంలో పైన ముదురు కుంకుమరంగు, నడుమ తెలుపు రంగు, అడుగున ముదురు ఆకుపచ్చరంగు కనిపిస్తాయి. ఈ మూడు రంగులు సమానమైన నిడివి, సమానమైన వెడల్పు కలిగి ఉంటాయి. పతాకకు నడుమ సారనాథ్‌లోని అశోకస్తంభం మీద ఉన్న ధర్మచక్రం చిత్రించబడి ఉంటుంది. ఈ ధర్మచక్రం వెడల్పు పతాక నడుమ తెల్లరంగు వెడల్పు అంత ఉంటుంది. ధర్మచక్రం పతాకకు రెండు వైపులా చిత్రితమై వుంటుంది. ఈ చక్రం 24 ఆకులతో ముదురు నీలి రంగులో ఉంటుంది.



జాతీయ త్రివర్ణ పతాక మొదటి నమూనా 1921లో తయారైంది. ఆ సంవత్సరం విజయవాడలో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశమైనప్పుడు మహాత్మాగాంధీకి ఆంధ్ర యువకుడు పింగళివెంకయ్య ఎరుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన పతాక ఒకటి సమర్పించాడు. భారతదేశంలో రెండు ప్రధానమైన మతవర్గలకూ ఈ రంగులు చిహ్నాలు కదా, దేశంలోని ఇతర చిన్నవర్గాలన్నిటికీ కలిపి సంకేతంగా ఒక తెలుపురంగు, ప్రగతి సూచకంగా చరఖా బొమ్మను జెండాలో చేర్చాలని గాంధీ మహాత్ముడు సూచించాడు.

1947 జులై 22వ తేదీన రాజ్యాంగ పరిషత్తు ఈ త్రివర్ణ పతాకనే ఒక చిన్న మార్పుతో జాతీయ పతాకగా ఆమోదించింది. జెండా మధ్యలో చరఖాకు బదులు అశోకుని ధర్మచక్రం చిత్రించాలని రాజ్యాంగ పరిషత్తు తీర్మానించింది.

రాజ్యాంగ పరిషత్తు సభలో జాతీయ పతాకను గురించిన తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ పండిట్ నెహ్రూ -

'ఈ పతాక సామ్రాజ్యకాంక్షను చిహ్నం కాదు. సామ్రాజ్యవాదానికి గాని, పరపీడనకు గాని ఇది చిహ్నం కాదు. ఇది స్వాతంత్ర్య పతాక. స్వతంత్రులైన ఒక భారతీయులకే ఇది స్వాతంత్ర్య చిహ్నం కాదు. సర్వ మానవులకు ఈ పతాక స్వాతంత్ర్య పిపాసను ప్రేరేపిస్తుంది. ఈ పతాకం అనేక దేశాలలో విహరించగలదని ఆశిస్తున్నాను. ఇదెక్కడికి వెళ్లినా ఇండియా మంత్రులు, రాయబారులు ఉన్న చోట్లకుగాని, నౌకలలో సముద్రాలు దాటి దూర దేశాలకు వెళ్లినా అది ఉత్కృష్ట సందేశాన్ని గొని పోతుందని ఆశిస్తున్నాను. స్వాతంత్ర్య సందేశాన్ని అందిస్తుంది. సమస్త దేశాల వారితో స్నేహసంబంధాన్ని పెంపొందించుకోవాలన్న కాంక్ష ఇండియాకు కలదని ఆ పతాక చాటి చెప్పుతుంది. స్వాతంత్ర్యం పొందగోరే సమస్త ప్రజలకు భారతదేశం సహాయ పడగలదని తెలియ చెయ్యగలుగుతుంది. ఈ పతాకచ్ఛాయ క్రింద లక్షాధికారికి, బిక్షాధికారికి తారతమ్యాలు లేవు. రాజు-కూలీ అనే వివక్షలేదు. ప్రత్యేక సౌకర్యాలేవీ ఎవ్వరికీ లేవు. అందుకు బాధ్యత వహించి తమ విద్యుక్త ధర్మాన్ని శ్రద్ధాశక్తులతో నిర్వహించవలసిందే. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు అనే విభేదాలకు తావులేదు. భారతాత్మ ఏకం. అఖండం అవిభాజ్యం. స్వతంత్ర్య భారత పౌరులారా! ఈ పతాకకు వందనమాచరించండి'.

**- జి.వి. రామారావు**

సమానమైన అవకాశం లభింపజేయడమే తమ తీర్మానమని సంభావించుకోవాలి'. (ఆంధ్రప్రభ తేది 24-1-1950)

వైస్రాయ్ కర్జన్ ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా హిందువుల నుండి ముస్లింలను వేరు చేయడానికీ, జాతీయోద్యమాన్ని దెబ్బతీయడానికి 1905లో వంగ (బెంగాల్) రాష్ట్ర విభజన జరపాడు. ఈ చర్యను ప్రజలు తీవ్రంగా తిరస్కరించారు. దీనికి నిరసనగా ప్రజలు విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ వస్తువుల ఉపయోగం, ఇంగ్లీషు విద్యాలయాల స్థానంలో జాతీయ విద్యాలయాల స్థాపన, బ్రిటిష్ ప్రభుత్వ చట్టాలను తిరస్కరించడమనే మూడు రకాల ఉద్యమాలను చేపట్టారు. 1905లో ప్రారంభమైన ఈ ఉద్యమానికి 'వందేమాతరం' ఉద్యమం అని పేరు వచ్చింది. ఈ ఉద్యమం ఎంత శక్తివంతంగా జరిగిందంటే దీని ధాటికి






SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 9 12/26/2009, 11:27 AM



తట్టుకోలేక వైస్రాయ్ కర్జన్ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. అంతేకాదు, 1911లో వంగ రాష్ట్ర విభజన రద్దయింది.

ఆంధ్ర దేశంలో జాతీయోద్యమం వందేమాతరం ఉద్యమంతోనే ప్రారంభమైంది. ఈ ఉద్యమ సందర్భంలో ఆంధ్రులు అత్యంత ఆవేశ పూరితులైనారు.

వందేమాతరం గీతాలాపనలో కౌతా సీతారామశాస్త్రి అపూర్వకీర్తి సంపాదించారు. బిపిన్ చంద్రపాల్ ఆ రోజులలో ఆంధ్రదేశ సంచారం చేశారు. పాల్ ఉపన్యాసానికిలోనైన రాజమహేంద్రవరం విద్యార్థులు వందేమాతరం బ్యాడ్జీలు ధరించి పాఠశాలలకు పోయేవారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల, ట్రెయినింగ్ కళాశాల ఆంగ్లప్రిన్సిపాల్ మార్క్స్ హంటర్ దీన్ని సహించలేకపోయాడు. అక్కడే చదువుతున్న గాడిచెర్ల హరి సర్వోత్తమరావు బ్యాడ్జి తీసివేయలేదు. బ్యాడ్జీలు ధరించే క్రమశిక్షణా రహిత్యచర్యకు గాడిచెర్ల కారణమని, ఆయనతో పాటు మరికొందరు విద్యార్థులను కళాశాల నుంచి బహిష్కరించారు. అంతేకాక, పోలీసులు ఆయనను అరెస్టు చేసారు. తెలుగుదేశంలో ఆది రాజకీయ బాధితుడు హరిసర్వోత్తమరావే. ఇందుకు నిరసనగా ప్రజలు బ్రిటిష్ క్లబ్బుపై దాడి చేసారు. 1907 మే 18 వ తేదీన గాడిచెర్లకు ఎక్కడా ఎటువంటి ఉద్యోగం ఇవ్వరాదనే ఆంక్షను విధిస్తూ, 384 నెంబరు జీవోను ప్రభుత్వం జారీ చేసింది. వందేమాతరం సందేశం ఆరోజుల్లో ఆంధ్రలో గ్రామగ్రామానికీ వ్యాపించింది. రాజమండ్రి, కాకినాడ, బందరు, గుంటూరు, బెజవాడ, నెల్లూరు మొదలైన అనేక పట్టణాలలో స్వదేశీ వస్తువుల దుకాణాలు తెరిచారు. తరువాత గాడిచెర్ల విజయవాడలో 'స్వరాజ్య' పత్రికను స్థాపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన రాసిన రాతలకు వెరచి ప్రభుత్వం గాడిచెర్లకు మూడు సంవత్సరాల కారాగారశిక్ష విధించింది. పాల్ ఉపన్యసిస్తున్న ఒక సభలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం -

**'భరత ఖండంబు చక్కని పాడియావు హిందువులు లేగ దూడలై యేడ్చుచుండ తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకుతున్నారు మూతులు బిగియగట్టి'** అనే పద్యం పాడి ఆంధ్రులను ఉగ్రూతలూగించారు.

'బందరుత్రయం'గా కీర్తింపబడిన ముట్నూరి కృష్ణరావు, కోపల్లె హనుమంతరావు, డా. భోగరాజు పట్టాభిరామయ్యల కృషితో 1910లో బందరులో జాతీయ కళాశాల స్థాపించడం జరిగింది. ఈ కళాశాల 1914లోనే కుటీర పరిశ్రమలు, చేనేత పరిశ్రమలను పాఠ్యాంశంలో చేర్చింది. ఆంధ్రదేశ పర్యటనకొచ్చిన గాంధీజీ యీ పాఠశాలను సందర్శించి ఎంతో సంతృప్తి చెందారు.

హైదరాబాద్ రాష్ట్రములో వందేమాతరం ఉద్యమం 1939-39లో ప్రారంభమైంది. నిజాం ప్రభుత్వంపై బాహాటంగా జరిగిన మొదటి తిరుగుబాటు ఇదే. 1937లో రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలేర్పడినప్పుడు శాసనసభ సమావేశాలు వందేమాతరం గీతంతోనే ప్రారంభమయ్యేవి. అప్పటికింకా బ్రిటిష్ వారి హయాంలోనే మనం ఉన్నట్లు మరచిపోరాదు.

"మన మాతృభూమే మన తల్లి. ఆమె తప్ప, వేరే తల్లిదండ్రులు కాని, ఇల్లూ ముంగిలి కాని లేవు" అని సారాంశమిచ్చే వందేమాతరం స్వాతంత్ర్యోద్యమానికి తొలిపిలుపు. ఉత్తేజానికి నెలవు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో వందేమాతరం అనే పల్లవి అనేక మంది పౌరులను ఉరి కంబాలనెక్కించింది. దేశ ప్రజలందరినీ ఉత్తేజం చేసింది. ఈ నినాదమే తెల్లదొరల గుండెల్లో ప్రతిధ్వనించింది. జాతికి స్ఫూర్తినిచ్చిన గీతం 'వందేమాతరం'.




**- జి.వి. రామారావు**



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 10 12/26/2009, 11:27 AM

# కృష్ణా, ప్రకాశం జిల్లాల సర్పంచ్‌ల మహారాష్ట్ర పర్యటన

**వార్తల్లో 'అపార్డ్'**

**'ఏదయినా ఒక విషయం వినడం ద్వారా కొంత తెలుసుకోగలం. అదే విషయం గూర్చి చదవడం ద్వారా మరింతగా తెలుసుకొనగలం. ఆ విషయాన్నే స్వయంగా సందర్శించి పరిశీలించడం ద్వారా సంపూర్తిగా తెలుసుకొనగలం. మనస్సుతో, మేదస్సుతో ఆ విషయం గూర్చిన మంచిచెడ్డలు మరింతగా ఆలోచించి ఆ స్ఫూర్తితో మంచిని అమలుచేయాలని సంకల్పించగలం!**

ఈ భావనతో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన సర్పంచ్‌లు ఇతర రాష్ట్రాలలోని అత్యుత్తమ పంచాయితీల క్షేత్ర సందర్శన పథకం రూపొందించారు.

ఏ.ఎం.ఆర్. అపార్డ్ ప్రాంతీయ కేంద్రమైన ఇ.టి.సి. బాపట్ల ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా నుండి ఎంపిక చేసిన 38 మంది గ్రామసర్పంచ్‌లు మహరాష్ట్రలోని జాతీయ స్థాయిలో ఆదర్శ గ్రామంగా పేరుగాంచిన హివ్రేబజార్ గ్రామపంచాయితీని సందర్శించారు. సర్పంచ్‌ల బృందంలో యస్.సి, యస్.టి, బి.సి వర్గాలకు చెందిన వారితోబాటు 8 మంది మహిళా సర్పంచ్‌లు గూడ పాల్గొన్నారు. ఇ.టి.సి. బాపట్ల ప్రిన్సిపాల్ శ్రీ బి. ఆశీర్వాదం పర్యటనకు అవసరమైన పథకం రూపొందించడంతో బాటు స్వయంగా పర్యటనలో పాల్గొని పర్యటన విజయవంతం కావడానికి ముఖ్యకారకులైనారు. ఇ.టి.సి. సీనియర్ ఫ్యాకల్టీ మెంబరు శ్రీ సజ్జా సుబ్బారావు, ఇతర సిబ్బంది షేక్ ఖాజా మెహియిద్దీన్, శ్రీమణి సర్పంచ్‌ల భోజన వసతి సౌకర్యాల పట్ల, వివిధ విషయాల సక్రమ అధ్యయనానికి ప్రత్యేక శ్రద్ధ కనబరచారు.

సర్పంచ్‌లతో కూడిన చక్కని లగ్జరీ బస్సు నవంబరు 9వ తేదీ రాత్రి 8.30 గంటలకు కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నం జిల్లా పంచాయితీ అధికారి ఆఫీసు నుండి బయలుదేరింది. ఈ సందర్భంగా జిల్లా పంచాయితీ అధికారి శ్రీ నాగరాజు సర్పంచ్‌లకు తేనీరు ఇచ్చి పర్యటన లక్ష్యాలను, పరిశీలించవలసిన విషయాలను తెలిపి, ఆ స్ఫూర్తితో తమ గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలని పేర్కొని జెండా ఊపి పర్యటన ప్రారంభించారు. రాత్రి 11:00 గంటలకు విజయవాడకు చేరుకున్న అక్కడ మరికొందరు సర్పంచ్‌లను కలుపుకొని రాత్రి 11:30కి బస్సు ముందుకు సాగింది. ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా, ఆనందంగా ప్రారంభమైంది.

ఎల్లోరా షిర్డీ మీదుగా ప్రయాణిస్తూ మధ్యాహ్నం రెండు గంటల సమయాన ఓ ఆశ్రమ సమీపంలో ఆగాయి. అక్కడ మధ్యాహ్న భోజనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం ప్రారంభించి అహమ్మద్‌నగర్ దాటి చేరవలసిన ప్రదేశం 'హివ్రే బజార్' గ్రామానికి నవంబరు 12వ తేది సాయంత్రం 4 గంటలకు గ్రామపంచాయితీ వద్దకు చేరుకున్నారు. అక్కడికి ఆ గ్రామ సర్పంచ్ శ్రీ పొపట్‌రావ్ పవార్ వచ్చారు. సర్పంచ్‌లంతా ఆయనను చుట్టుముట్టి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ప్రకాశం జిల్లాల సర్పంచ్‌లుగా తమను పరిచయం చేసుకొన్నారు. పంచాయితీలోని ఓ గదిలో శ్రీ పవార్ తమ గ్రామం గూర్చిన విషయాలు చెప్పడం మొదలెట్టారు. సర్పంచ్‌లంతా నేలమీద ఆశీనులై నిశ్శబ్దంగా వారి ఉపన్యాసం విన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ ఆశీర్వాదం పొపట్ పవార్ ఆంగ్ల, హిందీ ఉపన్యాసాన్ని అనువాదం తెలుగులోకి అనువాదించారు.

శ్రీ పొపట్ పవార్ తాను పూనా విశ్వవిద్యాలయంలో ఎం.కాం. అభ్యసించినట్లు, విశ్వవిద్యాలయం తరపున క్రికెట్ తదితర ఆటల పోటీలలో పాల్గొన్నట్లు తెలిపినారు. విద్యాభ్యాసం తరువాత ఇండియన్ ఏయిర్‌లైన్స్, ఇండియన్ రైల్వేస్‌లో తనకు చక్కని ఉద్యోగాలు లభించినా, తమ హివ్రే బజార్ గ్రామాభివృద్ధి ధ్యేయంగా భావించి 1989లో గ్రామ సర్పంచ్ పదవి చేబట్టి 20 సంవత్సరాలుగా సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నట్లు పేర్కొన్నారు. తాను సర్పంచ్ కాకముందు సరయిన రహదారులు, త్రాగు-సాగునీరు, విద్యా పారిశుధ్య సౌకర్యాలు లేక గ్రామమెంతో దీనస్థితిలో ఉన్నట్లు, ప్రభుత్వ ఉద్యోగులు తమ గ్రామానికి రావాలంటే పనిష్‌మెంటు గ్రామంగా భావించేవారని చెప్పారు. తాను సర్పంచ్ పదవి చేపట్టకముందు గ్రామ దుస్థితి తెలిపే కొన్ని ఫొటోలను, తాను సర్పంచ్ అయిన పిదప గ్రామాభివృద్ధి తెలిపే కొన్ని ఫొటోలను పోల్చి చూపుతూ తాము సాధించిన అభివృద్ధిని గూర్చి వివరించినారు. తమ గ్రామంలో 246 కుటుంబాలు, 1300 వందల జనాభా, 700 మంది ఓటర్లు ఉన్నారన్నారు. గ్రామంలో ప్రతివిషయం పైన గ్రామసభ ద్వారా నిర్ణయాలు తీసుకుంటామని, వివాహం, విచార సందర్భాలలో గ్రామస్థులు ఐకమత్యంగా పాల్గొంటారని చెప్పారు. తమ గ్రామంలో రాజకీయ, కుల, మత, వర్గ వైషమ్యాలు లేవని, గ్రామాభివృద్ధి లక్ష్యంగా తాము కృషి చెయ్యడం, గ్రామస్థుల శ్రమదానం గ్రామాభివృద్ధికి కారణమన్నారు. ఎన్నికల సమయంలో తప్ప ఇతర సమయాల్లో రాజకీయాల ప్రమేయం ఉండదన్నారు. ఎన్నికలలో ఇష్టమైన వారికి ఓటు వేసుకొనే స్వేచ్ఛ గలదన్నారు. గ్రామంలో వాటర్‌షెడ్ల నిర్మాణం, సోలార్ ఎనర్జీ లైట్ల ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాట్లు గూర్చి పేర్కొన్నారు.

హివ్రే బజార్ గ్రామం బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి సంపూర్ణ పారిశుధ్యం సాధించిన గ్రామంగా పేరు గాంచి 2007 సంవత్సరంలో నిర్మల గ్రామ పురస్కార అవార్డుతో, గ్రామంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించి 1995 లోనే ఆదర్శగ్రామంగా గుర్తింపబడింది. గ్రామస్థులలో అధిక సంఖ్యాకులను దారిద్ర్యరేఖ నుండి అభివృద్ధి మార్గానికి నడిపించి, చక్కని నీటి యాజమాన్య పద్ధతులననుసరించి 2000 సంవత్సరంలో



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 5 12/26/2009, 11:27 AM




మహారాష్ట్ర ప్రభుత్వం నుండి యశ్వంత్ గ్రామ పురస్కార్‌ను,2007 సంవత్సరంలో వ్యాన్ గ్రామ పురస్కార్‌ను, 2007 సంవత్సరంలోనే నేషనల్ వాటర్ అవార్డును సాధించినట్లు శ్రీ పవార్ తెలిపారు. వ్యవసాయం, పాడి, చిన్న మొత్తాల పొదుపు, ఉద్యోగాలు ప్రజల జీవనోపాధులు.

తమది పొగలేని గ్రామమని, గ్రామంలో మద్యం షాపులు లేవని, నేర చోరాలకు స్థానం లేని ఆదర్శ గ్రామమని, గ్రామంలో గల ఏకైక ముస్లిం కుటుంబానికి మసీదు నిర్మించి మతసహనం పాటిస్తున్నామని సగర్వంగా చెప్పినారు. గనుకనే ఎన్నో ప్రాంతాల నుండి ఎందరో ఇచటి అభివృద్ధి చూడటానికి ఆకర్షితులవుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు, మాజీ పంచాయితీరాజ్ మంత్రి శ్రీ డి. శ్రీనివాస్ సైతం తమ గ్రామం సందర్శించి అభినందించినట్లు శ్రీ పవార్ పేర్కొన్నారు. చైనా, జపాన్ దేశాల నుండి గూడ తమ గ్రామాభివృద్ధి తెలుసుకొనడానికి ఉత్సాహం చూపినవారున్నారని, త్వరలో రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ కూడా తమ గ్రామం సందర్శించే అవకాశాలున్నాయన్నారు. సర్పంచ్ ప్రసంగం కొనసాగుతుండగనే చీకటి పడుతుందనే కారణంగా మన స్వరంచ్‌ల విజ్ఞప్తి మేరకు ఆయన వెంటరాగా గ్రామ సందర్శన ప్రారంభమైంది. ఏవో నూతన విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి, పట్టుదల గల మన స్వరంచ్‌లు అనేక విషయాలను సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తూ, పరిశోధకులలాగా స్థానికులతో వివరాలు స్వీకరిస్తూ అటూ ఇటూ తిరుగుతూ తమలో తాము తమ గ్రామాల స్థితిని ఆ గ్రామంతో పోల్చుకుని భేరీజు వేస్తూ గంట గంటన్నర కాలం గడిపినారు. చీకటి ముంచుకురాగా, మెల్లగా ఓ రకంగా చెప్పాలంటే వదిలిపెట్టి వెళ్లలేక ఊరిబయట వేచియున్న బస్సుల వద్దకు చేరుకున్నారు. రాత్రి 7.30 సమయంలో హివ్రేబజార్ నుండి తిరుగు ప్రయాణం ప్రారంభించినవి. బస్సుల్లో సర్పంచ్‌లు చర్చల్లో మునిగిపోయినారు.

కృష్ణా, ప్రకాశం జిల్లాల సర్పంచ్‌లతో గూడిన రెండు బస్సులు నవంబర్ 13వ తేదీ ఉదయం 8.30కి మహారాష్ట్రలోని ఓ ముఖ్యప్రాంతం 'నాందేడ్' చేరుకున్నవి.

తరువాత మహారాష్ట్ర సరిహద్దు దాటి ఆంధ్రప్రదేశ్‌లోని 'నిజామాబాద్'కు రెండు బస్సులు రాత్రి 6.30కి చేరుకున్నవి. ఇక్కడ చెప్పుకోదగిన విశేషం కృష్ణా, ప్రకాశం జిల్లాల సర్పంచ్‌లు గత మూడురోజులుగా కలిసి ప్రయాణిస్తూ పలకరించుకుంటున్నా ముఖాముఖి కలిసి ఒకసారిగా మాట్లాడుకున్న సందర్భం లేదు. ఆ కొరత తీరింది. ఇరు జిల్లాల సర్పంచ్‌లు బారులు తీరి నిలబడి తమను తాము పరిచయం చేసుకొని, ఒకరినొకరు సౌహార్ద్ర యాత్రకు ఆహ్వానించుకొని, మనసు విప్పి మాట్లాడుకోవడం చాల సంతోషం కలిగించింది. తమ తమ జిల్లాలలోని పరిస్థితుల గూర్చి సమస్యల గూర్చి చర్చ జరిగింది. మహిళలు సైతం చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తర్వాత రాత్రి 10 గంటల ప్రాంతంలో వీడ్కోలు తెలుపుకుంటూ బస్సు ప్రయాణం సాగించినారు. మార్గంలో వరంగల్ జిల్లాలోని చేర్యాల చెక్‌పోస్టు వద్ద రెండు బస్సులు చెరొక దారి పట్టి గమ్యస్థానానికి మరలినవి. కృష్ణాజిల్లా బస్సు సూర్యాపేట, కోదాడ మీదుగా పయనించి కృష్ణా జిల్లాలో ప్రవేశించి ఉదయం 8.30 గంటలకు విజయవాడ చేరుకుంది. దారివెంబడి దిగి వెళుతున్న సర్పంచ్‌లకు వీడ్కోలు చెప్పుకుంటూ మచిలీపట్టణానికి 10 గంటలకు చేరడంతో సర్పంచ్‌ల మహారాష్ట్ర పర్యటన ముగిసింది. భగవంతుని దయవలన సర్పంచ్‌ల విజ్ఞానయాత్ర జయప్రదంగా నిర్దేశించిన సమయం మేరకు కొనసాగింది.

'హివ్రేబజార్' క్షేత్ర సందర్శన ముగించుకొని నాందేడ్ నుండి నిజామాబాద్‌కు వెళ్ళే సందర్భంలో మార్గమధ్యంలో బస్సులో ఇ.టి.సి. ప్రిన్సిపాల్ శ్రీ బి. ఆశీర్వాదంకి పర్యటనపై కృష్ణాజిల్లా సర్పంచ్‌లు తమ స్పందనను తెలియచేశారు.

'హివ్రే బజార్' గ్రామం చాలా చిన్న గ్రామం. తక్కువ జనాభా. కుల మత వర్గ రాజకీయ వైషమ్యాలు లేని గ్రామం. గనుక సర్పంచ్ పొపట్ పవార్ గ్రామాభివృద్ధి పట్ల దృఢ సంకల్పం గలిగి ఆ విజయాలు సాధించగలిగారని కంకిపాడు మండలం ఈడ్పుగల్లు గ్రామ సర్పంచ్ శ్రీ విజయకుమార్ అన్నారు. ఆ గ్రామం తమ గ్రామంలో ఓ వార్డుతో సమానమని తమ గ్రామాలు రకరకాల వైషమ్యాలు, రాజకీయాలకు కూడలి అయినా అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని పేర్కొన్నారు.

హివ్రే బజార్ గ్రామానికి ఇరవై సంవత్సరాలుగా సర్పంచ్‌గా కొనసాగడం, గ్రామసభలకు ప్రాధాన్యతనిచ్చి గ్రామస్థులను ఏకత్రాటిపైకి తేవడం ద్వారా ఆ గ్రామ సర్పంచ్ దానిని ఆదర్శ గ్రామంగా రూపొందించగలిగారని విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామ సర్పంచ్ శ్రీ రంగారావు పేర్కొన్నారు.

హివ్రేబజార్‌లో సంపూర్ణ మద్యనిషేధం, ధూమపాన నిషేధం ఆదర్శనీయమని అభినందిస్తూ, మద్యపానాన్ని ముఖ్య ఆదాయంగా






SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 6 12/26/2009, 11:27 AM

## గ్రామ వికాసం - దూర విద్యా బోధన (మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్-3)

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 21-01-10 | గ్రామ పంచాయితీ అధ్యక్షులు | 11.00-11.20 | గ్రామీణ నీటి సరఫరా |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| 28-01-10 | యం.పి.టి.సి.లు | 12.20- 12.40 | విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం |
| | | 12.40-01.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 1.00-1.20 | కేంద్ర ప్రభుత్వ పథకాలు |
| | | 1.20-1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 3.00-4.30 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |

మన రాష్ట్రం భావిస్తున్నదని, అవిరళకృషి చేసి మద్యపాన ప్రియులకు, విక్రేతలకు నచ్చచెప్పి తమ గ్రామంలో బెల్టు షాపులు లేకుండ చేసిన వైనం గూర్చి పెదపారుపూడి మండలం ఈదులమద్దాల గ్రామసర్పంచ్ శ్రీమతి కృష్ణవేణి విశదీకరించారు. పాపట్‌పవార్ లాగా సంకల్పం ఉంటే ఏదీ అసాధ్యం కాని ఆమె అన్నారు.

హిమ్రేబజార్ గ్రామస్థులు అధికశాతం దారిద్ర్యరేఖకు పైబడి ఉండటం, వారి జీవనోపాధులు, పంటలతీరు, నీటి యాజమాన్యం, వాటర్‌షెడ్ల నిర్మాణం, మార్కెటింగ్ పద్ధతులు చక్కగా ఉన్నాయని తిరువూరు మండలం రోలుపడి గ్రామ సర్పంచ్ యం.కుమార్, చిట్టేల గ్రామసర్పంచ్ శ్రీవినయ్‌కుమార్ పేర్కొన్నారు. అయితే హిమ్రేబజార్‌లో ఇతర ప్రాంతాల వారికి ప్రవేశించి స్థిరపడే వీలులేకపోవడం, గ్రామస్థులు ఇతర ప్రాంతాలవారికి ఆస్తి విక్రయాలు జరపగూడదనే నిబంధన, పట్టణప్రాంతానికి, పారిశ్రామికీకరణకు దూరంగా ఉండటం అందుకు కారణమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

మామిడిముక్కల, మచిలీపట్నం మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లు శ్రీమతి పద్మావతి, రమాదేవి, నాగలక్ష్మి హిమ్రే గ్రామంలోని మహిళలను కలసి వంట, వార్పు ఆహారపు అలవాట్లు తెలుసుకున్నారు.

హిమ్రే బజార్‌లాగే మన రాష్ట్రంలోని గంగదేవరపల్లి, ప్రగతినగర్ ఆదర్శ గ్రామపంచాయితీల అభివృద్ధి కూడా తమకు ఎంతో ఉన్నతమైనదిగా కన్పిస్తున్నదని బాపులపాడు మండలం కోడూరుపాడు సర్పంచ్ శ్రీ గరికపాటి రామకృష్ణ, పెడన మండలం శేరివర్తర్లపల్లి సర్పంచ్ శ్రీ కె. శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. హిమ్రేబజార్ గ్రామంలో అన్ని ఇండ్లు, పంచాయితీ, స్కూలు భవనాలకు ఒకే రంగువేసి యూనిఫారంగా ఉండటం, ఎక్కడగూడ గోడలమీద సినిమా, రాజకీయాలు, పోకిరిపాత్రలు లేకుండా ఉండటం తనను ఆలోచింపచేసిందని, అంతటి చిన్నగ్రామానికి విశాలమైన ఆవరణ గంభీరమైన ద్వారాలతో నిర్మించబడిన ఆఫీసు భవనం ఆశ్చర్యపరచిందని అవనిగడ్డ మండలం మోదుమూడి సర్పంచ్ శ్రీ వీర రాఘవులు చెప్పారు.

ఇ.టి.సి. ప్రిన్సిపాల్ శ్రీ ఆశీర్వాదం సర్పంచ్‌ల అభిప్రాయాలు తెలుసుకొని వారంతా తమ తమ గ్రామాలకు వెళ్ళి ఈ విజ్ఞానయాత్రతో పొందిన అనుభవాలను ఉపయోగించి తమ గ్రామాలను ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దుకొనవలెనని సలహా ఇచ్చారు. ఈ పర్యటనాద్యంతం చక్కగా సహకరించినందుకు ధన్యవాదాలు తెల్పినారు.

హిమ్రేబజార్ గ్రామ సందర్శన ద్వారా, సర్పంచ్‌లకు సక్రమ 'గ్రామ సభ నిర్వహణ' ద్వారా గ్రామస్థులతో ఐకమత్యం సాధించి, వారి శ్రమదానాన్ని సైతం మేళవించి, గ్రామాభివృద్ధి చేసుకొనగలమని తెలిసింది. సమస్యలు-విభేదాలు అంటూ కాలయాపన చేయక సర్పంచ్‌గా తాము ఆదర్శవంతంగా, నీతితో మెలగి, దృఢసంకల్పంతో పావట్ పవార్ లాగా గ్రామాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తే సత్ఫలితాలుంటాయనే అవగాహన ఏర్పడింది. తమలో ఈ జ్ఞాన, విజ్ఞాన జ్యోతిని వెలిగించిన జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏ.ఎం. ఆర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ (అపార్డ్) వారికి కృష్ణాజిల్లా సర్పంచ్‌లు మనస్సులో కృతజ్ఞతలు తెల్పుకొన్నారు. ఇలాంటి విజ్ఞానయాత్రలు తమకెంతో ఉపయోగపడతాయని, ఇలాంటి క్షేత్ర సందర్శన యాత్రలు మరిన్ని అవసరమని అభిప్రాయపడ్డారు. వాస్తవానికి సుదూర ప్రాంత క్షేత్ర సందర్శనతోబాటు, రాష్ట్రంలోనే వివిధ ఆదర్శ గ్రామాలకు ఇలాంటి పర్యటనలు రూపొందించి పంచాయితీ సర్పంచ్‌లకు జ్ఞాన విజ్ఞాన సముపార్జింప చేసి ప్రజాస్వామ్యాన్ని పరిమళింప చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. సర్పంచ్‌ల సాధికారికత పెంపొందించటానికి ఈ విజ్ఞానయాత్ర ఎంతగానో ఉపకరించింది.

**- ఎ. సిద్దయ్యనాయుడు**

*సీనియర్ డి.ఆర్.పి., జిల్లా పరిషత్ ట్రైనింగ్ సెల్, కృష్ణాజిల్లా, మచిలీపట్నం*



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 7 12/26/2009, 11:27 AM





**న్యా**యస్థానాలు ఇక పల్లెబాట పట్టనున్నాయి.సత్వర న్యాయం కోసం గ్రామీణ న్యాయాలయాలు ప్రజల ముంగిటకు రానున్నాయి. భారత గ్రామీణ జీవన వ్యవస్థకు పర్యాయపదమైన పంచాయితీలకు ఆధునిక రూపమే ఈ గ్రామీణ న్యాయాలయాలు. గ్రామీణ న్యాయాలయాలో వాద, ప్రతివాదాలన్నీ మాతృభాషలోనే జరగాలనే నిబంధనను న్యాయాలయాల చట్టం స్పష్టంగా పేర్కొంది. ఈ నిబంధనతో కక్షిదారులు స్వయంగా కేసు వాదించుకునే అవకాశం ఉంది.

ఫిర్యాదు అందిన 60 రోజుల్లో కేసు విచారణ చేపడతారు. వాదనలు పూర్తయిన 15 రోజుల్లో తీర్పును బహిరంగంగా ప్రకటిస్తారు. అనంతరం మూడు రోజుల్లో తీర్పుప్రతిని ఇరుపక్షాలకు ఉచితంగా అందిస్తారు. రూ.లక్ష మించని సివిల్ కేసులు, ఏడాది జైలు శిక్షార్హమైన క్రిమినల్ కేసులను గ్రామీణ న్యాయాలయాలు విచారిస్తాయి.

గ్రామ న్యాయాధికారి తీర్పుపై జిల్లా న్యాయస్థానంలో అప్పీల్

# పల్లెబాట పట్టనున్న న్యాయస్థానాలు



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 1 12/26/2009, 11:27 AM

- ప్రతి రెండు మండలాలకు ఒక కోర్టు
- ఆరు నెలల్లో కేసు పరిష్కారం
- ఫిర్యాదు అందిన 60 రోజుల్లో కేసు విచారణ
- వాదనలు పూర్తయిన 15 రోజుల్లో తీర్పు
- రూ. లక్ష లోపు సివిల్ కేసులు, ఏడాది జైలు శిక్షార్హమైన కేసుల విచారణ
- జిల్లా న్యాయస్థానంలో అప్పీలు చేసుకోవచ్చు
- మాతృభాషలోనే వాద ప్రతి వాదనలు

### రాష్ట్రమే ముందు ఉంటుంది

గ్రామీణ న్యాయాలయాలను ప్రారంభించడంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదట ఉంటుంది.గ్రామీణ న్యాయాలయాల నిబంధనలను రూపొందిచాల్సిన బాధ్యత హైకోర్టుదే. నిబంధనల రూపకల్పనకు త్వరలోనే ఓ కమిటీ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఎన్ని న్యాయాలయాలు కావాలి. ఎక్కడెక్కడ కావాలి.. సిబ్బంది ఎంత మంది ఉండాలి.. తదితర విషయాలను హైకోర్టు నిర్ణయిస్తుంది, పెండింగ్ కేసుల ఆధారంగా న్యాయాలయాల ఏర్పాటు ఉంటుంది.

**– నూరి అప్పారావు, న్యాయశాఖ కార్యదర్శి**

### విప్లవాత్మక చర్య

న్యాయాలయాల ఏర్పాటు న్యాయ సంస్కరణల చరిత్రలో విప్లవాత్మకమైన చర్యగా చెప్పొచ్చు. సత్యం, న్యాయం గురించి ఇన్ని సంవత్సరాల నుంచి మాట్లాడుతున్న మనం, ఇకపై దీన్ని ఆచరణలో చూపించవచ్చు. ఈ న్యాయాలయాల ఏర్పాటువల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. చట్టంలోని నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడకూడదు. న్యాయాలయాల వల్ల సామాజిక సంస్కరణలకు మరింత ఊపు వచ్చినట్లయింది.

**–ఎ. నర్సింహారెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్**




దాఖలు చేసుకోవచ్చు. కూలీల వేతనాలు, వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులు, కౌలు, పంట కాలవలు,నీటి నిల్వలు, బోర్లు, రహదారుల తగాదాలు, ఆస్తి వివాదాలు, భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు చెల్లించాల్సిన భృతి, హింస తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను సివిల్ కేసుల కింద న్యాయాధికారి విచారిస్తారు.

ప్రభుత్వ అధికారులను అడ్డుకోవడం, శాంతిభద్రతలను విఘాతం కలిగించడం, జంతుహింస, దొంగతనాలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం తదితర అంశాలపై ఫిర్యాదులను క్రిమినల్ కేసులుగా పరిగణించి విచారిస్తారు. గ్రామీణ న్యాయాలయాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వస్తే ఎగువ కోర్టుల్లో పెండింగ్ కేసుల భారం గణనీయ స్థాయిలో తగ్గుతుంది.

గ్రామీణ న్యాయాలయాల బిల్లును రాజ్యసభ ఇటీవలే ఆమోదించింది. న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ న్యాయాలయాలకు శ్రీకారం చుట్టింది. తొలిసారిగా గ్రామీణ న్యాయాలయాలను రాష్ట్రంలో ప్రారంభించాలని రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. న్యాయాలయాల ఏర్పాటుకు సంబంధించి తర్వితంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో ప్రతి రెండు మండలాలకు ఓ గ్రామీణ న్యాయాలయాన్ని ఏర్పాటు చేయాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

దేశవ్యాప్తంగా దాదాపు ఐదు వేల న్యాయాలయాలను ఏర్పాటు చేయాలని సంకల్పించిన కేంద్రం దాదాపు రూ.325 కోట్ల వ్యయాన్ని భరించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 25 వేల జనాభా, పట్టణ ప్రాంతాల్లో 50 వేల జనాభాకు ఓ న్యాయాలయం ఏర్పాటు చేయాలన్నది గ్రామీణ న్యాయాలయ చట్టంలోని ప్రధానాంశం. గ్రామ న్యాయాలయ పరిధిని పది కిలోమీటర్లకు నిర్దేశించారు. అయితే ఈ పరిధిపై తుది నిర్ణయ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. వీటికి తోడు సంచార న్యాయాలయాలూ పనిచేస్తాయి, గ్రామ న్యాయాలయ బాధ్యతలు నిర్వహించే గ్రామ న్యాయాధికారిని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుతో సంప్రదించి నియమిస్తుంది.

ఈ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ప్రాతినిధ్యం ఉంటుంది. జ్యుడీషియల్ ఫస్ట్క్లాస్ మేజిస్ట్రేట్ స్థాయి అధికారికి న్యాయాధికారిగా నియమిస్తారు.

**– టి. నర్మద**



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 2 12/26/2009, 11:27 AM

# 2009-10 గ్రామసభల సంవత్సరం



**(పంచాయతీ రాజ్ వ్యవస్థ 50 సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబరు 2, 2009 కొత్తఢిల్లీలో నిర్వహించిన పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధుల సమావేశంలో ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ సందేశం)**

**ఈ రోజు ఎంతో పవిత్రమైన చారిత్రాత్మక దినం. ఈ రోజు మహాత్మాగాంధీ జన్మదినోత్సవం జరుపుకోవటం మాత్రమే కాకుండా పంచాయతీరాజ్ వ్యవస్థ స్వర్ణోత్సవాలు కూడా జరుపుకుంటున్నాము. నేటికి ఖచ్చితంగా 50 సం.ల క్రిందట మన ప్రథమ భారత ప్రధాని శ్రీ పండిత జవహర్‌లాల్ నెహ్రూ పంచాయతీరాజ్ వ్యవస్థకు పునాదులు వేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన ఈ జాతీయ సమావేశానికి విచ్చేసిన మీ అందరికీ నా హార్ధిక స్వాగతం. మీ అందరితో సమావేశం కావటం నాకు ఎంతో ఆనందాన్నిస్తోంది. ఈ సమావేశాన్ని ఏర్పాటుచేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ సి.వి.జోషి గారికి, ఇతర మిత్రులకు నా అభినందనలు.**

దేశ అభివృద్ధిలో పంచాయతీరాజ్ సంస్థలు కీలక పాత్ర పోషించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రభుత్వ పథకాలు / కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలుచేయటానికి, ఈ కార్యక్రమాల అమలులో పారదర్శకతను తీసుకొనిరావటానికి ప్రజలను భాగస్వాములను చేయటం తప్పనిసరి. ఇది సాధించటం కేవలం పంచాయతీరాజ్ సంస్థల ద్వారా మాత్రమే సాధ్యం. భారతదేశంలాంటి విశాలమైన దేశంలో ప్రభుత్వ సేవలు ప్రజలచెంతకు చేరాలంటే అధికార వికేంద్రీకరణ ఒక్కటే మార్గం. దీనికి పంచాయతీరాజ్ సంస్థలు ఒక సమర్ధవంతమైన సాధనంగా ఉపయోగపడుతాయి.

స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్ల పంచాయతీరాజ్ వ్యవస్థలకు చట్ట బద్ధత లభించింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక స్వపరిపాలనా వ్యవస్థలుగా పనిచేయుటానికి అవసరమైన సాధికారతను కల్పిస్తూ స్థానిక ప్రాంతాలలో ఆర్థిక వికాసానికి, సామాజిక న్యాయ సాధనకు పథకాలను రూపొందించుకొనేలా చర్యలు తీసుకోవాలని 73వ రాజ్యాంగ సవరణ నిర్దేశిస్తోంది. కానీ మన దేశంలో ఈ చట్టం నిబంధనలు పూర్తిగా నేటికీ అమలుకు నోచుకోలేదు. చాలా రాష్ట్రాలలో పంచాయతీరాజ్ సంస్థలకు నిధులు, విధులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో బదలాయించలేదు. ఈ పరిస్థితిని మనమందరం సంస్కరించవలసిన అవసరం ఉన్నది.

పంచాయతీరాజ్ సంస్థలు సమర్ధవంతంగా పనిచేయాలంటే కేంద్ర ప్రభుత్వం విశేషమైన కృషి చేయాలి. ఇందుకు చేస్తున్న కృషికి ఉదాహరణగా పంచాయతీల ద్వారా అమలు జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చెప్పుకోవచ్చు. పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలు బదలాయించటంలో ఎన్నో బాలారిష్టాలు ఉన్నప్పటికీ జరుగుతున్న ప్రయత్నాల వల్ల వచ్చే తుది ఫలితాలు దేశ ప్రయోజనాల రీత్యా అనుకూలంగానే వస్తాయన్నది నా ధృఢ విశ్వాసం.

పంచాయతీరాజ్ సంస్థలను మంచి సాధనాలుగా మలచటానికి మనం నిరంతరం శ్రమించాలి. పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికయిన ప్రజాప్రతినిధులకు వివిధ పథకాల అమలులో, పర్యవేక్షణలో, ఆర్థిక సంబంధ లావాదేవీల నిర్వహణలో, సమాచార సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించటంలో సరైన శిక్షణ అందించటం ద్వారా ఈ సంస్థలను సమర్ధవంతమైన వికేంద్రీకృత పరిపాలనా వ్యవస్థలుగా మలచవచ్చు. అంతేకాకుండా ఈ సంస్థలకు కావలసిన కనీస సౌకర్యాలను కూడా సమకూర్చవలసి ఉన్నది.

2009-10 సంవత్సరాన్ని గ్రామ సభల సంవత్సరంగా పరిగణించటం నాకు చాలా సంతోషంగా ఉన్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామసభ అనేది ప్రజలు ప్రత్యక్షంగా పరిపాలనలో పాలు పంచుకోవటానికి ఉద్దేశించిన వేదిక. గ్రామంలోని ప్రజలందరూ గ్రామ సభలో పాల్గొని గ్రామపంచాయితీ చేసే ప్రతిపాదనలపై చర్చింటానికి, ప్రతిపాదనలు ఆమోదించటం లేదా తిరస్కరించటం చేయవచ్చు.

కేంద్ర మంత్రివర్గం నిన్న జరిగిన సమావేశంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కార్యక్రమంగా నామకరణం చేయటం నాకు ఎంతో ఆనందంగా ఉన్నది. మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్యాన్ని గూర్చి ఎన్నో మార్లు నొక్కి చెప్పారు. జాతీయ గ్రామీణాభివృద్ధి పథకానికి మహాత్మాగాంధీ పేరు జతచేయటం అన్నది జాతిపితకు మనుమందరం ఇచ్చిన ఒక చక్కని నివాళిగా భావించవచ్చు.

మరొక్కసారి మీ అందరికి ఈ సమావేశానికి స్వాగతం పలుకుతున్నాను. ఈ సమావేశంలో చర్చించే అంశాలు పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి ఉపయోగపడుతాయని భావిస్తాను. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాధనకు పంచాయతీరాజ్ సంస్థలు చక్కని సాధనాలు. రండి! అందరం కలిసి పంచాయతీ రాజ్ సంస్థలను మరింత బలోపేతం చేయటానికి, సమర్ధవంతంగా పనిచేసేలా చూడటానికి ప్రతిజ్ఞ చేద్దాం!!

సేకరణ & అనువాదం : ***డా. శివశంకర్ ప్రసాద్***
ఫ్యాకల్టీ మెంబర్, అపార్డ్.



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 4 12/26/2009, 11:27 AM

# హోమియో వైద్యం ఎందుకు మంచిది ?

– డాక్టర్ బి. సోహన్ సింగ్

## కంటివ్యాధులు

**వివరణ :** కళ్ళలోని తెల్లదనం ఎరువు ఛాయలోకి మారినప్పుడు కళ్ళకు వ్యాధి వచ్చినట్లు కాగలదు, కళ్ళలో నుంచి వేడి అవిరి రావడం, కనుగుడ్డులో భరింపలేని నొప్పి కలగడం, ఆ నొప్పి తలలోకి చొరబడటం (వ్యాపించడం), కాంతి (వెలుగు) ని ఏ మాత్రం కళ్ళు భరించలేకపోవడం, కన్నీళ్ళు అవిరి అయిపోయి కళ్ళు ఎండిపోయినట్లుగా పొడిగా వుండడం, జ్వరం రావడం మొ॥ లక్షణాలు వుంటాయి.

**లక్షణాలు :** 1. కళ్ళు బాధగా వుండి ఎఱ్ఱబడటం, వెలుతురును భరించలేకపోవడం, కళ్ళు తెరవడమంటేనే భయం వేయడం.

2. కంటిపొర (కన్నులోని తెల్ల గుడ్డును, కనురెప్పలలోన అంటివుండే పొర) కు ఏర్పడే బాధ, పసుపు పచ్చని ద్రవం కారుతుండటం.

3. రాత్రి వేళల్లో తీవ్రమైన నొప్పితో కళ్ళనుంచి పసుపు పచ్చని ద్రవం కారుతుండటం.

4. పిల్లలలో కంటిపొరలకు బాధ ఏర్పడి, సహించలేని పరిస్థితిలో ఉండటం.

- వాడవలసిన మందు, వాడకం – బెల్లడోనా– ప్రతి రెండు గంటలకు ఒక డోస్.

బెల్లడోనా– ప్రతి ఒక గంటకు ఒక డోస్.

పల్సటిల్లా– ప్రతి మూడు గంటలకు ఒక డోస్.

కామోమిల్లా– ప్రతి మూడు గంటలకు ఒక డోస్.

## చెవులకు సంబంధించిన వ్యాధులు

వివరణ: చెవిలో భరింపలేని నొప్పి, చెవిపోటు, బాధలు ఒక తీరుగా ఉండవు. చల్లదనం సోకితే బాధ ఎక్కువవుతుంది. అనేక సందర్భాలలో పంటినొప్పికి కూడా దారితీయవచ్చు. చెవి లోపలి భాగంలో నొప్పి పెరగవచ్చు.

**లక్షణాలు :** 1. జలుబు, పడిశం చిహ్నాలతో కలిసి చెవిపోటు వుంటే

2. తీవ్రమైన జ్వరంతో చెవిపోటు ఎక్కువగా ఉంటే

3. చెవిపోటు బాగా ఎక్కువగా ఉండి, రాత్రివేళల్లో ప్రత్యేకించి పిల్లలలో బాధ కలిగి గుక్కపట్టి ఏడుస్తుంటే

4. తీవ్రమైన చెవిపోటుతో రాత్రిళ్ళు బాధపడుతుంటే

- వాడవలసిన మందు, వాడకం




బెల్లడోనా

మెర్క్‌సాల్– ఒక దాని తర్వాత ఒకటి ప్రతి గంటకు ఒక డోస్ చొప్పున బెల్లడోనా.

మెర్క్‌సాల్– ఒక దాని తర్వాత ఒకటి తీవ్రతను బట్టి గంట, రెండు గంటలు, 3 గంటలకు ఒకసారి ఒక్కొక్క డోస్

కామోమిల్లా– ప్రతి గంటకు, రెండు గంటలకు ఒక డోస్

పల్సటిల్లా– ప్రతి గంటకు, రెండు గంటలకు ఒక డోస్.

## చెవి నుంచి చీము కారడం

**లక్షణాలు :** 1. శీతాకాలంలోను, చల్లటి గాలివల్ల చెవులు సున్నితంగా వుండి చీముకారినప్పుడు

2. చలిగాలి వల్ల నొప్పి లేకపోయినా, చెవిలో నుంచి ముదురు ఆకుపచ్చ రంగులో చీము కారుతున్నప్పుడు

3. పైన చెప్పిన మందుల వల్ల బాధలు తగ్గక పోయినప్పుడు

4. చలిగాలికి చెవులలో పోటు / బాధ కలిగినా, బాధ వున్న చెవి వున్న దిశగా పడుకోలేని పరిస్థితిలో

5. చెవులు దిబ్బడ కట్టి, కొద్దిగా వినికిడి శక్తి కోల్పోయినప్పుడు (ముక్కుపై భాగమును, మధ్య చెవిని కలుపు వినికిడి వాహిని (కర్ణకంఠ నాళం) దెబ్బతింటే కలిగే పరిస్థితి)

- వాడవలసిన మందు, వాడకం

సిలికా. రోజుకు నాలుగు డోస్‌లు వాడాలి.

పల్సటిల్లా. రోజుకు మూడు డోస్‌లు వాడాలి.

మెర్క్ సాల్. రోజుకు మూడు సార్లు వాడాలి.

హెపార్‌సల్ఫ్. రోజుకు మూడు పూటలా మూడు డోస్‌లు వాడాలి.

మెర్క్ సాల్. ప్రతి రెండు గంటలకు, నాలుగు గంటలకు ఒకసారి ఒకొక్క డోస్ చొప్పున తీసుకోవాలి.

## ముక్కుకు సంబంధించిన వ్యాధులు

**వివరణ :** ముక్కు లోపలి భాగంలో రక్తం ఎక్కువగా వున్న ప్రాంతం నుంచి నెత్తురు (రక్తం) చుక్కలుగా పడటం, సాధారణంగా మధ్య వయసు గల వారికి ఈ వ్యాధి కలుగుతుంది.

**లక్షణాలు :** 1. పొడి వాతావరణంలో ముక్కు నుంచి రక్తం కారడం జరిగితే

2. ముక్కుకు దెబ్బ తగిలిన కారణంతో లేదా బాగా దగ్గడం వల్ల రక్తం కారితే

- వాడవలసిన మందు, వాడకం

బ్రయోనియా. ప్రతి ఆరు గంటలకు ఒకసారి ఒక డోస్ చొప్పున ఇవ్వాలి.

ఆర్నికా. రక్తంకారడం తగ్గి, ఉపశమనం కలిగేవరకు ప్రతి గంటకు ఒక డోస్.

✧



SthanikaPalana_Tel_Jan2010_F_Black.pmd 3 12/26/2009, 11:27 AM

# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## త్వమేవాహం

**జగత్ప్రసిద్ధుడైన జగన్నాథ పండితరాయల స్వగ్రామం తూర్పు గోదావరి జిల్లా ముంగండ అగ్రహారం. జన్మత: ఆంధ్రుడైన ఆ మహా సారస్వత మూర్తి భారతదేశంలోని అన్ని ప్రాంతాలూ పర్యటించి, అన్ని ప్రాంతాల భాషల్నీ ఆకళింపు చేసుకున్నారు. చివరికి ఢిల్లీలోని షాజహాన్ పాదుషా కొలువు కూటాన్ని చేరి, అక్కడ పాదుషా చేత సకల గౌరవ సన్మానాలూ అందుకున్నారు.**

ఆయన ఒకమారు సర్వభారత దర్శనం కోసం, దేశంలోని అన్ని ప్రాంతాలూ చూసి, అక్కడ గల సాహితీమూర్తులతో సారస్వత గోష్ఠి ప్రారంభించారు. అలా దర్శించడంలో ఆయన అయోధ్య, కాశీ, పూరీ జగన్నాథం ప్రాంతాలకు వెళ్ళి అక్కడి కవులతో చర్చల్లో పాల్గొంటూ "మీలో ఎవరికేనా తెలుగు వచ్చా" అని ప్రశ్నిస్తూ వుండేవారు.

ఆ పర్యటనలో ఆయన వాదినస్తూ, విమర్శిస్తూ తన సిద్ధాంతాలు ప్రతిపాదిస్తూ ఎంతగా తలమునకలయిపోయారంటే తక్కిన ప్రాపంచిక విషయాలన్నీ దాదాపు జ్ఞాపకం తెచ్చుకోడానికి వీల్లేనంత జిజ్ఞాసలో పడిపోయారు. అయోధ్య, కాశీ, పూరీ వంటి వందలాది సభల్లో పాల్గొని చివరికి రాజమహేంద్రవరం చేరుకొని అక్కడ ఒకసారి సారస్వత సమావేశంలో పాల్గొంటూ అక్కడా అదే ప్రశ్న వేశారు – "మీలో ఎవరికైనా తెలుగువచ్చా?" అని. ఆయన ప్రశ్న విని సభాసదులంతా తెల్లబోయి చూడ్డంతో ఆయనకి జ్ఞాపకం వచ్చింది. తను మాట్లాడుతున్నది తెలుగు నడిగడ్డ మీద అని. చిరునవ్వు నవ్వి, "త్వమేవాహం" అన్నాడు. 'నిజమే – మీరూ నేనూ ఒకటే –అంతా తెలుగువారమే' అనే అర్థంలో.

☆

## అర్థ మనర్థం

**నేడు మన సమాజంలో మేధావుల్నీ, పండితుల్నీ, కళాకారుల్నీ చూస్తే జాలీ వేస్తుంది. ఒక్కొక్కప్పుడు జుగుప్సా కలుగుతుంది. ప్రభా సమానమైన ప్రతిభా, విద్యా, విజ్ఞాన సంపదా, తమ దగ్గర అపారంగా పెట్టుకుని, తమ కాలిగోటికి కూడా పోలని ధనవంతుడి చుట్టూ, అతను రాల్చే డబ్బుల కోసం దేవురిస్తూ తిరిగే ఆ మేధావుల్ని చూస్తే జాలి కూడా వేస్తుంది.**

ఒకనాడు మన సమాజంలో మేధావులు అలా లేరు. దేహి అని ఒకర్ని దేవురించక, వారిచ్చే ధన కనక వస్తు వాహనాల్ని గడ్డిపరకలా తృణీకరించి హుందాగా ఆత్మగౌరవం కాపాడుకునేవారు. అలాంటి వారిలో వింజరం అవధానిగారు ఒకరు. యానాం దగ్గరున్న ఆ గ్రామాన్ని అవధానిగారి పూర్వుల కెవరికో పెద్దాపురం ప్రభువు ఈనాముగా రాసి ఇచ్చారు.

ఓమారు పెద్దాపురం ప్రభువుగారికో ధర్మసందేహం వచ్చింది. దాన్ని అవధానిగారు తప్ప ఎవరూ తీర్చలేరని తేల్చారు. ప్రభువు అవధాని గారిని పెద్దాపురం పిలిపించవచ్చు. కాని నేటి రాజకీయ నాయకుల్లా ఔచిత్యం ఎరగనివాడు కాదు ప్రభువు. పెద్దాపురం దయచేయవలసిందని బోయీల నిచ్చి పల్లకీ పంపాడు.

పల్లకీలో వింజరం నుంచి వేంచేసిన అవధానిగారిని సగౌరవంగా ఎదురేగి తీసుకువచ్చాడు ప్రభువు. తర్వాత ఆయన్నడిగి తన ధర్మసందేహం కూడా తీర్చుకున్నాడు. అవధానిగారికి కానుకలివ్వబోయాడు. సత్కారం చెయ్యబోయాడు. కనీసం శాలువా అయినా తీసుకోండి అన్నాడు. అవధానిగారు అన్నీ తిరస్కరించారు.

"మీ పెద్దలు మా పెద్దలకి అగ్రహారం ఇచ్చారు. అది చాలు–బ్రతుకు వెళ్ళిపోతోంది. ఈ డబ్బూ, బట్టలూ నాకెందుకు" అని, "అర్థమనర్థం" అంటూ పల్లకీ ఎక్కి తిరిగి తమ స్వగ్రామం వింజరం వెళ్ళిపోయారు నిర్వికారంగా.

☆

## మహారాజ్యమా? మహాభాష్యమా?

**ధన కనక వస్తు వాహనాలకీ గౌరవ సత్కారాలకీ ప్రలోభపడకుండా, ఎవరి దగ్గరా దేహి అని చెయ్యి చాపకుండా హుందాగా రాజాగా దర్జాగా బ్రతికిన మహా విద్వాంసుల్లో భాగవతి హరిశాస్త్రిగారు ఒకరు.**

వ్యాకరణంలో కాశీ పండితుల్ని ఓడించి వచ్చి తూర్పుగోదావరి జిల్లా కోటిపల్లిలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని పఠన పాఠనాలతో కాలం గడిపేవారు. నిలువెత్తు ధనం ఇస్తానన్నా ఆయన కోటిపల్లి దాటి అడుగు బయట పెట్టేవారు కాదు. చీకటి ఉండగా గోదావరి కి వెళ్ళి స్నానం చేసి రావడం – శిష్యులకి పాఠం చెప్పుకోవడం – అంతే. మళ్ళీ ఫాలాక్షుడు వచ్చినా గడపదాటి బయటికి వెళ్ళడం లేదు. తిరిగి మర్నాడు గోదావరి స్నానానికే బయటికి రావడం. ఆ మహానుభావుడి దర్శనం చేసుకోవాలనుకున్నారు పిఠాపురం రాజా శ్రీ రావు గంగాధర రామారావుగారు.

కానీ ఎలా? శాస్త్రిగారు కోటిపల్లి విడిచి రారే? సరే – రాజావారే కోటిపల్లి వెళ్ళారు. కానీ శాస్త్రిగారికి ఎదురువెళ్ళి నమస్కారం చేసి తనని పరిచయం చేసుకుని "మీ దర్శనం చేద్దాం అని వచ్చాను" అన్నారు పిఠాపురం రాజా. శాస్త్రిగారు గంభీరంగా "చేశారుగా?" అన్నారు.

"మరి సత్కారం..." అంటూ నీళ్ళు నమిలారు గంగాధర రామారావుగారు. శాస్త్రిగారు సత్కారానికి తిరస్కారంగా తల త్రిప్పి చిరునవ్వు నవ్వి *"మహారాజ్యం వా పాలయే న్మహాభాష్యం పాఠయేత్"* అంటూ వెళ్ళిపోయారు.

మహారాజ్యం పాలించే వాడికి ఎంత ఆనందం కలుగుతుందో, పతంజలి మహాభాష్యం పాఠం చెప్పుకునే వాడికి కూడా అంతే–అంతకంటే ఎక్కువ కూడా అని దాని అర్థం.

విద్యాధనం ముందు భౌతిక సంపద ఒక లెక్కా? గడ్డిపరకతో సమానం అనే దృష్టితో వెళ్ళిపోయిన హరిశాస్త్రిగారిని చూస్తూ అవాక్కయి నిలబడిపోయారు పిఠాపురం రాజా.

☆

 

# రుతువుల వర్ణనల్లో తెలుగు అందాలు

అభినవోన్మేషజంబయినట్టి తొలుచూపు
కౌస్తుభాలోక రేఖలకునలగ
సాంగభంగం బైనయావులింతకు వేల్పు
లంగుళీస్ఫోటనం బాచరింప
సౌఖశాయనికులై సంపర్త భృగ్వాది
మునులుహస్తాం భోజములు మొగుడ్ప
ధృత చేతనంబులై దివ్యాయుధంబులు
జయ జయ ధ్వనులతో సంస్తుతింప
కలువ రేకుల బోలెపెంజిలువరేని
యరవి కుబుసంబు మైనంటి యుండ
నిదుర మేల్కాంచికూర్చుండె నుదధి నడుమ
విష్ణుడఖిలేశ్వరుడు శరద్వేళయందు

పూర్వ తెలుగు సాహిత్యంతో అంతో ఇంతో పరిచయం ఉన్న ఎవరికయినా ఇది శ్రీనాథుని పద్యమని ఇట్టే తెలిసిపోతుంది. ఈ పద్యం శ్రీనాథ కవితాముద్ర ముద్రితం. కాశీఖండంలో అగస్త్యుడు దక్షిణ దిశకు వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని, శరదృతువు ప్రవేశాన్ని, అప్పుడు ప్రకృతిలో వచ్చిన మార్పులనూ, సాంస్కృతికాంశాలనూ, పౌరాణికాంశాలనూ వ్యక్తీకరిస్తూ ఆయన చిత్రించిన పద్యమిది.

ఎంత అందమయినదీ పద్యం! కేవలం పద్యరచనా విషయంగానే కాదు, విషయాన్ని బట్టి కూడా అందమయింది. బహుశ ఇట్లాంటి పద్యం ఒక్క తెలుగులోనే, ఒక్క శ్రీనాథుడే రచించగలిగిన పద్యమన్నా గూడా ఎవరూ అభ్యంతరపడనక్కర లేని పద్యమిది.

భగవంతుడు నిద్రపోతున్న స్థితిని 'నిద్రా ముద్రాభిరామం' అంటూ, స్వామి నిద్రా సౌందర్యాన్ని భావించి అనుభవించిన కవులు – భక్తకవులు అటు సంస్కృతం, ఇటు ప్రాంతీయ భాషల్లోనూ ఉంటే ఉండవచ్చు గాని, నిద్ర మేల్కొంటున్నప్పటి సందర్భాన్ని ఇంత మధురంగా చిత్రించిన కవులు కన్పించటం లేదంటే అతిశయోక్తి కాదు.

ఈ పద్యం అందమంతా మొదటి పాదంలో ఉంది.

ఆ భగవంతుడు – ఆ అఖిలేశ్వరుడు అప్పుడప్పుడే కళ్లు తెరుస్తూ తెరుస్తూ నిద్ర మేల్కొంటున్నాడు. ఆ క్షణంలో ఆయన వెల్లకిల పడుకొని ఉన్నాడు గదా! ఆ కంటిలో నుండి వెలుపలికి ప్రసరించిన తొలుచూపుగా మొదటి చూపు – గుండెల మీదుగా సాగింది. అయితే, ఆ గుండెల మీద కౌస్తూభ రత్నం– కంఠహారంలోని మధ్యమణిగా ఉండింది. అది ఉజ్జ్వలమయిన రత్నం. దాని కాంతులు అన్ని వైపులా చిమ్ముతున్నాయి. అది ఎదురు చిమ్మే కాంతిరేఖలకు ఆ స్వామి తొలుచూపు 'నలిగి'పోతున్నదట. చూపు నలగటమేమిటి? కళ్లల్లోనికి బయటి వెల్గులు బలంగా దూసుకువచ్చిన క్షణంలో కళ్లు మిరుమిట్లుగొన్నాయనటం సాధారణంగా వినేదే. అప్పటిస్థితిలో కళ్లు చీకట్లు కమ్మినాయనే అనటం అంటే సాధారణం కాని, ఈ నలుగటమేమిటి? బట్టలు నలిగాయంటాం. ఒళ్లు నలిగిపోయిందంటాం. మరి చూపు నలిగిపోయిందంటారా? శ్రీనాధుడంటాడు. అతనే అనగలడు. ఈ తరహాలో అనగలవాడు బహుశః తెనాలి రామకృష్ణుడు మాత్రమేనేమో! కాగా, చూపు నలగటం ఎంత అందమయిన అభివ్యక్తి!

**శ్రీనాధుడంటే, ఇట్లాంటి అభివ్యక్తి.**
**ఆయన అంతటితో ఆగిపోలేదు.**

ఆ స్వామి ఒళ్లు విరుచుకొని ఆవులించాడట. నిద్రలేవగానే సామాన్యంగా చేసే/జరిగే పనులివే. ఇది ఒక సహజక్రమం. ఆవులించేప్పుడు తెరచుకొన్న నోటిముందు చిటికలు వేసుకొంటారు చాలామంది. ఈ పని ఆవులింత వచ్చిన ప్రతిసారీ చేస్తూనే ఉంటారు. (శ్రీనాధుడు అట్లా చేసేవాడేమో!) అయితే, ఎవరికి ఆవులింత వస్తే, వారే చిటికలు వేసుకొంటారు. మరి, ఆస్వామి, ఆ అఖిలేశ్వరుడు, తనకు తాను ఆవులిస్తే ఆవులిస్తాడేమోగాని (అది మరొకరు చేయటానికి వీలు కుదరదు కాబట్టి) చిటికలు గూడా ఆయనే వేసుకొంటాడా? ఆయన మేల్కొనే సమయానికి – మేల్కొలుపు సేవకు – దర్శనానికి సిద్ధంగా నిలిచి ఉన్న దేవతలు – ఆయనకు 'కష్టం' లేకుండా 'అంగుళీస్ఫోటనం' – చిటికలు వేయటం చేశారుట!

ఆ స్వామిదే వైభవం? ఎంత వైభోగం?

మహారాజుల దగ్గర వారి వారి వైభవ సూచకంగా కొందరు సేవకుల ంటారు. వందిమాగధుల విషయం ప్రసిద్ధమే. వారితో పాటు కొందరి వద్ద మరి మరికొందరుంటారు. ఆ కొందరిలో వారు 'సౌఖ శాయనికుల ు'– 'సుఖశయనం పృచ్ఛవీలు సౌఖశాయనికః'– 'స్వామి! ప్రభూ! సుఖంగా శయనించారా? బాగా నిద్రపట్టిందా?' అని వీరు అడుగుతూ ఉంటారు. ఈ స్వామి వద్ద సంవర్తుడు, భృగువు వంటివారు ఈ విధంగా అడుగుతున్నారట.



దేవతలు, మునులు చేతనులు– చైతన్యవంతులయిన జీవులు, ఆయుధాలు అచేతనాలు. శ్రీహరి పంచాయుధుడు – శంక, చక్ర, గదా, ధనుఃఖడ్గాలు –సుదర్శన, పాంచజన్య, కౌమోదకి, శార్జ, నందకాలు. మరి, శంఖం కూడా ఒక 'ఆయుధ'మేనా? అవును, అది ఆయనకు ఒకానొక 'ఆయుధమే'. 'విష్ణోః ముఖానిల పూరి తస్యి, యస్యధ్వనిః దానక దర్పహంతా? విష్ణువుచే ఊదబడిన ఆ శంఖం ధ్వని దానవుల దర్పాన్ని హరి స్తుంది. గుండెలు పగులగొడుతుంది. ఈ అయిదూ 'దివ్య' ఆయుధాలు. కార్యకాలంలో ఇవి కేవలం 'ఆయుధాలు' గానే ఉపయోగపడతాయి. కాని, భగవత్సేక సమయంలో అవి 'ధృవ చేతనాలు' అవుతాయి. అది వీటి విల క్షణత్వం. అవి ఈ సేవా సందర్భంలో 'జయజయ' ధ్వనులతో (బహుశః వంది మాగధులవలె) విష్ణువును కీర్తిస్తున్నాయి, పొగడుతున్నాయిట.

విష్ణువు శయ్య 'పెంజిలువరేడు' – పెద్ద పాముల రాజు – ఆదిశేషుడు. ఆయన కుబుసం పొదల ముక్కలలో ఆ దేవదేవుని శరీరాన్ని కలువరెక్కలతో వల అలంకరిస్తున్నాడట.

వీరందరూ ఇవి చేశారు. మరి హారతి ఏది? శ్రీనాధుడు హారతి సేవ చెప్పలేదుగాని, శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు.

*'సాంధ్య రాగలహరి సామి రంజితములై*
*తిరిగెమింట నిదుర తెలిసినట్టి*
*ఇందిరాధిపతికి నెత్తు కర్పూరనీ*
*రాజనంబులన శరద్ఘనములు'*

(ఆముక్తమాల్యద 4–137)

'శరత్ ఘనములు' – శరత్కాలంలోని మబ్బులు తెల్లగా పలుచగా, పింజెలు పింజెలుగా ఉంటాయి. వీటి మీద (ఉదయ) సంధ్యాకాంతులు ప్రసరిస్తున్నాయి. ఆ మబ్బులు ఎరుపు దిరిగి – నిద్రమేల్కొన్న శ్రీమహావిష్ణువు కెత్తిన కర్పూర నీరాజనంగా ఉన్నాయిట. ప్రకృతి ఆ స్వామికి చేస్తున్న హారతిసేవ. ఆకాశం ఒక హారతి పళ్లెం. మబ్బు పింజెలు కర్పూర దీపాలు. ఎంత దివ్యమయింది. ఈ రాయలు వారెత్తిన హారతి! కేవలం ఆకాశమే కాదు, నేల కూడా హారతులిచ్చింది.

*"–ఉదిత బోధ భుజంగ శయోపచారనీ*
*రాజనపుల్ల హల్లకసరంబుదయించె శరద్దినంబులన్".* (ఆ. 4–137 సరుస్సులలోని) ఎర్రకలువల వరసలు నిద్ర మేల్కొన్న శేషశయనునికి (శ్రీవిష్ణువుకు) నీరాజనం లాగా శరదృతు దినాలు నేలమీదికి వచ్చినయి. సరస్సు పళ్లెం. ఎర్రకలువలు దీపాలు. హారతి పట్టింది నేలమీదికి వచ్చిన శరత్కాల దినం.

రాయలు చెప్పిన ఈ రెండంశాలూ నింగీనేలా స్వామికి హారతి పట్టినాయని సూచిస్తున్నాయి.

శ్రీనాధుడు వైకుంఠంలోని ఒక దృశ్యాన్ని ప్రదర్శిస్తే కృష్ణదేవరాయలు ప్రకృతిలోని ఆహ్లాదకరమయిన దృశ్యాన్ని ఊహించాడు. 'సర్వమున్నతిని దివ్యకళామయ మంచు విష్ణునం దుల్లము చేర్చి' శ్రీనాధుని రాయల సేవాభావనను మనం మననం చేసుకోవచ్చు.

తమ కావ్యాల్లో శరదృతు చిత్రణ చేసిన పూర్వకవులు దాదాపు అందరూ ఈ విష్ణువు మేల్కొనటం అనే అంశాన్ని క్లుప్తంగానో, విపులంగానో ప్రస్తావించిన వారే.

ఇంతకీ ఈ శరదృతువుకీ విష్ణువు మేల్కొనటానికి ఏమి సంబంధం? 'మేఘదూత' కావ్యంలో కాళిదాస యక్షుడు తనకు సంవత్సరకాలం అనుభవించవలసిన భార్యావియోగ శాపం ఎప్పుడు పూర్తవుతుందో తన భార్యకు సందేశం పంపుతూ 'శాపాం తోమే భుజగ శయనాదుత్థితే శార్జపాణే' అని అంటాడు. తన శాపం పాము పడవ నుండి నిద్ర లేచిననాడు ముగుస్తుందన్నాడు. ఆ మేల్కొనే దినం కార్తీకశుద్ధ ఏకాదశి. దీన్నే 'ఉల్థానైకాదశి' 'ప్రబోధ ఏకాదశి' అని అంటారు. మరి, ఇది ఉల్థానైకాదశి అయితే ఆయన పడుకొనే / నిద్రపోయే దినమేది? నిద్ర పోతేనేగదా మేల్కొనటం! ఆయన ఆ నిద్రకుపక్రమించింది ఆషాఢ శుద్ధ ఏకాదశి, దాన్ని శయనైకాదశి అంటారు. కాగా, ఆషాఢ శుద్ధ ఏకాదశి మొదలు కార్తిక శుద్ధ ఏకాదశి వరకు ఈ నాలుగు నెలలు ఆయన నిద్రపోతారన్న మాట. అసలు విష్ణువుకు నిద్ర ఏమిటి? ఆయన నిత్య జాగృతుడు కదా!

నిజమే. అయితే, ఆయన నిద్రా, మన నిద్రా ఒకటి కాదు. మనది భోగనిద్ర.– నిద్ర సరిగా పడితే – ఆరోగ్య లక్షణం కాబట్టి – భోగనిద్ర లేకపోతే రోగనిద్ర. ఆయనది యోగనిద్ర. ఆయన యోగేశ్వరుడు. (యత్ర యోగే (గో)శ్వరః కృష్ణః). విష్ణువు (యోగ) నిద్రాకాలమయిన ఈ నాలుగు నెలలు మునులు, యతులు మొదలయినవారు నిలకడగా ఒకచోటనే ఉండి యజ్ఞయాగాదులు, వ్రతాలు, దీక్షలు నిర్వహిస్తుంటారు. ఈ నాల్గునెలలు చేసే వాటిని 'చాతుర్మాస్య' దీక్షలంటారు. ఇది కేవలం వైదికులే కాక బౌద్ధులు, జైనులు కూడా నిర్వహించేవారు. కాగా చాతుర్మాస్య విధివిధానాలు అందరూ ఆచరించవలసినవే.

ఈ నాలుగు నెలలూ వానలూ, జడివానలూ, జల్లులూ, తుంపరలూ – నేలంతా బురదా – అంతా కిచాటు కిచాటుగా ఉంటుంది. వీటితో

వాతావరణంలో మార్పువల్లా రకరకాల క్రిమికీటకాదులు విజృంభించి రకరకాల రోగాలకు కారణాలవుతాయి. త్రిదోషాలు – (వాత, పిత్త, కఫాలు) ప్రకోపిస్తాయి. అందువల్ల రాజకూషలు, ముల్లంగి, గుమ్మడి, కొన్నికొన్ని విధాల పప్పుదినుసులూ, చింత, కొత్త ఉసిరిక వంటి వాటిని ఆహారంలో తీసుకోగూడదని ధర్మశాస్త్రాలు నిషేధిస్తున్నాయి. ఈ నిషేధాలు గమనిస్తే మన పండుగలూ, వ్రతాలూ వంటివన్నీ మన ఆరోగ్యాన్ని కాపాడేందుకే ఏర్పడ్డట్టు కన్పిస్తుంది.

నిజానికి చాతుర్మాస్యం నాల్గు నెలలూ వర్షర్తువు. కాలం ఋతువుల సంపుటి. ఋతువు అంటే నడిచేది (కాలం–ఋగతే) అని తాత్పర్యం. ఒక ఋతువు తరువాత మరొక ఋతువుగా కాలం సాగిపోతూ ఉంటుంది. అందుకే ఋతుచక్రమంటారు. ఈ ఋతువులు కాలం గడిచే తీరును బట్టి గుర్తించబడినటయి. ఆరు ఋతువుల నేల ఈనాటి లెక్క. ఒక్కొక్కటి రెండు నెలలు. సంవత్సరానికి ఆరు ఋతువులు, పన్నెండు నెలలు. కాని పూర్వం సంవత్సరానికి మూడు ఋతువులేననీ, ఒక్కొక్కటి నాల్గు నెలలనే లెక్క ఉండేది. వానా కాలం, చలికాలం, ఎండాకాలం–మూడు 'కాలా'లు – ఋతువులు. (వర్షం, హేమంతం, వసంతం). వాతావరణంలోని మార్పుల ను మరింత నిశితంగా గుర్తించటం వల్ల కావచ్చు–వరహమిహిరుని నాటి నుంచి ఆరు ఋతువుల లెక్క మొదలయింది. నాల్గేసి నెలలుగా ఉండిన ఈ కాలాలను రెండేసి నెలలుగా విభజించటం వల్ల రెండేసి నెలల ఋతువులు– వర్ష, శరత్, హేమంత, శిశిర, కసుత, గ్రీష్మ అంటూ ఆరు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వర్షర్తువులోని ఉత్తరార్ధం శరదృతువుగా గుర్తింపబడింది.

ఒకప్పుడు వర్షర్తువుతోనే సంవత్సరారంభం పాటించబడేది. అందుకే 'వర్షం' అనేది సంవత్సరానికి పర్యాయ పదమయింది. వర్షర్తువులో ఉత్తరార్ధంగా ఏర్పడ్డ 'శరత్' కూడా సంవత్సరానికి పర్యాయపదమే. నిజానికి ఏ ఋతువయినా సంవత్సరంలో ఒక్కసారే కాబట్టి ప్రతి ఋతువూ సంవత్సరానికి పర్యాయపదం కావచ్చు. కాని వర్ష, శరత్, వసంతాలే వత్సర పర్యాయపదాలుగా వ్యవహారానికెక్కినాయి. హేమంతానికి ఈ వ్యవహారం చాలా అరుదు. గ్రీష్మ–శిశిరాలకు ఆ వ్యవహారం కన్పించదు. ఇవి వసంత హేమంతాల ఉత్తరానర్థాలే అయినా ఒకటి ఎండలతో నేలను మండించే, నెర్రలు కాయ జేసేది, మరొకటి ఆకులు రాల్చి ప్రకృతిని నగ్నం చేసేది. బహుశః అందువల్లే కావచ్చు, అవి వత్సర పర్యాయ పదాలు కాకుండా పోయి ఉంటాయన్పిస్తుంది.

ప్రకృతిలోని పరిణామాలను బట్టి ఋతువులూ, ఖగోళంలోని నక్షత్రాల గమనాన్ని బట్టి నెలలూ పరిగణింపబడుతున్నట్టు భావించవచ్చు.

శరదృతువులోని చివరి మాసం కార్తీకం. కృత్తికా నక్షత్రంతో దీనికి సంబంధం. కృత్తిక కుమారస్వామి జన్మ నక్షత్రం. అందుకే ఆయన 'కార్తికేయుడు'. ఆ నెలలో రెల్లు వెల్లువగా పూస్తుంది. రెల్లుపూలు శుభ్రమయినవీ, తెల్లనయినవీ. కుమారస్వామి రెల్లుతోటలో జన్మించాడు. అందువల్ల ఆయన 'శరవణభివుడు' శరరెల్లు, బాణం. కుమారస్వామి అసాధారణుడయిన ధనుర్విద్యాపాతం గతుడు. ఆయన క్రౌంచ పర్వతానికి తన బాణం ప్రయోగించి పెద్ద రంధ్రం చేశాడట. అది మానస సరోవరానికి వెళ్లేందుకు రాజహంసలకు రాజమార్గమయిందని పురాణాలు చెప్తున్నాయి.

కుమారస్వామి శివునికి బ్రహ్మవిద్యను ఉపదేశించాడనేదీ పౌరాణిక



విషయమే. స్వామి బ్రహ్మ విద్యావేత్త. షణ్మకాలలో స్కాందం ఒకటి. (స్కందుడు, కుమారస్వామి, స్కందం౼జారుట ఆయన కథ విల క్షణమయింది). కార్తీకమాసంలో ఆకాశదీపాలు ఎత్తటం ఒక సంప్రదాయం. శివుడు వ్యోమకేశుడు–ఆకాశం కేశపాశంగా కలవాడు. ఆకాశదీపాలు శివుని కేశపాశంలో వెలుగుపూలు. కార్తీక దీపాలు నీళల్లో విడుస్తారు. ఇదంతా కార్తిక వైభవం.

శరదృతువులో వానలు వెనుకబడతాయి. బురద ఎండిపోతూ పోతూ ఉంటుంది. బాగా బురద ఉన్నప్పుడు ప్రయాణాలు చేయటం, బండ్లు నడపటం కష్టం. బురద ఎండుతుండగా హాయిగా సాగే బండ్ల చక్రాల వల్ల ఏర్పడిన 'గాడి' (బండి చక్రాల వల్ల ఏర్పడిన దారి) భూదేవికి చేసిన పాపటవలె ఉన్నదంటాడు తెనాలి రామకృష్ణుడు. తన 'పాండురంగ మహాత్యం' కావ్యంలో 'పాపట దీర్చే భూభాగంబు నాశ్యావశానంబు శక్యటేఘు చక్రధార' (4.37).

శరదృతుశోభ, సౌందర్యమంతా అప్పుడు కాసే వెన్నెలలో ఉంది. శరత్‌చంద్రికలను ప్రస్తావించని కవి అంటూ ఎవరూ లేరేమో. 'కందర్ప దిగ్విజయ కీర్తి స్ఫూర్తియుంబోని యచ్చవెన్నెల విచ్చులు విడింగాయందొడంగె) (కాశి.3.23) అంటాడు శ్రీనాధుడు. మరే ఋతువులోనూ కలుగని 'అచ్చదనం' ఈ ఋతువులోనే వెన్నెలకు కలుగుతుంది. ఆనాటి శ్రీనాధుడిట్లా అంటే, అలనాటి– తెలుగులో తొలితొలిగా మహాకావ్యం రచించిన నన్నయగారు౼ "భూసతికందివంబునకు బొల్పెసగంగ శరత్సమాగమం బాసకల ప్రమోదకరమై విలసిల్లె"నంటారు.

భూమ్యాకాశాలకు శరత్ రావటంతో అందాలు వెల్లివిరిసినాయి. అందరికీ ఆనందం కలగిందన్నారు. భూసతి అనటం వల్ల 'దినంబు' నందు పురుషత్వం లోపించవచ్చు. భూమ్యాకాశాలకు భార్యాభర్తృత్వమూ సూచింపబుడుతున్నది. ఈ సృష్టి అంతా భూమ్యాకాశ మూలకమే. అదట్లా ఉంచి, ఆ శరత్కాలపు రాత్రులు –

*శారద రాత్ర లుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులం*
*జారుతరంబులయ్యె వికసన్నవ కైరవీగంధ బంధులో*
*దార సమీర సౌరభము దాల్చి, సుధాంశుని కీర్యమాణ క*
*ర్పూర పరాగ పాండురుచి పూరములంబర పూరితంబులై*

నాయన్నారు. (భార, అరణ్య 4.142) గొప్ప కాంతిలో వెలిగిపోయే

నక్షత్రాలు స్వచ్ఛమయిన ముత్యాలహారాలతో మరింత అందంగా ఉన్నాయి. ఇది ఆకాశానికి సంబంధించిన అంశం. అప్పుడే వికసించిన కలువల సుగంధంలో ఉదాత్తమయిన గాలి తెస్తున్న సౌరభాన్ని రాత్రులు ధరించాయట. ఇది రోదసికి సంబంధించిన విషయం. కలువలు వికసించటం నీటికి సంబంధించింది. సుధాంశు చంద్రుడు వెదజల్లుతున్న కర్పూరపు పరాగం(దుమ్ము) వలె తెల్లనయిన కాంతి ప్రవాహాలు – వెన్నెలలు ఆకాశమంతా వ్యాపించాయి.

ఈ విధంగా భూమి, ఆకాశం, వాయువు, నీరు, వెలుగు (రుచి) – పంచభూతమయ ప్రపంచమంతా శరదృతువు రావటంతో ప్రమోదభరితమయింది. ఆ సకల ప్రమోదకరమయింది.

వెన్నెల ప్రసక్తి వచ్చినప్పుడల్లా చకోర పక్షుల ప్రస్తావన తప్పక వస్తుంది. శరత్‌కాలపు వెన్నెల విషయంలో మరింతగా వస్తుంది. చంద్రుడు చకోరబంధువు. చకోరాలు వెన్నెల త్రావుతాయి (ట). ఇదొక కవి సమయం కావచ్చు. అదట్లా ఉంచి వెన్నెల ఒకే విధంగా ఉంటుందా? రకాలుగా ఉంటుందా? మన ప్రబంధాలు ప్రధానంగా ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం, జక్కన 'విక్రమార్క చంద్ర' చదివితే వెన్నెల రకాలు తెలుస్తాయి. చకోరపక్షులు 'వెన్నెల విందులు' చేసుకుంటాయట.

వెన్నెలంటే వాటికి అంత ఇష్టం. వాటిని అందుకే కావచ్చు, వెన్నెల పుల ుగులు అంటారు. (పులుగులు = పక్షులు). వాటికి వెన్నెల రకాలు తెల ుసు. పండు వెన్నెల, తరిపి వెన్నెల, వెచ్చ వెన్నెల, నులి వెచ్చ వెన్నెల, కిమ్మ వెన్నెల, కొదమ వెన్నెల, చిక్కని వెన్నెల, పలుచని వెన్నెల, తేట వెన్నెల, ముదురు వెన్నెల, అచ్చ వెన్నెల, లేత వెన్నెల, నునులేత వెన్నెల, మొల క వెన్నెల – ఇట్లా ఎన్నో రకాల వెన్నెలలు. వీటిని అనుభవించేవి వెన్నెల పులుగులు. అవి తమ పసిబిడ్డలకు నోట గ్రుచ్చుకొంటాయేమోనని మొల క వెన్నెల కొసలు త్రుంచి తినిపిస్తున్నాయట.

నోరు కాలుతుందేమోనని నులివెచ్చ వెన్నెలలు త్రాగిస్తాయట. మిగిలిన పలు రకాల వెన్నెలను బంధు మిత్రాదులకు భోజనాలు పెడుతాయట. ఇన్నిన్ని రకాల వెన్నెలలను, చకోరాల క్రియలను–అవి నిజంగా ఉన్నాయో లేవో కాని తెలుగు కవులు దర్శించి, భావించి అనుభవించిన వెన్నెల తీరులు తెలుగు వెన్నెల వైభవం.



శరదృతువంటే తెలుగులో వెన్నెల కారు.

అయితే, శరదృతువు వెన్నెలకారు మాత్రమే కాదు– పూల కారు కూడా. సాధారణంగా వసంతఋతువున పూలకారు అంటుంటారు. 'ఋతూనాం కుసుమాకరః' (ఋతువులలో వసంత రుతువును నేను) అని భగవంతుడన్నాడు (భగవద్గీత –విభూతి యోగం). కాని, దానికి దీటయిన 'కుసుమాకరు' శరత్తుగూడా. ఎన్నెన్నో రకాల పూలు. కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రం నాడు తిరుమలలో స్వామి ప్రీత్యర్థ 'పుష్పయాగం' నిర్వహించబడుతుంది. రకరకాల పూలతో పూజింపబడిన ఆ స్వామి అల నాడు క్షీరసాగరంలో వలె – పుష్పసాగరంలో విహరిస్తూ దర్శనమిస్తాడు. ఇరుప్రక్కల శ్రీ, భూదేవులు ఇక్కడ విశేషం. వైభవానికి శ్రీదేవి, ఉత్పత్తులకు భూదేవి ప్రతీకలు. వెన్నెలపూల వైభవాలు, మెట్ట, మాగాని మొదలయిన పంటలకు పల్లెలు నిలయాలు.

విశ్వనాథ సత్యనారాయణగారి 'తెలుగు ఋతువులు' తెలుగు నాట ఋతువైభవ దర్పణాలు.

*ప్రొద్దుటింతల వాయువులు మెల్ల*
*కొతిమేర చేలపై గొసరులాడె*
*చిరు వేరు వలచె గోసిన జొన్నచేనిలో*
*దొడిమ దగ్గర పచ్చి దోసపండు*
*పండి కోయని మిరపలు పెండ్లికూతుండ్ర*
*వలె సకుంకుమశోభగులకు వాడె*
*వడిసెలణా తప్పు నొడుపు నేర్పినుదల్ల*
*చిన్ని పిట్టకు మొక్కజొన్న చేల*
*జెలగెదల గిల్లిన పొగాకు సెనగకంప*
*టలును బంతిపూల్ మిరపతోటలకు మధ్య*
*శరదృతు సమస్తమాను బ్రదర్శనము చేసె*
*గూడి మెట్టపొలాల వికుంఠలక్ష్మి.*

*అని లాహతి దబకలాడె నొద్దులు మోచి*
*క్రొత్త నీరము పెట్టుకొన్న చెరువు*
*కాలగ్రుచు కొనె దొంకలు గొడ్లగిట్టలు*
*దిగిన గుర్తులలోడ చిగిసియెవిడి*
*క్రొత్త నూర్చిన వడ్లకు సరికిసరిగు*
*పండ్లమ్మ వచ్చె లంబాడి పడుచు*
*వినిపించె వీధిలోనన గంగిరెడ్డిదా*
*సరి సీత పెండి అసలుపు కేక*
*బువ్వ చిక్కిము కొడవలి బూని బయలు*
*దేరె వరికోత కొరకు పాలేరు చాన*
*ఒక విచిత్రమ్మయగు శోభనొలుక బోసె*
*వడి శరద్వేళ మాగాని పల్లెటూరు*

ప్రకృతి, మానవ సంబంధాల మాధుర్యమిది. ఈ మాధుర్యం ఆస్వాదిస్తూ–

**'జీవేమ శరదాం శతమ్'**
నూరు శరత్తులు జీవించుదాము

*– కోవెల సంపత్కుమారాచార్య*

# రైతాంగ విజ్ఞాన పెన్నిధులు
# గ్రామీణ విజ్ఞాన సమాచార కేంద్రాలు

ఆధునిక యుగంలో కంప్యూటర్ల లాంటి ఎలక్ట్రానిక్ పరికరాల ఆవిర్భావం నుంచి నేటి వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి సాంకేతిక విజ్ఞానం లాంటి క్రొత్త ఒరవడిలో మానవ జీవన సరళిలో అనేక సౌకర్యాలు వెలిసాయి. ఈ ఆధునాతన పరిజ్ఞానాన్ని విద్యా, వైద్య, ఆరోగ్య, అంతరిక్ష పరిశోధనలు మొదలైన వివిధ రంగాలలో వినియోగిస్తూ సామాన్య ప్రజానీకానికి చేరువ అయ్యాయి. మన భారత దేశంలో 70 శాతం జనాభా ముఖ్య జీవనోపాధిగా ఉన్న వ్యవసాయ రంగంలో కూడా ఈ కంప్యూటర్ విజ్ఞానాన్ని ఉపయోగించి, వ్యవసాయ సాంకేతిక విజ్ఞానాన్ని మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన వరవడులు, క్రొత్త పుంతలు త్రొక్కుతున్న ఆధునిక వ్యవసాయ రీతులను, పల్లె పల్లెకు విస్తరింపచేయటానికి ప్రయత్న లోపం లేకుండ చేయపడుతున్న కృషియే ఈ గ్రామీణ విజ్ఞాన సమాచార కేంద్రాల ఆవిర్భావానికి నాంది పిలికింది.

జాతీయ వ్యవసాయ నవ కల్పనా పథకం ద్వారా కేంద్రీయ వ్యవసాయ మెట్ట పరిశోధన సంస్థ (క్రీడా) వారు, ఆంధ్రప్రదేశ్‌లో వర్షాధార ప్రాంతాలైన మరియు వెనుకబడిన జల్లాలోని ఎంపిక చేయబడిన నల్గొండ, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, కడప, అనంతపూర్, ఆదిలాబాద్, మొదలైన ఎనిమిది జిల్లాలో ఈ






SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 3 12/26/2009, 11:30 AM

గ్రామీణ సమాచార విజ్ఞాన కేంద్రాలు నెలకొల్పి తద్వారా రైతాంగానికి ఆధునిక వ్యవసాయ సమాచార సేవలు అందజేయడంలో నిర్విరామ కృషి చేస్తున్నాయి.

ఈ గ్రామీణ వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయటంలో ముఖ్య ఉద్దేశ్యం, గ్రామీణ ప్రాంతాలలోని ప్రస్తుత వ్యవసాయ సమాచార వ్యవస్థను ఆధునిక సమాచార సాంకేతిక పరికరాలను ఉపయోగించి మరింత మెరుగైన సౌకర్యాలు కలుగజేయుటం, సమాచార సేవలను ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చే మెరుగైన సమాచార వ్యవస్థను కల్పించటమే.

ప్రతి గ్రామీణ విజ్ఞాన సమాచార కేంద్రంలో ముఖ్యంగా మూడు పరికరాలు ఉన్నాయి. అవి టచ్ స్క్రీన్ సమాచార, కియోస్క్ సమాచార ప్రసార దర్శిని ( డిస్ప్లే ఎనౌన్స్‌మెంట్ సిస్టమ్ డి.ఎ.యస్.) - ఐ.వి.ఆర్.యస్. మొదలైనవి ఉన్నాయి. ఇవే కాకుండా ఇంటర్‌నెట్, ప్రింటర్ మొదలైన సౌకర్యాలు కూడా అందుబాటులోకి తెచ్చాము. ప్రతి గ్రామీణ సమాచార విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ పరిజ్ఞానం వినియోగించటానికి 'క్రీడా' వారి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఔత్సాహిక యువత నుండి ఒకరిని సమాచార కేంద్ర కార్యనిర్వాహకుడిగా నియమించి గ్రామీణ రైతాంగానికి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూశాము.

## సమాచార కియోస్క్

ఈ పరికరం ద్వారా రైతులు తమకు కావలసిన వ్యవసాయ సమాచారాన్నిను, వారికి కావలసిన అంశం మీద చూపుడు వేలు స్పర్శ విధానంలో పొందవచ్చును. ప్రాథమిక విద్యా పరిజ్ఞానం ఉన్నవారు సైతం చాలా తేలికగా విషయ పరిజ్ఞానం పొందే విధంగా వ్యవసాయ సమాచారాన్ని, పొందుపరచడమైనది. అక్షరాస్యత లేని వారికి స్వరగాత్ర సహకారంతో ఉపయోగపడే విధంగా చేసారు.

ఈ సమాచార కియోస్క్ ద్వారా పంటల యాజమాన్య పద్ధతులు అధికోత్పత్తికి సూచనలు, చీడపీడల యాజమాన్యం, మార్కెట్ సమాచారం మొదలైనవి రైతాంగానికి లభ్యమవుతున్నాయి.



సమాచార కియోస్క్‌ని వినియోగించుకుంటున్న గ్రామీణులు

## సమాచార ప్రసార దర్శిని

ఈ పరికరం ద్వారా ముఖ్యంగా అక్షర పరిజ్ఞానం లేని రైతాంగానికి సమాచార అవసరాలు తీర్చవచ్చును. స్వర సాయ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సమాచారాన్ని సీడీలు, వీడియోల ద్వారా రైతులు వీక్షించి, వారి విజ్ఞానాన్ని పెంపొందించుకొనవచ్చును.



వీడియోని వీక్షిస్తున్న మహిళలు

## ఐ.వి.ఆర్.యస్

ఇది ముఖ్యంగా గ్రామీణ సమాచార కేంద్ర రైతాంగానికే కాక ఇతర ప్రాంత రైతులు కూడ, వారికి కావలసిన వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని ఫోన్ ద్వారా పొందవచ్చును. రైతులు ఈ సమాచారాన్ని ఏ ప్రదేశం నుంచి అయినా అంటే, ఇంటి వద్ద నుంచే కాక పొలం నుంచి అయినా తెలుసుకొనే వీలు ఉంది.

రైతాంగానికి పైన పేర్కొన్న ఆధునిక పరికరాల ద్వారా సమాచార అవసరాలు తీర్చటమే కాక ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా కూడ సమాచార లభ్యత అవకాశం ఏర్పాటు చేయడమైనది. (సమచార వెబ్ సైట్: www.naipsri.org)

ఇంటర్‌నెట్ ద్వారా వ్యవసాయ, సంబంధిత రంగాల స్కీముల గురించిన ప్రస్తుత సమాచారం, గ్రామీణ యువతకు అవసరమయ్యే, విద్య/ఆరోగ్య అవకాశాల గురించి సమాచారం కూడా పొందవచ్చును. అంతేకాక ప్రింటర్ సహాయంతో కావలసిన సమాచారాన్ని ప్రింట్ తీసుకొని వినియోగించుకొనవచ్చును.

ఈ విధంగా మన గ్రామీణ రైతాంగం ఆధునిక ఐ.టి. పరిజ్ఞానం సారథ్యంలో రూపొందించబడిన పరికరాలను ఉపయోగించి, వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని తక్కువ సమయంలో పొందగలరు. కావున గ్రామీణ విజ్ఞాన సమాచార కేంద్రాలు రైతుల విజ్ఞాన సమపార్జనలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.

*డా॥ నాగశ్రీ, డా॥ యస్.దీక్షిత్, డా॥వెంకటేశ్వర్లు*
*డా॥ రవి శంకర్, శ్రీ విజయ్ జేసుదాసన్*

శాస్త్ర వేత్తలు, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా), హైదరాబాద్



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 4 12/26/2009, 11:30 AM





# ప్రణాళికతో పశుగ్రాసాల సాగు

**మన రాష్ట్రంలో దాదాపు 24 లక్షల పైబడి కుటుంబాలు పశుపోషణ పై ఆధారపడి జీవిస్తున్నారు. పశుపోషణలో అతి ముఖ్యమైనది వాటి మేపు. ఎందుకంటే పశువుల జాతితో పాటు మేపు సంక్రమంగా ఉంటేనే వాటి నుండి అనుకున్న ఉత్పత్తి (పాలు, మాంసం) పొందగలుగుతాం.**

**పశుపోషకుల నిరంతర కృషి, పశుపోషణకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలతో ప్రోత్సాహం, పశుసంవర్ధక శాఖ సాంకేతిక తోడ్పాటులతో ఇటీవల మన రాష్ట్రం దేశంలోనే మాంసం ఉత్పత్తిలో మొదటి స్థానంలో, పాల ఉత్పత్తిలో నాల్గవ స్థానంలో నిలిచింది.**

అయినా మనం సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. మన దేశ పౌరుల పోషక అవసరాల కోసం ఆరోగ్యవంతమైన, మంచి నాణ్యతగల పశు ఉత్పత్తులను, రైతుకు గిట్టుబాటు ధరతో, వినిమోగదారులకు అందుబాటులో ఉండే విధంగా పశువుల నుండి ఉత్పత్తి సాధించాలి. దీనికి వారు ఎక్కువ ఉత్పాదకత ఉన్న మేలైన పశుజాతుల పెంపకం చేపట్టి, పశుపోషణలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించి, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధించాలి.

గ్రామీణ ప్రాంతాలలో రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ అంటే పాడి పశువుల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టి వాటికి మేతగా ముఖ్యంగా వ్యవసాయ ఉప ఉత్పత్తులైన వరి గడ్డి, చొప్ప మొదలైన వాటిని ఎండుమేతగా మేపుతున్నారు. దీనివల్ల వారు పశువుల నుండి లభించే పాలు గాని, మాంసం గాని అనుకున్న స్థాయిలో పొందలేరు. ఎందుకంటే వరిగడ్డి, చొప్ప మొదలగు వాటి ద్వారా లభించే పోషక పదార్థాలు చాలా తక్కువ. ఇవి వాటి జీవనం గడపడానికి ఉపయోగపడతాయి గాని, పశువుల నుండి అనుకున్న ఉత్పత్తులను పొందడానికి పోషక పదార్థాలను అందించలేవు. పాడి పశువుల పెంపకానికి అయ్యే మొత్తం ఖర్చులో సుమారు 70 శాతం వాటి పోషణకే ఖర్చవుతుందని మనందరికి తెలిసిన విషయమే. అందుకే ఎండుమేతతో పాటు తగినంత పచ్చిమేత ఇచ్చినప్పుడే వాటి నుండి అనుకున్న ఉత్పత్తి పొందగలుగుతాం. కావున పశు పోషణ చేపడుతున్న రైతులు వ్యవసాయ పంటల ద్వారా లభించే ఉప ఉత్పత్తులైన వరిగడ్డి, జొన్న చొప్ప, బంజరు భూములలో లభించే మేతతో పాటు ప్రత్యేకంగా అధిక దిగుబడినిచ్చే పశుగ్రాసాల సాగు చేపట్టి వారి పశువులకు పుష్కలమైన పచ్చిమేత అందించినట్లయితే అధిక పశు ఉత్పత్తులతో లాభం పొందగలుగుతారు.

పశు సంవర్ధక శాఖ పశుగ్రాసాల సాగు పట్ల పోషకులకు అవగాహన నిరంతం ఏర్పరుస్తూ వారిని ప్రోత్సాహపరచటానికి 75 శాతం రాయితీ పై పశుగ్రాస విత్తనాలను పశువైద్య కేంద్రాల ద్వారా సరఫరా చేస్తుంది. నీటి వసతి గలిగిన రైతులు దీర్ఘ కాలిక పశుగ్రాసాల సాగుకు భూమిని కేటాయించి, సిద్ధం చేసినట్లయితే వారికి బహు వార్షిక పశుగ్రాసాలైన కో-1, 2 ఎ.పి.బి.యన్ మొదలైన గడ్డిపిలకలు సరఫరా చేసి, పశువైద్య సిబ్బంది వారిని ప్రోత్సాహపరుస్తున్నారు.

ఇటీవల సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు (అనగా అనావృష్టి, వరదలు మొదలైనవి) వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండక, అధిక వర్షాల వల్ల ముఖ్యంగా నదీ పరీవాహక ప్రాంతాలలోని గ్రామాలలో వరదల వచ్చి అవసరానికి ఉంచుకొన్న పశుగ్రాసం కొట్టుకు పోవడం లేదా పాడయిపోవడంతో పశుగ్రాస కొరత ఏర్పడి పశుపోషకులకు తీవ్రమైన ఇబ్బంది ఏర్పడుతుంది.



వర్షాభావ పరిస్థితులే కాక, ఇటీవల పొట్టి రకం వరి వంగడాలను సాగు చేయడం, వరి కోతలకు యంత్రాల వాడకం వల్ల ప్రధాన ఎండుమేతైన

వరిగడ్డి తగినంత లభించక పోవడంతో పశుగ్రాస విషయంలో రైతు ఇంకా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.

దీనికి పశుపోషకులు దీర్ఘకాలిక ప్రణాళికతో అధిక దిగుబడినిచ్చే ఏక వార్షిక లేదా బహువార్షిక పశుగ్రాసాల సాగు చేపట్టాలి. అధికంగా ఉత్పత్తి అయిన పశుగ్రాసాన్ని సురక్షిత ఎత్తైన ప్రాంతాలలో హే/సైలేజి పద్ధతులతో నిలువ చేసు కొని జాగ్రత్తపడాలి.

### *ఇలా పొందిన అధిక పశుగ్రాసాల ఉత్పత్తితో -*

- రైతులు సంవత్సరం పొడవునా పచ్చిగడ్డి పొందవచ్చు.
- 5 లీటర్ల లోపు పాలు ఇచ్చే పాడిపశువులకు దాణా అవసరం లేకుండా తక్కువ ఖర్చుతో పాల ఉత్పత్తి చేపట్టవచ్చు.
- మేత కొరకు బయటకు వదలిన జీవాలకు ఇంటివద్దనే తను ఉత్పత్తి చేసిన పశుగ్రాసాన్ని ముక్కలు చేసి జీవాలకు మేపవచ్చు. ఇందువల్ల తక్కువ ఖర్చుతో అవి అనుకున్న రీతిలో/సమయంలో ఆరోగ్యంతో బరువు పెరిగి జీవాల పెంపకందారులకు లాభం చేకూర్చును.
- వారి పశువుల/జీవాల మేత అవసరాలకుపోను మిగిలిన పశుగ్రాసాన్ని 'సైలేజి' లేదా 'హే' పద్ధతి ద్వారా నిలువ చేసుకొనవచ్చు.
- నిల్వ చేసుకున్న పశుగ్రాసాన్ని అతివృష్టి, అనావృష్టి పరిస్థితులలో పశుగ్రాస కొరత ఏర్పడినప్పుడు ఉపయోగిం చుకొనవచ్చు.
- అంతేగాక తను ప్రాణప్రదంగా పోషిస్తున్న పశువుల/ జీవాల మేత గురించి నిశ్చింతగా ఉండవచ్చు.

### *ఇందుకు రైతు/ పశుపోషకులు ఏమి చేయాలి?*

- తన వద్దనున్న పశువులు/జీవాల సంఖ్య గమనించాలి.
- వాటికి సంవత్సరం వరకు ఎంత పశుగ్రాసం అవసరమో బేరీజు వేసుకోవాలి లేదా సమీప పశువైద్యుని సలహా తీసుకోవాలి. నీటి వసతి కల్గిన ఒక ఎకరా భూమిలో పశుగ్రాస సాగు చేపట్టినట్లయితే 5 పాడి పశువులకు సంవత్సరం పొడవునా పచ్చిమేత అందించవచ్చును సాధారణంగా పాలు ఇచ్చే పశువుకు ఒక్క రోజుకు 25-30 కిలోల పచ్చిగడ్డి , 7-8 కిలోల ఎండుగడ్డి లేదా చొప్ప అవసరం.

సంవత్సరం పాటు పశుగ్రాసాన్ని పొందటానికి ఎలాంటి పశుగ్రాసాల్ని సాగుచేయాలో తెలుసుకోవాలి.

వాటి సాగుకు తన వద్దనున్న అనువైన భూమిలో ఎంత భాగం పశుగ్రాసానికి కేటాయించగలుగుతారో చూసుకొని, దాని ద్వారా ఉత్పత్తి అయిన పశుగ్రాసం తనకున్న పశువులకు సరిపోని ఎడల ఇతర ప్రత్యామ్నాయ మార్గాల కొరకు ప్రయత్నం చేయాలి.

పశు పోషణలో అధిక ప్రాముఖ్యత కల్గిన పశుగ్రాసాల సాగు చేపట్టడానికి రైతు పశుగ్రాస రకాల గురించి తెలుసుకో వలసిన అవసరం ఉన్నది.

పశుగ్రాసాలలో ధాన్యపుజాతి, పప్పుజాతి రకాలు ఉంటాయి.

ధాన్యపుజాతి పశుగ్రాసాలలో పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. పప్పుజాతి పశుగ్రాసాలలో మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ధాన్యపుజాతి, పప్పుజాతిపశు గ్రాసాలను 2:1 నిష్పత్తి లో పశువులకు మేపాలి. అప్పుడే వాటికి మాంసకృత్తులు, పిండి పదార్థాలు సమానంగా

















లభించి పశువులు మంచి ఉత్పత్తినిస్తాయి. అయితే ఈ ధాన్యపుజాతి, పప్పుజాతి పశుగ్రాసాలు ఏకవార్షికాలు, బహువార్షికాలుగా ఉంటాయి.

## ధాన్యపుజాతి ఏకవార్షిక పశుగ్రాసాలు

ఈ పశుగ్రాసాలు ఒక సంవత్సర కాలంలో 3-4 కోతలు ఇస్తాయి. వర్షాధారంగా గాని, నీటివసతితో గాని ఉత్పత్తి చేయవచ్చు. ఉదా: హైబ్రిడ్ జొన్న (యం.పి.చారి,యస్.యస్.జి) మొక్కజొన్న (ఆఫ్రికన్ టాల్ , హైబ్రిడ్ఎఫ్-2) సజ్జలు, ఓట్స్.

**హైబ్రిడ్ జొన్న** (యం.పి.చారి,యస్.యస్.జి 59-3, పి.సి.- 23): ఇవి ఎకరాకు 16-20 కిలోల విత్తనాలు అవసరం. ***నీటి తడి :*** వర్షాకాలంలో అవసరాన్నిబట్టి, వేసవిలో వారం నుండి పది రోజులకొకసారి ఇవ్వాలి. మొదటి కోత 50- 55 రోజులకు, తదుపరి 40-45 రోజులకు కోయాలి. ***దిగుబడి :*** ఎకరానికి 20-25 టన్నులు.

**మొక్కజొన్న** (ఆఫ్రికన్ టాల్, హైబ్రిడ్ఎఫ్-2) : ఇవి ఎకరాకు 20 కిలోల విత్తనాలు అవసరం. నీటితడి: వర్షాకాలంలో అవసరాన్నిబట్టి, వేసవిలో వారం నుండి పది రోజుల ఒకసారి ఇవ్వాలి. మొదటి కోత 70 రోజులకు, తదుపరి 40-45 రోజులకు కోయాలి. ***దిగుబడి*** : ఎకరానికి16-20 టన్నులు. ఇది సైలేజి కి అనువైన రకం.

## పప్పుజాతి ఏకవార్షిక పశుగ్రాసాలు

***అలసంద :*** ఇవి ఎకరాకు15-20 కిలోల విత్తనాలు అవసరం. మిశ్రమ పంటగా కూడా వేసుకోవచ్చు. ***నీటితడి*** : వర్షాకాలంలో అవసరం లేదు. వేసవిలో వారం నుండి పది రోజులకొకసారి ఇవ్వాలి. మొదటి కోత 60 రోజులకు, ***దిగుబడి*** : ఎకరానికి 8-12 టన్నులు.

***పిల్లిపెసర :*** ఇవి ఎకరాకు10-152 కిలోల విత్తనాలు అవసరం. మిశ్రమ పంటగా కూడా వేసుకోవచ్చు. ***నీటితడి*** : వర్షాకాలంలో అవసరం లేదు. వరి కోతలు కోసిన తదుపరి ఉండే తేమతో కూడా సాగుచేయవచ్చు. మొదటి కోత 50 రోజులకు, ***దిగుబడి*** : ఎకరానికి10-12 టన్నులు.

## ధాన్యపుజాతి బహువార్షిక పశుగ్రాసాలు

ధాన్యపుజాతి బహువార్షిక పశుగ్రాసాలలో ఎ.పి.బి.యన్ 1,2 మరి యు కో-1,2,3 రకాలు ముఖ్యమైనవి. వీటిసాగుకు విత్తనాలు కాకుండా, కాండపు పిలకలు నాటుకోవాలి. భూమిని దున్ని 50-60 సెం.మీ. ఎడంగా బోదెలు చేసుకోవాలి. బోదెలలో రెండు కణుపులు కలిగిన కాండపు పిలకల ను నాటుకోవాలి. ఎకరానికి15-16 వేల కాండపు పిలకలు అవసరవం. నీటితడి వారం నుండి పది రోజులకు ఒకసారి ఇవ్వాలి. 4-5 సంవత్సరాల వరకు సంవత్సరానికి ఎకరానికి 100-120 మె. టన్నుల దిగుబడి పొందవచ్చు.

***గినీ గడ్డి :*** (హామిల్, మాకుని రకాలు) ఇది గడ్డి రకపు ధాన్యపుజాతి బహువార్షిక పశుగ్రాసం. చలికాలంలో ఎప్పుడైనా నాటుకోవచ్చు. ఎకరానికి 20-24 వేల వేరుగల పిలకలు అవసరం. ఒక అడుగు ఎడంగా నాటుకోవాలి. ఎకరానికి 40-60 మె. టన్నుల దిగుబడి పొందవచ్చు.

పచ్చిక బయళ్ళలో పెంచటానికి గడ్డి రకపు బహువార్షిక పశు గ్రాసాలైన అంజన్ గడ్డి, సబిగడ్డి రకాలు అనుకూలమైనవి. ఎకరానికి 3-4 కిలోల విత్తనాలు అవసరం. జూన్, జూలై మాసాలు అనుకూలం. 4-5

సంవత్సరాల వరకు సంవత్సరానికి ఎకరానికి 15-20 మె. టన్నుల దిగుబడి పొందవచ్చు.

### పప్పుజాతి బహువార్షిక పశుగ్రాసాలు

పప్పుజాతి బహువార్షిక పశుగ్రాసాలలో లూసర్న్, స్టైలో ముఖ్యమైనవి. వీటిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి.

***లూసర్న్ :*** వీటిసాగుకు విత్తనాలు ఎకరానికి6-8 కిలోలు అవసరము. అక్టోబర్-నవంబర్ మాసాలు అనుకూలం. నీటితడి వారం నుండి పది రోజులకొకసారి ఇవ్వాలి. 4-5 సంవత్సరాల వరకు సంవత్సరానికి ఎకరానికి 24-30 మె. టన్నుల దిగుబడి పొందవచ్చు.

***స్టైలో :*** వీటిసాగుకు విత్తనాలు ఎకరానికి 8-10 కిలోలు అవసరం. మే, జూన్,జూలై మాసాలు అనుకూలం.వర్షాధారం. 4-5 సంవత్సరాల వరకు సంవత్సరానికి ఎకరానికి 8-10 మె. టన్నుల దిగుబడి పొందవచ్చును.

పశుగ్రాసాల సాగుకు అనుకూలమైన భూమిలో 2/3 వ వంతు అధిక దిగుబడినిచ్చే బహువార్షిక రకాలను 1/3 వ వంతు అధిక దిగుబడినిచ్చే ఏకవార్షికాలు సాగుచేసినట్లయితే ఒక ఎకరం భూమితో 4-5 మేలు జాతి పాడి పశువులను, రెండున్నర ఎకరాల భూమితో 30-40 జీవాలను సంవత్సరం పొడవునా తగినంత పచ్చిమేత ఇచ్చి పోషించవచ్చు.

పాడి పరిశ్రమపై ఆధారపడి, అధిక పాల సారం కలిగిన మేలు జాతి పాడిపశువులను పోషించే రైతులు /పశుపోషకులు వర్షాకాలంలోనే పుష్కలంగా అధికదిగుబడినిచ్చే పశుగ్రాసాల సాగు చేపట్టి వేసవికాలం అవసరాల కోసం వాటి పోషక విలువలు తగ్గకుండా నిల్వ చేసుకోవాలి.

### పశుగ్రాసాన్ని నిల్వ చేసే పద్ధతులు

వర్షాకాలంలో ఎక్కువ మొత్తంలో పశుగ్రాపాన్ని ఉత్పత్తిచేసి, అవసరాలకు పోను మిగులు పశుగ్రాపాన్ని పోషకవిలువలు నష్టపోకుండా ముున్ముందు అవసర నిమిత్తం నిలువ చేయటానికి రెండు పద్దతులున్నాయి. అవి : 1 హే పద్దతి, 2 సైలేజి పద్దతి

***హే పద్ధతి :*** జనుము, పిల్లిపెసర, లూసర్న్, జొన్న మొదలైన పశుగ్రాసాలను హే పద్ధతి ద్వారా నిల్వ చేసుకోవచ్చు. పై గ్రాసాలు సగం పూత దశలో ఉన్నప్పుడు ఉదయం కోసి, పగటి పూట 20 రోజుల వరకు ఎండలో ఆరబెడుతూ తిరగ వేస్తుండాలి. తదుపరి ఆకులు రాలకుండా 2-3 రోజులు నీడలో ఆరబెట్టాలి. ఇలా చేయడం వలన తేమ 15 శాతానికి తగ్గుతుంది. ఇప్పుడు ఇలా ఆరిన పశుగ్రాసాన్ని పొరలుపొరలుగా గాలి చొరబడకుండా వాము వేసుకోవాలి. ఇలా నిలువ చేసిన పశుగ్రాసం పోషక విలువతో కూడింది కావున పచ్చిమేత దొరకని సమయాల్లో పశువులకు వాడినట్లయితే ఉత్పాదకత తగ్గకుండా ఉంటుంది. ఈ పద్ధతి తక్కువ పశువులు కలిగిన సన్నకారు, చిన్నకారు రైతులకు అనుకూలమైంది.

***సైలేజి పద్ధతి:*** జొన్న, మొక్క జొన్న, నేపియర్ మొదలైన పశుగ్రాసాలను సైలేజి పద్ధతి ద్వారా నిల్వ చేసుకోవచ్చు. వీటితో పాటు పప్పుజాతి రకాలను కలిపి ముక్కలు చేసి పాతర వేసుకోవాలి. పాతర వేయబోయేముందు వాటి తేమ 65 శాతానికి మించి ఉండరాదు. 8 అడుగుల వెడల్పు, 25 అడుగుల పొడవు, 5 అడుగుల లోతు గల గుంత చేసుకోవాలి (దీని పరిమాణము 1000 ఘ . అడుగులు) ఇందులో 15 టన్నుల పశుగ్రాసాన్ని నిల్వ చేసుకోవచ్చు. ప్రక్కలనుండి తేమ, నీరు రాకుండా గుంత అడుగు, ప్రక్కలకు సిమెంట్ రాయాలి. ముక్కలుగా చేసిన పశుగ్రాసాన్ని గుంతలో వేసి త్రొక్కడం ద్వారా లేదా ట్రాక్టర్ తో భూమి కన్నా ఎత్తుగా వేసి త్రొక్కించి దానిపై వరిగడ్డి పరచి మట్టితో లేదా పేడతో గాలి చొరబడకుండా పూడ్చాలి. ఇది మెట్ట ప్రాంత రైతులకు ముఖ్యంగా ఎక్కువ పశువులు కలిగిన వారికి అనుకూలమైంది

### ఛాఫ్ కట్టర్స్

పశుగ్రాసాన్ని ఉత్పత్తి చేయడమే కాదు, సద్వినియోగపరచుకోవడం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే ఎక్కువమంది రైతులు జొన్నచొప్ప, మొక్క జొన్న, నేపియర్ మొదలైన పశుగ్రాసాలను యధావిధిగా పశువుకు వేయడం వల్ల అవి ఆకులను మాత్రమే తిని మిగతా కాండపు భాగాన్ని కాళ్ళతో తొక్కి పాడు చేస్తాయి. దీనివల్ల 30-40 శాతం పశు గ్రాసం వృధా అవుతుంది.

ఛాప్‌కట్టర్ల సహాయంతో పశుగ్రాసాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేయడం వల్ల పశువులు ముక్కలు చేసిన మేతను 90 శాతం పైగా వినియోగించుకొని అధిక ఉత్పత్తినిస్తాయి. దీంతో వృధా అరికట్టబడుతుంది.ఉత్పత్తి పెరుగుతుంది. ఛాప్‌కట్టర్స్ చేతితో త్రిప్పేవి, విద్యుత్ యంత్రాలతో (2, 5 హెచ్. పి సామర్థ్యంతో) పని చేసేవి లభ్యమవుతాయి. ఔత్సాహికులకు పశు క్రాంతి పథకము ద్వారా 50 శాతం రాయితీతో ఛాప్‌కట్టర్లు అందజేయుచున్నది.

వర్షాభావ పరిస్థితులలో ప్రత్యామ్నాయ పద్ధతులతో పశుగ్రాసాల సాగుచేయడం.

వర్షాభావ పరిస్థితులలో, ప్రత్యేకంగా పశుగ్రాసం సాగుచేయడం రైతులకు వీలు పడని సందర్భాలలో వారు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించవచ్చును.

- పండ్ల తోటల్లో అంతర పంటగా స్టైలో, అంజన్ వంటి వాటిని సాగుచేసి పశుగ్రాస దిగుబడి పొందవచ్చును.
- పొలంగట్ల పై సుబాబుల్, అవిశ మొదలైన చెట్లను పెంచి వాటి ఆకులను పశుగ్రాసంగా వినియోగించుకోవాలి
- వరి కోతల అనంతరం ఉన్న తేమను వినియోగించుకొని జనుము, అలసంద వంటి వాటిని సాగుచేసి పశు గ్రాసం పొందవచ్చును.
- చెరువులు, కుంటలలో పంటలసాగుకు నీరు వాడుకోగా ఉన్న శిఖం భూమిలో మిగులు తేమను పశుగ్రాసాల సాగుకు గ్రామ రైతులు సామూహికంగా వినియోగించుకోవచ్చు.

పశుగ్రాస కొరత పరిస్థితులు ఏర్పడినప్పుడు గ్రామంలోని రైతులందరూ సామూహికంగా బోరుబావుల క్రింద (సంబంధిత రైతుల సహకారంతో) లేదా చెరువులు, కుంటలలోని శిఖం భూమిలో (తగు అనుమతితో) పశుగ్రాసాల సాగు చేసినట్లయితే గ్రామస్థాయిలోనే పశుగ్రాస కొరతను అధిగమించవచ్చు. దీనికి సంబంధిత అధికారుల సాంకేతిక సూచనలు, ప్రజాప్రతినిధు సహకారం, ప్రోత్సాహం రైతన్నలకు ఎంతో అవసరం

***- డా॥ జనార్ధనాచారి***
*ప్రచార విస్తరణ విభాగం, పశుసంవర్ధక శాఖ, హైదరాబాద్*



# క్యాలండర్ల వెనుక ఎన్ని కథలో !

'హ్యాపి న్యూఇయర్!'
'నూతన సంవత్సర శుభాకాంక్షలు!'

ఇవీ కొత్త సంవత్సరం ఆరంభంలో ప్రతి నోటా వినిపించే మాటలు. ఈ శుభాకాంక్ష సందేశాలను ఆధునిక యుగంలో సెల్‌ఫోన్లు,SMS లు, ఈ - మెయిల్స్ ద్వారా క్రియేటివ్ ఐడియాలతో బొమ్మలు, సౌండ్స్, పాటలు, మ్యూజిక్, యానివేషన్లతో ఆకర్షణీయంగా రూపొందించి నేటి తరం పంపుకొంటుంది. కానీ వ్యాపార సంస్థలు పరిశ్రమలు, ఇతరత్రా ప్రైవేటు సంస్థలు రంగు రంగుల బొమ్మలతో వివిధ సైజుల్లో ముద్రించిన క్యాలండర్లను తమ శ్రేయోభిలాషులకు ఇచ్చి శుభాకాంక్షలను తెలుపటం ఆనవాయితీగా వస్తోంది. కొన్ని సంస్థలు తేదీలను మాత్రమే ఉన్న క్యాలండర్లను ముద్రిస్తే, కొన్ని వారాలు, వర్జ్యాలు, తిధులు, నక్షత్రాల వివరాలతో ఉన్న క్యాలండర్లను ఇస్తాయి. కొన్ని వ్యాపార సంస్థలు తమ ప్రొడక్టులను ముద్రించి ఇస్తే, మరికొన్ని దేవతల బొమ్మలనో, ప్రకృతి దృశ్యాలనో ముద్రిస్తాయి. నేటి ట్రెండ్ అంతా 'స్విమ్ సూ్యట్' క్యాలండర్లదే. అందమైన అమ్మాయిలను స్విమ్‌సూ్యట్ల పేరుతో అర్ధనగ్నంగా వున్న ఫోటోలను తీసి క్యాలండర్లుగా ముద్రించి తమ కార్పోరేట్ క్లైయింట్లకు అందజేయడం లేటెస్ట్ ట్రెండ్.

టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా, ప్రతీ వారికీ కంప్యూటర్ ఉన్నా, చిన్నా పెద్దల చేతుల్లో సెల్‌ఫోన్లు ఉన్నా, ప్రతి ఇంట్లో మాత్రం కనీసం ఒక క్యాలండర్ గోడకు వేలాడుతూనే ఉంటుంది. వారం, వర్జ్యం, పండగలు, సెలవులు చూడాలన్నా, ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా విదేశీ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలన్నా చప్పున గోడకున్న క్యాలండర్‌ను అందుకొని ఇట్టే డేట్స్‌ను నిర్ణయించేసుకోవడం ప్రతి ఇంటా మనకు కనపడే సీనే. ఆఫీసుల్లోనైతే వర్క్ షెడ్యూల్స్, మీటింగ్స్, అప్పాయింట్‌మెంట్స్, సెలవులు లాంటివి చూసుకోటానికీ ఈ క్యాలండర్లే కావాలి. అంటే, దీన్ని బట్టి అర్ధమయ్యేది ఏమంటే, ప్రతి ఒక్కరి నిత్యజీవితానికి క్యాలండర్‌తో విడదీయరాని బంధం ఉందన్న మాట.

మానవుని జీవితాలు, ఆలోచనలు, పనులతో ఎంతో బలమైన అవినాభావ సంబంధమున్న క్యాలండర్‌కు చాలా సంపన్నమైన సుదీర్ఘమైన చరిత్రే ఉంది. కొందరు చరిత్రకారుల అంచనాల ప్రకారం క్యాలండర్‌కు 6000 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో మతాధికారులు, ఖగోళశాస్త్రవేత్తలు, గణితశాస్త్ర పండితుల ఆలోచనలకు, వత్తిళ్లకు ఎన్నో అవతారాలెత్తి, రూపాలను మార్చుకొని చివరికి నేడున్న స్థితికి చేరుకొంది.

## పుట్టుకపై కొన్ని కథనాలు

పూర్వం రోమ్ మహానగరంలో ఒక మతాధికారి ఆకాశాన్ని చాలాకాలం పాటు గమనించి చంద్రుని వివిధ దశలను కనిపెట్టాడు. చంద్రుడు దినదిన ప్రవర్ధమానం అవడం, ఆ తరువాత దినదినం క్షీణించిపోవడం, మళ్లీ కొత్తగా చంద్రుడు కన్పించడం ఒక వలయంగా లేదా చక్రంలా ఉందని రాజుకి నివేదించాడు. అప్పటి నుంచి మొదటిరోజు చంద్రుణ్ణి 'క్యాలండ్స్' అని పిలవనారంభించారు. క్యాలండ్స్ అన్న పదం గ్రీకు భాషలోని 'కలరె' అన్న పదం నుంచి పుట్టింది. కలరె అంటే "ప్రకటించడం" అని అర్ధం.





SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 13 12/26/2009, 11:30 AM

లాటిన్ భాషలో ప్రతినెలా మొదటిరోజు చంద్రుణ్ణి 'క్యాలండె' అని అనేవారు. ఈ క్యాలండ్స్, క్యాలండె పదాలు చివరకు ఇంగ్లీషులో క్యాలండర్ గా మారి స్థిరపడిపోయాయి.

క్యాలండర్ అనేది సమయపాలనకు సంబంధించిన ఒక పద్ధతి. ఒక నిర్ణీత సమయం గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు, దాన్ని కొన్ని ప్రమాణాలతో గుర్తించాలి. గుర్తించిన ప్రమాణాన్ని వివరించడానికి దానికో పేరు పెట్టాలి. కాలానికి సంబంధించిన ఆ పేర్లే మనం నిత్యమూ వాడే 'రోజులు', 'వారాలు', 'నెలలు', 'సంవత్సరాలు'. ప్రతి రోజును ఒక తేదీతో (ఉదా : జనవరి1, 2010) గుర్తిస్తారు. రోజులూ, సంవత్సరాలను దాదాపు ప్రపంచమంతా అంకెలు, సంఖ్యలతో సూచిస్తారు. కానీ, వారాలూ, నెలలను మాత్రం పేర్లతో పిలవడం అన్ని దేశాల్లో ఆనవాయితీగా వస్తోంది. ఈ వారాలు, నెలలపేర్లు ఒక్కోదేశంలో ఒక్కోరకంగా, ఒకే దేశంలో అనేక రకాలుగా కూడా ఉండేవి.

సాధారణంగా మనిషి తన దినచర్యలను భూమి,సూర్యుడు, చంద్రుడి గమనాల ప్రకారం షెడ్యూల్ చేసుకొంటాడు. అయితే నెలలు, సంవత్సరాలు అన్నవి. భూమి, సూర్యచంద్రుల గమనాలతో ఖచ్చితంగా 'సింక్రనైజ్' అవుతాయన్న గ్యారంటీ ఏమీ లేదు, ఎందుకంటే కాల ప్రయాణాలు మనిషికున్న పరిమిత జ్ఞానంతో లెక్కకట్టి నిర్ధారించుకొన్నవి. ఒక్కో వ్యక్తికి ఒక్కో స్థాయిలో ఉంటుంది. అందుకనే నెలలు, సంవత్సరాల కాల నిర్ధారణలో చాలా వ్యత్యాసాలున్నాయి. కొంతమంది లెక్కల ప్రకారం నెలకు 29 రోజులైతే, ఇంకొందరికి 30 రోజులుగానూ, మరికొందరికి 31 రోజులుగానూ ఉన్నాయనిపిస్తుంది. అలాగే ఏడాదికి 355 రోజులే ఉంటాయని కొందరు భావిస్తే, కాదు 365రోజులని లెక్కలు కట్టి మరీ చెప్పేవారు. కొన్ని వందల ఏళ్లపాటు సరైన శాస్త్రీయ పరిశోధన లేకపోవడంతో క్యాలండర్లకు నిర్దిష్ట ప్రమాణాలేవీలేవు. ఒక్కో కాలంలో కొందరి అవసరాలకు అనుగుణంగా అవి రూపొందించబడిన ఉదాహరణలు కూడా కోకొల్లలు.

## క్యాలండర్ల రకాలు

క్యాలండర్లలో బోలెడు రకాలున్నాయి. ఎన్నో సిద్ధాంతాల ప్రాతిపదికగా ఎన్నో క్యాలండర్లు వచ్చాయి. కాలగమనంలో కలిసిపోయాయి.స్థూలంగా చూస్తే మూడు రకాల క్యాలండర్లు మాత్రమే చాలాకాలం పాటు నిలిచిపోయాయి. వాటిల్లో:

1. చంద్రుడి దశలు ఆధారంగా రూపొందిన చాంద్రమాన క్యాలండరు. దీనికి ఉదాహరణ ఇస్లామిక్ క్యాలండర్.

2. సూర్య 'గమనం' లేదా రుతువుల ప్రాతిపదికగా రూపొందించబడిన సౌరమాన క్యాలండర్. ఉదా:పర్షియన్ క్యాలండర్.

3. చంద్రుడు, సూర్యుని గమనాల ప్రకారం రూపొందించబడిన చాంద్ర - సౌరమాన (luni - solar) క్యాలండర్. ఈ రకంలో సాంప్రదాయక హిందూ క్యాలండర్, చైనా క్యాలండర్ ముఖ్యమైనవి.

కాలపరిమితులను విభజించడం లేదా నిర్ధారించడం అంత తేలికైన పనికాదు. అందుచేతనే క్యాలండర్లు ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండవు. కొన్ని క్యాలండర్లు ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండవు. కొన్ని



క్యాలండర్లకు సాంప్రదాయాలు ప్రాతిపదిక అయితే మరి కొన్నింటికి శాస్త్ర విజ్ఞానం, ఖగోళశాస్త్రం ఆధారం. అందుకనే ప్రపంచ దేశాల్లో అత్యధిక దేశాలు అనుసరించే గ్రెగోరియన్ క్యాలండర్‌కు, ప్రపంచ ప్రజల్లో 20 శాతం మందిఉన్న ఇస్లాం మతస్తులు అనుసరించే చాంద్రమాన క్యాలండర్‌కు అసలు సామ్యం లేదు.

## రుతుచక్రాలు

వానాకాలం, చలికాలం, ఎండాకాలం మరలా వానాకాలం..... ఇలా రుతువులు ఒక చక్రంలా తిరుగుతూ ఉంటాయి. ఏడాదికి ఒక చక్రం పూర్తవుతుంది. దీన్నే 'ట్రాఫికల్ ఇయర్' అంటారు. ఒక ట్రాఫికల్ ఇయర్‌కు 365.2421896698 రోజులుంటాయి. ఈ సంఖ్య ప్రతి వందేళ్లకు ఒకసారి 'అరసెకను' కాలం తగ్గి పోతుంటుందని ఖగోళ శాస్త్రవేత్తలు లెక్కకట్టి చెబుతున్నారు.

అలాగే చంద్రదశలు ఒక చక్రం పూర్తి చేయడానికి 29.5305888531 రోజులు పడుతుంది. ఇది వందేళ్లకు ఒక సెకనులో 50వ వంతు కాలం పెరుగుతూ ఉంటుంది. ఒక ట్రాఫికల్ ఇయర్‌కు 12.36826639275 చాంద్రమాన నెలలుంటాయి.

## అధికమాసాలు

చాంద్రమాన సంవత్సరాలను ట్రాఫికల్ ఇయర్‌తో అనుసంధానం చేసే క్రమంలో ఒక నిర్ణీత సమయంలో కొన్ని రోజులను కలుపుతూ ఉంటారు. 12 చాంద్రమాన నెలలకు 10.8751234336 రోజులను కలిపితే అది ఒక ట్రాఫికల్ ఇయర్‌కు సమానం.

## గ్రెగోరియన్‌క్యాలండర్

ప్రస్తుతం గ్రెగోరియన్ క్యాలండర్‌నే అన్ని చోట్లా అంతర్జాతీయ



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 14 12/26/2009, 11:30 AM



ప్రమాణంగా వాడుతున్నారు.

అసలైతే ఈ క్యాలండర్ రోమన్ కాథలిక్, ప్రొటెస్టెంట్ చర్చిల శుభకార్యాలను నియంత్రించేందుకు ఉద్దేశింపబడినప్పటికీ, ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలు దీన్నే ప్రమాణంగా వాడుతున్నాయి.

దీనిలో సంవత్సరాలను ఆరో శతాబ్దపు పండితుడు డియోనిసియస్ ఎక్సిగస్ రూపొందించిన పద్ధతిలోనే లెక్కిస్తారు. సాధారణ సంవత్సరానికి 365 రోజులుంటే, లీప్ సంవత్సరానికి 366 రోజులుంటాయి. లీప్ సంవత్సరాన్ని లెక్క కట్టడానికి కొన్ని నియమాలను ఎక్సిగస్ రూపొందించారు. అవి ఎలాగంటే - ఒక ఏడాదిని 4చే భాగించినప్పుడు శేషం లేకుండా ఉంటే అది లీప్ ఇయర్ గా పరిగణిస్తారు. అయితే దీనికో మినహాయింపు (1) ఉంది. ఆ సంఖ్య 100తో నిశ్శేషంగా భాగించబడితే లీప్ ఇయర్ కాదు. ఇక్కడ మరో మినహాయింపు (2) ఉంది. అది ఏమిటంటే, ఆ సంఖ్య 400తో నిశ్శేషంగా భాగించబడితే దాన్ని మాత్రం లీప్ ఇయర్ గానే పరిగణిస్తారు. ఉదాహరణకు 1900, 2000, 2100 సంవత్సరాలను తీసుకొంటే, 4తో భాగిస్తే ఈ మూడు సంవత్సరాలు లీప్ ఇయర్స్ కిందే లెక్క. కానీ మొదటి మినహాయింపు ప్రకారం చూస్తే అవి లీప్ ఇయర్స్ కావు. రెండోసారి పేర్కొన్న మినహాయింపు ప్రకారం చూస్తే 2000వ సంవత్సరం మాత్రం లీప్ ఇయరే. 1900, 2100వ సంవత్సరాలు లీప్ ఇయర్స్ కావు. అందుకని గ్రెగొరియన్ క్యాలండర్ 400 సంవత్సరాలకు ఒకసారి ఒక చక్రాన్ని పూర్తి చేస్తుంది. 400 ఏళ్లకు 146097 రోజులు. ఈ రోజులను 7తో నిశ్శేషంగా భాగించవచ్చు. దీంట్లో ఏడాదికి 365.2425 రోజులుంటాయి. ఇది ట్రాఫికల్ ఇయర్‌కు ఇంచుమించు సమానం.

1572లో పోప్‌గా వచ్చిన గ్రెగొరి XIII క్యాలండర్‌లో సంస్కరణలు తేవాలని ఒక కమీషన్ నియమించాడు. ఆ కమీషన్ చేసిన రికమెండేషన్లకు 1582లో ఉన్నతాధికార పీఠం ఆమోద ముద్ర వేసింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా రోమన్ కాథలిక్ చర్చికి అదే క్యాలండర్. మొదట్లో ప్రొటెస్టెంట్లు ఈ క్యాలండర్‌ను తోసి పుచ్చారు కానీ తరువాతి కాలంలో వారూ అనుసరించారు. బ్రిటీష్ ప్రభుత్వం ఈ క్యాలండర్‌నే అధికార క్యాలండర్‌గా ప్రకటించింది. ఆ తరువాతి కాలంలో అమెరికా, తదితర పాశ్చాత్య దేశాలన్నీ ఈ క్యాలండర్‌నే ప్రమాణంగా తీసుకొన్నాయి. ఇండియా, చైనాతో సహా ప్రపంచ దేశాలన్నీ దీన్నే అధికార క్యాలండరుగా వాడుతున్నాయి. ఈ క్యాలండర్ ప్రధానంగా క్రైస్తవ మతం కోసం ఉద్దేశింపబడింది కాబట్టి క్రిస్టియనేతరులు AD (Anno Domini = క్రీస్తుశకం), BC (Before Christ = క్రీ.పూ.) అనే మాటలను వాడకూడదని వాదిస్తారు. ఆ మాటలకు బదులు CE (Common Era), BCE (Before Common Era) అనే మాటలను వాడాలని అంటున్నారు.

ఇన్ని వేల సంవత్సరాల తరువాత, సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన ప్రస్తుత కాలంలో క్యాలండర్ల పైనా, కాల నిర్ణయంపైనా హేతుబద్ధమైన వైఖరిని అవలంబించాల్సి అవసరం ఉంది. అందుకనే, 2000వ సంవత్సరం జనవరి 1న పసిఫిక్ మహా సముద్రంలో 'కిరిబటి' రిపబ్లిక్ కొత్త సంవత్సరాన్ని అన్ని దేశాల కంటె ముందు చూసింది. కాబట్టి కిరిబటి దీవుల సముదాయంలో ఒకదీవికి 'మిలీనియం ఐలాండ్' అని నామకరణం చేశారు. అంతర్జాతీయ 'డేట్‌లైన్'ను కూడా అక్కడే తొలిసారి మార్చారు. కాలానుగుణంగా క్యాలండర్లు మారినట్లే, మన వైఖరులు మారడం కూడా చాలా ముఖ్యం.

## ఇస్లామిక్ క్యాలండర్

క్యాలండర్లలో ఖచ్చితత్వం కోసం ప్రపంచమంతా కిందా మీద పడిపోతుంటే ఇస్లాం మతస్తులు మాత్రం చంద్ర దశల ఆధారంగా రూపొందించబడిన క్యాలండర్‌నే ఎటువంటి మార్పులూ చేర్పులూ చేయకుండా ఎన్నో శతాబ్దాలుగా అనుసరిస్తూ వస్తున్నారు. ఈ క్యాలండర్‌పై ఖగోళశాస్త్రం పరిశోధన, రోమన్, బాబిలోనియన్, యూదు తదితర క్యాలండర్ల ప్రభావం ఏ మాత్రం లేదు. క్యాలండర్ పరిశోధకుల భాషలో చెప్పాలంటే, ఇస్లామిక్ క్యాలండర్ చాలా సింపుల్‌గా ఉంటుంది. దీని ప్రకారం, ఏడాదిలో 12 చాంద్రమాన నెలలుంటాయి. సంవత్సరానికి 355 రోజులు మాత్రమే ఉంటాయి. రుతువులతో అనుసంధానం చేసి చూస్తే ప్రతి 33 ఏళ్లకు ఒక చక్రాన్ని పూర్తి చేస్తాయి.

ప్రతి ఏడాది కొత్త సంవత్సరం 10,11 రోజులు ముందు వస్తుంది. మొదటి రోజు చంద్రుడి రాకతో నెల ప్రారంభమవుతుంది. ఖగోళశాస్త్ర లెక్కల ప్రకారం చంద్రుడి రాక జరిగి, చంద్రుడు ఎవరికీ కన్పించనట్లయితే నెల ప్రారంభమైనట్లు కాదు. ఒక నమ్మకమైన సాక్షి మొదటి రోజు చంద్రుని చూసినట్లు ప్రకటిస్తేనే ప్రారంభమైనట్లు పరిగణిస్తారు.

ఇస్లాం సంప్రదాయం ప్రకారం, రోజు సూర్యాస్తమయంతో ప్రారంభమై మరునాటి సూర్యాస్తమయంతో ముగుస్తుంది. ఉదా: ఇంగ్లీష్ క్యాలండర్‌లోని శుక్రవారాన్నే తీసుకొందాం. ఇస్లాం శుక్రవారం ఇంగ్లీష్ గురువారం సూర్యాస్తమయమప్పుడు ప్రారంభమై ఇంగ్లీష్ శుక్రవారం సూర్యాస్తమయంతో ముగుస్తుంది.

ఇస్లామిక్ క్యాలండర్‌లో అధిక మాసం ఉండదు. ఖురాన్‌లో (సురా IX,మంత్రం 36-37) క్యాలండర్ ప్రస్తావన ఉంటుంది. ప్రవక్త మహమ్మద్‌కు ముందు కాలంలో అరబ్బు దేశాల్లో చాంద్ర - సౌరమాన క్యాలండర్ ప్రాచుర్యంలో ఉండేది. ప్రవక్త క్యాలండర్ గురించి



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 15 12/26/2009, 11:30 AM

ఖురాన్‌లో ప్రస్తావించాక పాత క్యాలండర్ ఒక్కసారే శాశ్వతంగా అటకెక్కిపోయింది. ఇస్లామిక్ క్యాలండర్‌లో నెలలు ఇలా ఉంటాయి.

| | నెల | రోజులు |
|---|---|---|
| 1 | మొహర్రం | 30 |
| 2 | సఫర్ | 29 |
| 3 | రబియా I | 30 |
| 4 | రబియా II | 29 |
| 5 | జుమాడా I | 30 |
| 6 | జుమాడా II | 29 |
| 7 | రజబ్ | 30 |
| 8 | ష'బన్ | 29 |
| 9 | రమడాన్ | 30 |
| 10 | షవ్వల్ | 29 |
| 11 | దు అల్ ఖదా | 30 |
| 12 | దు అల్ హిజా | 29 |

- లీప్ సంవత్సరంలో 12వ నెలకు 30 రోజులుంటాయి.
- మొహ్రరం, రజబ్, దు అల్ ఖదా, దు అల్ హిజాలు పవిత్రమైన నెలలు.
- రమజాన్ ఉపవాసాల నెల.

## మరికొన్ని విశేషాలు

- 7-రోజుల వారం, వార చక్రం ఎలా, ఎప్పుడు అమల్లోకి వచ్చిందన్న విషయంపై స్పష్టమైన ఆధారాలేవీ లేవు. కానీ దిన చర్యలు, విశ్రాంతి, పూజా పునస్కారాలకు సంబంధించి క్రైస్తవ మతం, జుడాయిజం, ఇస్లాంలో 7-రోజుల చక్రాలు ఉండేవి.
- బైబిల్ ప్రకారం, భగవంతుడు ఈ ప్రపంచాన్ని ఆరు రోజుల్లో సృష్టించి 7వ రోజు విశ్రాంతి తీసుకొన్నాడని విశ్వసిస్తారు. బహుశ వార చక్రానికి ఇదే ప్రాతిపదిక కావచ్చునని చాలా మంది ప్రాశ్చాత్యుల నమ్మకం.
- బైబిల్ కాలానికి ఎన్నో వందల ఏళ్ల పూర్వం ఉన్న బాబిలోనియన్ క్యాలండర్‌లో ప్రతినెలా 7, 14,21,28వ రోజులను విశ్రాంతి కోసం పక్కన పెట్టేవారట.
- యూదుల క్యాలండర్ బాబిలోనియన్ క్యాలండర్‌లోని నెలల పేర్లను స్వీకరించి వాడుకొంది. వార చక్రం కూడా బహుశ అదే సమయంలో యూదుల క్యాలండర్‌లోకి వచ్చి చేరి ఉంటుందని నమ్మకం.
- పూర్వం రోమ్‌లో రెండు మార్కెట్ రోజుల మధ్యలో 8-రోజుల చక్రం అమల్లో ఉండేది. కానీ క్రీ.పూ. రెండో శతాబ్దంలో 7-రోజుల చక్రం అమల్లోకి వచ్చింది. ఈ మార్పులో హిబ్రూ, బాబిలోనియన్ క్యాలండర్ల ప్రభావం కన్నా ఖగోళశాస్త్ర ప్రభావమే ఎక్కువగా ఉండి ఉండవచ్చు. వచ్చునన్నది కొందరి వాదన.
- జ్యోతిష్యులు సూర్యుడు, చంద్రునితో సహా 7 గ్రహాలు ఉన్నట్లు భావిస్తారు. ఒక్కో గ్రహం ఒక్కో రోజు ఆధిపత్య స్థానంలో ఉంటుందని వారి భావన. అలా 7 రోజుల్లో ఏడు గ్రహాలపాలన పూర్తయ్యాక మళ్లీ అవే ఏడు గ్రహాల వంతు తిరిగి ప్రారంభమవుతుంది. ఆ విధంగా వార చక్రం వచ్చి ఉంటుందని కొందరి భావన.
- ఆదిపత్య స్థానంలో ఉన్న గ్రహం పేరు మీద ఆ రోజుకు ఆ గ్రహం పేరును రోమన్స్ ఖాయం చేశారు. ఉదాహరణకు - సూర్యుడు ఆధిపత్య స్థానంలోకి వచ్చిన రోజును 'సన్స్ డే' అనీ, చంద్రుడి రోజును 'మూన్స్‌డే' అనీ, బృహస్పతి రోజును 'జూపిటర్స్ డే' అనీ, శుక్రుని రోజును 'వీనస్ డే' అనీ అలా పేర్లు పెట్టారు.
- ప్రాచీన ఈజిప్షు క్యాలండర్‌లో 12 నెలలు ఉండేవి. ప్రతి నెలకు 30 రోజులు మాత్రమే ఉంటాయి. సంవత్సరాంతంలో 5 రోజులు ఈజిప్షు దేవతల జన్మదినాలు జరుపుకొనే వారు. అలా వారి సంవత్సరానికి కూడా 365 రోజులుండేవి. లీప్ ఇయర్ అనే అంశం వారి క్యాలండర్‌లో లేనేలేదు.
- జూలియస్ సీజర్ కాలం వరకు ఈజిప్షు క్యాలండర్ ఒక్కటే సివిల్ క్యాలండర్‌గా ప్రాచీన ప్రపంచంలో ఉండేది. జూలియన్ క్యాలండర్ ప్రత్యేకత ఏమిటంటే మతాధికారులు, ఖగోళ శాస్త్రవేత్తల ప్రమేయం లేకుండా నెలలు, సంవత్సరాలకు రోజులను ఖాయం చేశారు. ఆధునిక క్యాలండర్‌కు దీన్ని మూలంగా పేర్కొనవచ్చని కొందరి వాదన.
- జూలియస్ సీజర్ కాలంలో క్యాలండర్‌కు చేసిన సంస్కరణల్లో చాంద్రమాన నెలలను పూర్తిగా వ్యతిరేకించారు. సౌరమాన నెలలనే ప్రమాణంగా తీసుకొన్నారు. దీనిలో ఏడాదికి 365.25 రోజులుండేవి. ఎక్స్‌ట్రా రోజును నాలుగేళ్ల కొకసారి ఫిబ్రవరి నెల చివరిలో కలిపేవారు. అదే లీప్ ఇయర్.
- ప్రపంచంలో ప్రస్తుతం 40 క్యాలండర్లు వాడుకలో ఉన్నాయి. వాటిలో ఇస్లామిక్, చైనీస్, హిబ్రూ, హిందూ, జూలియన్ క్యాలండర్లను మత పరమైన విషయాలలో వాడతారు.
- పర్షియన్ క్యాలండర్‌ను ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లోనూ, ఇస్లామిక్ క్యాలండర్‌ను అరబ్ దేశాల్లోనూ, ఇధియోపియన్ క్యాలండర్‌ను ఇథియోపియా, ఎరిట్రియాలలో వాడతారు.
- కొన్ని ప్రత్యామ్నాయ క్యాలండర్లు వాడకంలో ఉన్నాయి. వాటిలో ఫిస్కల్ క్యాలండర్, లీగల్ క్యాలండర్లు ఉన్నాయి. ఇవి కొన్ని వృత్తుల వారికే పరిమితమై ఉంటాయి. ✡



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 16 12/26/2009, 11:30 AM

## క్యాలండర్‌కు ఆఖరి గడియలొచ్చాయా?

### డిసెంబర్ 21, 2012 వతేదీ

ప్రపంచంలోని అనేక దేశాల్లో ఈ తేదీ ప్రజలను భయకంపితులను చేస్తోంది. భయంకరమైన భూకంపాలు, అగ్ని పర్వతాలు బద్దలవడం, సముద్రపు అలలు వందల మీటర్ల ఎత్తుకు లేవడం, ఎక్కడ చూసినా అగ్ని జ్వాలలతో సమస్త భూ ప్రపంచం అతలాకుతలమయ్యే రోజు అది. ఈ మహా ప్రళయం ఎవరో ఆషామాషీగా పంపిన ఈ - మెయిల్ లాంటిది కాదు. ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, ఇంజనీరింగ్ విజ్ఞానంలో మహా పండితులనిపించుకొన్న 'మాయన్' సంస్కృతి శాస్త్రాలలో ఈ విషయం స్పష్టంగా రాసి ఉంది. ఆ రోజున ప్రపంచం అంతమవుతుందని వెయ్యేళ్ల క్రితమే 'మాయన్' పండితులు రాశారు. క్రీస్తు శకం 300 నుండి 900 వరకు దక్షిణ మెక్సికో, గ్వాటిమాలా, బెలీజ్, హూండురాస్ దేశాల్లో 'మాయన్' సంస్కృతి విరాజిల్లింది. ఆ కాలంలో ప్రపంచంలో మరెక్కడాలేని సుందరమైన నగరాలను వారు నిర్మించినట్లు ఎన్నో చారిత్రక ఆధారాలున్నాయి. స్టోన్ టవర్స్, దేవాలయాలు వారి నిర్మాణ కౌశల్యానికి సాక్ష్యాలుగా ఇప్పటికీ ఆ దేశాల్లో ఉన్నాయి. గణితం, ఖగోళశాస్త్రాలలో నిపుణలైన వారు తయారు చేసిన క్యాలండర్లు చాలా ఖచ్చిత సమయాలను సూచిస్తాయని నేటి శాస్త్రవేత్తలు కూడా అంగీకరిస్తారు. అటువంటి మహత్తరమైన సంస్కృతి అకస్మాత్తుగా అంతరించిపోయింది. దీనికి సరైన కారణం ఇప్పటికీ ఎవరూ తేల్చి చెప్పలేకపోతున్నారు. 'మాయన్' పండితులు తయారు చేసిన క్యాలండర్‌లో 5,126 సంవత్సరాలు అతి ఖచ్చితంగా సమయాలను లెక్కకట్టారు. డిసెంబర్ 21, 2012 తరువాత ఎందుచేతనో ఆ లెక్కలు ముగిశాయి. అదే క్యాలండర్‌కు ఆఖరు రోజుని వారు పేర్కొన్నారు.

వారు పేర్కొన్న ఆఖరు గడియలు ఇంకా ఎన్నో ఏళ్లున్నాయి గదాని, ఇటీవలి వరకు ఎవరూ ఆ తేదీ గురించి అంతగా పట్టించుకోలేదు. ఈ మధ్యనే (నవంబర్ 2009లో) వచ్చిన '2012' ఇంగ్లీష్ చిత్రంతో మరుగున పడి ఉన్న 'మాయన్' పండితుల జోస్యానికి అకస్మాత్‌గా ప్రపంచ వ్యాప్త ప్రచారం వచ్చింది. యువతరాన్ని బాగా ఆకట్టుకొని బాక్సాఫీస్ వద్ద సూపర్ సక్సెస్ అయిన ఈ చిత్రంలో 40 నిముషాలకు పైగా కంప్యూటర్‌లో జనరేట్ చేసిన భూకంపాలను, టైడల్ వేవ్స్, పేలుళ్లను చాలా ఆకట్టుకొనే విధంగా, భయంగొలిపే విధంగా చూపించారు. అంతకు ముందు, ఇదే జోస్యంపై హిస్టరీ ఛానెల్ కొన్ని ఎపిసోడ్‌లను ప్రసారం చేసింది. భారతీయ జ్యోతిష్యులు గతంలో చెప్పిన ఇదే మాదిరి జోస్యాలను, నోస్టర్‌డామస్ తదితర యూరోప్ జ్యోతిష్కులు, మతాధిపతుల జోస్యాలను ఈ ప్రోగ్రాంలో ప్రస్తావించారు. ప్రపంచం అంతమవుతుందన్న సిద్ధాంతాలు కొత్త వేమీ కాదు. గత నాలుగైదు శతాబ్దాలలో కనీసం 'అయిదారు' సార్లయినా ఇటువంటి, అశాస్త్రీయ విషయాలను సృష్టించి అమాయకులు, మూఢవిశ్వాసాలున్న వారిని భయపెట్టిన ఘటనలు కోకొల్లలు. యూరోప్‌లో గతంలో క్రైస్తవ మత గురువులు ఇదే మాదిరి జోస్యాలు చెప్పి, ప్రజలను స్వర్గానికి తీసుకెళ్తామని టిక్కెట్లను అమ్ముకొని సొమ్ము చేసుకొన్న ఘటనలు కూడా చరిత్రలో ఉన్నాయి. కిందటి దశకంలో ఇటువంటి పుకార్లు రావడంతో అమాయకులైన ప్రజలు, బతికినన్ని రోజులు ఇష్టమైనవి తిని బతుకుదామని కోళ్లను, మేకలను కోసుకుతిన్న ఘటనలను మనం పేపర్లలో చూశాం.

అయితే, 'మాయన్' పండితులు ఎందుకు ఈ తేదీ నాడు క్యాలండర్ అంతమవుతుందని భావించారో ఎవరికీ అంతు బట్టని నిగూఢ రహస్యంగా నిలిచిపోయింది. ✡

## మన జాతీయ క్యాలండర్

భారతదేశంలో సాంస్కృతిక వైవిధ్యం చాలా ఎక్కువగా ఉన్నందున 'క్యాలండర్' అనే విషయం మొదటినుంచీ చాలా క్లిష్టంగా ఉండేది. 1950 దశకంలో 'క్యాలండర్ సంస్కరణ సంఘం' ఏర్పాటైంది. అప్పుడు దేశంలో దాదాపు 30 క్యాలండర్లు వాడుకలో ఉండేవి. వాటిలో కొన్నింటిని అధికార, పౌర కార్యకలాపాల్లో వాడే వారు. శక సంవత్సరాన్ని దేశంలో చాలా ప్రాంతాలలో వాడేవారు. ఆంధ్రులు శాలివాహన శకాన్ని ఇవిగాక, భారతదేశంలోని ముస్లింలు ఇస్లామిక్ క్యాలండర్‌ను వాడేవారు. భారత ప్రభుత్వం పాలనా వ్యవహారాలలో గ్రెగొరియన్ క్యాలండర్‌ను వాడేది.

చాంద్ర సౌరమాన క్యాలండర్ గురించి రుగ్వేదంలోనే శ్లోకాలున్నాయి. దాదాపు నాలుగు వేల సంవత్సరాల పూర్వమే భారత్‌లో క్యాలండర్ ప్రస్తావన ఉండటమే కాకుండా అధిక మాసాలను గురించి కూడా ఉంది. క్రీస్తు పూర్వం 1300 సంవత్సరం నుంచి క్రీస్తుశకం 300 మధ్య కాలంలో వచ్చిన సాహిత్యంలో క్యాలండర్ గురించి మరింత స్పష్టమైన సమాచారం ఉంది.

క్రీస్తు శకం తొలి శతాబ్దా లలో బాబిలోనియన్, గ్రీక్ ఖగోళశాస్త్ర విషయాలు తెలిశాక, భారతీయ ఖగోళ శాస్త్ర జ్ఞానంలో కొన్ని కొత్త ధోరణులు వచ్చాయి. కొత్త ఖగోళ స్థిరాంకాలను మన సాంప్రదాయక క్యాలండర్ రూపకర్తలు స్వీకరించి అమలు చేశారు. ఈ కొత్త ధోరణులు వచ్చిన కాలాన్ని 'సిద్ధాంత' అని వ్యవహరించే వారు. కాల గమనంలో వాటిలో చాలా సిద్ధాంతాలు కనుమరుగై పోయాయి. నాలుగో శతాబ్దంలో ప్రాచుర్యంలోకి వచ్చిన 'సూర్యసిద్ధాంత' తర్వాతి కాలంలో చాలా మార్పులకు లోనైంది. అదే 1957 నాటి క్యాలండర్ సంస్కరణల సంఘానికి ప్రాతిపదికగా అవతరించింది.

1978లో పింగ్రీ గణిత-ఖగోళ శాస్త్రాన్ని రూపొందించారు. అందులో క్యాలండర్లను గురించిన ప్రత్యేక ప్రస్తావన ఏదీ లేకపోయినా, భారతదేశంలో క్యాలండర్ల చరిత్రను తెలిపే అనేక అంశాలు ఉన్నాయి.

భారత దేశంలో సాంప్రదాయకంగా'శక' సంవత్సరం బహుళ ప్రాచుర్యం పొందింది. శక సంవత్సరం క్రీ.శ. 79నుంచి



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 17 12/26/2009, 11:30 AM

ప్రారంభమవుతుంది. భారత జాతీయ క్యాలండర్ 1957 మార్చి 22 ప్రారంభమైంది కాబట్టి, శక సంవత్సరం ప్రకారం అది 1879 చైత్రమాసం ఒకటో తేదీ అన్నమాట.

**భారత సివిల్ క్యాలెండర్ నెలలు**

| వ. సం. | భారత క్యాలండర్ | రోజులు | గ్రెగోరియన్ క్యాలండర్ |
|---|---|---|---|
| 1. | చైత్రం | 30 | మార్చి 22 |
| 2. | వైశాఖం | 31 | ఏప్రిల్ 21 |
| 3. | జ్యేష్ఠం | 31 | మే 22 |
| 4. | ఆషాడం | 31 | జూన్ 22 |
| 5. | శ్రావణం | 31 | జూలై 23 |
| 6. | భాద్రపదం | 31 | ఆగస్టు 23 |
| 7. | ఆశ్వీయుజం | 30 | సెప్టెంబర్ 23 |
| 8. | కార్తీకం | 30 | అక్టోబర్ 23 |
| 9. | మార్గశిరం / అగ్రహాయన | 30 | నవంబర్ 22 |
| 10. | పుష్యం | 30 | డిసెంబర్ 22 |
| 11. | మాఘం | 30 | జనవరి 21 |
| 12. | పాల్గుణం | 30 | ఫిబ్రవరి 20 |

క్యాలండర్‌ను రూపొందించడానికి భారత క్యాలండర్ సంస్కరణల సంఘం 1957లో అనేక మార్గ దర్శక సూత్రాలను విడుదల చేసింది. అయినా చాలా మంది ఈ సూత్రాలను పాటించకుండా సాంప్రదాయకంగా వస్తున్న పద్ధతులనే పాటిస్తూ వచ్చారు. అవి స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేవి: అందువల్లనే సెలవు దినాల సందర్భంగా ఒక్కో క్యాలండర్ ఒక్కో తేదీని సూచిస్తూ ఉండేవి.



భారత దేశంలో సౌరమాన క్యాలండర్ రాశి చక్రం ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన క్యాలండర్లలో నెల పొడుపునుంచి మరలా వచ్చే నెల పొడుపు వరకు ఒక నెలగా పరిగణిస్తారు. సౌరమాన నెలలతో పోలిస్తే చాంద్రమాన నెలలు తక్కువ రోజులు ఉంటాయి. ఒక్కో సౌరమాన నెలలో రెండు సార్లు చాంద్రమాన నెలలు ప్రారంభమవుతాయి. అప్పుడు క్యాలండర్‌లో అధిక మాసాన్ని చేర్చుతారు. రెండు మూడేళ్లకోసారి ఈ అధిక మాసాలు వస్తూ ఉంటాయి.

చాంద్రమాన క్యాలండర్ లో ఒక రోజును 'తిథి' అంటారు. ఇంగ్లీష్ క్యాలండర్‌లో రోజుకు 24 గంటలు ఖచ్చితంగా ఉంటుంది కానీ చాంద్రమాన క్యాలండర్ ప్రకారం తిథి పొడవు 20 గంటల నుంచి 27 గంటల వరకు ఉంటుంది. ఈ వ్యత్యాసం వల్లనే ఏ రెండు క్యాలండర్లు పండుగలను సరిగ్గా సూచించ లేక పోతున్నాయి. ✡







SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 18 12/26/2009, 11:30 AM

# బకాసుర

**ఒక్కసారిగా ఊరంతా గుప్పుమన్నది. ఎవడో దారికాసి, నగరానికి వస్తున్న కుటుంబం మీద పడి, ఒక స్త్రీనీ, పిల్లవాణ్ణీ చంపేశాట్ట. వాళ్ళ వెంట ఉన్న మగవాడు తప్పించుకు పారిపోయాడన్నారు. ఆ నరహంతకుడు పిల్లవాణ్ని అక్కడే పీక్కుతిన్నాట్ట.**

**మామూలు పౌరులెవరూ ఈ వార్తను శంకించలేదు. ఎక్కడ చూచినా ఈ విషయాన్ని గురించి చర్చలే. అబ్బో, వాడు తాడి ప్రమాణం మనిషిట! వాడికి జానెడేసి కోరలుట!. . . వాడి చేతిలో గద ఉన్నదని కొందరూ, గద కాదు అది వేపమానని కొందరూ అన్నారు.**



"చయనులూ, మా ముత్తాతగారి కాలంలో ఇట్లాగే తాడెత్తు రాక్షసుడు వచ్చి ఊళ్ళమీద పడి పీక్కుతిన్నాడన్నారు. వీడు వాడే కాదుగదా కొంపదీసి?"

"అయినా అయుండవచ్చు! నరమాంసం తినేవాళ్ళకు చావురాదు. బ్రహ్మ రాక్షసులు చూడరాదూ?"

"ఈ పాపిష్టి ఊరు మనకొద్దే అని ఏనాడనంగా అన్నాను. ఆ మాయదారిది విందా?"

"మీ ఆవిడ మాటేనా? పుట్టి పెరిగిన ఊరు కాదుటయ్యా? అందులోనూ తల్లిదండ్రుల కొక్కతే కూతురు. అదీగాక అల్లుళ్ళను ఇంట ఉంచుకునే ఆచారం ఉంది వాళ్ళ కుటుంబంలో. మీ అత్తగారు కూడా ఈ ఊళ్ళో పుట్టి పెరిగినదే తెలుసా?"

"అదే వచ్చిన చావు! మా అమ్మాయికి పెళ్ళిచేసి అల్లుణ్ణి తెచ్చుకున్నాక సుఖంగా నేను కాలిమీద కాలేసుక్కూచోవచ్చునని దాని వాదన. నేను నానా అగచాట్లు పడి మా అత్తమామల్ని పోషించిన మాట నిజమేననుకో. బొత్తిగా అప్రయోజకుణ్ణయిపోవటం చేతనేగా ఇల్లరికం ఉండిపోవలిసొచ్చిందీ? మళ్ళీ నా కూతురికింకో అప్రయోజకుణ్ణి తీసుకురానా? ఈ పాపిష్టి ఆచారం నుంచి బయటపడదామే, పిల్లను చక్కగా నిక్షేపంలాంటి వాడి చేతిలో పెడదామే అంటే విన్నదా? మా ఆవిడ మంకుపట్టు పట్టబట్టేకాని, ఆరునెల్ల క్రితమే మా పిల్లను ఆ బల భద్రపురం కుర్రవాడికిచ్చి కాపరానికి కూడా పంపేసే పనిగాదూ?"

"ఊరుకోవయ్యా, చయనులూ! ఇప్పటికేం మించిపోయిందీ? అంతా సక్రమంగా జరిగిపోతుంది."

"ఆ రాక్షస వెధవ ఏ రాత్రి వచ్చి పడి విరుచుకు తింటాడోనని భయపడి చస్తున్నాం గద!"

"చూడు, చయనులూ! వాడు రాక్షసుడయేది, పిశాచి అయేది, బ్రాహ్మల జోలికి వస్తాడుగా? ఎన్ని గుండెలు! బ్రాహ్మణ రక్తం కరం దిగిందో హాలాహలమై భగ్గున కాల్చేస్తుంది ఏమనుకున్నావోనూ!"

ఇటువంటి సంభాషణలు ఊరంతా సాగాయి.

రాజసభలో కూడా ఈ విషయం చర్చ జరిగింది. కాని అక్కడ రాక్షసుడి ఉదంతం నమ్మినవారు లేరు.



"అదంతా ఉత్తది! రాక్షసుడూ లేడు, గీక్షసుడూ లేడు, గిట్టని వాళ్ళు వెధవ పుకార్లు లేవదీశారు. ఈ బ్రాహ్మణ్యాన్ని ఒక్కనాటికీ నమ్మరాదు. మన పరిపాలన మీద ఇదివరకెన్నో అభాండాలు వేశారు. ఇది మరొకటీ" అన్నాడు ఏకచక్రపుర రాజు.

"కాకపోతే ఏమిటిలెండి? ఈ రాక్షసుడు ఎవర్ని చంపాడు? ఎవర్ని తిన్నాడు? అది చూసిందెవరు? ఒక మగవాడు పారిపోయాడన్నారు. పారిపోయినవాడు తన కొడుకును రాక్షసుడు తినటం ఎలా చూస్తాడు? మతిలేని మాట!"

"ఒకవేళ రాక్షసుడు తన కొడుకును చంపి తిన్నాడే అనుకున్నా, ఆ దౌర్భాగ్యుడు దీనులపాలిట కల్పవృక్షంలాగా తమరుండగా తమ దగ్గరికి వచ్చి మొరపెట్టుకొనక వీధి

కొడవటిగంటి కుటుంబరావు

జనంతోనా చెప్పుకుంటాడు? వాళ్ళా వీణ్ణి రక్షించేది? అంతా వట్టిది. తమరన్నట్టు ఈ బ్రాహ్మలే ఏదో సృష్టించారు! వాళ్ళకు సంభావనలు ముట్టకపోతే ఎంతకైనా తగుదురు!"

అంతా అబద్ధమనుకోవటం రాజుగారికీ, ఆయన భృత్యులకూ చాలా అనుకూలించింది. రాక్షసుడు నిజంగా ఉన్నాడని ఒప్పుకుంటే అందుగురించి ఏదో ఒకటి చెయ్యాలి. కాని ఏమిటీ చెయ్యటం? ప్రజలలో రాజుగారికి పరపతి లేదు. రాజుగారి ఉప్పు తినేవారే రాజుగారి మాట సరిగా వినరు.

కాని మూడు రోజులు దాటాక మరొక మనిషి చచ్చాడు. ఈసారి చచ్చినవాడు పొరుగూరి నుంచి వస్తున్న వాడు కాడు, ఊళ్ళో వాడే, వాడి అవయవాలు కొన్ని దొరికాయి–మనిషిని పోల్చుకోవటానికి వీలుగా.

"రౌరవుడు చచ్చినమాట అయితే నిజమే. కాని వాణ్ణి చంపింది రాక్షసుడేనని ఎట్లా చెప్పటం? ఎవరు చూచారు? పులి కాకూడదూ?" అన్నాడొక రాజుగారి భక్తుడు.

"కావచ్చుగాని, ఈ చాయల ఎక్కడా పులులూ అవీ లేవండీ?" అన్నాడొక అజ్ఞాని.

"ఒహూరి పిచ్చివాడా! ఆ మాటకొస్తే ఈ చాయల రాక్షసులు మాత్రం ఉన్నారా?" అన్నాడు రాజుగారి మరొక అభిమాని.

అందరూ గొల్లున నవ్వారు.

"కీడించి మేలెంచటం మంచిది. కొందరు భటులను తీసుకొని నగరం వెలుపలికి రాజుగారు వెళ్ళివస్తే ప్రజలకు కొంచెం ధైర్యంగా ఉంటుంది" అన్నాడు అజ్ఞాని.

"నీ సలహా విని నేను పెద్ద సైన్యంతో వెళ్ళేసరికి ఏ తోడేలో ఎదురైతే ఎంత పరువు నష్టం! ఎంత నగుబాట్ల పని!" అన్నాడు రాజు.

"తమరన్న ఈ ముక్క మహా బాగుంది. ఒకవేళ ఏ నరరాక్షసుడో ప్రమాదవశాత్తు వస్తే వచ్చుగాక. వాడింకా ఇక్కడే కూచోవచ్చాడా? సింహస్వప్నంకాదూ తమరంటే?"

"అతనికెవరో పిరికిమందు పోశారులెండి."

రాజు ప్రాంగణంలో నరభక్షకుడు గుర్తించబడలేదు. కాని అతడి చేతిలో చచ్చేవాళ్ళ సంఖ్య నానాటికీ పెరుగుతూ రాసాగింది. పట్టపగలే జనం ఉత్తపుణ్యానికి ఉలికిపడుతున్నారు. ఒకనాడు ఒక కూడలిలో "అదుగో!" అని ఎవరో అనేసరికల్లా నాలుగు వీధులూ క్షణంలో నిర్జనమైపోయాయి.

కొందరికి పూనకాలు వచ్చాయి. ఒకరి నోట గ్రామదేవత పలికింది. తనకు నరబలి ఇస్తే ఈ బెడద తప్పిస్తానన్నది. చిక్కేమిటంటే ఏ నరుడు తనకు బలికావాలో కూడా పూనినవాడి నోటంట చెప్పింది– వాడు పూనినవాడి దాయాది.

ఇంకొకరికి ఇంద్రుడు పూనాడు. మూడోవాడికి వాళ్ళ నాయనమ్మ పూని తనకు చీరె పెట్టమని అడిగింది. ఈ గొడవలో ఒకడు పెళ్ళాన్ని కోపంమీద తంతూంటే పొరుగింటివాళ్ళు వచ్చి, "అమ్మా, తల్లీ! నీకేం కావాలో కోరుకో!" అని మొక్కుకోవటానికి సిద్ధపడ్డారు.

రాజుగారు కొలువుచేసి తన భృత్యులను సూటిగా ప్రశ్నించాడు, "ఏమిటిదంతా? ఈ రాక్షసుణ్ణి గురించిన పుకార్లను గురించి మనమేం చెయ్యాలి? వాడికి పేరు కూడా పెట్టారు – బకుడట! నా మటుకు నేను నమ్మను. కాని రాజునైనందుకు నా నమ్మకం మీదనే కర్తవ్య నిర్ణయం చెయ్యటం భావ్యం కాదు. ప్రజల తృప్తికోసమైనా మనం ఏదో ఒకటి చెయ్యాలి."

"అదేంమాట, మహారాజా? మీకు రాక్షసుడిలో నమ్మకం లేకపోతే ఏమీ చెయ్యనవసరం లేదు" అన్నాడొకడు.

"పోనీ నీకు నమ్మకం ఉందా?" అన్నాడు మరొకడు అతనితో.

"నాకు లేదు."

"నాకూ లేదు."

అందరూ తమకు రాక్షసుడిలో నమ్మకం లేదని ఒప్పుకున్నారు. అజ్ఞాని అందరికేసి నిర్ఘాంతపోయినట్టు చూసి, "అయితే మీలో ఎవరైనా ఒంటరిగా నగరం దాటి వెళ్ళిరండి. జనానికి ధైర్యంగా ఉంటుంది." అన్నాడు.

అందరూ తెల్లమొహాలు వేసి, 'ఆ మాటలు నీక్కూడా వినిపించాయా?' అన్నట్టుగా ఒకరి నొకరు చూసుకున్నారు.

"నన్ను పొమ్మంటే నేను పోను. నాకు తెలుసు, ఊరి బయట ఒక సాహసి అయిన నరభక్షకుడు తిష్టవేసి ఉన్నాడు" అన్నాడు అజ్ఞాని.

"నేను పోదునుగాని, మా ఇంట్లో అక్కర చేసుకోబోతున్నాం, క్షణం తీరి కలేదు."

అందరూ తలా ఒక సాకూ సాగించారు. రాజుగారు పరధ్యానంగా ఉన్నట్లు కనిపించాడు. ఆయన అకస్మాత్తుగా ఏదో తట్టినవాడల్లే, "నేటికి సభ చాలించాం!" అంటూ లేచాడు.

సభికులందరూ లేచి సెలవు తీసుకుని నిష్క్రమించారు.

తన వెంట రమ్మని రాజు మంత్రికి సైగచేశాడు. ఇద్దరూ రహస్య గృహంలోకి వెళ్ళారు.

రాజుగారు ప్రారంభించేదాకా మంత్రి ఏమీ అనలేదు. అసలాయన ఇంతవరకూ ఈ రాక్షసుణ్ణి గురించి ఒక్కమాట కూడా అనలేదు.

"ఈ రాక్షసుడు ఒకవేళ నిజంగానే ఉన్నాడను కుంటే. . . ." అని రాజు ప్రారంభించాడు.

". . . అనుకోనవసరం లేదు, వాడు నిజమే!" అన్నాడు మంత్రి.

"నాతో మాట వరసకైనా అనలేదే!"



“మహారాజా! నేను వార్తాహరుణ్ణి కాను, మంత్రిని. ఏదన్నా ఒక కొత్త పరిస్థితి ఏర్పడినప్పుడు దానివల్ల తమకు గల లాభనష్టాలు గుణించి చెప్పటమే నా విధి.”

“గుణించటం అయిందా!”

“అయింది.”

“మనం ఇప్పుడు చెయ్యవలసిన పని ఏమిటి?”

“ఏమీ చెయ్యకుండా ఉండటమే.”

రాజుగారి కనుబొమ్మలు జుట్టు నందుకోబోయాయి.

“ఇప్పుడున్న పరిస్థితులు మనకు క్షేమకరం. ఈ రాక్షసుడు వచ్చాక మన పొరుగురాజులు ఇద్దరూ మన మీద యుద్ధప్రయత్నాలు మానుకున్నారు. వాడు మన నగరానికి పెట్టని కోట.”



“ప్రజల అందోళన మాటేమిటి?”

“వాళ్ళను అందోళన పడనివ్వండి. నిరుడు మహమ్మారి వచ్చినప్పు డాందోళన పడలేదా? అయిదేళ్ళ క్రితం కాటకం వచ్చి ఎందరు చచ్చారు కారు? జన నష్టం గురించి మనం బెంగ పడనవసరం లేదు.”

“బాగా చెప్పావు మంత్రీ!”

అయితే ప్రజలు తమ ప్రాణాలను గురించి అంత ఉదాసీనంగా ఉండలేకపోయారు.

బలభద్రుడనే సూత కులం వాడొకడు జనాన్ని పోగుచేసుకుని రాక్షసుడిపైన యుద్ధానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు రాజుగారికి చారులు చెప్పారు.

ఈ బలభద్రుడు ఒక రకం జ్ఞాని కూడాను. రాక్షసులను చంపటం సాధ్యమేనని అతని వాదం.

“దేవతలచేత రావణుడిడి వంటి మహాబలుణ్ణి ఇద్దరు మనుషులూ, అనేక కోతులూ కలిసి చంపేశాయి. ఈ రాక్షసుడు ఒకరిద్దరిపైన పడి చంపాడుగాని పదిమంది కలిసివస్తే వారి చాయలకు రాలేదు. ఇది రుజువు చెయ్యటానికి నేనూ, నాతో నమ్మకం ఉన్న వాళ్ళు కొంతమందీ కలిసి ఈ సాయంకాలం ఊరి వెలుపలికి వెళ్ళి రెండు ఘడియలపాటు తిరిగి రాబోతున్నాం” అన్నాడు బలభద్రుడు.

అతను అన్నంత పనీ చేశాడు కూడా.

బలభద్రుడూ, అతని శిష్యులూ చీకటిపడే వేళ నగరంలోకి క్షేమంగా తిరిగి వచ్చే సమయానికి రాజభటులు వాడిని పట్టుకుని రాజుగారి ఎదుటికి తీసుకు పోయారు.

“నువ్వేనా జనాన్ని రాక్షసుడిపైకి యుద్ధానికి తీసుకుపోయే ప్రయత్నంలో ఉన్నది?” అని రాజు అడిగాడు.

“చిత్తం, మహారాజా!” అన్నాడు బలభద్రుడు.

“నీవీ నగరానికి రాజువా?”

“కాను, మహారాజా! తమరుండగా. . . . ”

“నిన్ను నేను నగరరక్షకుడుగా నియమించానా?”

“లేదు మహారాజా!”

మరి నీకు జనాన్ని పోగుచేసే అధికారం ఎవరిచ్చారు? రాక్షసుడంటూ నిజంగా ఉన్నప్పటికీ వాడి సంగతి చూడవలసింది మేము. అవునా?”

“ఈ భాగ్యానికి తమకు శ్రమ దేనికి, మహారాజా? మేము పదిమందిమి కర్రలు తీసుకుని పోతే వాడు మా కళ్ళ పడకుండా దాక్కున్నాడు.”

“లేదు, మహారాజా!”

“లేని వాడు ఎలా కనబడతాడు?”

“ఉన్నాడు మహారాజా! వాడిప్పటికి ముప్పైమందిని పొట్టన బెట్టుకున్నాడు. ఈ ముప్పైమందీ ఒక్కసారిగా వాణ్ణి ఎదిరించి కొట్టినట్టయితే పీడ వదిలిపోయి ఉండేది.”

రాజుగారు అకస్మాత్తుగా కళ్ళ నిప్పులు రాలుస్తూ, “పాపీ, నీ దొంగవేషాలు చాలించు. నీవు జన రక్షకుడనిపించుకొని జనాన్ని కూడగట్టుకొని రాజువు కావాలని చూస్తున్నావు. ఒక వంక జనాన్ని హడలగొట్టడానికి రాక్షసు డున్నాడన్నావు. నీ ఎత్తు సగం పారింది. ఈ అమాయకులను వెంటవేసుకుని తిరిగి వచ్చావు. ఇలా నాలుగుసార్లు తిరిగి ఏ అభాగ్యుణ్ణో చంపి, రాక్షసుణ్ణి చంపి ఏకచక్రపురాన్ని రాక్షసుడి బారినుండి కాపాడానని మూఢులైన ప్రజలను సులువుగా నమ్మిస్తావు. మంత్రీ, ఈ రాజద్రోహి తలతీయించండి. ఈ మిగిలిన వాళ్ళందరినీ కారాగృహంలోకి తోయించండి” అన్నాడు.

★ ★ ★ ★ ★

నగరమంతా రాజుగారి చాటింపు జరిగింది. దాని తాత్పర్య మేమిటంటే – “నగర వాసులకు హెచ్చరిక! బకాసురుడనే మహాబలుడైన రాక్షసుడు ఏకచక్ర పురవాసులకు అనూహ్యామైన ప్రమాదం కలిగించబోతున్నాడు. ఈ ప్రమాదంలో సహస్రాంశం కూడా ప్రజల అనుభవంలోకి ఇంకా రాలేదు. ప్రజలకు తండ్రుల లాంటి రాజుగారూ, మంత్రిగారూ సకాలంలో తీసుకున్న చర్యల ఫలితంగా ఇప్పటిదాకా ఈ ప్రమాదం అదుపులో ఉంటూ వచ్చినది. కాని బలభద్రుడులాంటి మూర్ఖుడు రాజుగారి ప్రజాక్షేమ కార్యకలాపాలకు విఘ్నం చెయ్యటమేగాక ఆ మహా రాక్షసేశ్వరుడికి ఆగ్రహం తెప్పించి రెచ్చగొడుతున్నాడు. ఇందుకు వాడు ఇదివరకే ఫలితం అనుభవించాడు. బకాసురేశ్వరుడు బలభద్రుణ్ణీ, అతని అనుచరులనూ ఒక్క లిప్తలో చంపి తినేశాడు. అందుచేత ప్రజలు బలభద్రుడిలాంటి మూర్ఖుల మాటలకు మోసపోక, దైవం మీదా, రాజుగారిమీద భారం వుంచి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరూ బకాశురేశ్వరుడి ముచ్చటలు చేయవద్దు. నగరం దాటి

పోవద్దు. హనుమదుపాసన చేసుకున్నట్టయితే బకాసురాగ్రణి కలలోకి రాడు. ఆయన గురించిన భయాలు వారిని బాధించవు."

ఈ చాటింపు జనానికి చాలా ధైర్యం ఇచ్చింది. దీనికి తగ్గట్టు కొందరు మంత్రవేత్తలు తాయెత్తులూ, రక్షరేకులూ తయారుచేసి జనానికి విక్రయించసాగారు. అవి కట్టుకున్నవారికి కొత్త ప్రాణం వచ్చినట్టయింది.

చయనులూ, ఆయన భార్యా, పన్నెండేళ్ళ కొడుకూ తలా ఒక తాయెత్తూ కట్టుకున్నారు. "మీరు నిష్కారణంగా భయపడ్డారుగాని రాక్షసుడి బెడద చూడండి, రాజుగారు ఎంత చక్కగా పరిష్కరించారో! ఇంకా నయం, మీ భయంకొద్దీ ఊరు విడిచి వెళ్ళాం కాం" అన్నది చయనుల భార్య.

"ఈ ఊరూ సరే, ఈ రాజూ సరే. బలభద్రుణ్ని రాజుగారు తల కొట్టించారని నేను విన్నాను. భద్రుడూ, వాడి మనుషులూ నగరంలో ప్రవేశించటం చూచినవాడు నాతో చెప్పాడు. వాళ్ళందరిని రాక్షసుడు మింగాడని ఈ రాజు చాటింపు వేయిస్తాడు!. . . . అసలీ రాజు మొన్న మొన్నటి దాకా రాక్షసుడి మాటే నమ్మకపోయాట్ట. ఆ సంగతి విన్నావూ?" అన్నాడు చయనులు.

"రక్షరేకులు కట్టుకున్నాం. ఇక మనకేం భయం లేదు."

"ఇంకా ఆ మాట అన్నావు బాగుంది. ఆంజనేయ స్తవం చదువుతా వినండి. . ."

చయనులు యీసడింపుగా మాట్లాడితేనేం గాని రాక్షసుడి బెడద వదిలినట్టే కనబడింది. ఎక్కడా చావు కబుర్లు లేవు. అందులో ఆశ్చర్యపడవల సిందేమీలేదు. ఎందుకంటే జనం నగరం విడిచి వెళ్ళటం మానేశారు. కానీ కారణం ఎవడిక్కావాలి? రాక్షసుణ్ణి మరిచిపోవటానికిది చాలు. మరుపు వచ్చిన పీడ లేని పీడతో సమానం. ఈ సుఖమయ పరిస్థితి కలిగించిన కీర్తి రాజుగారికీ, మంత్రికీ దక్కింది.

కాని పాలకులకూ, పాలితులకూ షష్టాష్టకం వుండి వుండాలి. ప్రజల అందోళన తగ్గిన కొద్దీ రాజు, మంత్రుల ఆరాటం హెచ్చింది.

"మంత్రీ! ఇట్లా ఎంతకాలం గడుస్తుంది? ఆ రాక్షసుడికి నెల రోజులుగా మనుషులందకుండా చేశాం. వాడు వచ్చి నగరంపైన పడితే ఏమిటి దారి!" అన్నాడు రాజు.

"అదే ఆలోచిస్తున్నాను, మహారాజా!" అన్నాడు మంత్రి.




ఏం తేల్చావని రాజు అడగలేదు, మంత్రి చెప్పలేదు.

ఒకవేళ మంత్రి ఆలోచనలు ఒక పాకానికి రాకపోయి ఉంటే ఆ పని ఒనగూడే సంఘటన జరిగింది. ఒకనాటి అర్ధరాత్రి నగర ద్వారాన్ని వెలపలినుంచి ఎవరో నింపాదిగా తట్టారు. ద్వార రక్షకుడు ద్వారం తెరిచాడు. వాణ్ని ఎవరో బయటకి లాగేశారు. వాణ్ణి మళ్ళీ ఎవరూ చూడలేదు.

మిగిలిన భటులు రాత్రి జరిగిన సంఘటన తెల్లవారి మంత్రికి నివేదించారు.

"అయితే వాడక్కడే ఉన్నాడు!" అన్నాడు మంత్రి, లోపల అనుకోవల సిన మాటలు పైకి అనేస్తూ.

ఆయనకు బకాసురుణ్ణి గురించి ఇంకో కొత్త విషయం తెలిసినట్టయింది. ఆ రాక్షసుడు తాడి ఎత్తు మనిషి అనీ, వాడికి గంగాళమంత నోరూ, ఏనుగు దంతాలంతేసి కోరలూ ఉంటాయనీ ఆయన ఎన్నడూ అనుకోలేదు గాని, ఒక్క మనిషి దొరికితే వాడికి చాలునని ఆయనకిప్పుడే తెలిసివచ్చింది. ఇద్దరు మనుషులను తినగలిగి ఉండినా వాడు ద్వార రక్షకుడితో తృప్తిపడి వుండడు, తెరిచి ఉన్న ద్వారంలో నుంచి నగరంలోకి ప్రవేశించి మరి కొంతమందిని చంపి ఉండేవాడే.

"మీరీ మాట ఎక్కడా అనకండి, జనం నిష్కారణంగా భయపడి పోతారు. పాపం. వాళ్ళు ఇప్పుడిప్పుడే గుండెలపైన చేతులు వేసుకుని నిద్రలు పోవటం ఆరంభించారు. మన ద్వారరక్షకుడికి పెళ్ళాం పిల్లలు ఉన్నారా!" అని మంత్రి భటులతో అన్నాడు.

"లేరండీ. బ్రహ్మచారి?"

"మరీ మంచిది. ఎవరన్నా అడిగితే వాణ్ణి రాజమందిరానికి మార్చినట్టు చెప్పండి. ఈసారి ఎవరన్నా ద్వారాలు తట్టితే తలుపులు తెరవద్దు!"

"అఘోరించినట్టే వుంది!" అన్నాడు ఇదంతా మంత్రి ద్వారా విన్న రాజు. "ఆ రాక్షస ముండాకొడుక్కి కావలసింది తడవకొక మనిషే అయితే మరీ మంచిది. ఆ మనిషిని మనం, ఏదో విధంగా ఇచ్చుకొని అయినా వాణ్ణి నగరం విడిచిపోకుండా చెయ్యాలి. మనం చేసిన కట్టుదిట్టాల ఫలితంగా వాడు తిండి దొరక్క మరో ఊరు వెతుక్కుంటూ పోతాడేమోనన్న భయంతో నేను నిద్రపట్టక చస్తున్నాను!"

రాజుగారి హృదయం ఇట్టే మంత్రికి తెలిసి పోయింది. బకాసురుడు ఏ కచక్రపురానికి పెట్టనికోట. వాడు మూడు అక్షౌహిణుల సైన్యానికి తుల్యుడు. వాడే చతురంగ బలాలూను. అందుకే వాడు రాజుగారికి దివ్యమైన అంగరక్ష. వాడు పోవడానికి వీల్లేదు. వాడి ఖర్చు ఏడాడికి మూడువందల అరవైమంది ప్రాణులు! కారు చౌక! చచ్చు చౌక యుద్ధాలలో దానికి అయిదింతలు చస్తారు. క్షామాలు అంతకన్నా ఎక్కువే బలి తీసుకుంటున్నాయి. క్షామం వెనకా, మహమ్మారి వెనకా శత్రువులు వచ్చిపడి మరింత నష్టాలు చేసిపోతారు. వీడు అలా కాదు. వీడు పీడే అనుకున్నా ఇతర పీడలకు గొప్ప ప్రతిబంధకం. అదృష్టదేవత ఈ రాక్షసుడి రూపంలో వచ్చిందంటే అతిశయోక్తి కాదు.

"దేవర వారి మనోభావం గ్రహించాను. రాక్షసుడు వెళ్ళిపోవలసిన అవసరం లేదు. అందుకు తగిన ఏర్పాటు చేస్తాను. అది అంత సులువైన ఏర్పాటు కాదు.

మనకు కొంతమంది పెద్దల అండ అవసరం. సాధ్యమైనంత త్వరలో అన్ని ఏర్పాట్లూ చేసి తమ చేత భళీ అనిపిస్తాను. రెండు రోజులు వ్యవధి ఇస్తే చాలు!" అన్నాడు మంత్రి.

"కావలిస్తే ఇంకొక రోజు వ్యవధి తీసుకో. నాకల్లా పని సక్రమంగా జరగటం కావాలి. ఆ రాక్షసుడు వెళ్ళిపోకుండా చూడు. అంతే నేను కోరేది" అన్నడు రాజు.

మంత్రిగారి ఇంట ఆ రాత్రి రహస్య సమావేశం జరిగింది. ఇందులో అయిదుగురు మాత్రమే పాల్గొన్నారు. ఆ అయిదుగురూ నగర ప్రముఖులే, వారితో మంత్రి అంతా నిజం చెప్పలేదు. అంతా అబద్ధమూ చెప్పలేదు.

"ఈ బకాసురోత్తముణ్ణి గురించి మనం ఏదో ఒక నిర్ణయం చేయవలసిన సమయం ఆసన్నమయింది. ఆయన మనకు పక్కలో బల్లెం అయి కూర్చున్నాడు. మన రాజుగారి సంగతి మీరు ఎరుగుదురు. రాక్షసేశ్వరుడికి సంబంధించిన వార్తలను మొదటలో మనలాగే రాజుగారూ నమ్మలేదనుకోండి. కాని, ఆ వార్తలు నిజమని ఒకసారి రూఢి అయినాక ఆయనకు ప్రజా క్షేమం తప్ప మరేదీ తలకెక్కటంలేదు. వారికి గల ప్రజాహిత చింత నేను మీకు వేరే చెప్పనవసరంలేదు."

అందరూ తలలు ఆడించారు. మంత్రి కోతలు కోస్తున్నాడు. ఎందుకు కోస్తున్నదీ తెలిసేదాకా ఆయన మాట కాదనటం కేవలం నిరుపయోగం. మంత్రి ఒక్క నిట్టూర్పు విడిచి మళ్ళీ చెప్పుకుపోయాడు.

"ఆయన ప్రజా ప్రేమ ఎంతదాకా వెళ్ళిందంటే కవచం తెమ్మని భటులను కేకేసారు. ఎందుకని అడిగాను. ఆ రాక్షసుడిపై యుద్ధానికన్నారు. తొందరపడవద్దన్నాను. రాజుగారి ఆత్మీయులైన మీ అందరి ఆలోచనా తెలుసుకొనిగాని ఏ నిర్ణయమూ చేయగూడదన్నాను. మీకు తెలియనిదేముంది? నా పేరు కన్నా మీ పేర్లు ఆయనను త్వరగా మంత్రముగ్ధుణ్ణి చేస్తాయి. మీపై ఆయనకు గల గురిలో నా మీద శతాంశం ఉంటే నా భారం తగ్గును."

మంత్రి మళ్ళీ నిట్టూర్చాడు. పెద్దలు తలలు ఆడించారు. మంత్రి ఆ అబద్ధాలన్నీ ఎందుకాడుతున్నదీ వాళ్ళు ఊహించలేకపోయారు.

"ఉన్న వాస్తవ పరిస్థితి దాచకుండా మనవి చేస్తా. ఆ రాక్షసుడు తలచుకుంటే మన నగరాన్ని ఒక్క ఘడియలో శ్మశానంగా మార్చగలడు. అతణ్ణి ఆపటం ఎవరి తరమూ కాదు. రాజుగారి తరం కూడా కాదు. ఆ మాట అంటే నా తల ఎగిరిపోతుంది. త్రాసుకు ఒక వైపు ఈ విషయం ఉంచండి. ఇక రెండోవైపు ఉంచవలసిన విషయం మనవి చేస్తా. రాక్షసేశ్వరుడికి మన మీద ప్రత్యేకమైన పగ ఏమీ లేదు. భగవంతుడు సృష్టించిన ప్రతిప్రాణీ తనకు సహజమైన ఆహారాన్ని తిని బతకాలి. పులులు లేళ్ళను చంపి తింటవిగాని, లేళ్ళు పులులను చంపి తినవు గదా! అలాంటి ప్రకృతి నియమాన్ని అనుసరించి రాక్షసేశ్వరులు మన నగరానికి విచ్చేశారుగాని మన మీద శత్రుత్వంలో కాదు. రాజ్యకాంక్షతో కాదు. మన రాజ్యంపై కన్ను వేసిన పరిసర రాజులతో పోల్చితే రాక్షసేశ్వరులు దాదాపు మిత్రులనే చెప్పాలి. దాదాపు మిత్రులు! సాక్షాత్తూ మిత్రులుగా చేసుకుంటే మనకెంత ఉపకారమో ఆలోచించండి. యుద్ధాలు వచ్చినప్పుడు మనకెంత నష్టం కలుగుతున్నది! గడచిన పదేళ్ళలో మీరందరూ ఎంతెంత ద్రవ్యం త్యాగం చేశారు కాదు!"

మంత్రి ఆగి అందరినీ కలయజూశాడు. వారీసారి బొమ్మల్లాగా




నిశ్చలంగా ఉండిపోయారు. ఆసలు విషయం బయటపడబోతున్నది. ఇది మంచికో చెడుకో ఆ మంత్రికే తెలియాలి, దైవానికి తెలియాలి.

"ఇప్పుడు మీ మంచికోరే నా మంత్రాంగం ఏమంటే – ఈ రాక్షసేశ్వరుణ్ణి మన మిత్రుణ్ణి చేసుకుని తద్వారా మీకు లాభాలు కలిగే పద్ధతి ఉంటే, ఆ పద్ధతి అవలంబించటం ఉచితమా? లేక ఈ రాక్షసేశ్వరుణ్ణి మన శత్రురాజులతో సమంగా శత్రువును చేసుకుని మనమందరమూ సర్వనాశనం చేసుకోవటం సముచితమా? ఈ ఒక్క ప్రశ్నకు నాకు సమాధానాన్ని బట్టి పై విషయం మాట్లాడుకుందాం."

అయిదుగురి ముఖాలూ వికసించాయి. మంత్రి వేసినది పిచ్చి ప్రశ్న. అంత బలాధికుడైన రాక్షసులుంగారి స్నేహంతోబాటు తమకు లాభాలు కూడా కలిగే మాటుంటే వారితో – అంటే ఆ రాక్షసులుంగారితో– విరోధం పెట్టుకోమని ఏ గాడిద అంటాడు? వారు మంత్రిని చూసి విశాలంగా నవ్వారు. దీనికింత ఉపోద్ఘాతమెందుకో వాళ్ళకు అర్థం కాలేదు. అదే ఈ మంత్రులతో వచ్చిన చిక్కు. వాళ్ళు అసలు విషయానికి ఒకంతట రారు.

"రాక్షసేశ్వరులకు దినము ఒకటింటికి రెండు దున్నలూ, బండెడు అన్నమూ, కూరలూ, ఒక మనిషి ఆహారం. ఈ ఆహారం మనం సమకూర్చే పద్ధతిలో వారు మనతో మైత్రిచేసి మనకు అండగా, మన శత్రువులకు సింహస్వప్నంగా ఉంటారు. దీనికి మీరేమంటారు?" అన్నాడు మంత్రి.

పెద్దలు మరింత విశాలంగా నవ్వారు.

"మన నగరానికి ఇదొక పెద్ద వ్యయం అనిపించుకోదు. రోజూ ఎన్ని బళ్ళ ఆహారం వ్యర్థమై పోతున్నదో! ఆహార పదార్థాలు అందించటం మీ వంతు. మీకు తగిన ప్రతిఫలం చూపే పూచీ నాది. ఇంతకాలమూ నగర ద్వారాలు మూసి ఉంచటం చేత మీ వర్తక వాణిజ్యాలు ఎంత నష్టమయాయో నాకు తెలుసు. ఆ ద్వారాలు తెరవటమే మీకెంతో లాభిస్తుంది. దానికి తోడుగా మీకు తెలుసు. దానికి తోడుగా మీకు ఇది ఒక తీయని వర్తకంగా ఉంటుంది. ఏమంటారు?" అన్నాడు మంత్రి.

"రాక్షసులుంగారికి కావాలంటే ఒకటో రకం మద్యం కూడా మన వద్ద దొరుకుతుంది" అన్నాడు ఒక పౌరశ్రేష్ఠుడు.

"అది మంచి ఆలోచన, మీతో సంప్రదించుతున్నది ఇందుకేగదా!" అన్నాడు మంత్రి.

"మరి దున్నపోతులు?"

"మనుషులు మాట?"

"అదేమంత పెద్ద సమస్య కాదు. సమష్టి క్షేమం కోసం చెయ్యవల సిన త్యాగంలో సామాన్య ప్రజలు సంతోషంగా భాగం పంచుకుంటారు. ఇంటికొకరోజు ఒకరి వంతు వచ్చేటట్టుగా ఏర్పాటు చేద్దాం" అన్నాడు మంత్రి.

"ప్రతి ఇంటికీనా?"

"అవును. ఈ విషయంలో మనం పక్షపాతం వహించరాదు. సంపన్నులు తమ ఇంటి వంతు వచ్చినప్పుడు తమ బానిసలలో ఒకరిని పంపవచ్చు. లేదా మనుషులను కొని పంపవచ్చు. ఒక ఇంటికి వంతు వచ్చిందంటే తిరిగి మూడేళ్ళ తర్వాత కదా మళ్లీ వంతు వచ్చేది? మూడు నాలుగేళ్ళ కొకసారి ప్రతి ఇంటా చావు ఉంటూ ఉన్నదేనాయే. నా మాట నమ్మండి. మనం చేస్తున్న ఈ ఏర్పాటుకు ఒక్కరు కూడా అభ్యంతరం చెప్పరు. మనం చేస్తున్న ఈ ఏర్పాటంతా నగర క్షేమమూ, ప్రజా క్షేమమూ కోరే అయినప్పుడు ప్రజలు మటుకు ఎలా అభ్యంతరం చెబుతారు? రాక్షసేశ్వరులతో విరోధం పెట్టుకోవటం సర్వనాశనకరమైన పని అని మనం వారికి తెలియజెప్పుతాం గద!"

అయిదుగురి కళ్ళలోనూ ఆనందభాష్పాలు నిలిచాయి.

★ ★ ★ ★ ★

ఏక్రచక్రపురం పెళ్ళిల్లల్లే మహా సందడిగా ఉంది. రాక్షసుడుగారి కోసం పెద్ద పాకశాల కడుతున్నారు. ఈ పాకశాలలో రోజుకొక పుట్టెడు ధాన్యం వండి, రాక్షసుడుగారికి పంపించాలి. కొత్తగా నియమితుడైన ఉద్యోగులు ఇంటింటికి తిరిగి ధాన్య సేకరణ చేస్తున్నారు. వంటా వార్పూ, శాకం, పాకం దివ్యతమంగా ఉండాలనీ, అలక్ష్యం చేస్తే గట్టి శిక్ష పడుతుందనీ వంటవాళ్ళు హెచ్చరించబడ్డారు.

ఈ కొత్త పరిస్థితిని అనుకూలంగా చేసుకునే అవకాశాలున్న వారందరి కీ మార్గాలు అన్వేషించటంతో సరిపోయింది. వంట దివ్యంగా ఉండాల నటంలో అర్థం లేకపోలేదు. పెద్దవాళ్ళ ఇళ్ళకన్నిటికీ ఇక్కడి నుంచే భోజనాలు వెళ్ళేవి. ధాన్యం వసూళ్ళ వాళ్ళ ఇళ్ళలో ధాన్యం కొరత లేకుండా పోయింది. అగ్రపంచకం వారు తీసిన లాభాలకు అంతే లేదు.

కొలువుకూటంలో రాజుగారు ఇంకా రాక్షసుణ్ణి గురించి విచారమే వెలిబుచ్చుతున్నారు.

"ఇదంతా మనకు నిజంగా తలవంపులే. ఏడు తరాలుగా ఈ నగరం ఇటువంటి అవమానం పొంది ఎరగదు. కాని గత్యంతరం లేదు. నగరమంతా అరాజకమై, పీనుగ పెంటలై పోయేకన్నా రోజుకొక్క మనిషి మాత్రమే బలి కావటం లక్ష రెట్లు వాంఛనీయం" అన్నాడు రాజుగారు.

"మహారాజా, అలా అనకండి. వంగదేశంలో ఒక నగరానికి మహాకాళి గ్రామదేవత. అక్కడ ఆ దేవికి రోజూ నరబలి ఇస్తారు. ఆ మహాతల్లి ఆ గ్రామానికి ఏ ఆపదా రాకుండా కాస్తున్నది. రాక్షసుల వారు మనలను కాపాడాలేగాని రోజుకొక్క మనిషిని బలి ఇవ్వటం ఏమంత పెద్ద త్యాగం కాదు" అన్నారొకరు.

"మన వెర్రిగాని, చంపేదెవరు? చచ్చేదెవరు? అంతా మాయ! అదిన్నీ గాక. లోక హితార్థం ప్రాణత్యాగం చేసినవారికి ఉత్తమ లోకాలు కలుగుతవి. అందుకు ఎలాంటి సందేహమూ లేదు!" అన్నాడు మరొక వేదాంతి.

అకస్మాత్తుగా అజ్ఞాని కళ్ళు మెరిశాయి. అతగాడు ఎవరి మాటలూ చెవిన వేసుకోకుండా ఏదో ఆలోచిస్తున్నట్టున్నాడు.

"మ్హర్జా!" అని అతడు ఒక్క గావుకేక పెట్టాడు.

అందరూ అతడికేసి ఆశ్చర్యంగా చూశారు.

"విషం! విషం!. . . . మనజా రాక్షసాధముడికి పంపే కుంభంలో విషం పెట్టేద్దాం! పీడ విరగడై పోతుంది!" అన్నాడు అజ్ఞాని. అప్పుడే రాక్షసుడు విషం తిని చచ్చినంత ఆనందం అతడి మొహాన కనిపించింది.

అందరి మొహాల్లోనూ ఆశ్చర్యం తాండవమాడాయి.

"ఏకంగా-మ్య-మ్య-ప్రాణహత్యే?" అన్నాడు వేదాంతి ముక్కుమీద వేలేసుకుని.

"అంత మహాశక్తి సంపన్నులైన రాక్షసుల వారిని మనం ఎలాగైనా మనకు అనుకూలంగా ఉపయోగించుకోవాలిగాని, చేజేతులా నిర్మూలించుకుంటామా? చెట్టంత రాక్షసుడు పోతే మళ్ళీ వస్తాడా? నష్టపడిపోమూ?" అన్నారు మరొకరు.

అజ్ఞాని తన ధోరణి వదలలేదు.

"రాక్షసుడు పూర్తిగా నిరుపయోగమని నేనూ అనను. చచ్చాక వాణ్ణి కాల్చి బూడిదచేసి అందరి దొడ్లలోనూ చల్లుకుందాం. రాక్షసి శాకాలు కాస్తాయి. వాటిని తింటూ మనం కొంత తృప్తి అయినా పడవచ్చు"

ఈ మాటతో గగ్గోలు లేచిపోయింది. నలుగురూ మాట్లాడారు. ఒకరి మాటలు ఒకరికి వినిపించలేదు.

మంత్రి అందరినీ దారికి తెచ్చి అన్నాడు : "రాక్షసేశ్వరుణ్ణి మాయోపాయంచేత మట్టుబె ట్టవచ్చునన్న ఆలోచన నాకు మొట్టమొదట కలిగిన ఆలోచన. కాని అందువల్ల కలిగే ప్రమాదాలు మరింత తీవ్రంగా ఉండవచ్చునన్న భయంతో ఆ ఆలోచన కట్టిపెట్టాను."

"ఏమిటండి, మహామంత్రిగారూ, ఆ ప్రమాదాలు?" అన్నాడు అజ్ఞాని, కొంచెం



వెటకారంగానే.

"ఒకటి-ఈ రాక్షసులవారు స్వయంభువు కాదు గనక, ఆయనకు బంధుమిత్రాదులుంటారు. వారు దండుగా వచ్చి మన నగరంపై పడి భస్మీపటలం చేస్తారు" అన్నాడు అజ్ఞాని కొంచెం వెటకారంగానే.

"అమ్మయ్యో! ఇంకేమైనా ఉందా?" అన్నాడు వేదాంతి.

"రెండు - రాక్షసులు కూడా దేవతల వలెనే అమానుష శరీరులు. వారు విషాన్ని జీర్ణించుకోవచ్చు"

"హరాయించుకోవచ్చు!" అని వేదాంతి తర్జుమా చేశాడు.

"మనం తన నిర్మూలనానికై విషప్రయోగం చేసినట్టు రాక్షసేశ్వరుడికి తెలిశాక ఏం జరిగేది తలుచుకుంటేనే నా కాళ్ళు వణుకుతున్నాయని నేను దాపరికం లేకుండా చెబుతున్నాను."

"నా కాళ్ళు -మ్యొ-మ్యొ-ఇప్పుడే వణకుతున్నాయి" అన్నాడు వేదాంతి.

"ఆ రాక్షసుణ్ణి నిర్మూలించటానికి నేనింకా చాలా ఉపాయాలు చెప్పగలను. విషం చేత చావక మనమీద పగబట్టి నగరంలోకి వచ్చే మాటుంటే నగరం నాలుగు మూలలా నిప్పుపెట్టేద్దాం!"

"వాడలా చావడండీ! అంత సులువుగా చచ్చేవాడు వెయ్యేళ్ళు బతుకుతాడా?" అన్నాడు వేదాంతి. (బకాసురుడి వయస్సు వెయ్యేళ్ళన్నది రుజువయిన సత్యంలాగే జనంలో ప్రచారమవుతున్నది)

అజ్ఞాని వదలలేదు.

"వాడేం బ్రహ్మ పదార్థమండీ? విషానికి చావడంటారు! నిప్పుకు కాలదంటారు! మార్కండేయిల వారిలాగా చిరంజీవా?"

"పెద్దల పట్ల ఏకవచన ప్రయోగం కూడదు. రాక్షసుల వారిని గురించి తూష్ణీభావంతో మాట్లాడడానికి వారికన్న మనం ఎందులో అధికులమని?" అంటూ ఒక సభికుడు మొహం కండలు బీల్చుకున్నాడు.

మంత్రిగారు మళ్ళీ చర్చకు అడ్డొచ్చాడు.

"ఈ విషయం కొంచెం ఆలకించండి. నేను రాక్షసేశ్వరుణ్ణి సమర్థించటానికి చెప్పటంకాదు. మన నగరంలో రోజుకు నలుగురు పుట్టుతున్నారు. ఇద్దరే చచ్చిపోతున్నారు. ఒకసారి క్షామమూ, ఒకసారి మహమ్మారి వచ్చి ఎంతో జనాభా పోయాక కూడా మన నగరంలో మా తండ్రిగారి కాలంలో ఉన్నంతమందీ ఉన్నారు. రోజుకొక్క మనిషి చనిపోయినందువల్ల మన జనాభా కొంచెం అదుపులో ఉంటుందిగాని జననష్టం ఉండదు."

"పొరుగూళ్ళవారు వచ్చిపడి జనాభా పెరిగిందండి. ఈ ఊళ్ళో ఇల్లరి కపుటానవాయితీ గల ఇళ్ళు నూటికి పైగా ఉన్నాయి. అదీగాక నగరం పచ్చపచ్చగా ఉండటం చూచి యాభై ఆమడ నుంచి కూడా జనం వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు." అని అజ్ఞాని మంత్రిగారికి జ్ఞాపకం చేశాడు.

"నిజం, నిజం! అందుకు కూడా ఆ రాక్షసేశ్వరుడుండటం నగరానికి మంచిది. ఈ అయిదారు మాసాల కాలంలో నగరంలోకి పెరవాడొక్కడు రాలేదు" అన్నాడు మంత్రి తాపీగా.

సభికులంతా వెళ్ళిపోయాక రాజూ, మంత్రీ రహస్య మంతనాలాడారు. వారు చర్చించిన విషయం చాలా ముఖ్యమైన విషయం.

రాక్షసుణ్ణి నగరం విడిచిపోకుండా ఉంచటానికి అవసరమైన ఏర్పాట్లన్నీ జరిగాయి. కాని ఆ రాక్షసుడితో రాజుగారు ఒక సంధి నిర్ణయానికింకా రావటం జరగలేదు. అది సులభసాధ్యం కాదు కూడా. ఎందుకంటే అధికారి




అయిన వాడెప్పుడూ ఇంతవరకూ రాక్షసుణ్ణి అంత దూరాన చూడనైనా లేదు.

"అతడితో మాట్లాడి, మన నగరం విడిచిపోననీ, మనం పంపే ఆహారంతో తృప్తి పడతాననీ, నగరంమీద పడి ఎవరినీ చంపననీ, ద్వారాలు తెరిచినా నగరంలోకి రాననీ ప్రమాణం చేయించుకోవాలి" అన్నాడు రాజు.

"ఎవరం వాడి ఎదుటపడి ఈ మాట అడుగుతాం? అదీగాక రాక్షసుడు అన్నమాట మీదనే ఉంటాడని ఏమిటి? మాట తప్పితే వాణ్ణి మనం ఏం చెయ్యగలం?" అన్నాడు మంత్రి. రహస్య సంభాషణలలో మంత్రిగాని, రాజుగాని, రాక్షసుడిపట్ల అంత గౌరవ మర్యాదలు ప్రకటించేవారు కారు.

"అయితే ఈ చేసిన ఏర్పాట్లన్నీ వృధాయేనా? మరి ఇదంతా ఎందుకు చేయించావు?" అన్నాడు రాజు.

"ఆలోచించకుండా నేనేదీ చెయ్యలేదు మహారాజా! నా ఆలోచన ఏమిటంటే మనం ఈ రాక్షసుణ్ణి మచ్చిక చెయ్యాలి. నా చిన్నతనంలో మా ఇంట ఒక పిల్లికూన ఉండేది. దానికి మొదట పాలూ, తరువాత మీగడా, పెరుగూ, చిన్న చిన్న చేపలూ పెట్టి పెంచాం. అది తన ఆహారం కోసం మా మీద ఆధారపడిపోయి తన ముందుగా ఎలుకపోయినా కదలకుండా కూచునే స్థితికి వచ్చింది. ఈ రాక్షసి వెధవను మనం అలా మచ్చిక చెయ్యాలి. మనం ఆహారం పంపనినాడు పస్తయినా పడుకోవాలిగాని మనుష్యుల్ని వేటాడరాదు. ఆ స్థితి వచ్చాక మనం ఎలా చెయ్యమంటే అలా చేస్తాడు. అందుచేత మనం కొంతకాలంపాటు రోజూ వాడికి కుంభమూ, మనిషీ, బండిలో రెండు దున్నలూ పంపుదాం, ఎంత లావు రాక్షసుడైనా ఇంతకంటే హెచ్చు ఆహారం కోరడు."

మంత్రి యొక్క బుద్ధిశాలితనానికి రాజుగారు మెచ్చుకుని మెడలో ఆ సమయాన ఉన్న రుద్రాక్షమాల ఆయనకు కానుకగా ఇచ్చాడు. ఆయన మెడలో అనేక ముత్యాల మాలలూ, రత్నాల మాలలూ ఉండేవే గాని వాటిని చిన్న చిన్న దారపు పోగులతో అక్కడా అక్కడా అంటగట్టి ఉంచి రుద్రాక్షమాల ను మాత్రమే తీయగానే సులువుగా వచ్చేటట్లు ఉంచుకునేవాడు. ఈ రహస్యం మంత్రి చెప్పినదే. అందుచేత రుద్రాక్షమాల తీసుకుని కళ్ళకు అద్దుకుంటూ

మంత్రి తనలో తాను నవ్వుకున్నాడు.

మొదటిరోజు బకాసురుడికి ఆహారం వెళ్ళింది. ఒక బండికి రెండు దున్నలను పూన్చి, దానిమీద పుట్టెడు కుంభం వేసి, దానిమీద రాజుగారి బానిసల్లో ఒకణ్ణి కూచోబెట్టారు. అంతకు ముందే పూలతోనూ, గంధంతోనూ అలంకరించి, బ్రహ్మణులు మంత్రోక్తంగా వాణ్ణి వాడి ఇష్టదేవతకు నైవేద్యం పెట్టేసి, "పోరా, ఇక నీకు జన్మలేదు! నీ దేవి నిన్ను స్వీకరించింది. రాక్షసేశ్వరుడు తినేది నీ కట్టెనే!" అని ధైర్యం చెప్పారు. దేవేంద్రుడూ, ముప్పైకోట్ల దేవతలూ, రంభా ఊర్వశ్యాది అచ్చరకన్నెలూ వాడికోసం ఎదురుచూస్తున్నారని నమ్మబలికారు.

అంతా విని వాడు "అక్కడ నాకు మా అమ్మ కనిపిస్తుందా?" అని ఆత్రంగా అడిగాడు.

సరిగా నడిమధ్యాహ్నంవేళ బండి నగరద్వారం దాటి ఒక అరకోసు దూరం వెళ్ళి అక్కడ ఒక మర్రిచెట్టు కింద ఆగింది. బండివాడు మర్రి చెట్టెక్కాడు. లోగడ రాక్షసుడి చేతిలో చచ్చిన వాళ్ళంతా ఈ ప్రాంతానే అపరాహ్ణం వేళ చచ్చారు. దారిలోనే రాక్షసుడు కనిపిస్తే పారిపొమ్మనీ, రాక్షసుడు కనిపించకుండా బండి చెట్టు నీడకు చేరితే చెట్టుమీద కెక్కి దాక్కోమనీ బండివాడికి చెప్పారు.

సాయంకాలం సూర్యాస్తమయానికింకా పది ఘడియలు ఉన్నదనగా బండి తిరిగి వచ్చింది. భటులు బండివాణ్ణి రాజూ, మంత్రీ కూచుని ఉన్న గదికి తీసుకుపోయారు.

"ఏం జరిగిందిరా? ఏం జరిగింది? రాక్షసుడు వచ్చాడా? అంతా తిన్నాడా?" అని మంత్రి బండివాణ్ణి అడిగాడు. నిజానికి, బండివాడు ప్రాణాలతో తిరిగి వస్తాడని ఆయన అనుకోలేదు.

మంత్రిగారి ప్రశ్న వింటూనే బండివాడు ఏదో జ్ఞాపకంవచ్చి, విరగబడి నవ్వాడు.

"ఏంరా నవ్వుతావు?"

"ఆ రాచ్చొచుడు–" అంటూ వాడు మరింత నవ్వాడు.

"చూస్తినిగా! ముసలిడొక్కు! నా కంటె రెండు గుప్పిట్లుంటాడులెండి. అణ్ణి జూసి నాకు బయమే యెయ్యలా! వొసికర్ర తీసుకుని నాలుగేట్లేస్తే పారి పోతాడనుకున్నా, సెప్పొద్దూ! ఆడు మనిసిని చంపి తిని జేబ్లిపోయేదాకా ఉండి, కుంభం అక్కడే వొదిలేసి బండి తోలుకొచ్చేశా. ఆడు కుంభం ముట్టనేలా! మనిషిని చంపటానికే అడికి జాంసేపట్టిందంటే!

"నువ్వు వెళ్ళి అవతల ఉండు!" అన్నాడు మంత్రి.

బండివాడు అవతలికి వెళ్ళాక రాజూ, మంత్రీ మొహాలు చూసుకున్నారు.

"ఎవర్రా అక్కడ?" అని మంత్రి పిలిచాడు.

భటుడొకడు వచ్చాడు.

"మన మంగలి మంత్రిని పిలిచి, బండివాడి నాలుక రహస్యంగా తీసెయ్యమన్నాని చెప్పు. లేకపోతే పాపం, వాడు బతకడు" చెప్పాడు మంత్రి.

★ ★ ★ ★ ★

ఏకచక్రపురవాసులు బకాసురుడికి అలవాటు పడిపోయారు. వారికి తమ జీవితం సహజంగానే కనబడింది. పగటివేళ అందరూ అస్తమానం సూర్యుణ్ణి స్మరించరు. కాని ఆకాశంలో సూర్యుడున్న సంగతి వారికి అనుక్షణమూ తెలిసేవుంటుంది. బకాసురుడూ అంతే. వాడు నగరం వెలపల ఎక్కడో ఉంటాడు. రోజూ వాడికి బండిమీద కుంభమూ, కుంభంతో పాటు ఒక ఆడదో, మగవాడో, చిన్నపిల్లో, పిల్లవాడో పోతూంటారు. వీధిలో ఆ బండి ఎదురైతే జనం దానికేసి చూడరు. దృష్టి మరల్చుకుని తమ దారి ని పోతారు.

బకాసురుడి అలవాటు కనీసం రాజభటులకు తెలుసు. సూర్యాస్తమయం వేళకు వాడు ఆ చెట్టు చాయల ఉండదు. బండిలో కుంభమంతా ఇంచుమించు అలాగే ఉండిపోతుంది. రాజభటులు దానిని ఆరగించేస్తారు. మూగబండివాడు ముందే ఆరంభిస్తాడు. వాడికిప్పుడు బకాసురుడి భయం ఏమీలేదు. వాడు వచ్చే వేళకు చెట్టెక్కడు–దూరంగా పోతాడు. బకాసురుడు వాడికేసి చూడడు. వాడికి బలిమనిషి మెడలో ఉండే పూలదండలు గుర్తు.

బకాసురుని చూడనివాళ్ళు ఊహించుకొన్నదానికి బండివాడు నిత్యమూ చూసేదానికి సంబంధంలేదు. ఒక్కోరోజు ఆ నరభక్షకుడు చావుదెబ్బలు తిని, ప్రాణంమీద రోసిన కుక్కల్లే కనబడేవాడు. ఒక్కొక్కప్పుడు వాడి కళ్ళు పొరలు కమ్మినట్టుండేవి. మొహం ఎప్పుడూ ముడతలు పడి విచారగ్రస్తంగానే ఉండేది. బకాసురుడు తన కోసం తిండిగా వచ్చిన మనుషులను తినకుండా వదిలిన సమయాలు కూడా ఉన్నాయి.

"చావు రాసి ఉండనప్పుడు–మ్యా–మ్యా–చంపడం బకాసురులవల్ల మాత్రం అవుతుందండీ?" అనేవాడు వేదాంతి. బకాసురులు బహువచనం కాదు. గౌరవ వాచకం మాత్రమే. మంత్రిని మంత్రులు అనీ, తండ్రిని తండ్రులు అనీ, మామను మామలు అనీ, పొరపాటున నోరుజారి భర్తని భర్తలు అనీ కూడా అనటం ఆయనకు అలవాటు.

ఒకే ఒక్కసారి బకాసురుడు తన బలిమనిషిని చంపినాక తనకు తినే కోర్కెలేనట్టు తెలుసుకుని కళేబరాన్ని అవతల పారేశాడు. అప్పుడు మాత్రం బండివాడికి పట్టరాని అగ్రహం వచ్చింది. వాడు బండి వొసికర్రతీసి బకాసురుడి కణత అదిరేటట్టు గిరవాటేశాడు. బకాసురుడు బెదురుచూపులు చూస్తూ ఉడాయించేశాడు.

అది అంతటితో పోలేదు. ఆ మరునాడు బండితోలుకుని రా నిరాకరించి కోపంతో "బే–బే బో –బో!" అని చెయ్యి బకాసురుడుండే వేపు ఊపాడు. అయినా మంత్రిగారు, వాణ్ణి భటులచేత తన్నించి బండిమీద కూచోబెట్టాడు. వాడి కళ్ళవెంట నీరు కారుతుంటే అది దెబ్బలకనే అనుకున్నాడుగాని, తన చేత దెబ్బతిని పారిపోయినవాడు నిండుప్రాణాన్ని తీసెయ్యటమే వాడికి బాధ కలిగించింది. అయితేనేం? బకాసురుణ్ణి భయపెట్టేవాడై ఉండి కూడా, వాణ్ణి చూసి అదలిపోయే మంత్రి వగైరాలకు తాను లొంగవలసి వచ్చింది! వైపరీత్యం!

రోజూ బకాసురుడి కారణంగా ఏదో ఇంట రోదనలు వినిపించేవి అన్నమాట పూర్తిగా నిజంకాదు. ధనికులు తమ ఇళ్ళవంతు వచ్చినప్పుడు డబ్బుపోసి మనుషులను కొని బకాసురుడికి ఆహారంగా పంపేవారు. పేదవాళ్ళు గట్టిగా ఏడవటానికి నోచుకోరు. అందుచేత తమ ఇంటిపై గద్ద వాలగానే ఏడిచేవాళ్ళు.

బ్రాహ్మణ రక్తం గొంతు దిగితే బకాసురుడు భస్మీపటలం అవుతాడన్నది వట్టి అబద్ధమని రుజువైపోయింది. బ్రాహ్మణుల వంతు వచ్చినప్పుడు వాడు బ్రాహ్మణులను గూడా నిరాక్షేపణగా తిన్నాడు. వాడి ఆరోగ్యానికేమీ భంగం రాలేదు.

అన్నిటికన్నా వింత ఏమంటే, నగర ద్వారాలు తెరిచి చాలాకాల మైనప్పటికీ, ఏ తెల్లవారుఝామునో బయలుదేరి నగరం విడిచిపోతే

బకాసురుడి పీడ తప్పుతుందన్న ఆలోచన బహు కొద్దిమందికే వచ్చింది. వాళ్ళు వెళ్ళిపోయారు.

కొందరు ఈ ఉపాయం తెలిసి కూడా "ఆ! చావు ఎక్కడికి పోయినా తప్పదు. ఈ బకాసురుడు నిమిత్తమాత్రుడు" అన్న వైఖరి అవలంబించారు.

"మరేమిటోనున్నూ, ఈ ఊరివాళ్లందరూ మ్యె-మ్యె – ఏ జన్మలో మ్యు-మ్యు – ఈ బాకాసురులను చిత్రవధ చేసి – మ్య-మ్య ఉంటారు, అప్పుడేమో నున్నూ-మ్యం-మ్యం-వీరు పగదీర్చుకుంటున్నారు" అన్నాడు వేదాంతి.

నిజం చెప్పాలంటే వేదాంతికి రాక్షసుడు బాగా దొరికాడు. వాడు ఆయన మనోనేత్రం తెరిచి, మనసును శరవేగంతో పరుగెత్తించాడు. సృష్టి స్థితిలయల రహస్యమంతా ఆయనకిప్పుడు కరతలామలకమైనట్టు భావన కలిగింది. తన బుర్రలో ఊరే విజ్ఞానాన్ని ఆయన అందరికీ పంచేస్తున్నాడు. . . .

ఒకనాడు ఒక కుటుంబం ఏకచక్రపురంకేసి వచ్చింది. ఒక తల్లీ, అయిదుగురు కొడుకులూను. అందరూ బ్రాహ్మణుల్లాగే ఉన్నారు. పెద్ద కుర్రవాడు వేదపనస చదువుతుంటే మిగిలినవాళ్ళు కూడా వంత చదువుతున్నారు. వాళ్ళ ఉత్సాహం చూస్తే వాళ్ళకు బకాసురుడి గొడవ ఏ మీ తెలియనట్టున్నది.

నగరం ఇంకో కోసుదూరం ఉందనగా, ఒక నల్లటి ఆకారం చెట్ల చాటునుంచి దారి మీదకు వచ్చి అడ్డంగా నిలబడింది. మనిషి కొంచెం భారీవాడే. కానీ బాగా వయసు మళ్ళినట్టున్నాడు. వాడి కళ్ళు ఆనని చూపు చూస్తున్నట్టున్నాయి. మొహంమీదా, ముఖ్యంగా నుదుటిమీదా ముడతలు.

బ్రాహ్మణ స్త్రీ కొడుకులలో బలిష్ఠంగా ఉన్నవాడు తన అన్నను దాటి ముందుకొచ్చి ఈ ఆకారాన్ని సమీపిస్తూ, "ఎవడ్రా నువూ? తొలుగు!" అన్నాడు.

బకాసురుడు – ఆ ఆకారం వాడే– ఓండ్రు పెట్టినట్టుగా అరిచాడుగాని కదలలేదు. బలిష్టుడైన పేడిమూతి కుర్రాడు ఇంకొక్క అడుగు ముందుకువేసి పిడికిలి బిగించి బకుడి రొమ్ములో ఒక్కపోటు పొడిచాడు. ఈ దెబ్బకు బకుడు అక్కడే చతికిలబడి భయంకరంగా మూలిగాడు. కుర్రవాడు వాణ్ణి తన పాదంతో ఎడంగా తోసి తల ఊపాడు. అతని తల్లీ, అన్నా, తమ్ములూ ముందుకు వెళ్ళారు.




బకుడు తల పక్కగా ఎత్తి తనను కొట్టినవాడు మృత్యుదేవతలాగా తన పక్కనే రెండు చేతులు పెట్టుకుని ఉండటం చూసి, పిల్లిలాగా ఒక్క దూకుతో దూరాన వెళ్ళిపడి, లేచి చెట్లలోకి పారిపోయాడు.

బలిష్టుడైన కుర్రవాడు చేతులు దులుపుకొని తన వాళ్ళను కల ఏసుకున్నాడు. మరికొంత సేపటికి వారు ఆరుగురూ ఏకచక్రపరం ప్రవేశించారు.

వారు వీధివెంట నడుస్తుండగా చయనులు ఎదురుపడి ఆగి వారికేసి ఆశ్చర్యంగా చూసి, 'ఎవరో పొరుగూరివాళ్ళు. ఎందుకు వచ్చి ఉంటారు? వారి మంచికా? ఊరి మంచికా?' అనుకున్నాడు.

ఆయన బ్రాహ్మణిని సమీపించి, "అమ్మా, మీదే వూరు? ఈ ఊళ్ళో మీకెవరన్నా బంధువులున్నారా? నేనీ ఊళ్ళో చాలా ఏళ్ళుగా ఉంటున్నాను. మిమ్మల్ని ఎన్నడూ చూడలేదు. ఇక్కడికనే వచ్చారా? ఇంకెక్కడికైనా పోతూ వచ్చారా?" అని అడిగాడు.

"మాకు ఒక ఊరంటూ లేదు, బాబూ. నేనూ, నా బిడ్డలూ ఒకప్పుడు బాగా బతికాం. కాని కాలం కలిసిరాక దేశాలుపట్టి తిరుగుతున్నాం. మాకు ఏ ఊరైనా ఒక్కటే. తల దాచుకునే నీడ దొరకాలేగాని" అన్నది బ్రాహ్మణి.

"వీరెవరు? వీరి తండ్రిగారి నామధేయం ఏమిటి" అని చయనులు అడిగాడు.

బ్రాహ్మణి తల వంచుకుని, "బాబూ, మమ్మల్ని ఏమీ అడక్కండి. మేము అజ్ఞాతంగా బతుకుతున్నాం. మమ్మల్ని శత్రువులు చంపాలని చాలా ప్రయత్నాలు చేశారు. నా ఈ రెండో కొడుకును చంపటానికి వాళ్ళు చేసిన ప్రయత్నాలు యిన్నీ అన్నీ కావు. వాడి ఆయుర్దాయం గట్టిది. ఆ మాటకు వస్తే మా అందరి ఆయుర్దాయమూ గట్టిదే. మాకు చావు భయం ఏనాడో తీరిపోయింది. ఇదే నగరమో మాకు తెలియదు. ఇక్కడ మాకు వుండేందుకు జానెడు కొంప దొరికితే సంతోషంతో ఇక్కడే ఉంటాం. మేం ఒకరి జోలికిపోయే వాళ్ళం కాం, బాబూ!" అన్నది.

"వేరే ఎక్కడికో పోవటమెందుకమ్మా? మా ఇంటికే పోదాం రండి. ఈ ఊరి పేరు ఏకచక్ర నగరం" అన్నాడు చయనులు.

"చాలా కృతజ్ఞులు, అన్నగారూ!"

చయనులు ఆ కుటుంబాన్ని ఇంటికి తీసుకుపోయి అందులో ఒక భాగం వారికి యిచ్చేశాడు.

ఆ విధంగా లక్క ఇంట్లో కాలిపోకుండా ప్రాణాలతో బయటపడిన కుంతీ పాండవులూ ఏకచక్రపురం చేరుకుని ఆ బ్రాహ్మణుడి ఇంట తలదాచుకున్నారు. వాళ్ళు కూడా రాక్షస భయంకంటే మనిషి భయం జాస్తిగా కలవారే–బండివాడిలాగా.

పాండవులు రోజల్లా వేద పఠనం చేస్తారు. నాలుగు వీధులకూ నలుగురూ వెళ్ళి మధుకరమెత్తి అన్నం తెస్తారు. కుంతీదేవి వారు తెచ్చిన ఆహారాన్ని రెండు భాగాలు చేస్తుంది. ఒక సగం భీముడు ఒక్కడే తింటాడు. మిగిలిన సగం కుంతీ, మిగిలిన నలుగురూ తింటారు. భీముడి భుజబలమే వారికి అంగరక్ష, వారెక్కడికీ వెళ్ళరు, ఎవరితోనూ కబుర్లు చెప్పరు. బకాసురుడి సంగతి వారి కి ఏ మాత్రమూ తెలియదు.

కొద్ది రోజులు గడిచాయి. అకస్మాత్తుగా చయనులు ఇంటిపై గద్ద వాలింది. తెల్లవారుజామునే నగర రక్షణాధికారి వచ్చి శుభవార్త చెప్పిపోయాడు– "ఇవాళ నరబలి మీ ఇంటి వంతు."

ఇది జరిగే సమయానికి కుంతీ, భీముడూ ఇంట్లో వున్నారు. మిగిలిన వాళ్ళు మధుకరానికి వెళ్ళి వున్నారు. చయనులుగారి అయిదేళ్ళ కొడుకు భీముడిచేత కథలు చెప్పించుకుంటున్నాడు. అన్నీ రాక్షసుల కథలు.

"రాక్షసుల్ని ఎవరూ చంపలేరు కాదూ?" అన్నాడు కుర్రవాడు.

"ఎవర్రా చెప్పింది? రాక్షసుణ్ని ఒక చేత్తో మెడ పట్టుకుని రెండవ చేత్తో కర్రపెట్టి టపీటపీ కొడితే కాసేపటికల్లా వాడు చస్తాడు."

"బకాసురుడు కూడా చస్తాడా?" అన్నాడు కుర్రవాడు.

"బకాసురుడా? ఎవడన్నా చస్తాడు, మీకు తెలీదు గాబోలు? రాక్షసులకు మొండి ధైర్యమేగాని మెదడు తక్కువ!" అన్నాడు భీముడు.

కుంతి నవ్వింది, భీముడూ ఇంచుమించు అదే మాట చాలా మందిచేత అనిపించుకున్నాడు.

అకస్మాత్తుగా పక్కభాగంలోంచి రోదనం వినిపించింది. కుంతీ, భీముడు కొయ్యబారినట్లుయిపోయి, చెవులు రిక్కించి విన్నారు.

"పాపం, ఏదో కష్టం వచ్చినట్టుంది. కనుక్కు వస్తానుండు!" అంటూ కుంతి లేచి చయనులుగారి భాగానికి వెళ్ళింది.

చయనుల భార్యా, కూతురూ పెద్ద పెట్టున ఏడుస్తున్నారు. చయనులు మొహం కందగడ్డలాగా వుంది.

"ఏడిస్తే ఏం ప్రయోజనం? తప్పుతుందా? మనింటి మనిషి ఎవరో ఒకరు వెళ్ళాలి. రోజూ ఎవరికో ఒకరికి జరుగుతున్నదేగా? ఇవాళ మన వంతు. నువ్వు నాలుగేళ్ళు కనిపెట్టి వుంటే పిల్లలకు రెక్కలు వస్తాయి" అన్నాడు చయనులు.

"మీరు పోతే అందరమూ దిక్కులేని వాళ్ళమవుతాం. నేనే పోతాను. బ్రాహ్మణ స్త్రీని, ముత్తయిదువునని వాడు నన్ను విడిచి పెట్టినా పెట్టవచ్చు" అన్నది బ్రాహ్మణి భార్య.

"ఎప్పటికైనా పోవలసినదాన్నే. నన్ను పంపండి, అమ్మా!" అన్నది కూతురు ఏడుపు ఆపకుండానే.

ఇంతలో కుర్రాడు చేతిలో ఒక పూచిక పుల్లతెచ్చి, "నేనా రాచ్చుణ్ని దీంతో చంపేస్తా!" అంటూ వచ్చాడు.

అందరూ గొల్లుమన్నారు.

కుంతికి వాళ్ళకి వచ్చిన కష్టం బోధపడనే లేదు.

"బాబూ, మీరంతా ఆరోగ్యంగానే వున్నారు. దుర్వార్త వచ్చిందను కుందామంటే దూరపు బంధువులైనా రాలేదు. మీకు వచ్చిన కష్టం ఏమిటో చెప్పండి. చేతనైతే నా కొడుకులు సహాయం చేస్తారు!" అన్నదామె.

ఆమె తన కొడుకుల్లో ఒకణ్ని బలిగా ఇస్తానంటుందనుకుని చయనులు ఆక్రోశిస్తూ. "వద్దు తల్లీ! వద్దు, ఏ జన్మలోనో మా ప్రాణానికి ఎవరి ప్రాణమో అడ్డెయ్యబట్టే మాకీనాడు ఈ ఘోరం వచ్చి పడింది. మా నలుగురిలో ఎవరో ఒకరం రాక్షసుడికి ఆహారం అవుతాం. ఒకరెందుకు? నేనే అవుతాను. నేనింక వెయ్యేళ్ళు బతికి మాత్రం సాధించేదేమిటి? రత్నంలాంటి భార్యతో ఇన్నాళ్ళూ కాపురం చేశాను. కొడుకునూ, కూతుర్నీ కన్నాను. వాళ్ళద్వారా పౌత్రులనూ, దౌహిత్రులనూ పొంది ఉత్తమలోకాలకు పోతాను" అన్నాడు.

"ఎవరా రాక్షసుడు?" అన్నది కుంతి.

ఆ సద్బ్రాహ్మడు ఆశ్చర్యంతో తన కష్టం కూడా క్షణంపాటు మరిచాడు. ఆయన ద్వారా కుంతి బకాసురుడి వ్యవహారం తెలుసుకున్నది.




"అయ్యా, మీరు నిశ్చింతగా వుండండి. ఇవాళ మన ఇంటి వంతు గనుక మా రెండోవాణ్ణి రాక్షసుడి దగ్గరకు పొమ్మంటాను" అన్నదామె.

పిచ్చి బ్రాహ్మడికి బ్రహ్మ హత్య చేసినంత భయం కలిగింది.

"వద్దు తల్లీ, వద్దు! ఆ మాట మరొకసారి అనవద్దు, ఒట్టే!" అన్నాడాయిన. కుంతి నవ్వి, కొడుకుపైన నాకు ప్రేమలేక పంపుతున్నాననుకుంటున్నారా, అన్నగారూ? వాడికేమీ భయం లేదు. నా మాట నమ్మండి" అన్నది.

ఇంటివాళ్ళు ఈ ఏర్పాటుకు వెంటనే ఒప్పుకోలేదు. కాని ఏడుపులూ పెడబొబ్బలూ మాని తాపీగానే కుంతి సూచనకు తమ వ్యతిరేకత తెలిపారు. కుంతి భీముణ్ని పిలిచి, "బకాసురుడికి ఆహారంగా రోజుకొక గడపవాళ్ళు వెళ్ళాలట. ఈ రోజు ఈ ఇంటి వంతు, ఏం చేద్దాంరా, నాన్నా" అని అడిగింది.

"నేను పోతానమ్మా!" అన్నాడు భీముడు ప్రాధేయపడుతున్నట్లుగా. బలిష్ఠంగా వున్న ఆ బ్రాహ్మణ కుర్రవాడు ఆ మాట అన్న పద్ధతి చూసి చయనులూ, భార్యా కూడా దడుచుకున్నారు. ఆ కుర్రవాడే మారు వేషంలో వున్న రాక్షసుడా అని వారికి సందేహం కూడా కలిగింది.

"నువ్వు వెళ్ళటమేమిటి నాయనా? చచ్చిపోతావు సుమా!" అనటానికి కూడా చయనులుకు నోరు రాలేదు. ఆయన మౌనంతో తన అంగీకారం తెలిపాడు. ఆయన భార్య కుంతి మొహంకేసి చూడలేకపోయింది.

రాజభటులు వచ్చే సమయానికింకా మిగిలిన పాండవులు తిరిగి రాలేదు. భీముడి కడుపులో నకనకలాడుతున్నది. బకాసురుడికి పంపే కుంభం దివ్యంగా ఉంటుందని చయనులు చెప్పాడు. భీముణ్ణి అధికారులు అలంకరింప చెయ్యటమూ, మంత్రాలు చదవటమూ, ఇష్టదేవతలకు నైవేద్యం పెట్టటమూ – ఈ తంతంతా అతనికి చాలా విసుగు కలిగిస్తున్నది. ఆ చిరాకును అణచి పెట్టుకుని కుంభం వాసన ముక్కుకు తగలగానే భీముడు పురోహితులను చూసి నవ్వాడు.

"పాపం, పిచ్చివాడు! రానున్న గతి తెలియక పెళ్ళికి పంపుతున్నామను కుంటున్నాడు!" అని వాళ్ళలో వాళ్ళు అనుకుంటున్నారు.

భీముడు బండి ఎక్కుతూనే బండిమీద ఆహారం తినటం ప్రారంభించాడు. రాజోచితమైన భోజనం. సందేహంలేదు. రోజూ యాయవారపు తిండి తినటం చాలా బాధగా ఉన్నది. రోజూ ఇటువంటి భోజనం తింటే ఎంత

బాగుంటుంది! కాని రోజుకొక బకాసురుడెక్కడి నుంచి వస్తాడు?

అంతలోను ఇంకొక ఆలోచన వచ్చింది. తాను ఈ రాక్షసుడి పీడ వదలగొట్టితే రాజుగారు తనకూ, తన వాళ్ళకూ రోజూ మృష్టాన్నాలు పెట్టి, దక్షిణ కూడా ఇస్తాడు. అప్పుడు మీరెవరని అడిగితే చిక్కే! అన్నయ్యా, అర్జునుడూ ఏమంటారో తెలుసుకోవాలి. అమ్మ ఒప్పుకోవాలి.

బండి దున్నలు తలలూపుకుంటూ బండిని మెల్లిగా లాగుతున్నాయి.

★ ★ ★ ★ ★

**బం**డివాడికి ఈ అబ్బాయి నచ్చాడు. సామాన్యంగా తాను చేరవేసే వాళ్ళు బెదిరో, కొయ్యబారో, విలవిలా కొట్టుకుంటూనో ఉంటారు. ఈ అబ్బాయి మంచి ఉత్సాహంగా ఉండటమేగాక, కుంభమంతా ఆరగించేస్తున్నాడు. ఇతగాణ్ణి మెచ్చుకునేటందుకు వెయ్యి నాలుకలు లేకపోతే పోయె, ఉన్న ఒక్క నాలుక కూడా తెగ్గోసిరి కదా పిరికి ముండావాళ్ళు!

తాను తినగా ఇంకా మిగిలిపోతుందనిపించగానే భీముడు బండివాడి సహాయం కోరాడు. దున్నలకు దారి తెలుసు. పగ్గపుతాళ్ళు వదిలివేసి బండివాడు కూడా పైనెక్కి తినటం ప్రారంభించాడు. వాడికి రాజభటులు మాట జ్ఞాపకం వచ్చి నవ్వొచ్చింది. వెధవలు–ఇవాళ వాళ్ళ నోట మట్టే!

"చూడబ్బీ, నీ పేరేమిటి?" అన్నాడు భీముడు.

"బా. . . .బా." అన్నాడు బండివాడు నోరు చూపిస్తూ.

వాడు చెవిటివాడు కాదు, ఎవరో నాలుక కోసేశారు.

"ఎవర్రా నీ నాలుక కోసింది?" అన్నాడు భీముడు.

బండివాడు మీసాలు మెలిపెట్టి చూపించాడు. ఎవరో గొప్పవాళ్ళు చేసిన పనే. ఆ సంగతి తర్వాత తేల్చుకోవాలి.

బండి వచ్చి చెట్టుకింద ఆగింది–దానంతట అదే. ఇద్దరూ ఇంకా తింటూనే వున్నారు. ఇంతలో పెడబొబ్బలు వినిపించాయి. భీముడు తలెత్తి చూసి ఆశ్చర్యపోయాడు.

కొద్దిరోజుల క్రిందట తాము ఈ నగరానికి వస్తూండగా దారికి అడ్డం నిలబడిన వాడే వీడు.

"వీడేనా రాక్షసుడు?" అని భీముడు బండివాణ్ణి అడిగాడు. ఆ మాట అడగటానికే సిగ్గయినట్టుగా.

బండివాడు తల పైకీ కిందకీ ఊపాడు. భీముడు రొండిన చేతులు పెట్టుకొని తనకేసి వచ్చే బకుడిని చూశాడు. వీడికోసమా ఇన్ని వందల మంది మనుష్యులు బలి అయింది? ఎంత చిత్రం! ప్రపంచంలో ఎటువంటి పాలకులుంటారు!

బకుడు భీముణ్ణి చూసి గుర్తు పట్టలేదు. వాడికి సరిగా చూపు ఆనదు. వాడి కళ్ళు దీనంగా ఉండటానికి అదే కారణం. వెనక కుంతినీ, పాండవులనూ చూసి అడ్డగించటంతో కూడా వాడు ప్రకటించినది ఒకరకమైన కుక్కబుద్ధి. తాను ఈ ప్రాంతాలకు వచ్చిన తరవాత నగరంలోకి మనుషులు బయటనుంచి రావటం చూడలేదు. కొత్తమనిషిని, కొత్త పరిస్థితులనూ చూసి ఇంటి కుక్క ఆందోళన పడినట్టు బకుడు ఆ ఆగంతుకులను చూచి తికమక పడి అడ్డు తగిలాడు. వారి రాకవల్ల తనకేం నష్టమో అని వాడి బుర్రలో ఒక అస్పష్టమైన ఆలోచన మెల్లిగా కదిలింది.

ఆ వచ్చిన వారిలో ఒకడు తనను గుండెల్లో పొడిచిన మాట కూడా వాడి మట్టిబుర్రలో అస్పష్టంగా మెదులుతున్నది. వాడు మళ్ళీ నగరం దాటి వస్తూండటం కనిపిస్తే వీడు కాలిసత్తువ కొద్దీ పరుగెత్తి వుండేవాడే. అదే మనిషి బండి మీద తనకు ఆహారంగా వస్తాడని వాడికి కలలో కూడా తట్టి ఉండదు. వీడెవడోగాని వీడి మెడలో దండలున్నాయి. తన ఆహారం. వీడు తనచేత చచ్చి తినబడటానికి సిద్ధంగా ఉండకపోగా బండిలో తెచ్చినదంతా తింటూ బండివాడికి కూడా మేపుతున్నాడు.

"హోయ్!" అని పెడబొబ్బ పెడుతూ బకుడు బండిని సమీపించాడు. వాణ్ణి దగ్గరి దాకా రానిచ్చి భీముడు వాడి భుజాల మీదికి ఎగిరి దూకాడు. ఆ పాటుకు బకుడు కూలిపోయాడు. వాడి వేళ్ళు భీముణ్ణి పట్టుకోటానికి తహతహలాడటం బండివాడికి కనిపించింది. ఆ విరిగినవి బకుడు ఎదురు రొమ్ము ఎముకులు. బకుడు చేసిన అర్తనాదానికి బండివాడు చెవులు మూసుకున్నాడు. అది అకస్మాత్తుగా అణగారిపోయింది. భీముడు వాడి ముఖం మీద పాదం పెట్టి తొక్కుతున్నాడు.

ఈ తరువాత బండివాడు చూచింది బకుడి శవమే.

భీముడు తలెత్తి పైకి చూచి బండివాణ్ణి, "నిజంగా వీడేనా రాక్షసుడు?" అని అడిగాడు. బండివాడు భీముడిలో సందేహం మిగల్చకుండా తల పైకీ కిందకీ అడించాడు.

"అయితే తిరిగి పోదాం పద!" అంటూ భీముడు బండిలోకి ఎక్కాడు.

రాజుగారు కొలువుతీరి ఉన్నారు. ఎవరో పొరుగూరి ఆడకూతురు తనకు తానై కొడుకును బకాసురులు వారికి ఆహారంగా పంపటం సభికులందరికీ విడ్డూరంగానే ఉంది.

"ఎవరో కాదండి? మన చయనులు ఇంటిభాగంలో ఉంటున్నవారే. ఆ తల్లి కొడుకును పొమ్మనటమేమిటి? ఆ కొడుకు పోవటమేమిటి? పెళ్ళి కొడుకులా ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడండీ! నే కళ్ళారా చూశానుగా!" అన్నారొకరు.

"పోనిస్తురూ! వెర్రిబాగుల తల్లీ, వెర్రిబాగుల కొడుకులూ అయి ఉంటారు. వెర్రిబాగుల వాళ్ళు కాకపోతే పొద్దస్తమానం వేద పనస చదువుతారటండీ; ఒకటే వేదఘోష! ఏ సత్రయాగానికన్నా వెళ్ళి ఈ ఘోష పెడితే పన్నెండేళ్ళపాటు నిక్షేపంగా గడిచిపోను గదా, మధుకరమెత్తి పొట్ట పోసుకుంటున్నారు – వెర్రివాళ్ళు!" అన్నారు మరొకరు.

''అలా అనకండి, ఆవత్సమయంలో ఒకర్ని మ్యా–మ్యా–కాపాడటానికిగాను –మ్యా–మ్యా–దేహాలనే అర్పణంచేసే వారికి మ్యా–మ్యా– ఉత్తమ లోకాలుంటవని పెద్దలు –మ్యా–మ్యా–చెబుతారు. శిబి–మ్యా–చక్రవర్తి–మ్యా–మ్యా చూడండి! ఆ యొక్క మ్యా–మ్యా"



వేదాంతిగారి వైజ్ఞానిక ప్రసంగం పూర్తికాకముందే దూరాన తప్పెటలూ, బాకాలూ, కలకలమూ వినబడ్డాయి. అందరూ ఆలకిస్తూండగానే భటుడొకడు పరుగెత్తుకుంటూ వచ్చి "అయిపోయింది, అయిపోయింది" అన్నాడు రొప్పుతూ.

ఏమయిపోయిందీ తెలుసుకోవటానికి రాజుగారికి చాలా కాలం పట్టింది. భటుడు సరిగా మాట్లాడే పరిస్థితిలో లేడు. వాడికి చాలావరకు మతి మతిలో ఉన్నట్టులేదు. బకాసురుడు చచ్చాడనీ, వాడికి ఆహారంగా ఆ రోజు వెళ్ళిన కుర్రాడే ఒంటరిగా బకాసురుణ్ణి చంపాడనీ వినేసరికి రాజుగారికే మతిపోయినంత పని అయింది.

"ఒక్క కుర్రాడిచేత చచ్చే రాక్షసుడి కోసం ఎంతమంది ప్రాణాలు బలి చేశామండీ!" అన్నాడు అజ్ఞాని తనలో తానే మాట్లాడుకుంటునట్లుగా.

"రాక్షసుడిలో ఏమున్నదండీ? మ్య-మ్య-వాడు మ్య-మ్య-నిమిత్తమాత్రుడు. నేను-మ్య-మ్య-నెత్తీ నోరూ కొట్టుకుని అదే చెబుతున్నాను. మన పౌరులకు మరణం మ్య-మ్య రాసిపెట్టి ఉన్నదీ! వాడు చచ్చాడు! వాడి పని ముగిసిపోయిందీ! మ్య-మ్య-వెళ్ళిపోయాడు!" అన్నాడు వేదాంతి, విధి విలాపాన్ని అరటిపండు ఒలిచినట్లు చూపిస్తూ.

"సభ చాలించాం!" అన్నాడు రాజు.

అందరూ చప్పున లేచి వెళ్ళిపోయారు. వాళ్ళకు అక్కడ ఉండాలని ఏ మాత్రమూ లేదు.

వీధిలో పరమానందంగా ఉన్నది. నగర ప్రజలంతా వీధిలోనే వున్నారు. బకాసురుణ్ణి చంపిన కుర్రాణ్ణి జనం ఊరేగిస్తున్నారు. స్త్రీలు అతడికి హారతి ఇస్తున్నారు. పూలు చల్లుతున్నారు. చాలామంది వృద్ధులు ఆనందబాష్పాలు కారుస్తున్నారు. పిల్లలు గెంతుతున్నారు.

"ఏమయ్యోవ్! విన్నావా? అంత రాక్షసుణ్ణి తొక్కి చంపాట్ట. కాళ్ళకు కొంచెం రక్తమయింది. చేతులకు మట్టి కూడా లేదు."

"ఇతను మనిషి అనుకుంటున్నావా? ఒట్టిది. ఎవరో గంధర్వుడు! మామూలు మనుషులకు అంత లావు రాక్షసుణ్ణి చంపటం, ఇంత కర్రపుల్ల కూడా లేకుండా, సాధ్యమా!"

"అసలు ఈ అబ్బాయి ఎవరు? వీళ్ళే దేశం వాళ్ళు? ఎవరికీ తెలీదే చిత్రం!"

"అద్భుతంలెండి! రాక్షసుణ్ణి ఈ చిన్నవాడు చంపుతాడని అతడి తల్లికి ముందే తెలుసుట. మీ వెర్రిగాని, అది రూఢి చేసుకోకుండా ఎంత ఇద్దైన తల్లి అనండిగాక, అలా చావటానికి పంపుతుందండీ! ఏమిటో!"

"అబ్బే, ఎందుకిన్ని మాటలు? మన నగరానికి పట్టిన పీడ వదిలిపోయింది. ఇక మనం కాలిమీద కాలేసుకుని నిద్ర పోవచ్చు."

చయనులు కుటుంబం మనః స్థితి వర్ణనాతీతం. తమ ఇంటిలో ఉండే బ్రాహ్మణ కుమారుడు బకాసురుణ్ణి చంపాడన్న వార్త వినగానే ఆ దంపతులిద్దరూ కుంతి కాళ్ళమీద పడి, "అమ్మా, మా తప్పులు మన్నించు. నీవు ఏ దిక్పాలకుల తల్లివో, పార్వతీదేవివో తెలియక నిన్ను మామూలు మనిషిగా చూశాం! అపచారం, తల్లీ, అపచారం! మీరంతా దేవతలు-సందేహం లేదు" అని గిలగిలా కొట్టుకున్నారు.

"లేదు, అన్నగారూ! మేమూ మీవంటి మనుషులమే. మీరు మమ్మల్ని మామూలు మనుషులుగానే చూడాలి. నా కొడుకులు ప్రజ్ఞావంతులు, శక్తిమంతులు, అంతకన్నా మరేమీ లేదు" అన్నది కుంతి.

ఆ రాత్రి చయనులు ఇల్లు సంకీర్తనతో మారుమోగింది. నగరంలో ఎవరికీ నిద్రలు లేవు, తీర్థప్రజగా జనం వచ్చి భీముణ్ణి చూసి పోతున్నారు.

ఆ రాత్రి రాజుకు, మంత్రికి కూడా నిద్రలు లేవు. వారు విచారసాగరంలో మునిగి దరిగానక కొట్టుకున్నారు.

"పోయింది! మనకున్న కాస్త అండా పోయింది!" అన్నాడు రాజు.

"ఇక మన శత్రువులు విజృంభిస్తారు!" అన్నాడు మంత్రి.

"మన ప్రజలు మనలను కుక్కలకన్నా హీనంగా చూస్తారు!"

"అంత లావు రాక్షసుడు కుర్రకుంక చేతిలో కుక్కకన్నా అన్యాయంగా చస్తాడని ఎలా అనుకుంటాం?"

"వీడెవడో శనిగాడులాగా దాపురించాడు మనకు! రాక్షసుడి కోసం మనం ఇన్ని ఏర్పాట్లు ఎందుకు చేశామా అని అందరూ ఆశ్చర్యపడరూ?"

"ఇలా జరుగుతుందని తెలిస్తే ఓ పదిమందిని వెంటబెట్టుకొనిపోయి, వాణ్ణి మనమే చంపి ఉండేవాళ్ళం."

"రాక్షసుణ్ణి చంపామన్న ప్రతిష్ఠ కూడా దక్కేది."

"ఇక ఈ నగరంలో మనం తలెత్తుకు తిరగలేం."

"ఇప్పటికైనా నిజాన్ని అబద్ధం చేసేటందుకు ఏదైనా ఉపాయం ఉందేమో?"

"ఈ చంపినవాడు మనిషి కాదని ప్రచారం చేస్తే?"

"ఆ ప్రచారం ప్రజలే చేస్తున్నారు-వాడి మీద గౌరవం కొద్దీ."

"వాణ్ణి రాజును చేసేస్తారు! నిశ్చయం!"

"మనం అజ్ఞాని చెప్పినట్టు ఈ కుర్రాణ్ణి విందుకు పిలిచి విషం పెట్టి చంపేస్తే?"

"బాగానే వుందిగాని అదికూడా మననే కట్టి కుదిపితే?"

"ఒక్క ఆలోచన."

"ఏమిటిది?"

"వాడు వాణ్ణి మించిన రాక్షసుడని ప్రచారం చేస్తే?"

"సాధ్యమా?"

"ఈ నగరంలో రోజుకొకణ్ణి చంపేసి, అది వీడి పనే అంటే సరీ,"

"దివ్యంగా వుంది ఆలోచన. . . ."

తెల్లవారుజామున నగరం సద్దు మణిగింది. చయనులుగారి కుటుంబం అప్పుడే మేనులు వాల్చి నిద్రలకు పడ్డారు.

కుంతి తన కొడుకులతో "నాయనలారా, మనం బయలుదేరే వేళ అయింది. ఈ బకుడి చావుతో మనం ఇక్కడ ఉన్నామని హస్తినాపురం వాళ్ళు పసిగడతారు! ఈ ఊరు వచ్చినందుకు వీళ్ళకు ఇంత మేలే చేశాం. కాని ఇక మనకీ ఊరు అచ్చిరాదు" అన్నది.

ధర్మరాజూ, భీముడూ, అర్జునుడూ, కవలలూ మునివేళ్ళమీద నడుస్తూ బయటికి వెళ్ళారు. కుంతి వారి వెనుకనే బయలుదేరింది, నగరంలో ఎక్కడా అలికిడి లేదు. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. కాపలావాళ్ళు నిశ్చింతగా నిద్రపోతున్నారు.

చీకటిలోపడి పాండుమహారాజు కుటుంబం సాగిపోయింది.

*(మొదటిసారి ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 25-10-61 ప్రచురించబడిన యీ కథ కొడవటిగంటి కుటుంబరావు గారి శతజయంతి సందర్భంగా ప్రచురింపబడుతోంది- ఎడిటర్)*

# గులాబీ వర్ణన

*వచన కవితా ప్రక్రియ ఇంత వటువు అంతైనట్లు, అర్ధశతాబ్ది కాలంలో దేశం పట్టనంతగా ఎదిగిపోయింది. ప్రాచీన కావ్యాలను, కవితారీతిని కొలుకు పుచ్చుకునే వారి సంఖ్య పడిపోయి, మౌలిక రచనలు చేసే నవ్వుల సంఖ్య పెరిగింది. వీరిలో కొందరు మాత్రమే వచన కవితలలో తమ సొంతముద్రలను బలంగా వేసుకోగలిగారు. అలాంటి కొందరిలో కొందరిని అనుకరిస్తున్నాను.*

**గులాబి పువ్వు కవితా వస్తువైతే ఆయా రచయితల వచనా కవితా రచన ఎలా సాగుతుంది?**

*- అనేది పేరడీ అంశం.*



## పఠాభి పన్ చాన్ గమ్

అచ్చు ందంగా కవిత్వం వ్రాస్తే ఆయుక్షీణమని నమ్ముతున్న రోజులలో నిర్భయంగా పద్యాల నడుములు విరగదన్నినవాడు తిక్కవరపు పఠాభిరామిరెడ్డి గారు. మంచి పనివాడు మాత్రమే కాదు, వచన కవితలలో అనేకానేక సర్కస్ ఫీట్లు చేసి చూపిన జోకర్.



*వారి శైలి:*

'లాబీలో హృదయాన విర్సిన గులాబి
ఈవినింగ్ మెరీనాలో మెర్సిన రోజీ లిలి దోయివలె తోచున్
రోజా వృషోదయంబున ఫ్రెష్‌గా వుంటే
రోజీ నైట్వేళ ట్రిమ్‌గా వున్డును,
డ్రీమ్‌గరల్ పేర్లల్‌గా చూచు జనం కేసి
డీమ్ ఫ్లవర్
ని
ట్ట
ని
లు
వు
గా
చూసితుంది.
స్మైలోకి రోజాని పల్కరించన్ గాని
నేను రోజీని మాత్రం "కుచలప్రశ్నలో"
అడుగుతాన్రోజా
లతాంగి కోరికల్
సాయింత్రానికి వాడిపోవున్
రోజా పూ -
రోజీ వాడును హృదయానికి
మొగాడి వాడికలో

★




## శ్రీరంగం నారాయణబాబు

కాల్పనిక సాహిత్యపు వలయం నుంచి బయటపడి చాలా దూరం పరిగెత్తి ఫ్రాయిడ్‌ని, మార్క్సుని ఒకే గ్రుక్కలో తాగేసి దప్పిక తీర్చుకున్నాడు నారాయణబాబు గారు. ఇమేజిజం సామాజిక స్పృహ ఆయన వెలిగించిన రుధిరజ్యోతికి చమురూ, వత్తి.

*నారాయణబాబు కవితా తంత్రం:*

శిథిలమైన
గోరీ వెనుక
తుమ్మలో
పొద్దు క్రుంకిన
విధాన
విచ్చుకున్న
గులాబి
కుష్టురోగి
కురుపు
జలధిపైన
కుంభవృష్టి
శ్మశానంలో
సంతర్పణ



అందాలను
చిమ్ముతోంది
ముళ్ల గులాబి
బలి ఇచ్చిన
మేకపోతు
కార్జ్యం
బూర్జువా
గుండె మీద
బూజుల్లే
రోజా!



★

## కాళోజీ గొడవ

కాళోజీ గారు ప్రజాకవి, "చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చూడలేవు" అంటారాయన. వారి రసార్ద్ర హృదయమే వారి కవితల్లో అంతర్లీనంగా స్పందిస్తుంది. సమాజంలోని అసమానతలు తొలగించాల నే కాళోజీ గొడవ -

*గులాబిని చూచి ఆయన పెట్టే గొడవ :*

లెక్కకు మించిన రెక్కలు వున్నా
గులాబి పువ్వొకటేనన్నా;
మనదేశం ఒకటే అయినా
కులమత భేదాలెన్నో ? ఎన్నో?



వికసించిన పువ్వుకు రెక్కలు
విహరించే పక్షికి రెక్కలు
ప్రతి మనిషికి వున్నవి రెక్కలు
రెక్కలు కలిపిన వుండవు చిక్కులు

రెక్క లాడినా డొక్కలు ఫూడవు కొందరికి
డొక్కలునిండీ రెక్కలాడవు కొందరికి

వికసించిన గులాబిరేకులు
చైతన్యపు సంకేతాలు
అటపొంచిన గులాబిముళ్ళు
గురిపెట్టిన తుపాకి గుళ్ళు ☆

## సోమరాజు రంధి

రా.వి. శాస్త్రి గారి నవలలలో, పాత్రో గారి నాటికలలో ప్రవేశ పెట్టిన శైలిని వీరి కవితలలో జొప్పించారు. విశాఖ ప్రాంతపు మాండలీకాలలో తొలిగా కవితలల్లిన ఘనత రంధి సోమరాజు గారికి దక్కుతుంది. అన్నీ అవే అయితే వెగటించే ప్రమాదం వుంది. అక్కడక్కడ అప్పుడప్పుడైతేనే ఆ టెక్నిక్ అందగిస్తుంది.



సందె మబ్బుల్ని
తునకలుగా తురిమి
ఇంద్ర ధనసు
తొడిమ సేసి
దొంతర్లల్లే
పేర్చినట్టుంది
యిచ్చిన గులాబి.

పొద్దుటేల
గులాబి మీన
తొంగున్న
మంచు సుక్క
అమ్మ వొడిలో
జోగిన
సిట్టి పాపాయి నాగుంది

బుల్లి సిగలో
గులాబి యెట్టుకుంటే
సిమ్మ సీకటిలో
గోరంత దీపం
యెట్టి నట్టుంటాది.

బుల్లి పెదాలు ఇప్పితే
గులాబి ఇరిసినట్టుంటాది
సొట్టలడిన బుగ్గలు
రేపు ఇచ్చే గులాబి
మొగ్గల్లాగుంటాయ్

బారెడు పొద్దేళ
మాంసపు ముక్కని
ముక్కెట్టి
యెనక్కి తగ్గింది
మాయదారి
వూర కాకి ☆

## విశ్వం గీస్తున్న గీతలు

అనుభవాన్ని అనుభూతిలోకి, అనుభూతిని అక్షరంలోకి అందంగా అనువదించగల అనుభవశాలి అరిపిరాల విశ్వం గారు. భాషలో ప్రాచీనత తొంగి చూచినా భావనలో నవ్యత పొంగులు వారుతుంది. వీరి వచనకవితలలో రవీంద్రుని గీతాంజలి ఛాయా మాత్రంగా కనిపిస్తుంది.



ఏ అప్సర కన్నె మధురాధరాల నుండి
తొణికిన హసిత తరంగానివి?
ఏ సంకల్ప సిద్ధుని ఫలించిన
కోరికవో నువ్వు?
నాగుండె అంచున కరుడుగట్టిన
వాంఛలు చెమ్మగిలిన్నై, నీరాకతో
నా యౌవనపు మైకపు జీరల్ని
సిరలుగా, అనురాగ ప్రస్తారం చేసే
నువ్వు
చీలిన పారిజాతపు గుండెవా?
గులాబివా?
ముగ్ధమై స్నిగ్ధమై
జాలినీ కాంక్షనూ
ఎదలోపలి పొరల్లో రేపే
నులివెచ్చని వసంత జాగృతిలా
మధుజ్వాలా కీలికలా
విరిసిన తరుణారుణ లతాంతమా!
ఏ ప్రకృతి శిల్పి కుంచెకొసవో చెప్పు
. . . . . . . . . . . . . .
. . . . . . . . . . . . . .

సంజె మబ్బు నీడలో
గులాబి విచ్చుకున్నప్పుడు
అసంఖ్యాక రక్తాశ్రులు
ఘనీభవించిన చప్పుడు.

☆

# బోయి భీమన్న

ఆంధ్ర కవితాకుమారికి ఊరూరా జరిగిన ఊరేగింపులో యధాశక్తి పల్లకీ మోసిన బోయీ భీమన్న గారు. వీరి 'గుడిసెలు కాలి పోతున్నై' కవితా సంపుటికి అకాడమీ బహుమతి లభించింది.



గులాబీలు పూస్తున్నై!
ఓహో! పూస్తున్నై!
ఎవరికోసమో? పాపం!
కలవారికే అయివుంటై!
రోజాలు రాజాలకు కాక
మరెవరి కోసం?

ఒకసారి కోసిన గులాబీలు
మరి మళ్ళీ కోయడానికి
ఎక్కడ నుంచి వస్తుంటై!
అవును నిజమే!
ఎక్కడి నుంచి వస్తుంటై?

అదే మన సృష్టిలోని రహస్యం
వున్నవారి వినోదార్థం
ఈ గులాబీలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై!
పోతుంటై పుట్టుకొస్తుంటై!

ఈ విషవలయం సాగడం
ఎంతవరకు?
ఆ మొక్కను వేళ్ళతో సహా
పెకిలించేంతవరకు!

☆

# అద్దేపల్లి ఆమోదం

విశ్వనాథ నుంచి నీరసపు పొలిమేరల దాకా ప్రస్థావించిన వాడు, భాష మీద అధికారం వున్నవాడు, ఆవేశం వరదపాలు కాకుండా కవితలో ప్రిజర్వ్ చేయగలవాడు, నినాదంతో పాటు నిజాయితీ కూడా వున్నవాడు అద్దేపల్లి రామమోహనరావు గారి ఆలోచనా జ్వాల –



'తూరుపు ఆకాశపు గుండెల్ని చీల్చుకుని
దూసుకువచ్చే అరుణ కిరణంలా –
చీకటి గుహలో నర్తిస్తున్న దీపశిఖలా
నిరుపేద గుండెలో మెదిలిన ఆశా జ్యోతిలా –

తోట నడుమ విచ్చుకొందొక ఎర్ర గులాబి
గతరాత్రి చలినీ, చీకటినీ కలుపుకు తిని
మంచెమీద సోలిన తోటమాలి కోసం
తలపై రాలిన మంచు బిందువులను
రక్తాశ్రువులుగా మార్చి రాల్చింది గులాబి.

రుధిర జ్యోత్స్నను కురిపించే
అర్క బింబంలా
పురోగమిస్తూ ప్రజాకోటి
ముక్తంగా ఆలపించు విప్లవ గీతంగా -

నెత్తుటి మడుగులోంచి హఠాత్తుగా
అవతరించిన విస్ఫులింగమై
ఘనీభవించిన ఎర్రదనంతో
తోటంతా తానే ఐ శిరసెత్తింది ఎర్ర గులాబి

☆




## బాల గులాబీ

తెలుగులో బాల సాహిత్యం సృష్టిస్తున్న కవులు చాలామంది వున్నారు. అగ్రశేణికి చెందిన స్రష్టల్లో మరల ఎవరిశైలి వారిదే! ఇక్కడ జనరలైజ్ చేసి ఒక వుదాహరణ మాత్రం యిస్తున్నా?

"పాపల్లారా! రారాండి!
గులాబి బాల విచ్చింది
బడి తోటకు దిగివచ్చింది
పాపల్లారా! రారండి!
రంగుల రంగుల
రేకులు రేకులు



హంగుల పొంగుల
సోకులు సోకులు
సోకుల వెనుక
వున్నవి ములుకులు
జాగ్రత్తర్రా! జాగ్రత్త!

జవహర్‌లాల్‌కు
బాలలన్న బలె ప్రీతి
చూచారా మరి
చాచా నెహ్రూ ఎదమీద
కిచ కిచ నవ్వే గులాబి బాల.

☆



# గిరిజన జాతరలు



**గిరిజన ప్రాంతంలో జరిగే జాతరలు వారి ఉన్నతమైన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. జాతరలో ముఖ్యభాగం పూజ. దీనిని గిరిజన పూజారులే నిర్వహిస్తారు కాని, కాలక్రమేణా సంస్కృతీకరణ జరిగి కొన్ని హిందూ పూజా విధానాలు కూడా కనిపిస్తుంటాయి.**

మన రాష్ట్ర గిరిజన ప్రాంతాలలో నివసించే అతిపెద్ద గిరిజన జాతులు గోండులు కోయలు. వీరిరువురి జనాభా 2001లో కలిపి 6,60,000. గోండులు ఆదిలాబాదు జిల్లాలో ఉంటే, కోయలు గోదావరి నదీ పరివాహక ప్రాంతమైన కరీమ్ నగర్, వరంగల్ ఖమ్మం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలలో నివశిస్తున్నారు. గోండు జాతి నివసించే ప్రాంతం మన ఆదిలాబాద్ జిల్లాలోనే కాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా వరకు వ్యాపించి గోడ్వానాగా ప్రసిద్ధిగాంచింది. పూర్వకాలంలో వీరికి ప్రత్యేక రాజ్యం ఉండేది. దానికి చాందా (ఇప్పటి చంద్రపూర్) రాజధాని. మొదట మరాఠీలు, ఆ తరువాత మొగలులు గోండల రాజ్యంపై దండెత్తి గోండు రాజులను ఓడించారు. ఆతరువాత వారి రాజ్యం నిజాం చేతిలోకి వెళ్ళిపోయింది. ఒకప్పటి గోండు రాజులు, ఇప్పుడు బీదరికంతో కష్టాలు పడుతుంటే గోండుల చరిత్ర తెలిసిన వాళ్ళందరూ బాధపడుతారు. అయితే వారిలో హుందాతనం, రాచరికపు మర్యాదలు ఇప్పటికీ కనిపిస్తూంటాయి. ప్రత్యేకమైన భాష, ఆట, పాట కలిగిన గోండుల సంస్కృతి వారి పండుగలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

అలాగే కోయలు మన రాష్ట్రంలోనే కాక చత్తీస్‌ఘడ్ ప్రాంతంలో ఉంటారు. వీరికి, గోండులకు సంస్కృతిలో చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. గోండులు కూడా వారి భాషలో కోయతూర్ అని పిలుచుకుంటారు. ఇరువురు మాట్లాడే భాషను కోయ భాష అంటారు. వీరి ఇరువురి గోత్రాలు, సగాలు ఒకే రకంగా ఉంటాయి. వారి భాషల్లో ప్రాంతీయ భేదాలు ఉన్నా చాలా దగ్గర పోలిక ఉంది. ఇద్దరు కోయరాజాల్ (గోండు), రాచకోయలుగా (కోయ)గా వ్యవహరించ బడతారు. అందుకని అందరూ కోయలేనని నేను నమ్ముతాను.

గోండు (నాగోబా) జాతర, కోయ (సమ్మక్క-సారక్కల) జాతరలు ఈసారి జనవరి 2010న రావటం విశేషం. అందుకని ఈ రెండు జాతరల విశేషాలు తెలుసుకుని వారి ఉన్నత సంస్కృతిని ప్రశంసిద్దాం.

## నాగోబా జాతర

ప్రతి సంవత్సరం పుష్య బహుళ అమావాశ్య నాడు జరిగే నాగోబా జాతర గోండులకు, ఇతర గిరిజన జాతులకు చాలా ముఖ్యమైనది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లోని సుదూర ప్రాంతాల నుండి ఈ జాతరకు గిరిజనులు వస్తారు. నాగోబా (శ్రీ షెక్) దేవతను వారు పూజిస్తారు. ప్రముఖ మానవ శాస్త్రజ్ఞుడు హెమన్‌డార్ఫ్ 1940 నుంచి 1980 వరకు, ప్రొ. ప్రకాశ్ రెడ్డి 1971లోనూ, ఈ వ్యాసకర్త 1970 నుంచి ఈ మధ్య వరకు ఈ జాతర వివరాలు సేకరించారు. ఈ వివరాలు ఇందులో పొందుపరచడం జరిగింది.

మేస్రాం గోత్రంలో (ఏడు అన్నదమ్ముల సగ) బూ గోతా అనే విభాగానికి చెందిన వారు చేసే పూజలు ఈ జాతరకు చాలా ముఖ్యమైనవి. వారి పుక్కిట పురాణాల్లో ఒక కథను ప్రధానులనే గిరిజన పూజారులు పాటలుగా పాడతారు. దీని ప్రకారం, పానియార్ అన్నదమ్ములు చాలా చిన్నగా ఉన్నప్పుడు వారి గ్రామంలో ఒక మహమ్మారి జ్వరం వచ్చిందట. వీరు తప్పించి అందరూ చనిపోయారట. వెంటనే ఊరు వదలి ఎక్కడెక్కడో తిరుగుతూ ఒక గొల్ల వారింటికి చేరుకున్నారట. వారి పశువుల పాకలలో (ఏడు పాకలు) మకాం పెట్టారట. అక్కడే పండ్రెండు సంవత్సరాలు పనిచేసి పశువులను మేపడం లాంటివి నేర్చుకున్నారు. ధనం కూడ సంపాదించాక, వారి స్వస్థలమైన కేస్లాపూర్ కు వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. దారిలో వారి మేనమామైన సాకాటి గోత్ర రాజు ఇంటికి వెళ్ళారు. ఈ మేనమామ ఈ అన్నదమ్ముల కష్టాలలో ఉన్నప్పుడు, మున్నెప్పుడూ కూడ సహాయం చేయలేదట. కాని వీరు మాత్రం మర్యాదగా మేనమామ దగ్గరకు వెళ్ళారు. ఇది తెలియని మేనమామ కూతురు తన తండ్రిని చంపటానికి వచ్చారని భయపడిందట. వెంటనే పెద్దపులిగా మారి, ఆరుగురు అన్నదమ్ములను చంపివేసిందట. అయితే ఆఖరు వాడు మాత్రం, సర్పదేవత (షెక్ రాజా) ను తల్చుకోవటం ద్వారా రక్షించబడడం జరిగింది. ఎలాగోలాగ కేస్లాపూర్ గ్రామం చేరి స్థిరపడ్డాడు. కొంత స్థిమితపడ్డ తరువాత పెండ్లి చేసుకున్నాడు. మరి కొద్ది కాలం తరువాత, తనను కాపాడిన శ్రీషెక్ (నాగదేవత)ను తన గ్రామం (కేస్లాపూర్) కు వచ్చి ఉండమని ప్రార్థించాడు. నాగదేవత సలహా మేరకు 16 ఆడ (సతి), 18 మగ (కామ) దేవతలను కూడా ఈ గుడి సముదాయంలో ప్రతిష్ఠింపచేస్తాడు. అప్పటి నుంచి తరాలుగా మేస్రాం గోత్రానికి చెందిన బుయి గోతా భాగం కుటుంబీకులు నాగదేవతను పూజిస్తూ వస్తున్నారు.

మరో కథ ప్రకారం ఈ పిల్లవాడు నాగదేవత ఇంట్లో వేళ్ళాడుతున్న



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 5 12/26/2009, 11:30 AM

ఏడు బంగారు ఆకులను లాగుతాడు. దానికి నాగదేవతకు కోపం వస్తుంది. దేవతను శాంతింపచేయటానికి పుష్యబహుళ అమావాస్యనాడు నాగదేవతకు పాలు, పెరుగు వంటకాలు సమర్పించారట. కేస్లాపూర్ గ్రామంలో ఇప్పటికీ గుడిప్రక్కన ఒక నిర్ణయించిన స్థలంలో ఈ గోత్రస్తులు వంటలు చేసి, వాటిని నాగోబా కు సమర్పించిన తరువాతనే మిగిలిన గోండులను, ఇతర జాతి గిరిజనులను గుడిలోకి వెళ్లేందుకు అనుమతిస్తారు. అదే ప్రాంగణంలో గుడి బయట, ప్రధానులు కూర్చుని 'కింగ్రి' వాద్యానికి అనుగుణంగా పాటలు పాడతారు. భక్తులు డబ్బులు, బీడీలు, బియ్యం మొదలైనవి వేస్తారు. ఆవులు, గేదెలు, మేకలు మొదలైనవి ఈ సందర్భంగా బలి ఇవ్వటం 1941 లో చూశానని హెమన్‌డార్ఫ్ గారు రాశారు. అయితే ఇప్పుడు ఇది నిషిద్ధం. అదే జాతరకు ఉట్నూరు ఆత్రం రాజా పల్లకీలో రావటం, పంచాయితీలు జరపటం జరిగేదట. ఇది కూడా ఇప్పుడు పోయింది.

అదే సమయంలో (1940) నిజామ్ సంస్థానంలోని రెవెన్యూమంత్రి, మానవ శాస్త్రజ్ఞుడు అయిన గ్రిగ్‌సన్‌కు ఒక ఆలోచన వచ్చింది. అడవులలోని చాలా గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవటం వల్ల అధికారులు వెళ్ళలేరు కాబట్టి, ఈ జాతరలో దర్బారు పెట్టి, గిరిజనుల సాధక బాధకాలు గురించి చర్చించి, పరిష్కారాలు కనుగుంటే బాగుంటుందని ఆయన ఆలోచన. అయితే 1946 లో నిజాం సంస్థానానికి సలహాదారుడైన హెమన్‌డార్ఫ్, ఈ ఆలోచనకు రూపం కల్పించి ఈ దర్బారు ప్రారంభించారు. ఇటువంటివే కాక, భూమి పంపకం వంటి ఎన్నో



మంచి కార్యక్రమాలకు కారణ భూతుడైన హెమన్‌డార్ఫ్ గోండు సమకాలీన చరిత్రలో భాగంగా అయిపోయాడు. అతడిని హేమండరావు, (మరాఠీ - తెలుగు పేరుతో) గా పిలవడం కూడా జరిగింది.

ఇలాగ జరుగుతున్న దర్బారుకు జిల్లా కలక్టర్లు రావటం ఆనవాయితీ. నిజాం తరువాత హైదరాబాద్, తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు వచ్చాయి. వాటితో పలురకాలైన ప్రభుత్వ శాఖలూ వచ్చాయి. అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు గోండులతో కోయభాషలో మాట్లాడితే, కొంతకాలానికి అదితారుమారు అయ్యింది. గిరిజనులు అధికారులతో తెలుగులో ఉర్దూలో మాట్లాడవలసి వస్తోంది. చరిత్ర తిరగబడింది. గిరిజనుల గోడు వినటం మానేసి, గంటల తరబడి నాయకులు ఇచ్చే ఉపన్యాసాలకు వేదిక అయ్యిందీ దర్బారు. దాంతో గిరిజనులు రావటం మానేశారు. 1980 ఇంద్రవెల్లి విప్లవం తరువాత ఈ దర్బారు రూపం పూర్తిగా మారిపోయింది. గిరిజనుల కంటే, కాపలా పోలీసులే ఎక్కువ అయ్యారు. బాధలు చెప్పి అదికారులను గట్టిగా ప్రశ్నించిన వాళ్ళని కొట్టిన సందర్భాలూ ఉన్నాయి.

ఈ జాతర ప్రాముఖ్యం పెరిగిన తరువాత రోడ్లు పడ్డాయి. మంచినీటి సౌకర్యాలు వచ్చాయి. గవర్నమెంటు బస్సులు రావటం మొదలైంది. ఎన్నో దుకాణాలు, టెంటు సినిమాలు, అభివృద్ధి శాఖలు, ప్రైవేట్ వ్యాపారస్తుల స్టాల్స్ వచ్చాయి. ఆదాయం పెరగగానే దేవాదాయ శాఖ ఈ గుడిని తనలో కలుపుకుంది. కొన్ని సౌకర్యాలు కల్పించింది. ఆదాయంలో భాగం తీసుకుంటోంది. గోండు జాతర హిందూ జాతర అయ్యింది. శ్రీశేక్ (నాగోబా) గా, నాగదేవతగా మారటం ఈ పరిణామంలో భాగమే. పూజార్లు, పూజలు, కొబ్బరికాయలు కొట్టటం, హారతి ఇవ్వటం, మంత్రోచ్చారణ మొదలైన మార్పులు కూడా వచ్చాయి. నేను 1972లో మొదటి సారి చూసినప్పుడు ఒక ప్రధాన్ పూజారి ఉండేవాడు. అతడు వయస్సుమళ్ళి చనిపోయాడు. తరువాత వచ్చినతనికి అంత నిష్ట లేదని తెలిసింది. కొత్తతరం ప్రధాన్‌లు పాఠశాల చదువులలో పడి ఉద్యోగాలకు వెళ్ళిపోతున్నారు. చాలామంది గోండులకు, నాగోబా గుడికి సరైన పూజార్లు కరువయ్యారు. గోండు పురాణాలు పాడేవారే తగ్గిపోయారు. కొంతకాలం పోతే గోండు సంస్కృతి అంతా చరిత్రలో కలిసిపోతుందేమో! దేవాదాయశాఖవారు శైవ పూజారిని ఉద్యోగిగా నియమించినా, ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

## సమ్మక్క జాతర

ఈ జాతరనే సమ్మక్క-సారలమ్మ జాతర అని కూడా పిలుస్తారు. వరంగల్లు జిల్లాలో అడవి ప్రాంతంలో మేడారం అనే గిరిజన గ్రామంలో రెండు సంవత్సరాల కొకసారి మాఘపూర్ణిమ నాడు జరిగే ఈ జాతరను మేడారం జాతరగా కూడా పిలుస్తారు. వరంగల్లు నుండి ములుగు, తాడ్వాయి మీదుగా 110 కిలోమీటర్లు ప్రయాణిస్తే మేడారం వస్తుంది. జాతర సమయంలో నిలుచునేందుకు కూడా చోటు దొరకని ఈ మారుమూల గిరిజన గ్రామం, మామూలు రోజుల్లో అసలు జనాభాయే లేనట్లు కనిపిస్తుంది. ఈ జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగినా, ప్రతి సంవత్సరం గిరిజనులు ఆ సమయానికి తమ మొక్కులు అమ్మవారికి తెలియచేస్తారు. ప్రధానంగా గిరిజన జాతర అయినా కూడా, గిరిజనేతరులు లక్షల మంది రావటంతో గిరిజన దేవతలు సంస్కృతీకరింపబడుతున్నారు. గిరిజనుల నమ్మకాలు, వారి పాత్ర వెనుకబడుతోంది.

1986-87 లో నేను ఏటూరు నాగారం, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలో సహాయ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్నప్పుడు అదే ప్రాంతంలోని బూటారం గ్రామంకు చెందిన శ్రీ కుడుముల చొక్కయ్య తో బాగా పరిచయం పెరిగింది. ఇతడు బాగా చదువుకున్న (యం.ఎ., బి.యల్.) కోయ యువకుడు. అప్పట్లో వచ్చిన ఉద్యోగాలు వదులుకుని గిరిజనాభ్యుదయ సంస్థ ద్వారా సంఘసేవ చేశారు. కొన్నాళ్ళకు కాకతీయ విశ్వవిద్యాలయం కాలేజీలో ఉపన్యాసకులుగా ఉద్యోగం వస్తే వరంగల్లులో నివశించడం మొదలు పెట్టారు. అయితే ఇప్పటికీ సంఘసేవ చేస్తున్నారు. ఆయన ఒకసారి సమ్మక్క జాతర గురించి చెప్పి, గిరిజనుల అసలు కథ మరుగౌతూందని తెలిపారు. నేను వివరాలు సేకరించి రాస్తానంటే, గిరిజన పెద్దలందరి దగ్గరకు తీసుకువెళతానన్నారు. కాని ఆ సంవత్సరం జాతర లేదు. తరువాత సంవత్సరం జాతర సమయానికి నేను ఆదిలాబాదు జిల్లాలో



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 6 12/26/2009, 11:30 AM

పనిచేస్తున్నాను. వెళ్ళలేపోయాను. అందుకని 1990 సంవత్సరం లో ఫిబ్రవరి 7 నుండి పదవ తారీఖు వరకు మేడారం లోను, చుట్టుప్రక్కల గ్రామాల లోపల వివరాలు సేకరించాను. నా సహోద్యోగి శ్రీ ఎ. శ్రీరాములు తనకు ఆరోగ్యం బాగోలేక పోయినా నాతో వచ్చి ఎంతో ఉత్సాహంగా పరిశోధనలో పాల్గొన్నారు. ఆ సంవత్సరం సుమారు పది లక్షల మంది భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ సంవత్సరం (2010) 60 లక్షలమంది వస్తారని జిల్లా అధికారుల అంచనా. ఆదిలాబాదు జిల్లా, ఖమ్మం జిల్లాలోని బొగ్గు గనులలో పనిచేసే కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఈ జాతరకు రావటంతో, గని పనులు చాలా చోట్ల ఆగిపోవటం కాని, చప్పపడడం కాని జరిగేది. అందుకని బెల్లంపల్లి లాంటి ప్రాంతాలలో చిన్న జాతరని నిర్వహిస్తున్నారని చెబుతారు. ఏదైతేనేం, అడవిలో ఉండే కుగ్రామంలో లక్షల జనాభా ప్రవాహంలా జాతరకు వచ్చి, ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తిరిగి వెళ్ళడం చాలా ఆశ్చర్యం. ఇది సమ్మక్క మహిమేనంటారు గిరిజనులు. రోడ్డు రవాణా సంస్థ వందల బస్సులు త్రిప్పితే, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చాలా సౌకర్యాలు కల్పించటం జరుగుతోంది. భక్తులు పెరిగేటప్పటికి దేవస్థానంశాఖవారు ఈ జాతరను సొంతం చేసుకున్నారు. దాంతో బాటు సంస్కృతీకరణ జోరు పెరిగింది. ఎందుకంటే లక్షల భక్తులలో తక్కువ శాతం మాత్రమే గిరిజనులు ఉంటే, మిగిలిన వారందరూ గిరిజనేతరులే. అందుకని సంస్కృతీకరణ తప్పదనిపించింది. గిరిజనుల కథ నమ్మకమునకు ప్రాముఖ్యత ఇస్తూ, గిరిజనేతరుల నమ్మకాలను త్రోసిపారేయకుండా, అన్ని కోణాల నుండి వివరాలు సేకరించాము మేము.

వరంగల్లు జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఈ జాతర సందర్భంగా ప్రచురించిన కరపత్రము, 1988 లో దేవస్థానము కమిటీ ప్రచురించిన స్థల పురాణం, పాత్రికేయులు శ్రీ ఎస్.వి. రాజేశ్వర రావు వ్రాసిన 'జాతర చరిత్ర', గిరిజనేతర జానపదులు పాడుకునే ఒగ్గుకథ, ఉయ్యాల పాటలు మొదలైనవి సేకరించి, గిరిజనేతరుల నమ్మకాలు తెలుసుకున్నాం. అలాగే మేడారం ప్రాంతంలోని కోయ పెద్దలు శ్రీ బంగారు పెద్ద నర్సయ్య (80 సంవత్సరాలు), వారి తమ్ముడైన చిన నర్సయ్య (60 సంవత్సరాలు) ద్వారా కొన్ని వివరాలు సేకరించాము. మేడారం పూజారి శ్రీ సిద్ధబోయిన జగ్గారావు, కోయల దేవతల గురించి పాటలుగా పాడే డోలి కోయలు మాదిరి సమ్మయ్య, నాగుల అచ్చయ్య, పూజారి నాగేశ్వర రావు లాంటి వారి దగ్గర నుండి, సమ్మక్క గోత్రీకుల నుండి కోయల నమ్మకాల గురించి వివరాలు సేకరించాము. సంస్కృతీకరణ ఎంత ఎక్కువ అయ్యిందంటే, అసలు కోయల మూల కథలను విడకొట్టడం కష్టం అనిపించింది. ఎందుకంటే, గిరిజన, గ్రామీణ ప్రాంతాల సంస్కృతులు సంస్కృతీకరింపబడి, మళ్ళీ అదే ప్రాంతానికి క్రొత్తగా తిరిగి రావటం మనం సామాన్యంగా చూస్తాం. ఇక్కడా అదే జరిగింది. గుడ్డు ముందరా, కోడిముందరా అన్న మీమాంసలాగ అయింది. చాలాకాలంపాటు రెండు సంస్కృతులు కలసిన తరువాత, దేంట్లోంచి ఏది వచ్చిందని వెతకటం కష్టం అవుతంది.

గిరిజనుల పాత్ర మరుగున పడకుండా ఉంటే చాలు. చెంచు మల్లన్న లాగ, భద్రాచలం దమ్మక్క లాగ మరుగునపడకుండా ఉంటే బాగుంటుందని మా తాపత్రయం. చాలామంది కోయల కొర్కె కూడా



అదే. ఈ వివరాలు రాసిన తరువాత, మళ్ళీ కోయ పెద్దలకు తాడ్వాయి లో వినిపించి, వారి ఆమోదము పొందిన తరువాత 1991 లో మాచే గిరిజన సాంస్కృతి పరిశోధన, శిక్షణ సంస్థ ద్వారా ప్రచురించటం జరిగింది. దీంట్లో నుంచి కొన్ని వివరాలు మీ ముందుంచుతాను.

## అ) దేవస్థానం కమిటీ వారి కథ

గోదావరి నదీ తీరాన సూర్యుడి కిరణాలు సోకని దట్టమైన అడవిలోని మేడారం, పదవ శతాబ్దం కోయరాజుల నివాస స్థలం. ఒక రోజు కోయ దొరలు అడవిలో వెళుతున్నప్పుడు పెద్దపులుల మధ్య దేదీప్యమానంగా వెలుగుతున్న చిన్న పాపను చూశారట. ఆమెను మేళ, తాళాలతో పల్లకీ మీద తీసుకువెళ్ళి వాళ్ళ గ్రామంలో పెంచారట. ఆమె వచ్చిన దగ్గర నుండి అన్నీ శుభాలే జరిగేవట, దీర్ఘరోగాలను పోగొట్టడం, సాహసకృత్యాలు చేయటం, మృతులను బ్రతికించటం లాంటివి చేయటం, క్రూర జంతువులతో ఆడుకోవడం లాంటివి చేసేదట. ఇది కేవలం సమ్మక్కను వనదుర్గగా చిత్రకరించే ప్రయత్నంగా అనిపిస్తుంది.

## ఆ) పాత్రికేయుని కథ

పాత్రికేయుని కథలో కూడా సమ్మక్కను దేవీ భాగవతంలోని వనదుర్గగా వర్ణించారు. సమ్మక్క పేరు, నివశించిన ప్రదేశము, కుటుంబము పేరు అందరి కోయలకు ఇప్పటికి తెలుసు కాబట్టి, వనదుర్గ అవతారముగా వర్ణించటం సంస్కృతీరణలోని భాగమే. అదీ కాకుండా, ఇదే ప్రాంతంలో నేను 1970 లో తిరిగినప్పుడు ఈ కథ ప్రచారంలో లేదు. డోలి కోయలు చెప్పే కథలలో కూడా ఈ వివరాలు లేవు. అందువల్ల బయటి వారి ఊహాగానాలు గానే దీనిని కూడా అర్థం చేసుకోవచ్చును.

## ఇ) చరిత్రకు సంబంధించిన కథ

చరిత్రకు సంబంధించిన కథ ప్రకారం, సమ్మక్క కాకతీయుల కాలమునకు చెందినది అని చెబుతారు. ఈ కథ ప్రకారం పగిడి గిద్దరాజు, ఒక కోయ రాజ్యమును ఈ ప్రాంతములో స్థాపించారు. అతని భార్య సమ్మక్క. ఈ కోయరాజు, కాకతీయులకు సామంతరాజుగా ఉండెనట. ప్రతి సంవత్సరం కప్పము కట్టేవాడట. కొన్ని సంవత్సరాల పాటు కరువు, కాటకాలు వచ్చినందువలన కప్పము కట్టలేకపోతే, కాకతీయ రాజులు ఆగ్రహించి ఈతని రాజ్యంపై దండెత్తారట. పోరాటములో పగిడి గిద్దరాజు, సమ్మక్క వీరోచితంగా పోరాడి చనిపోయారని చెబుతారు. మరో కథలో భర్త చనిపోయిన తరువాత సమ్మక్క గాయపడి, చిలకల గుట్టమీద అడవిలోకి వెళ్ళి అదృశ్యం



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 7 12/26/2009, 11:30 AM

అయ్యిందని చెబుతారు. తాడ్వాయి దగ్గర ఒక కోట కూడా ఉండేదని ఈ కథలో చెబుతారు. అయితే, కోయ పెద్దలెవ్వరూ ఈ కోటను కాని, శిధిలాలను కాని ఎప్పుడూ చూడలేదని తెలిపారు. ఈ కథకు చారిత్రక ఆధారాలు ఇంకా కావాలి. అవి నేను సేకరించలేక పోయాను. ఈ ప్రాంతంలో రాచ కోయల (దొర చట్టం) రాజ్యం ఉండడం చారిత్రక సత్యం. వరంగల్లు లో కాకతీయుల రాజ్యం ఉండడం కూడా చారిత్రక సత్యం. కోయ ప్రాంతాలలో కాకతీయుల నాటి చెరువులు, గుడులు కూడా ఉన్నాయి. అయితే వీరివురి సంబంధాలు, యుద్ధాలు చరిత్రకారులు పరిశోధించాలి. అప్పటివరకు ఈ కథను కాదనటం ఎందుకు అనిపిస్తుంది. ఇప్పుడు కోయల నమ్మకానికి వద్దాం.

## ఈ) కోయ పెద్దలు చెప్పిన కథ

సమ్మక్క ఐదవ గట్ట గోత్రంలో జన్మించింది. సమ్మక్క తల్లి ఇంటి పేరు 'చంద'. అయితే ఐదవ గట్ట గోత్రంలో బంగారు, చేల, మల్లెల, చంద మొదలైనవి ఉన్నాయని ఈ ప్రాంతంలో చేసిన పరిశోధనలో తేలింది. ఈమెకు పెండ్లి వయసు రాగానే నాల్గవ గట్ట గోత్రీకుడైన పగిడి గిద్దరాజు తో వివాహం జరిగింది. పగిడి గిద్దరాజు ప్రస్తుత బస్తరు ప్రాంతం (మధ్యప్రదేశ్) లోని బీజాపూర్ తాహసీల్, కొత్తపల్లి గ్రామానికి చెందినవాడని చెబుతారు. ఈ ప్రాంతం ఖమ్మంజిల్లాలోని వెంకటాపురం కోయ ప్రాంతానికి దగ్గర ఉంది. ఇతని ఇంటిపేరు 'మజ్జి' అంటారు. అయితే మజ్జి ఇంటిపేరు గలవాళ్ళు ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఉన్నారు. ఆ చుట్టరికం ప్రకారం, పగిడి గిద్దరాజు తరుపు వాళ్ళు ప్రతి సమ్మక్క జాతరకు ఇప్పటికీ ఇక్కడి నుండి ప్రభలు తీసుకువస్తారు.

పగిడి గిద్దరాజుకు ఇద్దరు భార్యలు. సమ్మక్క, నాగులమ్మ. ఒకసారి భర్తతో ఇద్దరూ ఒకే సమయంలో ఉన్నప్పుడు సవితి (నాగులమ్మ) మీద అక్షింతలు వేశాడట. సమ్మక్కకు కోపం వచ్చి రాయి తీసి పగిడి గిద్దరాజును కొడితే, అతడికి ఒక కన్ను పోయింది. ఇప్పటికీ గద్దె మీద అతడికి ఒకే కన్ను ఉంటుంది. దానిని చిత్రకన్ను అంటారు. ఆమెకు కోపం తగ్గక అతనిని వదలి తిరిగి తిరిగి పుట్టింటికి (మేడారం) వచ్చింది. కోయల నమ్మకం ప్రకారం, గోవిందరాజులు, గోపాలకృష్ణుడు సమ్మక్క మరుదులు. సారలమ్మ, జంపన్న, మూగన్నలు నాగులమ్మ పిల్లలు. సమ్మక్కకు వయసు మళ్ళీ అందరిలాగే చనిపోయిందట. కాని పదవ దినం చేస్తుంటే పెద్ద మంటలాగ వచ్చిందట. ఇప్పటికీ సమ్మక్క తల్లిని భక్తితో పిలిస్తే మంటలాగా కనిపిస్తుందట. ఆమె వస్తుంటే, మెరుపు వస్తుందట. ఇది నిజమా కాదా తెలుసుకునేందుకు ఆమెను గద్దె వద్దకు తీసుకువస్తుంటే నేను ఫోటో తీశాను. దాంట్లో మెరుపే పడింది. మనుషులు కనిపించలేదు. అందుకని నేను కూడా ఈ వివరణ నమ్ముతున్నాను. మరొక విషయం ఏమిటంటే, గిరిజనులలో శక్తిని ఆరాధించటం సర్వసామాన్యం. గాలి, నీరు, అగ్నిలాంటి ప్రకృతి శక్తి స్వరూపాలను వీరు ఆరాధిస్తారు. సమ్మక్కను అగ్నిశక్తి తో పోల్చటం దీంట్లో ఒక భాగం అని నేను అనుకుంటాను.

సమ్మక్క జాతరలో పూజారులు ఐదుగురు. నలుగురు నాల్గవ గట్ట గోత్రం (అంటే ఆమె భర్తది)కు, ఒకరు మూడవ గట్ట గోత్రంకు చెందిన వారు. మూడవ గట్ట వారు ఐదవ గట్ట (సమ్మక్క) గోత్రానికి చెందిన పూజారులు. సారలమ్మ, సమ్మక్క సవతి కూతురు. ఆమె 'కాక' ఇంటిపేరుగల వాళ్ళ కోడలు. అందుకని సారలమ్మ ఆరుగురు పూజారులలో నాలుగుమంది 'కాక' కుటుంబానికే చెందిన వారు.

సమ్మక్క పూజ నాలుగు వారాలు జరుగుతుంది. మొదటివారంలో మేడారం దగ్గరున్న చిలకల గుట్ట పైకి వెళ్ళటం, రెండవ వారంలో మేడారం లో గద్దె తయారు చేయటం, మూడవ వారం జాతర, నాలుగవ వారంలో సమ్మక్కను, చిలకల గుట్ట దగ్గర విడవటం వీటిలోని ముఖ్యభాగాలు. అలాగే సారలమ్మను మేడారం దగ్గరున్న కన్నెపల్లి గ్రామం నుండి సమ్మక్క వచ్చేలోపల ఒకరోజు ముందరే తీసుకువస్తారు. సారలమ్మ ఒక ప్రతిమ రూపంలో ఉంటుంది. చిలకల గుట్ట దగ్గర ఒక చిన్న గుడిసెలో చూరుకు అలివేణి కుండలు కట్టి ఉంటాయి. దానిలో రెండు బంగారు కణికెలు ఉంటాయి. ఒకటి సమ్మక్క. రెండవది పగిడి గిద్దరాజు అని నమ్ముతారు కోయలు.

కోయల ఆచారం ప్రకారం మాఘ పూర్ణమికు రెండు వారాల ముందు కొక్కెర, గంపర, సిద్దబోయిన, బంగారు ఇంటిపేరుకల వారు చిలకల గుట్ట (దీన్నే దేవర గుట్ట అని కూడా అంటారు)కు వెళ్ళి పూజలు చేస్తారు. తిరిగి వచ్చి మేడారంలో సమ్మక్క గద్దెను తయారు చేస్తారు.

మూడవ వారంలో కొక్కెర కుటుంబీకులు ఈ బంగారు కణికలను నలుపురంగు పట్టుగుడ్డలో చుట్టి చిలకలగుట్ట దగ్గర నుండి తెచ్చి గద్దె దగ్గర పూజారులైన సిద్దబోయిన కుటుంబీకులకు అందిస్తారు. దానితో సమ్మక్క వచ్చినట్లే. అప్పటివరకు మామూలుగా ఉన్న జనంలో ఒక్కసారి సంచలనం ఏర్పడుతుంది. వందలాదిమందికి పూనకాలు వస్తాయి. డప్పులు, డోలులు, సన్నాయి లాంటి వందలాది వాయిద్యాలు మార్మోగుతాయి. జాతర ఊపందుకుంటుంది. తదియనాడు సమ్మక్కను తిరిగి గుట్టకు చేర్చడం తో జాతర సమాప్తం అవుతుంది. అంటే త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి, పాడ్యమి, విదియలనాడు అంతా పండుగ వాతావరణమే. పౌర్ణమినాడు మాత్రం జాతర.

సమ్మక్కకు అతీతమైన శక్తులు ఉన్నాయని, పౌర్ణమినాడు ఆమె గద్దె వద్దకు వచ్చినప్పుడు ఏవైనా కోరికలు కోరుకుంటే, ముఖ్యంగా సంతానము లేని వారు కోరితే అవి తప్పక తీరుతాయని కోయల నమ్మకం. అదే నమ్మకం గిరిజనేతరులలో మెల్లగా వ్యాపించి, వరంగల్లు, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుండేకాక సుదూర ప్రాంతాల నుండి, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ నుండి లక్షలాది భక్తులు వస్తారు. ముఖ్యంగా పిల్లలు లేని పురుషులు స్త్రీ వేషధారణలో వచ్చి మొక్కుతే తప్పక పిల్లలు పుడతారని నమ్మకం. భక్తులు కొబ్బరికాయ, బెల్లం (నిలువెత్తు), జుట్టు మొదలైనవి సమర్పిస్తామని మొక్కుకుంటారు. నేను చూసిన జాతరలో పదకొండు లారీల బెల్లం, లక్ష కొబ్బరికాయలు అమ్ముడు పోయాయని అధికారులు తెలిపారు. ఇప్పుడు ఇంకా ఎక్కువని మిత్రులు చెబుతారు. కోళ్ళు, మేకలు, గొర్రెలు లాంటివి ఇక్కడ బలి ఇవ్వటం నిషేధించారు. కాని దూరంగా అడవిలో బలి ఇస్తారు. జాతర సందర్భంగా ప్రక్క గ్రామాల్లో సారా అమ్మకం కూడా చాలా జరుగుతుంది. కాంట్రాక్టుకు చాలా పోటీ ఉంటుంది.

పదండి సమ్మక్క జాతరకు.

డా. వి.ఎన్.వి.కె. శాస్త్రి,
సలహాదారు, ప్రచరణలు, అపార్డ్



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 8 12/26/2009, 11:30 AM





# గ్రామీణ యువతకు స్ఫూర్తి, విలు విద్యలో రాణి - ప్రణీత

**అది 2003వ సంవత్సరం: వరంగల్ జిల్లా. పర్వతగిరి మండలం కల్లెడ గ్రామం.**

**13 సంవత్సరాల ఓ బాలిక తోటి వారిలాగా, స్కూలు నుంచి ఇంటికి రాగానే తన తల్లిదండ్రులకు పొలం పనులలో చేయి అందిస్తూ ఉండేది. అదే ఆమె ప్రపంచం.**

2008వ సంవత్సరం: కేవలం అయిదేళ్లలో కల్లెడ బుల్లి ప్రపంచం నుంచి, తన కలలో కూడా ఊహించని పెద్ద, సువిశాల ప్రపంచంలోకి అడుగు పెట్టింది. ఆ బాలిక విధి అయితేనేం, కౌశల్యమైతేనేం ఆమెను తారాలోకానికి తీసుకెళ్లింది. అదే బీజింగ్ ఒలింపిక్స్‌కు వెళ్లే భారత బృందంలో ఆమెకు చోటు దొరకడం.

ఇదీ వర్ధినేని ప్రణీత, యావత్‌దేశం గర్వించతగ్గ మేటి విలువిద్యా రాణి విజయగాథ. కల్లెడ నుంచి బీజింగ్ దాకా ఆమె ప్రస్థానం సాగిన తీరు ఇదీ:

నవంబర్ 17, 1990 లో కల్లెడ గ్రామంలో ప్రణీత జన్మించింది. అందరిలాగానే ఆమె ఓ సాధారణ గ్రామీణ బాలిక. దేశంలో తన ఈడు బాలికలు ఎందరికోలేని అవకాశం, అదృష్టం ఆమెకుంది. అదే ఆ ఊరిలో ఓ గొప్ప స్కూలు ఉండటం. ఆ గ్రామీణ పాఠశాలను ఎర్రబెల్లి వారి కుటుంబం ఆధ్వర్యంలో నడిచే 'రూరల్ డెవలప్‌మెంట్ పౌండేషన్' (RDF) నడుపుతోంది. ఆ స్కూల్లో సగం సీట్లు బాలికలు, బడుగువర్గాల విద్యార్థులకు కేటాయించారు. స్కూలు యాజమాన్యం చేపట్టే సృజనాత్మక కార్యక్రమాలలో భాగంగా, అక్కడ విద్యార్థులకు తరగతి గదుల్లో పాఠాలు పూర్తయ్యాక ఆర్చరీని నేర్పడం ప్రారంభించింది.

ఎన్నో కష్టనష్టాలు పడ్డాక అక్కడ విలువిద్యకి మంచి ఆదరణ లభించింది. 2003లో తన 13వ ఏట ప్రణీత ఆర్చరీ క్లాసుల్లో చేరింది. చాలా త్వరగా ఆమెకు అందులో అభిరుచి లభించింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన మాజీ ఆర్చరీ చాంపియన్ ప్రబిర్ దాస్ అక్కడ కోచ్. తెలుగు ఏ మాత్రంరాని కోచ్‌తో మొదట్లో విద్యార్థులు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రణీత ఆర్చరీ క్లాసులో చేరినప్పుడు అది అమ్మాయిలు నేర్చుకొనే క్రీడ కాదు అని కొందరు భయపెట్టారు. గతంలో వరంగల్ జిల్లాకు క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో ఎందరో మేటి క్రీడాకారులను తయారు చేసిన చరిత్ర ఉంది. కానీ ఎవరూ ఈ విల్లు విద్యపై దృష్టి పెట్టలేదు. అయితే, ఇవేవీ ఆమె పట్టుదలను, ఏకాగ్రతను ప్రభావితం చేయలేదు. ప్రణీత చాలా దీక్షగా నేర్చుకొని తన సామర్థ్యాన్ని నిరూపించుకొంటూ వచ్చింది. ఇక ఆమె ఇతర చోట్లకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి సిద్ధమైంది. 2004లో అంటే దాదాపు ఏడాది కాలంలోనే ఢిల్లీలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని రన్నర్ అప్ (2వ స్థానం)గా నిలిచింది. "ఆ అమ్మాయికి ఏ మాత్రం అనుభవం లేదు. ఏదో అదృష్టవశాత్తు పతకం లభించిందని కొందరు వ్యాఖ్యానాలు చేశారు. వారి నోళ్లు మూయించేలా 2006లో మెక్సికోలో జరిగిన వరల్డ్ కప్ ఆర్చరీ టోర్నమెంట్‌లో ప్రణీత సిల్వర్ మెడల్ అందుకొని తన సత్తాను చాటుకొంది. ఒక అంతర్జాతీయ వేదికపై భారతీయ బాలిక మెడల్ సాధించడం చరిత్రలో అదే మొదటి సారి. ఆమెకు ఫైనల్స్‌లో మొదటి స్థానం తృటిలో తప్పిపోయింది. ఆ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియాకు చెందిన జేన్ వాలర్ కేడెట్ రికర్వ్ విభాగంలో ప్రణీతపై గెలిచి మొదటి స్థానంలో నిలిచింది.

అప్పుడే ఇంటర్మీడియేట్ పాసైన ప్రణీత ప్రతిభను గుర్తించిన జంషెడ్‌పూర్‌లోని టాటా ఆర్చరీ అకాడమీ ఆమెకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. నిపుణుల సంరక్షణలో, శిక్షణలో అకాడమీలో లభించిన ఆధునిక సౌకర్యాలతో ఆమె నైపుణ్యానికి మరింత పదును పెట్టుకొంది. ఆమె టాటా అకాడమీలో శిక్షణ పొందుతున్న కాలంలోనే మెక్సికో టోర్నమెంట్‌లో రాణించింది.

2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో స్థానం సంపాదించాలన్న ఆమెకల చివరికి సాకారమైంది. ఎంతో మంది సీనియర్లు, అదివరకే ఆ రంగంలో పేరు సంపాదించిన క్రీడాకారులున్న భారత బృందంలో స్థానం సంపాదించడం అంత తేలిక కాదు. ఒలింపిక్స్ కోసం సెలక్షన్స్ జరిగేటప్పుడు భారతీయ ఆర్చరీ క్రీడాకారిణి, అదివరకే ఒలింపిక్స్‌లో పాల్గొన్న అర్జున అవార్డు గ్రహీత డోలా బెనర్జీ కంటె హెచ్చు పాయింట్లు స్కోరు చేసి, పాయింట్ల పట్టికలో ప్రణీత మొదటి స్థానం సంపాదించింది.

ఒలింపిక్స్‌లో మహిళల రికర్వ్ విభాగంలో ఆమె ప్రీ క్వార్టర్ ఫైనల్ వరకు చేరుకొంది. తొలిసారి ఒలింపిక్స్‌లో పాల్గొనే ఓ కొత్త క్రీడకారిణి ఆ స్థానంవరకు వెళ్లడం చాలా గొప్పకింద లెక్కే. ఆమె సీనియర్లు డోలా బెనర్జీ, బొంబైలా దేవి ఎంతో అనుభవం ఉన్నప్పటికీ మొదటి రౌండ్‌లోనే విఫలమయ్యారు. ఆ పోటీలో ప్రణీత ఉత్తర కొరియాకు చెందిన క్వాన్ ఆన్ సిల్ చేతిలో 96-100 పాయింట్లతో ఓడిపోయింది. ఒలింపిక్స్ అయ్యాక, 2008 అక్టోబర్‌లో టర్కీలోని అంటాల్యాలో



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 9 12/26/2009, 11:30 AM



జరిగిన వరల్డ్ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో మరోసారి తృటిలో గోల్డ్ మెడల్ చేజారి పోయింది. ఆ పోటీలో ఫైనల్స్‌లో జపాన్ క్రీడాకారిణి మికీ జుషీ చేతిలో మరలా 96-100 పాయింట్లతో ఓటమి పాలైంది. అయితే, ఇండియన్ టీమ్ ఫైనల్స్‌లో చైనాటీమ్ చేతిలో ఓడిపోయి, ఆ పోటీలో సిల్వర్ మెడల్ సంపాదించింది.

జంషెడ్‌పూర్‌లో ప్రణీత ఇంకా శిక్షణ పొందుతున్నప్పటికీ ఆర్చరీకి సంబంధించిన అన్ని అంతర్జాతీయ పోటీల్లో ఆమెస్థానం స్థిరపడిపోయింది. ఇటీవలే ఢాకాలో జరిగిన ఆసియన్ గ్రాండ్ ప్రి టోర్నమెంట్‌లో స్టీల్‌ప్లాంట్‌లో స్పోర్ట్స్ బోర్డు తరపున పాల్గొంది.

ఇక కల్లెడ విషయానికొస్తే, ప్రణీత సాధిస్తున్న విజయాలు క్రీడలపట్ల ఎందరికో ఉత్సాహం పెంచింది. ముఖ్యంగా ఆర్చరీ పట్ల మక్కువ పెరిగింది. ప్రణీత ఎదుగుదల పట్ల రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఎంతో గర్వపడుతోంది. ప్రణీత తల్లిదండ్రులు కూడా ఆ ఫౌండేషన్‌కు ఎంతో రుణపడి ఉన్నామని భావిస్తున్నారు. కల్లెడలో ఆర్చరీ ప్రోగ్రాంను ప్రవేశపెట్టటానికి ఆర్థిక సహాయం అందించిన 'పజులోనా ఫాబ్రికేటర్స్' యజమాని ప్రకాశ్ పాయ్‌కి ఉన్న విశ్వాసాన్ని వమ్ము కానివ్వకుండా ప్రణీత కాపాడింది. ఒలింపిక్స్‌లో స్థానం సంపాదించటానికి ముందు ఆమె వివిధ పోటీల్లో పాల్గొని 17 గోల్డ్ మెడల్స్, 19 సిల్వర్ మెడల్స్, 15 బ్రాంజ్ మెడల్స్ సాధించింది.

ఇక ముందు కూడా మన 'కల్లెడ ఆడపడుచు' మన రాష్ట్రానికీ దేశానికీ మరిన్ని పతకాలను తెచ్చి గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు మరింత స్ఫూర్తి నివ్వాలని ఆశిద్దాం.



## కొసమెరుపు

క్రీడల్లో వరంగల్ జిల్లా ప్రతిభను గురించి మాట్లాడుకొనేటప్పుడు, కేసముద్రం మండలం ఇంగుర్తి గ్రామానికి చెందిన కొండునూరి కొమురయ్య గురించి చెప్పుకొని తీరాలి. 85 ఏళ్ల 'క్రీడా గురువు' కొమురయ్య అనేక ఏళ్లుగా ఎందరో విద్యార్థులను మంచి వాలీబాల్ ప్లేయర్లుగా తీర్చిదిద్దారు. కొమురయ్య మాస్టారు చలవపల్లనే తామీ స్థితికి చేరుకొన్నామని వారంతా అంటుంటారు. కొమురయ్య శిష్యులలో మాజీ జాతీయ వాలీబాల్ కెప్టెన్ కన్నా వెంకటనారయణ ఒకరు. అలాగే, ఆ క్రీడలో జాతీయ స్థాయికి ఎదిగిన ప్లేయర్లలో ఎన్.వెంకటేశ్వర్లు, బి. వెంకటాద్రి, ఒ. లత, ఒ.గీత, కె.గీత, కె. కుమారస్వామి మొదలైన వారున్నారు. 1947 నుండి 1983 వరకు ఇంగుర్తి ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేసిన కొమురయ్య కూడా గొప్ప వాలీబాల్ ప్లేయర్. ఆయన నిజాం కాలంలో అనేక పోటీల్లో పాల్గొనే వాడు. క్రీడలవల్ల మానసిక, శారీరక శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని ఆయన విశ్వసిస్తారు. తన విద్యార్థులను మంచి ప్లేయర్లుగా తీర్చిదిద్దటానికి అహర్నిశలు కృషి చేస్తూ ఉండేవారు.

తన విద్యార్థులను ఇతర ప్రాంతాల్లో జరిగే పోటీలకు తానే తీసుకెళ్లేవారు. దానివల్ల విద్యార్థులకు కొత్త విషయాలు తెలియడమే కాకుండా క్రీడలపట్ల ఆసక్తి పెరుగుతుందని ఆయన భావిస్తారు. ఆయన శిష్యులు చాలా మందికి మంచి కాలేజీల్లో క్రీడలకోటా కింద అడ్మిషన్లు రావడమే కాకుండా, ఉద్యోగాలు కూడా సంపాదించారు. ఆయన అందరిలా డబ్బుకోసం శిక్షణ ఇచ్చే గురువు కాదని ఆయన శిష్యులందరూ చెప్పుకొంటారు. తెల్లవారు ఝామునే తన విద్యార్థులందర్నీ లేపి ఊరి చెరువు వరకు మార్చ్ చేయించి తీసుకెళ్లి, అక్కడ కాలకృత్యాలు తీర్చుకొన్నాక ప్రాక్టీస్ కోసం గ్రౌండ్‌కు తీసుకెళ్లేవాడు.

క్రికెట్ పిచ్చి వల్ల దేశంలో ఇతర క్రీడలపట్ల ఆదరణ తగ్గిపోతుండటం ఆయనకు చాలా బాధ కలిగిస్తోంది. ఆయన ఎప్పుడూ ప్రచారాన్ని ఆశించరు. క్రీడారంగానికి తను చేసిన సేవల పట్ల ఆయనెప్పుడు చాలా సంతృప్తిగా ఉంటారు.

- దాసు కేశవరావు

*(అనువాదం: కె.యస్. రెడ్డి)*



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 10 12/26/2009, 11:30 AM

# మనం ప్రేమించే క్రీస్తు

- స్వామి రంగనాథానంద

(గత సంచిక తరువాయి భాగం)

బాప్తిస్మమిచ్చే యోహాను, యేసుక్రీస్తుల జీవితం, పరిచర్య మనకు యూదుల మతచరిత్రకు సంబంధించిన ఒక కొత్త అధ్యాయాన్ని మనల్ని పరిచయం చేస్తుంది. దైవ మానవ సంబంధంలో ప్రేమానుబంధంతో కూడిన సాన్నిహిత్యం ప్రాతిపదికగా పాశ్చాత్యుల ఈ మతానికి వారి అసాధారణ పరిచర్య ఒక కొత్త రూపాన్నిచ్చింది. ప్రాచీన యూదుల మతానికి ఇది వరకు ఈ రూపం లేదు. దేవుడంటే అక్కడెక్కడో దూరంగా ఉండేవాడని, మానవుడికి దేవుడెంత దూరంగా ఉంటే దేవుడంత గొప్ప వాడవుతాడని పురాతన మతం విశ్వసించేది. దేవునికి దూరంగా ఇక్కడ భూమ్మీద మానవుడు దేవుడంటే భయంతో విశ్వాసంతో జీవనాన్ని గడపాలి. తన జీవనకాలంలో చూపించిన విశ్వాసానికి మరణానంతరం ఫలాలుం టాయన్నది పురాతన ప్రాతిపదిక. అలాంటి మతం ఎక్కువగా ఈ లోకానికి సంబంధించినదిగా, చారిత్రక, కాల సంబంధమైన మార్పులకు నిరంతరం లోనయ్యేదిగా ఉంటుంది. పరలోకానికి సంబంధించిన వాసనలు ఎక్కువగా లేని అలాంటి సాంఘిక-రాజకీయ విశ్వాసం, మూఢవిశ్వాసంగా, కేవలం ఆచార వ్యవహారాలు, పూజా సంబంధమైన కార్యకలాపాలు ప్రధానంగా ఉన్న మత విశ్వాసంగా అసహన పూరితంగా ఉంటుంది.



బాప్తిస్మమిచ్చే యోహాను, యేసుక్రీస్తు నాటి కొత్త నిబంధనకాలంలో అలాంటి మత పరిస్థితులున్నాయనడానికి స్పష్టమైన వర్ణనలు దొరుకుతాయి. సార్వత్రిక, మానవీయ దృక్కోణంతో పురుడు పోసుకొంటున్న ఒక కొత్త మత విశ్వాసపు పోకడలు యోహాను, యేసుక్రీస్తుల కాలంలో మనకు కనిపిస్తాయి. ఈ కొత్త సిద్ధాంతానికి అప్పటికే పాతుకుపోయి వున్న ఏకదేవవాద నియంతృత్వపు పోకడలకు మధ్య చెలరేగిన ఘర్షణలు, మత సంప్రదాయాలు మూఢవిశ్వాసాల సంకెళ్ళ నుండి వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్న యాజక వర్గపు పెత్తనం నుండి విముక్తి కోరుతున్న అప్పటి ప్రజల లోతైన మనోభావాలకు, నిరీక్షణ, వాగ్దానం పునాదులుగా యోహాను, యేసుక్రీస్తు వంటి మహనీయులు తమ జీవితాలు, పరిచర్య ద్వారా చేస్తున్న బోధనలు. . . ఇవన్నీ మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఆత్మసంబంధమైన అన్వేషిగా మానవుడెవ్వాడూ మతపరమైన నియమాలు, ఆజలను అదిగమించడానికే ప్రయత్నం చేస్తాడు. సంకుచితమైన, భూ సంబంధమైన ప్రయోజనాలకు మాత్రమే మత నియమాలు, ఆజ్ఞలు పరిమితమవుతాయి కాని ఆత్మీయ విలువలు నిత్యజీవానికి, అంతం లేని అనంత జీవనానికి చేరువగా తీసుకెళ్తాయి. ఆత్మీయంగా ఆకలిగొని ఉన్న ప్రజలకు నిత్యజీవం అనే రొట్టెనివ్వడానికి యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడు. ఆత్మసంబంధమైన అంశాల కోసం ఆకలిగొన్న వ్యక్తికి మత నియమాలు, ఆచారవ్యవహారాలు తృప్తి నివ్వలేవు. అవి అతనికి రాళ్ళలాగే కనిపిస్తాయని కొత్త నిబంధన చెబుతుంది. యేసు ప్రబోధించిన మతం పునాదులు లోతైనవి, సరిహద్దులు సువిశాలమైనవి. ఆయన దేవున్ని మానవునికి చేరువుగా తీసుకువచ్చి, వారిద్దరినీ ప్రేమ అనే బంధంతో కట్టేశాడు. వారిద్దరి సంబంధంలో ప్రధాన భాగంగా ఉన్నా భయాన్ని పూర్తిగా రూపుమాపాడు. 'భయం' స్థానాన్ని 'ప్రేమ' ఆక్రమించుకున్న కొత్త నేపథ్యంలో మానవుడు తన తోటి వారుని ప్రేమించేవాడుగా కొత్త రూపాన్ని సంతరించుకున్నాడు. దేవుణ్ని ప్రేమించడంతో, తోటి మానవునికి పరిచర్య చేయడంలో తన జీవనానికి సార్థకతను అతడు వెదుక్కోవడం ఆరంభించాడు. దేవుని పట్ల అతనిలో చిగురించిన ఈ ప్రేమ, ఈ సన్నిహితబంధం అతనిలోని నీతియుక్తమైన జీవనవిధానాలకి కొత్తరూపాన్నిచ్చింది. అతనిలోని ఆధ్యాత్మిక ఆకలిని తీర్చగలిగిన ఒకే ఒక స్థానంగా అది పరిణమించింది. మతంలో ఇదే అతి ప్రధానమైన అంశం. మానవుడు భౌతిక, సాంఘిక జీవి మాత్రమే కాదు. అతనిలో అత్యున్నతమైన మరో కోణంతో కూడిన వ్యక్తిత్వం ఉంది అని అది రుజువు చేసింది. అతడు ప్రధానంగా ఆధ్యాత్మిక జీవియని, అతనిలో అంతర్గతంగా ఉన్న ఈ ఆధ్యాత్మిక వ్యక్తిత్వంలోనే సృష్టి కర్తయైన దేవునితో పటిష్టమైన సంబంధం, దేవుని సృష్టియైన తోటి మానవులతో సౌభ్రాతృత్వం ఏర్పడుతాయి. ఆ ఆధ్యాత్మిక వాస్తవాన్ని ఆవిష్కరించి అతని జీవితంలో, ప్రవర్తనలో పరిఢవిల్లేదే మతం.

మతం పట్ల యేసుప్రభువుకున్న దృక్పథం ఇది. ఇదే దృక్పథాన్ని ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవతం తదితర లేఖనాలు ద్వారా ఇండియా అలవర్చుకుంది. ఇదే మన జాతీయ జీవన ప్రవంతిలో అవగాహనలో భాగమయింది. మతం కేవలం ఒక మూఢవిశ్వాసం కాదని, మెరుగైన జీవితం, నైతిక జీవితం, నీతియుక్తమైన జీవితానికి సంబంధించిన నియమావళి కాదని, మామూలు విశ్వాసం కాదని, అది జీవన సార్థకతను సాధించే ఆధ్యాత్మిక ఉపకరణమని ఈ లేఖనాలు ఉద్ఘోషించాయి. అయితే ఇవన్నీ కూడా అందులో అంతర్భాగమే తప్ప ప్రధానాంశాలు కాదని మనం నేర్చుకున్నాము.

పాలస్తీనా మతానికి భిన్నంగా ఉపనిషత్తులు కేవలం సాంఘిక, నైతిక నియమావళిగా మారిన మతంకాక ఆధ్యాత్మిక లోతు విలువ కలిగిన మతాన్ని భారతదేశానికిచ్చాయి. అలాంటి మతం పట్ల ఆసక్తిని రగిలించాయి. 'స్మృతి' కంటే 'శ్రుతి' గొప్పదన్న మన జాతీయ భావనకు ఉపనిషత్తులే పునాది వేశాయి. 'స్మృతి' ప్రధానమైన 'జీవితం' నిజానికి 'శృతి ప్రధానమైన' జీవితానికి ఉపోద్ఘాతమేనని ఉపనిషత్తులు నిర్వచించాయి.

## యేసు నెరవేర్చు కోసం వచ్చాడు, నాశనం చేయడానికి కాదు!

యూదు మతస్థులకు, దాని సంబంధిత మతస్థులకు మొట్టమొదటిసారిగా ఈ గొప్ప ఆలోచన యోహాను యేసుక్రీస్తుల



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 19 12/26/2009, 11:30 AM

ద్వారా వచ్చింది. అయితే వారి పూర్వీకులకు, వారి సంప్రదాయాలకు ఇది అంత కొత్త విషయమేమీ కాదు. ప్రతిభావంతులైన కొందరు పూర్వమే ఈ విషయమై సాక్ష్యమిచ్చారు. అయితే వారి వాణి అప్పటికే అమలులో వున్న సంప్రదాయాలపైన పెద్దగా ప్రభావాన్ని చూపించలేకపోయింది. బాప్తిస్మమిచ్చే యోహానుది కూడా అదే పరిస్థితి గనుకనే 'అరణ్యంలో కేకలు వేస్తున్న ఒక వ్యక్తి స్వరం' తనదని అతను చెప్పాడు. కాని యేసులో ఆ స్వరం ఒక శక్తిగా మారింది. అది సాంప్రదాయక మతశక్తులతో ఘర్షణకు దిగడం తప్పని సరయింది. కొత్త నిబంధనలో ఈ రెండు స్రవంతులూ పక్కపక్కనే ప్రవహించినట్టుగా మనం చూస్తాము. ఈ రెండు ధోరణుల మధ్య ఉన్న వైరుధ్యం ఒకే వైపునకు ప్రవాహం సాగే అయింది. పాతది కొత్త దానితో ఘర్షణ పడటం చూస్తాము తప్ప కొత్త దానికి పాతదానితోఘర్షణ లేదు. ఆధ్యాత్మిక సందేశం ఎంత విశాలమైనదంటే, అన్ని రకాల విశ్వాసాలకు అందులో తావుంది. ప్రేమ, కృప ధర్మశాస్త్రాన్ని, ఆజ్ఞల్ని వమ్ము చేయవు కాని వాటిని నెరవేర్చుతాయి. పాతమతాన్ని పారదోలాలని యేసుప్రభువే ఎన్నడూ అనుకోలేదు. తాను ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడానికే వచ్చాను తప్ప రద్దు చేయడానికి కాదని ఆయన స్పష్టం చేశాడు. సువిశాలమైన, ఎంతో ఔదార్యంతో కూడిన ఈ ఆలోచనా విధానంలో పాత కొత్త భావాల కలయికతోపాటు, లోతైన ఆధ్యాత్మిక మత విశ్వాసపు నిజమైన చిహ్నాలు కనిపిస్తాయి.

మోషే, యేసుక్రీస్తుల సందేశాల పరస్పర సమన్వయ ధోరణి తాలూకు దృశ్యాలు మనకు కొత్త నిబంధనలో కనిపిస్తాయి. 'ఎందుకంటే మోషే ద్వారా ధర్మశాస్త్రం, యేసుక్రీస్తుద్వారా కృపాసత్యాలు వచ్చాయి' అని బైబిలులో రాయబడి ఉంది (యోహాను 1:17).

నిత్యజీవానికి వారసుడయ్యేందుకు మార్గం తెలుపమంటూ తనను సంప్రదించిన ధనికునికి యేసుక్రీస్తు ఉన్నత ఆధ్యాత్మిక స్థాయికి చేరుకోవడానికి ముందుగా దేవుని ఆజ్ఞలన్ని పాటించమంటూ సలహా ఇచ్చాడు. ఈ ఉన్నత ఆధ్యాత్మిక అన్వేషణలోనే యేసుక్రీస్తు కొన్ని సరికొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించనుద్దేశించాడు. విన్నవారికి అవి కొత్తగానే కాదు, సంచలనాత్మకమైనవిగా కూడా ధ్వనించాయి. చాలా ప్రదేశాల్లో ప్రజలు ఆయన ప్రసంగాలు విని నిర్ఘాంతపోయారని కొత్త నిబంధన చెబుతుంది.

## యేసుక్రీస్తు బాప్తిస్మం

ఇలాంటి పరిస్థితుల్లో యోహాను ఆవిర్భావం ప్రజలకు విస్మయం కలిగించింది. భవబంధాలకు దూరంగా బ్రహ్మచారిగా సన్యాసి జీవితం గడిపిన వ్యక్తి యోహాను. యూదుమత సంప్రదాయాల సన్యాసత్వం, బ్రహ్మచర్యం తెలియని విషయాలు. 'పరలోక రాజ్యం సమీపంలో ఉంది. పశ్చాత్తాప పడండి' అన్న సంచలనాత్మక సందేశంతో యోహాను అందరి దృష్టినీ ఆకర్షించాడు.

పరలోక రాజ్యానికి సంబంధించిన అవగాహన ప్రజలకు అప్పటికే ఉంది. అందువల్ల అందులో సంచలనాత్మక విషయమేమీ లేదు. పరలోక రాజ్యమంటే అక్కడెక్కడో దూరంలో, ఎప్పుడో భవిష్యత్తులో రానున్న విషయం. అది చనిపోయాక చేరే రాజ్యం కాబట్టి దాని గురించి తొందరపడవలసిన అవసరం లేదన్నది ప్రజల అభిప్రాయం. కాని 'అది సమీపించింది', అన్న యోహాను మాటలే వారిలో సంచలనం కలిగించాయి. ఇక్కడే 'దగ్గరలోనే' పరలోకరాజ్యం ఉందనడం ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. రోమా ప్రభుత్వపు అణిచివేత పాలనలో ఉన్న పీడిత ప్రజలకిది ఆనందాన్ని కలిగించింది. అయితే ప్రజలు దాన్ని రాజకీయంగా అన్వయించుకొని అర్థం చేసుకున్నారు. అంతరంగ ప్రక్షాళన ద్వారా, నిజమైన పశ్చాత్తాపం ద్వారా ఆ పరలోక రాజ్యంలోకి ప్రవేశించమంటూ ప్రజలకు ప్రకటించి యోహాను వారిని సిద్ధపర్చాడు. ఆ ప్రక్షాళనకు బాహ్యచిహ్నంగా యోర్దాను నదిలో 'బాప్తిస్మాన్ని' యోహాను నిర్దేశించాడు.

వందలాదిమంది ప్రజలు యోహాను ద్వారా బాప్తిస్మం తీసుకోవడానికి పరుగులు తీశారు. వారిలో కుటిలచిత్తం గలవారిని యోహాను తిట్టి బెదిరించి వెనక్కి పంపేశాడు. ఔదార్యం, న్యాయం, కరుణ, నిజాయితీ వంటి సత్ లక్షణాలతో బతకమంటూ బాప్తిస్మం తీసుకున్న వారికి ఆయన హెచ్చరిక చేశాడు. లేఖనాలు ప్రవచించిన మెస్సీయా ఇతనేనేమో నన్న భ్రమను యోహాను కల్పించాడు. అయితే వారి తలంపుల నెరిగిన వాడుగా యోహాను 'నేను నీటిలో బాప్తిస్మమిస్తున్నాను కాని నావెనుక వచ్చేవాడు నాకంటే శక్తివంతుడు. ఆయన చెప్పులవారు విప్పడానికి కూడా నా కర్హతలేదు. ఆయన పరిశుద్ధాత్మలోను, అగ్నిలోనూ మీకు బాప్తిస్మమిస్తాడు' (మత్తయి 3:11) అని రుజువు చేశాడు.

అప్పటికి ప్రజలకెవరికీ అంతగా తెలియని యేసుక్రీస్తు యోహాను వద్దకు వెళ్ళి బాప్తిస్మం తీసుకున్నాడు. యేసును ఎగాదిగా చూసిన యోహాను 'నేను మీకు బాప్తిస్మమిచ్చేంత అర్హున్ని కాదు. నాకే మీరు బాప్తిస్మమివ్వాలి' అన్నాడు. 'నీతియావత్తూ నెరవేరడం కోసం ఇప్పటికి ఇలా జరుగనివ్వు' అని యేసు జవాబిచ్చి ఆయన ద్వారా బాప్తిస్మం తీసుకున్నాడు. యోర్దాను నదిలో ఆవిధంగా యోహాను ద్వారా బాప్తిస్మం తీసుకున్న యేసు నీళ్ళలో నుండి వెలుపలికి రాగానే ఆకాశం నుంచి ఒక స్వరం వినబడింది. ఈయన నా ప్రియ కుమారుడు. ఈయన యందు నేనానందిస్తున్నాను' అన్న పరలోక స్వరం ద్వారా యేసుక్రీస్తు ఆధ్యాత్మిక అనుభవాన్ని పొందాడు.

యేసు పరిచర్య ఇపుడు ఆరంభమయింది. తన కాలం కన్నా ఎంతో ముందున్న కాలానికి సంబంధించిన ప్రవచనాలు చేసినందుకు ఆ తర్వాత యోహానును నిర్బంధించి శిరచ్ఛేదనం చేశారు. బాప్తిస్మం తీసుకున్న వెంటనే యేసుక్రీస్తు ప్రక్కనే ఉన్న కొండల్లోకి వెళ్ళి ఏకాంతవాసం చేసి అంతర్గత పరిశోధన చేసుకున్నాడు, 'శోధనలు' జయించాడు. ఆ తరువాత గలిలయ సరస్సు తీరానికి వెళ్ళి తన ప్రజా పరిచర్యను బహిరంగంగా ప్రారంభించాడు.

(మిగిలిన భాగం తరువాతి సంచికలో)

*అనువాదం:* **రెవ. టి. ఎ. ప్రభుకిరణ్**

Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Phani Kumar**



SthanikaPalana_Tel_Jan2010_F_Colour.pmd 20 12/26/2009, 11:30 AM


నూతన
సంవత్సరానికి
స్వాగతం

# సమున్నత జాతీయ పతాకకు వందనం



Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.